


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 సంచిక: 56

SUNDAY Special

ఆదివారం 18-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కోల్'కథ' ముగిసింది

ఐపీఎల్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్. భారీ వర్షం కారణంగా బెంగళూరుతో మ్యాచ్ రద్దు.

- వివరాలు 14లో



వింటి నారి.. జేమ్స్ బ్రాండ్

'ఫోర్బ్స్ – 30 అండర్ 30 ఆసియా 2025' జాబితాలో చోటు సాధించిన శీతల్‌దేవి, అనన్య పాండేల గురించి...

- వివరాలు 13లో



మహిళా యూట్యూబర్ అరెస్ట్

గూఢచర్యం ఆరోపణలపై హరియాణాకు చెందిన ఓ మహిళా యూట్యూబర్‌తోపాటు మరో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

- వివరాలు 6లో



నీట్–యూజీ ఫలితాలపై స్టే

నీట్–యూజీ ఫలితాలపై మద్రాస్ హైకోర్టు స్టే విధించింది. పలువురు అభ్యర్థుల పిటిషన్‌పై ఈ ఉత్తర్వులిచ్చింది.

- వివరాలు 6లో



ట్రంప్ 'బిగ్‌బాస్' షో!

వలసదారులకు ప్రైజ్‌మనీగా పౌరసత్వం అందించే వెరైటీ రియాలిటీ షో కోసం ట్రంప్ సర్కారు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

- వివరాలు 6లో



పాక్ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

ఇస్లాం పేరుతో పాకిస్తాన్ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని తుర్కియేను అసదుద్దీన్ ఒవైసీ కోరారు.

- వివరాలు 2లో

కొలువు దీరేదెప్పుడు?

టీజీపీఎస్సీ గ్రూప్స్ ఉత్తీర్ణులకు తప్పని ఎదురుచూపులు

ఉద్యోగాలకు ఎంపికైనా కోర్టు కేసులతో కాలయాపన




- న్యాయ చిక్కులతో నిలిచిన గ్రూప్–1 ఉద్యోగాల భర్తీ
- తుది జాబితా ప్రకటించినా కోర్టు ఆదేశాలతో నిలుపుదల
- తుది తీర్పు తర్వాతే తదుపరి చర్యలకు టీజీపీఎస్సీ నిర్ణయం
- గ్రూప్–1 నియామకాలు పూర్తయ్యాకే గ్రూప్–2, గ్రూప్–3
- వేసవి సెలవుల తర్వాత గ్రూప్–1పై హైకోర్టులో విచారణ

సాక్షి, హైదరాబాద్: టీజీపీఎస్సీ గ్రూప్స్ ఉద్యోగాల భర్తీకి మరికొంత కాలం వేచిచూడక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించినప్పటికీ నియామక పత్రాల జారీకి నిరీక్షణ తప్పేలా లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పరుగులు పెట్టింది. అర్హత పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ఫలితాల ప్రకటన, అర్హుల ఎంపిక ప్రక్రియ శరవేగంగా సాగింది. అయితే, ఇతర కేటగిరీల్లో కొలువుల భర్తీ పూర్తయినప్పటికీ.. గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగాల భర్తీ మాత్రం నెమ్మదించింది. న్యాయపరమైన అంశాలు పెండింగ్‌లో ఉండడంతో నియామక ప్రక్రియలో వేగం తగ్గింది. మార్చి నెలాఖరులో గ్రూప్–1 తుది ఫలితాలను టీజీపీఎస్సీ ప్రకటించింది. గ్రూప్–2, గ్రూప్–3 అర్హత పరీక్షల ఫలితాలు సైతం ఇప్పటికే విడుదలైనా నియామక ప్రక్రియ మాత్రం ఆగిపోయింది.

తుది తీర్పు తర్వాతే ముందుకు...

గ్రూప్–1 ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఇప్పటికే తుది జాబితా విడుదలైంది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ సైతం దాదాపు పూర్తయింది. ఇంతలో గ్రూప్–1పై దాఖలైన కేసుల విచారణలో భాగంగా తుది తీర్పు వెలువడే వరకు నియామకాలు చేపట్టవద్దని హైకోర్టు ఆదేశించటంతో టీజీపీఎస్సీ ఈ ప్రక్రియను నిలిపేసింది. గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగాల విషయంలో ఎలాంటి ఆంక్షలు లేవు. కానీ, గ్రూప్–1 నియామకాలు పూర్తి చేసిన తర్వాతే గ్రూప్–2, ఆ తర్వాత గ్రూప్–3 ఉద్యోగాల భర్తీ చేపట్టాలని భావిస్తోంది. ఎగువ నుంచి దిగువ కేడర్ ఉద్యోగాల భర్తీతో పూర్తిస్థాయిలో ఉద్యోగాలు భర్తీ అవుతాయనే ఆలోచనతో టీజీపీఎస్సీ ఈ నిర్ణయం



తీసుకుంది. ప్రస్తుతం కోర్టులకు వేసవి సెలవులు నడుస్తున్నాయి. వచ్చే నెలలో సెలవులు ముగిసిన తర్వాత గ్రూప్–1పై విచారణ ప్రక్రియ వేగం అందుకోనుంది. తుది తీర్పు వచ్చిన తర్వాత ఉద్యోగాల నియామకాల్లో కదలిక

మిగతా 15వ పేజీలో ▶

న్యూస్‌రీల్

తెలంగాణతో పోటీ పడే రాష్ట్రమే లేదు: భట్టి



సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణతో పోటీపడే రాష్ట్రం దేశంలోనే లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.

- వివరాలు 3లో

ఆకాశంలో నిఘా నేత్రం



పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ కీలక ముందడుగు వేస్తోంది. అత్యంత అధునాతన నిఘా ఉపగ్రహం ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్–09)ను నేడు శ్రీహరికోట నుంచి ప్రయోగించనుంది.

- వివరాలు 6లో

త్వరలో రాష్ట్రమంతా అనాథ పిల్లలకు ఆరోగ్యశ్రీ



రాష్ట్రంలోని అనాథ పిల్లల ఆరోగ్య పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అనాథ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు.

- వివరాలు 2లో

ఉద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ సమరశంఖం



ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సమరశంఖం పూరించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. త్వరలో పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పింది.

- వివరాలు 3లో



అంబేడ్కర్ భావజాలమే ఆదర్శం..

- ఆ మార్గమే సీజేఐగా నిలిపింది: జస్టిస్ గవాయ్
- నాకు సిగ్గు ఎక్కువ.. అందుకే ఇంటర్వ్యూలు ఇవ్వను
- న్యాయ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళల నియామకానికి హైకోర్టులే సిఫార్సు చేయాలి
- బార్ కౌన్సిల్ సన్మాన కార్యక్రమంలో సీజేఐ

6 లో

పాక్‌పై దౌత్య యుద్ధానికి ఏడు బృందాలు

- ఏడుగురు సారథులను ప్రకటించిన కేంద్రం
- విపక్షాల నుంచి శశిథరూర్, కనిమొళి, సుప్రియా సూలేకు అవకాశం
- ఈ నెలాఖరు నుంచి విదేశాల్లో పర్యటన

6 లో

కాంగ్రెస్‌కు బిగ్ షాక్

- పార్టీ ప్రతిపాదించిన నాలుగు పేర్లను పక్కనపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- కేంద్రం తుంటరి మనస్తత్వంతో ప్రతిపక్షాలతో ఆటలాడుతోందని కాంగ్రెస్ ఆగ్రహం
- ప్రజాస్వామ్యం అంటే కేంద్రానికి లెక్కలేకుండా పోయిందని ధ్వజం

వీహబ్ కార్యక్రమంలో హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, వి హబ్ సీఈఓ సీత పల్లచొల్లా, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ప్రజావాణి స్టేట్ కో ఆర్డినేటర్ దివ్య దేవరాజన్



కోటి మంది స్త్రీలను కోటీశ్వరుల్ని చేస్తాం

- అదే మా ప్రభుత్వ లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి
- ఆడబిడ్డల ఆత్మగౌరవంతోనే రాష్ట్రం పురోగతి
- మహిళా శక్తిని కాంగ్రెస్ ఎన్నడూ తక్కువ అంచనా వేయదు.. మహిళలకు వేయి మెగావాట్ల సోలార్ యూనిట్ల బాధ్యతలు
- అర్బన్ మహిళలను ఎస్‌హెచ్‌జీల్లో చేర్చేందుకు ప్రత్యేక డ్రైవ్..
- 'వి హబ్'విమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రామ్‌లో ముఖ్యమంత్రి వెల్లడి

సాక్షి, హైదరాబాద్/రాయదుర్గం: ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా పురోగతి సాధిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. ఆర్థిక క్రమశిక్షణ తెలంగాణ ఆడబిడ్డల సొంతమని, రూపాయి కూడా ఎగవేయకుండా వడ్డీతో సహా అప్పులు చెల్లిస్తున్నారని కితాబునిచ్చారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘా(ఎస్‌హెచ్‌జీ)ల్లో సభ్యుల సంఖ్య కోటికి పెరగాల్సిన అవసరముందని, పట్టణ ప్రాంత మహిళలను వాటిలో చేర్చేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 'వి హబ్'(విమెన్ ఆంట్రప్రెన్యూర్స్ హబ్) చేపట్టిన 'విమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రామ్', 'గ్రాస్‌రూట్ యూత్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్'ను శనివారం రేవంత్‌రెడ్డి ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. 'ఆడబిడ్డలను ప్రోత్సహించడమే మా ప్రభుత్వ విధానం. ఇప్పటికే వేయి మెగావాట్ల

మిగతా 15వ పేజీలో ▶



చర్చలంటూ జరిగితే ఆక్రమిత కశ్మీర్‌పైనే..

శనివారం హైదరాబాద్‌లో తిరంగా ర్యాలీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మంగ్లీ, జయప్రద, బెల్లంకొండ శ్రీనివాస్, మాధవీలత, మంద కృష్ణ మాదిగ

-16లో





రేపట్నుంచే భూముల రీసర్వే

- కేంద్రం మార్గదర్శకాల మేరకు నిర్వహించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- పైలట్ పద్ధతిలో 5 గ్రామాల ఎంపిక.. 3 ఏజెన్సీలకు బాధ్యతలు
- ఇప్పటికే పూర్తయిన గ్రామాల సరిహద్దుల సర్వే
- కొత్త సమస్యలు వస్తాయేమోనని రెవెన్యూ వర్గాల ఆందోళన

సాక్షి, హైదరాబాద్: ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని పైలట్ పద్ధతిలో భూముల రీసర్వేకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్ (డీఐఎల్ఆర్ఎంపీ) మార్గదర్శకాలకు అనుగుణంగా డ్రోన్లు లేదా

మిగతా 2వ పేజీలో ▶

జుంబారే.. జుజుంబారే: గచ్చిబౌలి స్టేడియంలో జుంబా డాన్స్ చేస్తున్న మిస్ ఇండియా వరల్డ్ నందినీ గుప్తా, ఇతర పోటీదారులు



అందగత్తెల ఆటవిడుపు

మిస్‌వరల్డ్ పోటీదారుల క్రీడా దినోత్సవం..

- పలు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్న సుందరీమణులు
- త్వరలో తెలంగాణ నూతన క్రీడా విధానం: మంత్రి జూపల్లి
- గ్రామీణ జనాభాలో ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తోందని వెల్లడి

3 లో

హలో వరల్డ్.. మిస్ కావొద్దు!


- మిస్ వరల్డ్‌తో తెలంగాణ బ్రాండ్‌కు విశ్వవ్యాప్త ప్రచారం..
- 3,300 విదేశీ టీవీ చానల్స్‌కు నిత్యం ఫీడ్.. ప్రపంచవ్యాప్తంగా ప్రసారాలు


- 3లో

'కొండ ప్రాంతాల్లో పంట. బాగా మగ్గిన కాఫీ చెర్రీస్ సేకరణ, గ్రేడింగ్ సైతం చేతితోనే.. భారత్ మినహా ప్రపంచంలో మరెక్కడా ఈ ప్రత్యేకత లేదు. అంతేకాదు నాణ్యతలోనూ మనది విశిష్ట స్థానమే. అందుకే ఖరీదైన 'స్పెషాలిటీ కాఫీ'లభించే దేశాల జాబితాలో భారత్ నిలిచింది. కొన్ని ఎస్టేట్స్‌లో పండిన కాఫీ 100 శాతం ప్రీమియంతో అమ్ముడైన సందర్భాలు ఎన్నో. యూరప్‌కు చెందిన దిగ్గజ బ్రాండ్స్‌కు మన కాఫీయే కావాలని చెబుతారు. ఉత్పత్తిలో ప్రపంచంలో 7వ స్థానంలో నిలిచిన భారత్‌లో 2023-24లో 3,74,200 టన్నుల కాఫీ పండింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కాఫీ ప్రియులు భారతీయ అరోమాను ప్రతిరోజూ ఆస్వాదిస్తున్నారు. నాణ్యత, పోటీ ధర, సర్వీస్‌తో భారత కాఫీ అంతర్జాతీయంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహం మరింత పెరిగితే కాఫీ రంగంలో మన దేశం అద్భుతాలు సృష్టిస్తుంది'అంటారు ప్రైవేట్ లేబుల్ కాఫీ తయారీలో ప్రపంచ దిగ్గజం సీసీఎల్ ప్రాడక్ట్స్ వ్యవస్థాపకులు చల్లా రాజేంద్ర ప్రసాద్. ఆయనింకా ఏమన్నారంటే..

- సాక్షి, స్పెషల్ డెస్క్

భారత్.. మంచి కాఫీలాంటి మార్కెట్!





- విదేశీ దిగ్గజ బ్రాండ్స్‌కు మన కాఫీయే కావాలి
- స్పెషాలిటీ కాఫీగా అంతర్జాతీయంగా డిమాండ్
- ప్రీమియం ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు
- ప్రోత్సహిస్తే ఉత్పత్తిలో అద్భుతాలు ఖాయం
- సీసీఎల్ ప్రాడక్ట్స్ వ్యవస్థాపకులు చల్లా రాజేంద్రప్రసాద్

ఒక్క అరకులోనే..: ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ, పన్నులు లేవు.. అందుకే కాఫీ ఉత్పత్తిలో వియత్నాం 20-25 ఏళ్లలో ప్రపంచంలో రెండో స్థానానికి చేరింది. మనదేశంలోనూ కాఫీ పంటకు అనువైన ప్రాంతాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అరకులో 5,000 టన్నులు పండుతోంది. దీనిని 1,00,000 టన్నుల స్థాయికి చేర్చవచ్చు. కావాల్సిందల్లా ప్రభుత్వ ప్రోత్సాహమే. స్థానికులకు ఉపాధి అవకాశాలతోపాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అనుబంధ కంపెనీలూ వస్తాయి. 5-10 ఏళ్లు కష్టపడితే చాలు.

కాఫీ స్టార్టప్స్..: యువ వ్యాపారవేత్తలు త్వరితగతిన డబ్బులు అందుకోవాలని చూస్తున్నారు. ఇదే సమస్యకు కారణం. సుస్థిరత, దీర్ఘకాల కోసం వ్యాపార సంస్థలు ప్రణాళిక చేసుకోవాలి. ఏ స్టార్టప్ అయినా, ఉత్పాదన ఏదైనా.. వినూత్నంగా ఉంటేనే నిలదొక్కుకుంటాయి. కాఫీ రంగంలోనూ ఎన్నో స్టార్టప్స్ వచ్చాయి. నాణ్యతలో స్థిరత్వం లేదు. ఆహార సంబంధ వ్యాపారంలో అపార అవకాశాలు ఉన్నాయి. ప్రజల సగటు ఆదాయం పెరిగింది. వినియోగదార్లు ఆహారాన్ని ఆస్వాదించడంలో ప్రయోగాలకు సిద్ధపడుతున్నారు.



సగటు దిగుబడి **750** కేజీలు	వియత్నాం హెక్టారుకు 5 టన్నుల వరకు దిగుబడి సాధిస్తోంది	భారత్‌లో సగటు దిగుబడి 750 కిలోలు అరకులో కేవలం 100-150 కిలోలు మాత్రమే ఉంది

వినియోగం పెరిగింది

గతంలో భారత్‌లో కాఫీ వినియోగం ఏటా 50 టన్నులు మాత్రమే. నేడు 1,25,000 టన్నుల స్థాయికి చేరుకున్నాం. ఉత్పత్తి అధికం అయితే కాఫీ వినియోగం పెరుగుతుంది. దేశీయంగా 10,00,000 టన్నుల కాఫీ విక్రయించేంతగా అవకాశాలు ఉన్నాయి. 1960-70 ప్రాంతంలో ఇన్‌స్టంట్ కాఫీ తయారీ సామర్థ్యం కేవలం 1,600 టన్నులు మాత్రమే. ఇప్పుడు ఏకంగా 70,000 టన్నులతో ప్రపంచంలో మూడవ స్థానంలో నిలిచాం. ఇందులో సీసీఎల్ వాటా 40,000 టన్నులు. అన్ని కంపెనీలకూ రెండింతలు ఉత్పత్తి చేయగల అదనపు సామర్థ్యం ఉంది. సాంకేతికతను అందిపుచ్చుకుని కాఫీకి విలువ జోడించడం ద్వారా ప్రపంచ పటంలో భారత్ నిలిచింది. ఇన్‌స్టంట్ కాఫీలో బ్రెజిల్ 90,000 టన్నులు, యూరప్ దేశాలు 80,000 టన్నులతో తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.



అప్పు తీర్చే వరకు విస్తరణ వద్దు..

ఏ కంపెనీ అయినా అప్పు తీర్చేవరకు విస్తరణ చేపట్టకపోవడమే మంచిది. అప్పు తీసుకుని మొహం చాటేయడం మంచి పద్ధతి కాదు. వ్యాపారవేత్తలు తమ వైఫల్యాన్ని ఒప్పుకోవాలి. ఆర్థిక క్రమశిక్షణ ఉండాల్సిందే. లాభంలో 50 శాతం ఆదా చేయాల్సిందే. ఈజీ మనీ అనే ఆలోచనే రాకూడదు. నా చిన్ననాటితో పోలిస్తే నేటి సమాజంలో ప్రేమ, ఆప్యాయతలు తగ్గిపోయాయి. ఒకరిపట్ల ఒకరికి నమ్మకం తగ్గింది. తల్లిదండ్రులు అంటే దేవుడి తరువాతి స్థానం. అలాంటిది ఇప్పుడు యాంత్రికంగా జీవిస్తున్నారు. కల్చర్ సైతం మారిపోయింది. డబ్బుకు ఒక దశ తరువాత విలువ ఉండదు. మనసు స్వచ్ఛంగా ఉండాలి. డబ్బు విషయంలో దురాశ సమస్యలను తెచ్చిపెడుతుంది.

ప్రభుత్వ జోక్యం ఉండరాదు..

కంపెనీల కార్యకలాపాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే బాగుంటుంది. లైసెన్స్ రాజ్ ఉండకూడదు. నిబంధనలు పెట్టడం వరకే ప్రభుత్వం పరిమితం కావాలి. కంపెనీలు తప్పు చేశాక ప్రభుత్వం రావడం కాదు.. తప్పు చేయక ముందే ప్రభుత్వం మేల్కొనాలి. దేశంలోని కోర్టుల్లో 75 శాతం ప్రభుత్వ వ్యాజ్యాలే.

100కు పైగా దేశాల్లో...

ప్రారంభించిన కొన్నాళ్లకే నష్టాలు ఎదురైనా.. కంపెనీని తిరిగి గాడిలో పెట్టి కాఫీ ప్రపంచంలో తెలుగువారి సత్తా చాటుతున్న తొలితరం వ్యాపారవేత్త చల్లా రాజేంద్ర ప్రసాద్. స్వచ్ఛంద కార్యక్రమాల కోసం రూ.కోట్లు వెచ్చిస్తున్న పెద్ద చేయి ఆయనది. ఉస్మానియా వర్సిటీ నుంచి 1975లో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ప్యాకేజింగ్ మెటీరియల్, ట్యూబ్స్, డక్ట్స్, ఐటీ, రియల్టీ, నిర్మాణ రంగంలోనూ తనదైన ముద్రవేశారు. 1989 నుంచి కాఫీ వ్యాపారంలో ఉన్నారు. ఔత్సాహిక యువతను భుజం తట్టి వ్యాపారం వైపు ప్రోత్సహిస్తున్నారు. భారత కాఫీ బోర్డు సభ్యుడిగా నాలుగు సార్లు, ప్రత్యేక ఆహ్వానితుడిగా ఒకసారి పనిచేశారు. ఇంటర్నేషనల్ ఇన్‌స్టంట్ కాఫీ మాన్యుఫ్యాక్చరర్స్ నుంచి 2019లో జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. సీసీఎల్ ప్రాడక్ట్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.10,160 కోట్లకుపైనే.100కిపైగా దేశాల్లోని విభిన్న బ్రాండ్స్‌కు కాఫీ సరఫరా చేస్తోంది. సొంత బ్రాండ్ అయిన 'కాంటినెంటల్ కాఫీ'కి మంచి డిమాండ్ ఉంది.

పెంచిన 'మెట్రో' చార్జీలను వెంటనే తగ్గించాలి

- బీఆర్ఎస్ డిమాండ్
- సీఎం రేవంత్‌కు గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల లేఖ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో పెంచిన మెట్రో రైలు టికెట్ చార్జీలను వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. టికెట్ ధరల పెంపు సామాన్యులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శనివారం ఒక లేఖ రాశారు. మెట్రో రైలు టికెట్ ధరల పెంపు వల్ల ఒక్కో ప్రయాణికుడిపై నెలకు అదనంగా రూ.600 మేర ఆర్థిక భారం పడుతుందన్నారు. ప్రజలు చవకగా, వేగంగా ప్రయాణించే ప్రజా రవాణా వ్యవస్థపై ప్రభుత్వం పగబట్టినట్లు కనిపిస్తోందని ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. ప్రైవేటు కంపెనీల లాభం కోసం కాకుండా హైదరాబాద్ నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా మెట్రో రైలు వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. మెట్రో రైలు టికెట్ ధరల పెంపుతో ప్రజలు ఇతర రవాణా మార్గాల వైపు దృష్టి సారిస్తే ట్రాఫిక్, కాలుష్య సమస్యలు మరింత తీవ్రతరమయ్యే ప్రమాదముందని ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మెట్రో రైలు టికెట్ ధరలను పెంచడాన్ని ఒక విధానపరమైన నిర్ణయంగా తీసుకున్నట్లు కనిపిస్తోందని వారు విమర్శించారు. బెంగళూరులో వంద శాతం మెట్రో ధరల పెంపుతో ప్రయాణికుల సంఖ్య 13 శాతానికి తగ్గిందని గుర్తు చేశారు. అయితే ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో అక్కడి సీఎం జోక్యం వల్ల ధరల పెంపుపై వెనకడుగు వేశారని తెలిపారు. సీఎంకు రాసిన లేఖపై సంతకాలు చేసిన వారిలో తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావుగౌడ్, మాగంటి గోపీనాథ్, కేపీ వివేకానందగౌడ్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, బండారు లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి ఉన్నారు.

'తెలంగాణ రైజింగ్'లో భాగస్వాములు కండి

- మీ అనుభవాలను పంచుకోండి
- నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీకి సీఎం రేవంత్ వినతి
- ఐసీసీసీలో బెనర్జీతో భేటీ అయిన సీఎం, మంత్రి శ్రీధర్‌బాబు
- రాష్ట్రాభివృద్ధికి రేవంత్ చేస్తున్న కృషికి ప్రశంసలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి 'తెలంగాణ రైజింగ్'అనే విజన్‌తో ముందుకెళ్తున్నామని, ఆ విజన్‌లో భాగస్వాములు కావాలని ఆర్థిక శాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. త్వరలోనే ఏర్పాటు చేయనున్న తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డులో చేరి ఇతర ప్రముఖులతోపాటు తమ అనుభవాలను పంచుకోవాలని కోరారు. ఇందుకు అభిజిత్ బెనర్జీ సమ్మతించారు. తెలంగాణ అభివృద్ధి కోసం తన వంతు చేయూతనందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి శనివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో అభిజిత్ బెనర్జీతో భేటీ అయ్యారు. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టిన పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై బెనర్జీతో ముచ్చటించారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఆదాయ పెంపునకు గల మార్గాలు, ఆర్థిక క్రమశిక్షణ, పట్టణ, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన తదితర అంశాలు ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చాయి. ఈ భేటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచానికి చాటి చెప్పాలి: సీఎం రేవంత్

శతాబ్దాల చరిత్ర ఉన్న హైదరాబాద్ విజన్‌ను, ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదరణ గురించి అభిజిత్ బెనర్జీకి సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. తెలంగాణ విశిష్టత, ఇక్కడి అనుకూలతలను ప్రపంచమంతా చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, రైతు సాధికారత, యువతకు ఉపాధి కల్పనతోపాటు నైపుణ్యాభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను రేవంత్ వివరించారు.



అభిజిత్ బెనర్జీకి జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఆధునిక వ్యాపారవేత్తలను చేయాలి: అభిజిత్ బెనర్జీ

రాష్ట్ర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషిని నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ ప్రశంసించారు. పోలీసు, మున్సిపల్ శాఖల్లో ట్రాన్స్‌జెండర్ల నియామకం, ఓఆర్ఆర్ లోపలి హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాను సేవా రంగ హబ్‌గా అభివృద్ధి చేసే ప్రణాళికను ఎంచుకోవడం, స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీల ఏర్పాటు రేవంత్ దార్శనికతకు అద్దం పడుతున్నాయన్నారు. ఫ్యూచర్ సిటీలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సృజనాత్మకతను జోడించాలని, సంప్రదాయ చేతివృత్తుల వారిని ఆధునిక వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక స్వల్పకాలిక కోర్సులను నిర్వహించాలని సూచించారు. అత్యాధునిక సాంకేతికతతోపాటు సోషల్‌మీడియా, మార్కెటింగ్ నైపుణ్యాలతో ఆ దిశగా కృషి చేయాల్సి ఉందన్నారు.

త్వరలో రాష్ట్రమంతా అనాథలకు ఆరోగ్యశ్రీ

హైదరాబాద్‌లో 2,200 మందికి కార్డుల పంపిణీ

- మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క

సనత్‌నగర్ (హైదరాబాద్): రాష్ట్రంలోని అనాథ పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. శనివారం టూరిజం ప్లాజాలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనాథలు, నిరాశ్రయులైన పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో 2,200 మంది అనాథలు, నిరాశ్రయులైన పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వమే కుటుంబంగా.. అనాథలకు ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్నామని వివరించారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను మానవతా దృక్పథంతో చేరదీసి, అనాథ బాలలు ఆత్మవిశ్వాసంతో అడుగులు ముందుకు వేసేలాకృషి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పలువురు అనాథ పిల్లలకు కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డులను ఇప్పటికే అందజేశామని, ప్రస్తుతం వారికి ఆరోగ్యశ్రీ కార్డులు అందించటం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్డుల ద్వారా 95కి పైగా గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో 180కి పైగా వైద్య చికిత్సలు ఉచితంగా పొందే అవకాశం లభిస్తుందని తెలిపారు. కాగా, అంగన్‌వాడీల ద్వారా కూలీల పిల్లలకు అల్పాహారం అందించే దిశగా ప్రభుత్వం పరిశీలన చేస్తోందని చెప్పారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలోని 50 చైల్డ్ కేర్ సంస్థల్లోని 4,000 మంది పిల్లలకు కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డులను రెండు దశల్లో అందించామని తెలిపారు. తాజాగా మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం తరపున అనాథ పిల్లలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వర్తించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. పిల్లలందరికీ రేషన్ కార్డులు కూడా ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు పిల్లలతో ఫొటోలు దిగి, వారితో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్ పాల్గొన్నారు.



అనాథ పిల్లలకు ఆరోగ్యశ్రీ పత్రం అందజేస్తున్న పొన్నం, సీతక్క, అనిల్ కుమార్, విజయలక్ష్మి, అనుదీప్ దురిశెట్టి

మంత్రి శ్రీధర్‌బాబుకు ఊరట

కాళేశ్వరం ప్రజాభిప్రాయ సేకరణలో నమోదైన కేసును కొట్టేసిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు: మంత్రి శ్రీధర్‌బాబుకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా అధికారుల విధులకు ఆటంకం కలిగించారని శ్రీధర్‌బాబుపై నమోదైన కేసును నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు శనివారం కొట్టివేసింది. 2017, ఆగస్టు 23న పెద్దపల్లి జిల్లా బసంత్ నగర్ పోలీసులు శ్రీధర్‌బాబుతోపాటు మరికొందరిపై కేసులు నమోదు చేశారు. శ్రీధర్ బాబు తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నాడు రైతుల పక్షాన పోరాటం చేసినందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. ప్రజాప్రతినిధిగా రైతులు, ప్రజల పక్షాన పోరాటం చేసే హక్కు వారికి ఉందని చెప్పారు. ఈ వాదనలతో ఏకీభవిస్తూ శ్రీధర్‌బాబుతోపాటు 12 మందిపై నమోదైన కేసులను కొట్టివేస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు.

ప్రజలు, రైతులే గెలిచారు: శ్రీధర్‌బాబు

తీర్పు అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పేద రైతుల బాధను న్యాయస్థానం అర్థం చేసుకుందని, ఈ తీర్పు న్యాయవ్యవస్థపై మరింత గౌరవాన్ని పెంచిందన్నారు. అంతిమంగా ప్రజలు, రైతులే గెలిచారని చెప్పారు. అధికారం ఉంది కదా అని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పోలీసులపై ఒత్తిడి తెచ్చి అక్రమ కేసులు బనాయించిందన్నారు.

తవ్వకాల్లో వెలుగు చూసిన బుద్ధ విగ్రహం

శాతవాహనులు లేదా ఇక్ష్వాకుల కాలానిదై ఉండొచ్చు



చింతకాని: ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచలో రామసముద్రం చెరువు వద్ద ఉపాధి హామీ కూలీలు శనివారం చేపట్టిన తవ్వకాల్లో పాలరాతి బుద్ధుని విగ్రహం బయటపడింది. రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టి కోసం రామసముద్రం చెరువులో తవ్వుతుండగా.. మూడు అడుగుల పాలరాతి బుద్ధుడి విగ్రహం వెలుగు చూసింది. ఆ పక్కనే విగ్రహానికి సంబంధించిన మూడున్నర అడుగులున్న మరో శకలం కనిపించింది. రామసముద్రం చెరువులో ఆరేళ్ల క్రితం కూడా తవ్వకాల్లో బుద్ధుడి విగ్రహాలు బయటపడటంతో పురావస్తు శాఖ అధికారులకు అప్పగించారు. రాష్ట్రంలోని ఫణిగిరి, నేలకొండపల్లితో పాటు నాగులవంచలోనూ బౌద్ధ కేంద్రాలున్నట్లు చరిత్ర చెబుతున్నందున.. ఇక్కడ విగ్రహాలు బయటపడుతున్నాయని పురావస్తు శాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నాగరాజు, భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ మిల్టన్ తెలిపారు. కాగా, బుద్ధుడి విగ్రహం బయటపడిన నేపథ్యాన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్కియాలజీ రీసెర్చ్ స్కాలర్ జక్కుల సోమయ్య, గ్రామపెద్ద కోలేటి నాగేశ్వరరావుతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ వెలుగు చూసిన విగ్రహం శాతవాహనులు లేదా ప్రారంభ ఇక్ష్వాకుల కాలం నాటిదని అభిప్రాయపడ్డారు.

రేపట్నుంచే భూముల రీసర్వే

▶ మొదటి పేజీ తరువాయి

ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ పద్ధతి ద్వారా ఎంపిక చేసిన ఐదు గ్రామాల్లో ఈ సర్వే సోమవారం నుంచి నిర్వహించనుంది. ఇందుకోసం ఆయా గ్రామాల్లో 4-5 రోజులుగా భూముల సరిహద్దుల నిర్ధారణ జరుగుతుండగా రేపట్నుంచి సర్వే బృందాలు అక్కడకు వెళ్లనున్నాయి. ముందుగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్‌నగర్, జగిత్యాల జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్త), ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ గ్రామాల్లోనే సర్వే నిర్వహించాలనుకున్నా ఆ తర్వాత సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం సాహెబ్‌నగర్, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగూరు గ్రామాలను కూడా కలిపారు. ఈ ఐదు గ్రామాల్లో పైలట్ సర్వే నిర్వహించేందుకు మూడు ఏజెన్సీలను ఎంపిక చేశారు. భూముల రీసర్వేను సర్వే, సెటిల్‌మెంట్ శాఖ పర్యవేక్షించనుంది.

గ్రామ పటాలు, కమతాల పటాల తయారీ..

భూముల రీసర్వేకు ప్రస్తుతం ఎంపిక చేసిన ఐదు గ్రామాల పటాలతోపాటు ప్రతి కమతానికి సరిహద్దులు నిర్ధారించి ఆయా కమతాల పటాలు కూడా రూపొందించనున్నారు. ఇందుకోసం ఆ గ్రామంలో ఎంత భూమి ఉంది.. ఎన్ని సర్వే నంబర్లున్నాయనే వివరాల ఆధారంగా సర్వేయర్లను మోహరించి ప్రతి సర్వే, బైసర్వే నంబర్లలోని కమతాలకు విడివిడిగా పటాలను తయారు చేయనున్నారు. ఇప్పటికే గ్రామాల్లో అందుబాటులో ఉన్న చెస్సలా, ఖాస్రా పహాణీ రికార్డులతో వాటిని సరిపోల్చి వివాదాల్లేని కొత్త పటాలను రెవెన్యూ రికార్డుల్లో చేర్చనున్నారు. ఈ గ్రామాల్లో ఎదురయ్యే అనుభవాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా భూముల రీసర్వే మార్గదర్శకాలు తయారవుతాయని సర్వే శాఖ అధికారులు చెబుతున్నారు.

ఏమవుతుందో... ఏమో?

భూముల రీసర్వే విషయంలో రెవెన్యూ వర్గాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. తెలంగాణలో నెలకొన్న భౌగోళిక పరిస్థితులు, రెవెన్యూ రికార్డులను బట్టి సర్వే జరిపితే ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో సమస్యలు వస్తాయని అంటున్నారు. ఈ విషయమై ఓ తహసీల్దార్ 'సాక్షి'తో మాట్లాడుతూ 'ఓ గ్రామంలోని 311 సర్వే నంబర్‌లో 200 ఎకరాలకు రికార్డు ఉంది. కానీ ఆ సర్వే నంబర్‌లో 300 ఎకరాల భూమి ఉంది. ఆ మేరకు రైతులకు 300 ఎకరాలకు పాసుపుస్తకాలున్నాయి. కానీ రెవెన్యూ రికార్డును మార్చలేకపోతున్నాం'అని అన్నారు. మరోవైపు భూకబ్జా ఓ సర్వే నంబర్‌లో ఉంటే రికార్డు మరో సర్వే నంబర్‌లో ఉంటుందని.. రాష్ట్రంలోని మొత్తం భూముల్లో 35-40 శాతం భూములకు ఇదే సమస్య వస్తుందన్నారు. రీసర్వేలో ఇదే విషయం తేలితే ఆయా గ్రామాల్లోని రికార్డులు, రైతుల పాసుపుస్తకాలన్నింటినీ మార్చాల్సి వస్తుందని చెప్పారు. రీసర్వే సులభమైనప్పటికీ అనంతరం ఎదురయ్యే సమస్యల పరిష్కారమే పెద్ద సవాల్ అని అభిప్రాయపడ్డారు.

ఆ గ్రామానికి నక్ష లేదు!

భూముల రీసర్వే కోసం ప్రభుత్వం ఎంపిక చేసిన ఐదు గ్రామాల్లోని రెండు గ్రామాల స్థితిగతులపై 'సాక్షి'క్షేత్రస్థాయి సమాచారం సేకరించింది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్‌నగర్ గ్రామాల్లో పరిస్థితుల గురించి స్థానిక రెవెన్యూ యంత్రాంగాన్ని అడిగి తెలుసుకుంది. ములుగుమడ గ్రామం తొలుత బ్రిటిష్ పాలన అమలైన నాటి ఆంధ్ర ప్రాంతంలో ఉండేది. అలాగే నిజాం పాలించిన తెలంగాణ ప్రాంతంలో ప్రస్తుత కంచికర్ల మండలంలో ఉన్న పరిటాల అనే గ్రామం ఉండేది. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పుడు జిల్లాల సరిహద్దుల మార్పుల్లో భాగంగా పరిటాలను గుంటూరు జిల్లాలో చేర్చి ములుగుమడను ఖమ్మం జిల్లాలో చేర్చారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భించాక కూడా ములుగుమడ తెలంగాణకే వచ్చింది. అయితే భూరికార్డుల ప్రక్షాళన జరిగే వరకు ఆ గ్రామంలో భూముల రికార్డులు సెంట్ల రూపంలోనే ఉండేవి. గుంటలు, ఎకరాలుగా ఉండేవి కావు. భూరికార్డుల ప్రక్షాళన తర్వాత దాన్ని గుంటల్లోకి మార్చారు. కానీ ఆ గ్రామ నక్షను అప్పటి నుంచి ఇప్పటిదాకా తయారు చేయలేదు. దీంతో ములుగుమడ గ్రామానికి అధికారికంగా గ్రామ సరిహద్దులే లేకుండా పోయాయి. ఇప్పుడు ఈ గ్రామాన్ని పైలట్ సర్వే కింద ప్రభుత్వం ఎంపిక చేసింది. మొదటగా స్థానిక రెవెన్యూ యంత్రాంగం గ్రామ సరిహద్దులను నిర్ధారించింది. ఈ మేరకు గ్రామ నక్షను కూడా తయారు చేయనున్నాయి. ఈ గ్రామంలో మొత్తం 103 సర్వే నంబర్లకు 845 ఎకరాల వరకు భూమి ఉంది. ఈ భూమిలోని ప్రతి కమతాన్ని సర్వే, బైసర్వే నంబర్లవారీగా రీసర్వే నిర్వహించి ఆయా కమతాల హద్దులు నిర్ధారించి పటాలు తయారు చేయనున్నారు. ఇక మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్‌నగర్ అనే గ్రామానికి నక్షతోపాటు ఇతర రెవెన్యూ రికార్డులన్నీ ఉన్నాయి. ఈ గ్రామంలోనూ ఇతర గ్రామాలతో సరిహద్దులను గుర్తించారు. ఈ గ్రామంలో 122 సర్వే నంబర్లలో 422 ఎకరాల భూమి ఉంది. సోమవారం నుంచి ఈ భూమిని కమతాల వారీగా సర్వే నిర్వహించి హద్దుల నిర్ధారణ ద్వారా కమతాల వారీగా పటాలు రూపొందించనున్నారు.

పాక్ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

- భారత్ తోడ్పాటును తుర్కియే గుర్తు చేసుకోవాలి
- ఇక్కడ ముస్లింలు గౌరవప్రదంగా జీవిస్తున్నారు
- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్.. ఇస్లాం పేరుతో చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తుర్కియే దేశానికి విజ్ఞప్తి చేశారు. పాక్ వ్యవహరిస్తున్న తీరుకు ఇస్లాంకు ఎటువంటి సంబంధం లేదన్నారు. శనివారం హైదరాబాద్ దారుస్సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాక్ కంటే భారత్‌లోనే ముస్లింల సంఖ్య ఎక్కువ అని, భారత్‌లోనూ గౌరవప్రదంగా జీవిస్తున్న విషయం మరిచిపోవొద్దని వ్యాఖ్యానించారు. తుర్కియే, భారత్‌ల మధ్య చారిత్రక సంబంధాలున్న విషయాన్ని గుర్తు చేశారు. గతంలో తుర్కియే అభివృద్ధికి భారత్ తోడ్పాటును అందించిందని పేర్కొన్నారు. పాక్ వైపు మొగ్గుచూపుతున్న తుర్కియే తమ విధానాన్ని పునరాలోచించుకోవాలని హితవు పలికారు. తనను పాక్ జాతీయులు విమర్శిస్తుండటంపైనా ఒవైసీ దీటుగా బదులిచ్చారు. 'నా లాగా నిక్కచ్చిగా ఉన్నది ఉన్నట్టు మాట్లాడే వారిని పాకిస్తానీలు ఇప్పటివరకూ ఎప్పుడూ చూడలేదు. నాలాంటి వారు ఇండియాలో మాత్రమే ఉంటారు. వాళ్లు నేను చెప్పేది జాగ్రత్తగా వినాలి. అప్పుడే వారికి అవగాహన పెరిగి అజ్ఞానం తొలగిపోతుంది'అని అన్నారు.

మానవాళికి ముప్పు పాక్: పాకిస్తాన్ నిరంతరం ఉగ్రవాదానికి చేయూతనిస్తూ మానవాళికే ముప్పుగా పరిణమించిందని అసదుద్దీన్ ఒవైసీ నిప్పులు చెరిగారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదానికి భారత్ బాధిత దేశంగా మారిందన్నారు. పాక్ తనని తాను ఇస్లామిక్ దేశంగా ప్రకటించుకోవడాన్ని ఒవైసీ కొట్టి పారేశారు. దీర్ఘకాలిక ఎజెండా ప్రకారం, పాకిస్తానీ మిలిటరీ భారత్‌లో అస్థిరతను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. భారత్, పాక్ కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడాన్నీ ఆయన విమర్శించారు. మతపరమైన విభజనలు సృష్టించడం, దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం పాకిస్తాన్ అప్రకటిత సిద్ధాంతమని ఒవైసీ ఆరోపించారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని అంతర్జాతీయ వేదికల దృష్టికి భారత్ తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. విదేశాలకు పంపించే అఖిల పక్ష ప్రతినిధుల బృందంలో తాను ఉండే విషయం కానీ, చైర్‌పర్సన్ ఎవరనేది కానీ తనకు తెలియదని ఒక ప్రశ్నకు సమాధానంగా ఒవైసీ చెప్పారు.

వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగొద్దు

సమీక్షలో సింగరేణి సీఎండీ బలరామ్



సాక్షి, హైదరాబాద్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి, రవాణా కుంటుపడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ అన్ని ఏరియాలోని జనరల్ మేనేజర్లను ఆదేశించారు. శనివారం ఆయన కొత్తగూడెం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జనరల్ మేనేజర్లు, డైరెక్టర్లతో ఉత్పత్తిపై సమీక్షించారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల ఓపెన్ కాస్ట్ గనుల్లో నీరు నిలిచి బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడే అవకాశం ఉన్నందువల్ల ముందస్తుగా సంపులలోని నీటిని తొలగించడం కోసం తగినన్ని మోటారు పంపులను సమకూర్చుకోవాలన్నారు. రోజుకు కనీసం 2.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.4 లక్షల టన్నుల బొగ్గు రవాణా సాధించాలని చెప్పారు.

యుద్ధంలో ఉన్నా.. రాలేకపోతున్న

సీఎం గారూ.. నా భూమిని కాపాడండి

- సీఎం రేవంత్‌కు బీఎస్ఎఫ్ జవాన్ రామస్వామి వేడుకోలు





భూమి పత్రాలను చూపిస్తున్న జవాన్ తల్లిదండ్రులు (ఇన్‌సెట్‌లో బీఎస్ఎఫ్ జవాన్ రామస్వామి)

దుబ్బాక: 'దేశ సరిహద్దుల్లో శత్రువులతో నేను పోరాడుతుంటే.. సొంతూరులో భూమిని కబ్జా చేసిన అక్రమార్కులతో నా తల్లిదండ్రులు పోరాడాల్సి వస్తోంది'అని సిద్దిపేట జిల్లాకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ బూర రామస్వామి వాపోయాడు. తన భూమిని కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జమ్మూకశ్మీర్ నుంచి శనివారం ఓ సెల్ఫీ వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లా భూంపల్లి-అక్బర్‌పేట మండలం చౌదర్‌పల్లికి చెందిన రామస్వామి తన భూమి కబ్జా అయిన తీరును ఆ వీడియోలో వివరించాడు. '1992లో ధర్మాజీపేట శివారులోని 406 సర్వే నంబర్‌లో నా తల్లిదండ్రులు 1.16 ఎకరాల భూమిని సాదాబైనామా కింద కొనుగోలు చేశారు. ఆ భూమిని నా గ్రామానికే చెందిన వీఆర్వో రమేష్.. తన సోదరుల పేరిట రికార్డుల్లోకి ఎక్కించుకున్నాడు. భూమి గురించి అడిగితే వీఆర్వో బంధువులు నా తల్లిదండ్రులను బెదిరిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మా భూమిని మాకు దక్కేలా చేయాలి'అని వేడుకున్నాడు. ఈ వీడియోపై స్పందించిన బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు.. వెంటనే జిల్లా కలెక్టర్ మనుచౌదరికి ఫోన్ చేసి జవాన్ భూ సమస్యను పరిష్కరించాలని కోరారు. తన ఎక్స్ ఖాతాలో కూడా ఆ వీడియోను పోస్ట్ చేశారు. దీంతో రెవెన్యూ యంత్రాంగంలో వెంటనే స్పందించింది. శనివారం సాయంత్రం భూంపల్లి తహసీల్దార్ మల్లిఖార్జున్, ఆర్ఐ తదితరులు పంచనామా నిర్వహించి కలెక్టర్‌కు నివేదించారు.

క్లుప్తంగా...

సీఎం మార్పు ప్రతిపక్షాల కల్పిత కుట్ర

- సురేఖ వ్యాఖ్యల వక్రీకరణ
- నెలాఖర్లో మంత్రివర్గ విస్తరణ
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్



నిజామాబాద్ రూరల్: సీఎం మార్పు ప్రతిపక్షాల కల్పిత కుట్ర అని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఆయన శనివారం నిజామాబాద్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు.. సీఎం రేవంత్‌రెడ్డి కుల సర్వే నిర్వహించి చరిత్ర సృష్టించారన్నారు. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను వక్రీకరించి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వాటిపై కొండా సురేఖ సైబర్ క్రైంలో ఫిర్యాదు చేయబోతున్నారన్నారు. ఈ నెలాఖరు లేదా వచ్చేనెల మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని వెల్లడించారు. బీఆర్‌ఎస్ పార్టీలో కవిత, కేటీఆర్, హరీశ్‌రావుల మధ్య మూడు ముక్కలాట నడుస్తోందన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రధాని మోదీ వైఖరితో ఆయన సత్తా ఏంటో తేలిపోయిందన్నారు. సమావేశంలో వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశవేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్లకూ నైపుణ్య శిక్షణ

- ట్రస్మాకు నిర్వహణ బాధ్యతలు
- ఆన్‌లైన్ విధానంలో కోర్సు



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యం పెంపొందించేందుకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రైవేటు స్కూల్స్, విద్యార్థుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు షామిల్ అహ్మద్ తెలిపారు. హైదరాబాద్ ట్రస్మా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కేంద్ర నైపుణ్య మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, తెలంగాణలో ఇందుకోసం రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్‌ను గుర్తించి, శిక్షణ కార్యక్రమ నిర్వహణ భాగస్వామ్య ఒప్పందం చేసుకుందని తెలిపారు. కోర్సు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు భారత స్కిల్ డెవలప్‌మెంట్ అంత్రపెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ నుంచి సర్టిఫికెట్లు వస్తాయని వివరించారు. జాతీయ విద్యా విధానం అమలులోకి వచ్చిన తరుణంలో విద్యార్థుల మనోవికాసాన్ని అర్థం చేసుకుని, వారికి ఈ తరం పద్ధతులకు అనుగుణంగా బోధన చేయటం, వారిలో మరింత నాణ్యత పెంచేందుకు ఈ కోర్సు తోడ్పడుతుందని చెప్పారు. ఆన్‌లైన్ విధానంలో 30 గంటల పాటు ఈ కోర్సును నిర్వహిస్తారని, రూ. 8 వేల ఫీజు ఉంటుందని వివరించారు. దేశవ్యాప్తంగా లక్షల మంది ప్రైవేటు టీచర్లకు ఈ కోర్సు వల్ల ప్రయోజనం ఉంటుందని, రాష్ట్రంలో ట్రస్మాకు ఈ అవకాశం రావడం సంతోషకరమైన అంశమని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సామా నర్సిరెడ్డి తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు ఇప్పుడు ఉద్యోగులు కావాల్సి వచ్చారా ?

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: అధికారం పోయాక.. బీఆర్‌ఎస్‌కు ఉద్యోగులు కావాల్సి వచ్చారా అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నేతలు ముందు తమ ఇంటిని చక్కదిద్దుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సహా అందరినీ ప్రజా ప్రభుత్వం కళ్లలో పెట్టుకొని చూసుకుంటుందని చెప్పారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగులను రెచ్చగొట్టడానికి కుట్ర చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగ సంఘాల మాజీ నాయకులను పిలిచి ఉద్యోగుల్లో విభజన తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఉద్యోగ సమస్యల పరిష్కారానికి ప్ర భుత్వమే సుముఖంగా ఉన్నప్పుడు ఆందోళనల అవసరమేముందని ప్రశ్నించారు.









అందగత్తెల 'ఆట'విడుపు

- గచ్చిబౌలి స్టేడియంలో మిస్‌వరల్డ్ పోటీదారుల క్రీడా దినోత్సవం
- పలు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్న సుందరీమణులు
- త్వరలో తెలంగాణ నూతన క్రీడా విధానం: మంత్రి జూపల్లి

సాక్షి, హైదరాబాద్: అందంలో మాత్రమే కాదు ఆటల్లోనూ తాము మేటి అంటూ అందాల రాణులు పలు రకాల క్రీడల్లో సత్తా చాటారు. నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీదారుల కోసం శనివారం క్రీడా దినోత్సవం నిర్వహిచారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్, చెస్ వంటి క్రీడాంశాల్లో వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు పాల్గొన్నారు. 109 దేశాలకు చెందిన పోటీదారులు భారతీయ సంప్రదాయ యోగాసనాలు సాధన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మణిపురి మార్షల్ ఆర్ట్స్ 'థాంగ్–టా' ప్రదర్శన, 24 మంది ఆర్టిస్టిక్ స్కేటర్లు ప్రదర్శించిన రోలర్ స్కేటింగ్ ఆకట్టుకున్నాయి. ఈ స్పోర్ట్స్ డే వేడుకలతో స్టేడియం మొత్తం పండుగ వాతావరణం నెలకొంది. పలు పోటీలలో గెలిచిన సుందరీమణులకు గుర్తింపు పత్రాలను అందించారు.

త్వరలోనే కొత్త క్రీడా విధానం: జూపల్లి

రాష్ట్రంలో త్వరలోనే కొత్త క్రీడా విధానం తీసుకురానున్నట్లు ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో ప్రకటన చేస్తారని చెప్పారు. గచ్చిబౌలి స్టేడియంలో క్రీడా దినోత్సవాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేలా తెలంగాణ నూతన క్రీడా విధానం ఉంటుందని చెప్పారు. గ్రామీణ జనాభాలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తోందని తెలిపారు. తెలంగాణలో 72వ మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించడం వెనుక ప్రధాన ఉద్దేశం రాష్ట్రాన్ని ప్రపంచానికి పరిచయం చేయడమేనని పేర్కొన్నారు. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. క్రీడలు –మిస్ వరల్డ్ ప్రత్యేక కలయిక అయిన స్పోర్ట్స్ డే సమాజానికి ఫిట్‌నెస్ సందేశాన్ని ఇస్తోందని అన్నారు. వివిధ జిల్లాల్లోని పర్యాటక ప్రదేశాలను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించడం గ్రామీణ ప్రజలను ఉత్సాహపరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాజ్యోతితో పరుగెత్తుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రామోజీ ఫిలిం సిటీ సందర్శన

ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటున్న పోటీదారులు శనివారం సాయంత్రం రామోజీ ఫిలింసిటీని సందర్శించారు. అయితే ముందుగా ఖరారు చేసిన షెడ్యూల్ ప్రకారం ఏదీ సాగలేదు. కార్యక్రమాలు బాగా ఆలస్యమవడం, పలుచోట్ల తమ సహాయకులను అనుమతించకపోవడంపై అందాలభామలు అసంతృప్తి వ్యక్తంచేశారు.

హలో వరల్డ్.. మిస్ కావొద్దు!

మిస్ వరల్డ్‌తో తెలంగాణ బ్రాండ్‌కు విశ్వవ్యాప్త ప్రచారం..

సామాజిక మాధ్యమాల ద్వారా పోస్ట్ చేస్తున్న పోటీదారులు

3,300 విదేశీ టీవీ ఛానల్స్‌కు నిత్యం ఫీడ్.. ప్రపంచవ్యాప్తంగా ప్రసారాలు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీల ద్వారా తెలంగాణకు, హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం లభిస్తోంది. పోటీలకు వచ్చిన ప్రతినిధులు వివిధ మీడియా సంస్థలకు, మిస్ వరల్డ్ సంస్థ ఏర్పాటు చేసిన సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో హైదరాబాద్, తెలంగాణ గురించి గొప్పగా వర్ణిస్తున్నారు. హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందిన ఆధునిక నగరమని, తెలంగాణ తనదైన సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆకట్టుకుంటోందని ప్రశంసిస్తున్నారు. ఇవన్నీ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ప్రచారమవుతున్నాయి. ఒక్కో ప్రపంచ సుందరి పోటీదారుకు సోషల్‌మీడియాలో లక్షల్లో ఫాలోవర్స్ ఉన్నారు. వీరి వీడియోలు నిత్యం వైరల్ అవుతున్నాయి. అలా హైదరాబాద్, తెలంగాణకు మంచి ప్రచారం లభిస్తోంది.

3,300 విదేశీ ఛానల్స్‌కు సమాచారం

మిస్ వరల్డ్ పోటీలను కవర్ చేసేందుకు 150 దేశాలకు చెందిన మీడియా సంస్థల ప్రతినిధులు హైదరాబాద్‌కు వస్తున్నారని, దాదాపు మూడున్నర వేల మంది విదేశీ జర్నలిస్టులు పోటీలయ్యేవరకు హైదరాబాద్‌లో ఉండి ఆయా దేశాలకు ఇక్కడి పరిస్థితులపై సానుకూల సంకేతాలను పంపుతారని ప్రభుత్వం పలు సందర్భాల్లో తెలిపింది. కానీ, ఈ పోటీల కవరేజీకి వచ్చిన విదేశీ మీడియా ప్రతినిధులు 20 మంది వరకు మాత్రమే. దీంతో ప్రభుత్వ అంచనా తప్పిందన్న భావన వ్యక్తమైంది. అయితే, మిస్ వరల్డ్ లిమిటెడ్ ఈ పోటీల ప్రచారం కోసం బ్రిటన్‌కు చెందిన ఓ మీడియా సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఆ సంస్థ ప్రతినిధులు హైదరాబాద్‌లో మకాం వేసి, పోటీలకు సంబంధించి సమగ్ర వివరాలను 3,300 విదేశీ టీవీ ఛానల్స్‌కు అందిస్తున్నారు. పోటీలో ఉన్న 113 దేశాలకే కాకుండా, పోటీల్లో లేని దేశాలకు చెందిన టీవీ ఛానల్స్ కూడా ఆ జాబితాలో ఉన్నాయని మిస్ వరల్డ్ ప్రతినిధులు తెలిపారు. దీంతో తెలంగాణకు ప్రపంచం నలుమూలలా ప్రచారం లభిస్తోంది.

భిన్న సంస్కృతుల కేంద్రం

ఆశ్చర్యపరిచే భిన్న సంస్కృతులకు కేంద్రం తెలంగాణ. విద్య, వైద్య పరంగా ఇక్కడ గొప్ప వసతున్నాయి. మా దేశం నుంచి ఎంతోమంది ఇక్కడ చదువుకునేందుకు వస్తున్నారు. ఇప్పుడు ఇక్కడి వసతులను ప్రత్యక్షంగా చూస్తున్నాను – అయోమ్ టీటో మటీస్, సౌత్ సూడాన్.

సొంత ప్రాంతంలో ఉన్నట్లుంది

ఆఫ్రికా ఖండంలో సంస్కృతికి గొప్పగా ఉంటుంది. తెలంగాణను చూసిన తర్వాత మాలాగే ఇక్కడి ప్రజలు సంస్కృతిని కాపాడుకుంటూ కొనసాగిస్తున్న తీరు అబ్బురపరిచింది. నాకు సొంత ప్రాంతంలో ఉన్న అనుభూతి కలుగుతోంది. – జైనబ్, సోమాలియా

ఇక్కడి అభివృద్ధి ఆశ్చర్యకరం

మా దేశంలో చాలా మందిలో ఇండియా అభివృద్ధి చెందని దేశం అన్న భావన ఉంది. కానీ, హైదరాబాద్‌ను చూసిన తర్వాత ఇక్కడి ఆధునిక పోకడలు, తక్కువ సమయంలో అభివృద్ధి చెందిన తీరు తెలుసుకుని ఆశ్చర్యపోయాను. – అతెన్నా క్రోస్బీ, అమెరికా

ఇదెంతో సురక్షిత ప్రాంతం

ఇక్కడికి రావటం సురక్షితం కాదని, విదేశీ యువతులను రేప్ చేసి చంపేస్తారని నేను ఇక్కడికి వచ్చేముందు కొందరు సలహా ఇచ్చారు. కానీ, ఇక్కడికి వచ్చాక తెలిసింది.. ఈ ప్రాంతం చాలా సురక్షితమని. ఇప్పుడు హైదరాబాద్ విషయంలో నా దృక్కోణం పూర్తిగా మారింది. – నటాషా న్యోన్యోజీ, ఉగాండా.



ఇక్కడ బౌద్ధానికిస్తున్న ప్రాధాన్యం ఆశ్చర్యపరిచింది

భారతీయ సంప్రదాయాలంటే జపనీయులకు ఎంతో ఇష్టం. వాటిని ఇప్పుడు ప్రత్యక్షంగా చూసి పులకిస్తున్నాను. ఈ ప్రాంతంలో బౌద్ధానికి ప్రాధాన్యం ఇస్తున్న తీరు చూసి నిజంగా ఆశ్చర్యపోయాను. నాకు ఇండియా సినిమాలంటే చాలా ఇష్టం. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటునాటు పాటకు మా దేశంలో యువత రీల్స్ రూపొందించారు. ఆ పాటలో నటించిన తెలుగు నటుల సొంత ప్రాంతంలో ఇప్పుడు నేనున్నానన్న అనుభూతి గొప్పగా ఉంది. – కియానా తుమీత, జపాన్

'ములుగు'కు గోదావరి జలాలు అందించండి

మంత్రి ఉత్తమ్‌ను కోరిన సీతక్క... సానుకూలంగా స్పందన

సాక్షి, హైదరాబాద్: ములుగు నియోజకవర్గానికి గోదావరి జలాలు అందడంలేదని, సాగునీరు అందక స్థానిక రైతులు అన్యాయానికి గురవుతున్నారని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆమె నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలసి గోదావరి నది మీద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ములుగులో గోదావరిపై లిఫ్టులు ఏర్పాటు చేయాలని, రైతులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని కోరారు. సీతక్క విజ్ఞప్తికి ఉత్తమ్ సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదిత ప్రాజెక్టులపై అధ్యయనం చేయించి, ప్రాజెక్టుల నిర్మాణం చేపడతామన్నారు.

తెలంగాణతో పోటీ పడే రాష్ట్రమే లేదు

- గిరిజనుల కోసం 'ఇందిర సౌర జలవికాసం'పథకం
- వారి భూముల్లో బోరు బావులకు రూ.12,500 కోట్లు
- సోలార్, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క వెల్లడి
- ఉద్యాన శాఖ నుంచి ఉచితంగా మొక్కల పంపిణీ
- 19న సీఎం చేతుల మీదుగా పథకం ప్రారంభం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్ (కొత్తగూడెం): సంక్షేమం, అభివృద్ధి విషయంలో తెలంగాణతో పోటీపడే రాష్ట్రం దేశంలోనే లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శనివారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదేళ్లు ఫామ్‌హౌస్‌లో పడుకుని ప్రజల సొమ్మును దుబారా చేసిన మాజీ సీఎం కేసీఆర్, రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయాభివృద్ధితో పాటు పరిశ్రమల విస్తరణకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే లేనంతగా విద్యుత్ డిమాండ్ పెరిగినా ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 104 నియోజకవర్గాలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు మంజూరు చేశామని, ఒక్కో పాఠశాల నిర్మాణానికి రూ. 200 కోట్లు ఖర్చవుతాయని వివరించారు. అడవికి నష్టం జరగకుండా, గిరిజనులు ఆత్మగౌరవంతో నిలబడేలా ఇందిర సౌర జలవికాసం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, గిరిజనుల భూముల్లో బోర్లు వేయడానికి రూ.12,500 కోట్లు కేటాయించామని తెలిపారు. ఆ భూముల్లో సోలార్, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించడంతో పాటు ఉద్యానశాఖ నుంచి అవసరమైన మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ పథకాన్ని అచ్చంపేట నియోజకవర్గంలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని, ఆ తర్వాత రాష్ట్రమంతా అమలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కొత్తగూడెం, వైరా ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, రాందాస్ నాయక్, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, సింగరేణి సీఎండీ బలరాం, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై బీఆర్‌ఎస్ సమరశంఖం

- డిమాండ్లు నెరవేర్చేంత వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం
- పోరాటానికి త్వరలో కార్యాచరణ
- ఉద్యోగ సంఘాల మాజీ నేతలతో భేటీలో కేటీఆర్, హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సమరశంఖం పూరించాలని బీఆర్‌ఎస్ పార్టీ నిర్ణయించింది. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనే విషయం తేటతెల్లమైందని, డిమాండ్లను నెరవేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా త్వరలో పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పింది. శనివారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో ఉద్యోగ సంఘాల మాజీ నేతలు, తెలంగాణ వికాస సమితి ప్రతినిధులతో భేటీ అయ్యారు. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పెన్షనర్ల డిమాండ్లపై స్పందించడం ప్రధాన ప్రతిపక్షంగా తమ బాధ్యత అని కేటీఆర్ వారితో చెప్పినట్లు తెలిసింది. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ భేటీలో చర్చించినట్లు సమాచారం. ప్రభుత్వం గడిచిన 18 నెలల్లో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై విస్తృతంగా చర్చించారు. అధికారంలోకి రాకముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకపోవడం, డీఏ బకాయిలు, పీఆర్సీ వంటి ప్రధాన డిమాండ్లను పట్టించుకోకపోవడం తదితరాలను మాజీ ఉద్యోగ సంఘాల నాయకులు ప్రస్తావించారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను సకాలంలో అందించకుండా ఇబ్బందులకు గురి చేయడం, ప్రశ్నించేందుకు ప్రయత్నిస్తున్న ఉద్యోగులపై ఒత్తిడి తేవడం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. 'ఉద్యోగుల ఆకాంక్షలు, హక్కుల పట్ల బీఆర్‌ఎస్ ఎల్లవేళలా సానుభూతితో ఉంటుంది. ప్రభుత్వం లక్షల మంది ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తుంటే వారికి అండగా నిలవడం మా బాధ్యత. ప్రస్తుతం ఉద్యోగ సంఘాలకు నాయకత్వం వహిస్తున్న నేతలకు మద్దతుగా నిలుస్తాం. పార్టీలో ఉన్న ఉద్యోగ సంఘాల మాజీ నాయకులు, గతంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న రిటైర్డ్ నేతలను కలుపుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం'అని కేటీఆర్, హరీశ్‌రావు వారికి హామీ ఇచ్చారు. ఈ భేటీలో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, టీఎన్జీఓస్ యూనియన్ మాజీ అధ్యక్షులు దేవీ ప్రసాద్, మామిండ్ల రాజేందర్, ఉపాధ్యాయ సంఘాల మాజీ నేతలు పాతూరు సుధాకర్‌రెడ్డి, భుజంగరావు పాల్గొన్నారు.

తెలంగాణ అస్తిత్వ పోరాటం

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తోపాటు తెలంగాణ వికాస సమితికి చెందిన ఎర్రోజు శ్రీనివాస్, వేణుగోపాలస్వామి తదితరులతో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అస్తిత్వాన్ని చాటేలా క్షేత్రస్థాయిలో భావసారూప్య సంస్థలతో కలిసి పనిచేయాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. తెలంగాణ సంస్కృతి, అస్తిత్వ పరిరక్షణ లక్ష్యంగా ఉద్యమ కాలం నాటి తరహాలో కవులు, కళాకారులు, రచయితలు, విభిన్న రంగాలకు చెందిన మేధావులను కలుపుకుని ప్రజల్లోకి వెళ్లాలని సంకల్పించింది.



లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకేగాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, **తిథి:** బ.షష్ఠి రా.2.26 వరకు తదుపరి సప్తమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ప.3.48 వరకు, తదుపరి శ్రవణం,**వర్జ్యం:** రా.7.49 నుండి 9.25 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.38 నుండి 5.30 వరకు, **అమృత ఘడియలు:** ఉ.9.11 నుండి 10.50 వరకు, తిరిగి తె.5.24 నుండి 7.02 వరకు (తెల్లవారితే సోమవారం).

సూర్యోదయం : 5.31
సూర్యాస్తమయం : 6.21
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

వారెన్ బఫెట్ (బిజినెస్ టైకూన్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు


వృద్ధాప్యం అన్నది మంచి విషయం కాక పోవచ్చు. అయితే, అంతకంటే కూడా మంచిది కాని విషయం... ఊరికే వృద్ధాప్యాన్ని వెంటేసుకుని తిరగటం!

నెరుపో, మరుపో కాదు. తలపు మన వృద్ధాప్యం. వెనక ఇన్నిన్ని జ్ఞాపకాలు ఉన్నాక, ఎన్నెన్ని జన్మలకైనా వృద్ధ కపోతాలు వచ్చి వాలటానికి చోటుంటుందా భుజాల పైన?!

94 ఏళ్ల వయసులోనూ నేనింకా ఆరేళ్ల పిల్లవాడిలా ఔన్సుల కొద్దీ కోకాకోలా తాగుతూ, మెక్‌డొనాల్డ్స్ నుంచి తెప్పించుకున్న బేకన్, ఇంకా.. చీజ్ బిస్కెట్లు ఇష్టంగా తింటూ ఉంటానంటే నా వయసు ఆరేళ్లన్నట్లా? లేక, తొంభై నాలుగేళ్లన్నట్లా?!

"డిసెంబరులో కంపెనీ సీఈవో బాధ్యతల నుండి తప్పుకుంటాను.." అని ఈ నెల మొదట్లో ఓమాహాలో జరిగిన 'బెర్క్‌షైర్ హాథ్‌వే' వార్షిక సమావేశంలో నేను ప్రకటించినప్పుడు కూడా నా వయసు ఆరేళ్లుగానే ఉంది. తొంభై నాలుగేళ్లుగా కాదు!

"మిస్టర్ వారెన్! ఫస్ట్ టైమ్ మీకు ఎప్పుడు అనిపించింది వయసు పైబడినట్లు?" అని – వాల్‌స్ట్రీట్ జర్నల్ నుంచి మిస్ క్యారెన్ లాంగ్లీ!



తన వైపు బ్లాంక్‌గా చూశాను.

ప్రపంచంలోని టాప్–10 కంపెనీలలో ఒకటైన 1.08 ట్రిలియన్ డాలర్ల 'బెర్క్‌షైర్ హాథ్‌వే' గురించి కానీ, నా తర్వాత సీఈవోగా ఉంటారని నేను ప్రకటించిన 62 ఏళ్ల గ్రెగ్ అడెల్ గురించి కానీ అడగటానికి తన దగ్గర ఒక్క ప్రశ్నా లేనట్లుంది!

"లుక్... మిస్ క్యారెన్! ఎవరికైనా ఎలా తెలుస్తుంది ఫలానా తేదీ నుంచి తమకు వయసు పైబడినట్లు! జన్మదినంలా, ఒక వృద్ధాప్య దినం ఎందుకు ఉంటుంది?!" అన్నాను... నవ్వుతూ.

బహుశా ఈ జర్నలిస్టులు మానవ జీవిత యుగాంతానికి ప్రారంభ సంకేతాలుగా, ఒక కంపెనీ సీఈవో నుండి ఆశిస్తుండేది... అడుగులు తడబడటం, బాడీ బ్యాలెన్స్ తప్పటం, తూలి పడబోవటం... ఇలాంటివి కావచ్చు.

కానీ, అవేవీ అడల్ట్‌హుడ్ ఆరంభ ఛాయలు కాదు. భుజాల మీది జ్ఞాపకాలు ఒకటొకటిగా మనక 'జారి'పోతూ ఉంటే, వాటి స్థానంలోకి మెల్లిగా వచ్చి వాలుతుండే మతిమరపులే ఈ ఓపలేని వయో భారాలు.

ఓమాహాలో మేముండే చోట బెట్టీ గాలఫూర్ అనే అమ్మాయిని గాఢంగా ప్రేమించాన్నేను. అప్పుడు నా వయసు 18 ఏళ్లు. అయితే ఆ అమ్మాయికి అప్పటికే బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడని తెలిసి నా గుండె బద్దలైపోయింది. ఆ బాయ్‌ఫ్రెండ్‌కు రాని విద్య ఏదో కనిపెట్టి, బెట్టీకి దగ్గరయ్యేందుకు 'యూకలేలీ' హవాయ్ గిటార్‌ను ప్లే చేయటం నేర్చుకున్నాను. తను చూస్తూ ఉండగా శ్రావ్యంగా ప్లే చేశాను. బెట్టీ నన్ను మెచ్చుకోలుగా చూసింది కానీ, తన బాయ్‌ఫ్రెండ్‌ని మాత్రం విడిచిపెట్టలేదు!

ఇంకో జ్ఞాపకం – నా 20 ఏళ్ల వయసప్పుడు నా చెల్లెలి రూమ్మేట్ సూజన్‌ను పెళ్లి చేసుకుంటానని నేను వెళ్లి ఆమె తండ్రిని అడగటం. "నా కూతుర్ని పస్తులుంచి చంపేస్తావా ఏంటి నువ్వు!" అనేశారాయన!!

ఆ వెంటనే మెత్తబడి..."నీ మీద నమ్మకం ఉన్నా ఈ డెమొక్రాట్‌లు, కమ్యూనిస్టుల మీద నమ్మకం లేదు..." అన్నారు. ఆ మాట ఎప్పుడు గుర్తొచ్చినా పెద్దగా నవ్వేస్తుంటాను నేను.


తొలినాళ్ల ప్రేమలు, నవ్వులు నూరేళ్లకైనా వయసును మీద పడనివ్వవు.

"మిస్టర్ వారెన్! మిస్టర్ వారెన్! ఎక్కడికి వెళ్లిపోయారు మీరు? గతంలోకా, భవిష్యత్తులోకా?" అని నవ్వుతోంది మిస్ క్యారెన్ లాంగ్లీ.

"చెప్పండి సర్! ఏజ్ కారణం కాకుంటే మరెందుకు సీఈవోగా స్టెప్ డౌన్ అవాలని అనుకున్నారు?" అంటోంది తనింకా!

"న్యూస్ పేపర్స్ చదవటానికి టైమ్ సరిపోవటం లేదు మిస్ క్యారెన్..." అని చెబితే ఆశ్చర్యపోనంత వయసు తనకు వచ్చి ఉండొచ్చని నాకనిపించింది. న్యూస్ పేపర్స్ కాదు, మళ్లీ మళ్లీ అదే పనిగా 'బ్రేకింగ్ బ్యాడ్' క్రైమ్ డ్రామా సీరీస్ చూడాలని కూడా ఉంది నాకు!

ఇది స్టేట్ ఫ్యాక్షనిజం కాదా?



జనతంత్రం

వర్ధెల్లి మురళి

ప్రభుత్వ యంత్రాంగంలో ముఠా తత్వాన్ని ప్రవేశపెడితే ఎలా ఉంటుంది? అచ్చంగా నేటి ఆంధ్రప్రదేశ్ పరిపాలన మాదిరిగా ఉంటుంది. కక్షలూ, కార్పణ్యాలూ, ప్రత్యర్థుల వేటలే ప్రధానాంశాలుగా సర్కారు ఎజెండాను ఆక్రమించాయి. ప్రజా శ్రేయస్సు గురించి మాట్లాడడం కూడా ఇప్పుడు అప్రకటిత నిషేధిత జాబితాలో చేరిపోయినట్టుంది. ఏలినవారిచ్చిన హామీల అమలు గురించి ప్రశ్నించడం కూడా నేరమైపోతున్నది. కేసుల బెత్తం కర్ర్రజేస్తున్నది. జైళ్ల నోళ్లు తెరుస్తున్నాయి. వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళి, నందిగం సురేశ్, సుధారాణి, కృష్ణవేణి, రవీందర్‌రెడ్డి... ఇలా ఎంతమంది గొంతుకలపైకి ఫ్యాక్షన్ సర్కార్ పంజా విసిరిందో చూస్తూనే ఉన్నాము. అస్మదీయ బూతు జాగిలాలు మాత్రం ఎంతయినా పెట్రేగిపోయే వెసులుబాటును కల్పించారు. మొక్కుబడిగా ఒక్క పచ్చి బూతు జాగిలాన్ని అత్తారింటికి పంపినట్టు ఓ నాలుగు రోజులు లోపలికి పంపించి, సగౌరవంగా విడిచిపెట్టేశారు. ఈ బూతుశ్రీ కంటే కరుడుగట్టిన తీవ్రవాదులా... వంశీ, పోసాని, నందిగం వగైరాలు?

కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కాకముందే చంద్రబాబు అరెస్టుకు ప్రతీకారం తీర్చుకోవాలన్న దుగ్ధ ప్రభుత్వ యంత్రాంగంలో కనిపిస్తున్నది. యెల్లో మీడియాలో జ్వలిస్తున్నది. అందుకు అవకాశమున్నదా అనే మీమాంస అవసరం లేదు. తాము కోరుకున్నట్టుగా కేసులు రాసుకోవడానికి గత ప్రభుత్వం అమలుచేసిన మద్యం పాలసీని ఎంచుకున్నారు. నిజానికి జగన్ ప్రభుత్వ పాజిటివ్ అంశాల్లో మద్యం పాలసీ కూడా ఒకటి. ఒక పాజిటివ్ అంశాన్ని నెగెటివ్ కోణంలో చూపెట్టడానికి రోజుకో సారా మజిలీ కథను, పూటకో పుక్కిటి పురాణాన్ని ప్రభుత్వ యంత్రాంగం వండి వార్చడం, యెల్లో మీడియా వడ్డించడం ఒక దైనందిన దైవకార్యంగా చేపట్టినట్టు కనిపిస్తున్నది. తాజాగా రిమాండ్ రిపోర్టుల పేరుతో వెలువరిస్తున్న ఫిక్షన్ సాహిత్యంతో కొంతమందినైనా గందరగోళానికి గురి చేయాలనే ఉద్దేశం కనిపిస్తున్నది.

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేసిన మద్యం విధానంలో గందరగోళానికి గురి కావలసినంత సంక్లిష్టత ఏమీ లేదు. సామాన్యుడికి కూడా అర్థమయ్యే సులభమైన విధానం అది. మద్యం మహమ్మారి విష ప్రవాహానికి సంసారాలు ఛిద్రమవుతున్నాయనే మహిళల ఆక్రందనను 'పాదయాత్ర' సందర్భంగా జగన్ గమనించారు. దీనికి ముగింపు పలకడం కోసం మద్య నిషేధం విధించాలనే ఆలోచన చేశారు. అయితే గత అనుభవాల దృష్ట్యా ఎకాయెకిన నిషేధించడం సాధ్యమయ్యే పని కాదని, ఆచరణాత్మక పద్ధతిలో దశలవారీ నిషేధాన్ని ఎంచుకున్నారు. మద్యం షాపుల సంఖ్యను తగ్గించారు. లాభాపేక్షతో దొంగచాటు అమ్మకాలు, కల్తీ వంటివి జరగకుండా ప్రైవేట్ వ్యాపారాన్ని తొలగించి ప్రభుత్వ పరిధిలోకి అమ్మకాలను తీసుకొచ్చారు. ఫలితంగా 43 వేల బెల్ట్‌షాపులను విజయవంతంగా మూసివేయడం సాధ్యపడింది. విచ్చలవిడిగా మద్యం తయారీని నిరుత్సాహపరచడానికి ఒక్క డిస్టిలరీకి కూడా కొత్తగా అనుమతి నీయలేదు.

మద్యం దుకాణాల సంఖ్యను కూడా గణనీయంగా పది శాతం కంటే ఎక్కువగానే తగ్గించారు. వాటికి అనుబంధంగా ఉండే పర్మిట్ రూములూ మూతపడ్డాయి. దుకాణంలో అమ్మకాలు జరిగే సమయాన్ని తగ్గించి, రాత్రి 9 గంటలకే మూసేశారు. టీడీపీ హయాంలో అనధికారికంగా 24 గంటలూ మద్యం అమ్మకాలు సాగేవి. వ్యాపారులంతా టీడీపీ అనుయాయులే కనుక, పైదాకా మామూళ్లు ఇచ్చేవారే కనుక ఈ వేళల నియంత్రణ సాధ్యం కాలేదు. జగన్ ప్రభుత్వ చర్యల పర్యవసానంగా మద్యం విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. చంద్రబాబు సర్కార్ చివరి సంవత్సరంలో (2018–2019) ఐఎమ్ఎఫ్ఎల్, బీర్లు కలిపి 6 కోట్ల 61 లక్షల కేసుల అమ్మకాలు జరిగితే, జగన్ ప్రభుత్వ చివరి సంవత్సరానికి (2023–24) 4 కోట్ల 44 లక్షలకు పడిపోయింది. అంటే అమ్మకాల్లో మూడో వంతు తగ్గింది. దశలవారీ మద్య నిషేధం అనే జగన్ సర్కార్ పెట్టుకున్న ఒక లక్ష్యంలో దీన్నొక పెద్ద ముందడుగుగా పరిగణించాలి.

వినియోగం ఇంత తగ్గినా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం తగ్గలేదు. పైపెచ్చు గణనీయంగా పెరిగింది. మద్యాన్ని తయారు చేసే డిస్టిలరీలకు కొత్తగా ఒక్క అనుమతిని కూడా జగన్ ప్రభుత్వం ఇవ్వలేదు. అధిక లాభాలకోసం విచ్చలవిడిగా అమ్మకాలు సాగించే ప్రైవేట్ వ్యక్తులను ఈ వ్యాపారం నుంచి తప్పించారు. మొత్తం విధానం ఇంత పారదర్శకంగా ఉన్నప్పుడు స్కామ్ ఎక్కడ జరిగే అవకాశముందన్న ప్రశ్నల జోలికి కూటమి సర్కార్ గానీ, దర్యాప్తు చేస్తున్న సిట్ బృందం కానీ వెళ్లదలచుకోలేదు. జగన్ ప్రభుత్వ హయాంలో చంద్రబాబును అరెస్టు చేశారు కనుక, ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోవలసిందే, కేసులు నడపాల్సిందే అన్నట్టుగా వారి వైఖరి కనబడుతున్నది. మద్యం అమ్మకాల్లో జగన్ ప్రభుత్వం 3 వేల కోట్ల స్కామ్‌కు పాల్పడిందని అధికారంలోకి వచ్చిన నెల రోజులకే చంద్రబాబు తేల్చిపారేశారు. జూలైలో శ్వేతపత్రం పేరుతో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ లెక్క చెప్పారు. ఆయన నోటివెంట వచ్చిన 'అంకె'ను నిజం చేయడానికి దర్యాప్తు బృందం ఇప్పుడు కథలు అల్లుతున్నట్టు కనిపిస్తున్నది. ఈ కేసులో ప్రభుత్వ ఖజానా నుంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడానికి తీసుకున్న నిర్ణయం ఏమన్నా ఉన్నదా? నిబంధనలకు విరుద్ధంగా ప్రజాధనాన్ని ఎవరికైనా దోచిపెట్టిన అంశం ఇమిడి ఉన్నదా? లంచాలకు ఆశించి ప్రైవేట్ వ్యక్తులకు వనరుల్ని కట్టబెట్టిన వైనం ఈ కథలో కనబడుతున్నదా? మరి స్కామ్ ఎక్కడ?

చంద్రబాబును అరెస్టు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ ఇందుకు పూర్తిగా భిన్నమైనది. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీ ఉదారంగా సాయం చేస్తున్నదనీ, ఇందులో పది శాతం నిధుల్ని సమకూర్చితే వాళ్లు 90 శాతం విడుదల చేస్తారనీ ఓ కట్టుకథను అల్లిపెట్టారు. సీమెన్స్ కంపెనీ ఆ తదనంతర కాలంలో స్వయంగా ఖండించడం వల్ల ఇది కట్టుకథని రూఢీ అయింది. పది శాతం కింద రూ.371 కోట్లను విడుదల చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆర్థిక శాఖకు ఆదేశాలు వెళ్లాయి. సదరు సీమెన్స్ నిధులను విడుదల చేయకముందే పది శాతాన్ని విడుదల చేయడం నిబంధనలకు విరుద్ధమన్న అభ్యంతరాలను తోసిపుచ్చి నిధుల విడుదలకు ముఖ్యమంత్రి కార్యాలయం ఒత్తిడి చేసింది. పైగా తాము చెబుతున్న సీమెన్స్ కంపెనీకి కాదు, మధ్యలో ఓ బ్రోకర్ కంపెనీకి ఈ నిధులు బదిలీ చేశారు. అక్కడి నుంచి అందులో 241 కోట్ల రూపాయలు పుణె, అహ్మదాబాదుల్లోని షెల్ కంపెనీల ద్వారా ప్రయాణించి దుబాయ్, సింగపూర్ కంపెనీలకు చేరుకున్నాయని, ఆ పిదప చేరాల్సిన చివరి మజిలీకి కూడా చేరుకున్నాయని సీఐడీ ఆధారాలతో నిరూపించింది. 241 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్‌కు అవసరమైన పరికరాలు కొనుగోలు చేసినట్టు పుణె షెల్ కంపెనీ నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించి ఈడీకి దొరికిపోవడంతో ఈ బాగోతం డొంకంతా కదిలింది. చంద్రబాబు అరెస్టు వెనుక ఇంత నిరూపణ ఉన్నది.

జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన మద్యం పాలసీలో ఒక లక్ష్యం ఉన్నది. ఒక సదుద్దేశం ఉన్నది. ఆ లక్ష్యసాధనలో అనుకున్న మేరకు విజయం సాధించారు కూడా! ఇందులో ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే అంశం లేదు. స్కామ్ జరగడానికి కూడా అవకాశాలు లేవు. చంద్రబాబు సర్కార్ 2015లో మద్యం దుకాణాలు, బార్లపై విధించే ప్రివిలేజ్ ఫీజును తొలగిస్తూ ఒక రహస్య జీవోను విడుదల చేసింది. ఇందులో దురుద్దేశం ఉన్నది. డబ్బు సంపాదించే లక్ష్యం కనిపిస్తున్నది. మద్యం దుకాణాలు గానీ, బార్లు గానీ వాటి ఏడాది టార్గెట్‌ను మించి అమ్మకాలు సాగిస్తే ఆ అదనపు అమ్మకాలపై ప్రభుత్వాలు ప్రివిలేజ్ ఫీజు వసూలు చేసేవి. ప్రభుత్వానికి ఇదొక ఆదాయ వనరుగా ఉండేది. చీకటి జీవో ద్వారా చంద్రబాబు ఆ ఫీజును మాఫీ చేశారు. తద్వారా నాలుగేళ్లలో ఖజానాకు 5 వేల కోట్లు నష్టం జరిగిందని అంచనా!

ఖజానాకు గండి పడినందువలన ప్రైవేట్ వ్యాపారులు లాభపడ్డారు. తమకు లాభాలు తెచ్చిపెట్టే నిర్ణయాన్ని తీసుకున్నందుకు ప్రైవేట్ వ్యక్తులు లంచాలు చెల్లించే అవకాశం ఉంటుందా? ఉండదా? దాన్ని స్కామ్ అంటారా, లేదా? అట్లాగే 2014–2019 మధ్యకాలంలో 200 రకాల దిక్కుమాలిన బ్రాండ్లు రంగప్రవేశం చేశాయి. దీనివల్ల లాభాలు పొందింది డిస్టిలరీల వాళ్లు! ఏపీకి మద్యం సరఫరా చేస్తున్న 20 డిస్టిలరీలలో 14 చంద్రబాబు హయాంలో అనుమతి తెచ్చుకున్నవేనని సమాచారం. మిగిలిన ఆరు వేర్వేరు సమయాల్లో అనుమతి పొందాయి. జగన్ అనుమతించిన డిస్టిలరీ ఒక్కటి కూడా లేదు. ఈ విషయాలను పరిశీలించినప్పుడు ఎవరిది పారదర్శక విధానమో, ఎవరిది కుంభకోణ విధానమో గ్రహించడం బ్రహ్మ విద్యేమీ కాదు.

ప్రస్తుత లిక్కర్ కేసు నమోదు వెనుక రాజకీయ దురుద్దేశాలున్నాయని పిటిషనర్లు ప్రాథమికంగా రుజువు చేయగలిగారని సర్వోన్నత న్యాయస్థానం కూడా శుక్రవారం నాడు వ్యాఖ్యానించినట్టు వార్తలు వచ్చాయి. సాక్షులనూ, సహ నిందితులనూ ఫలానా విధంగా వాఙ్మూలం ఇవ్వాలని ఒత్తిడి చేయడం గానీ, బెదిరించడం గానీ, ప్రలోభపెట్టడం గానీ చేయవద్దని ఏపీ సీఐడీని సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించింది. రిమాండ్ రిపోర్టుల పేరుతో స్వీయ కవిత్వాన్ని ప్రచారం చేస్తున్నారని వినిపిస్తున్న ఆరోపణలకు సుప్రీం వ్యాఖ్యలు బలం చేకూర్చినట్లయింది. అసలు స్కామ్‌కు అవకాశమే లేనిచోట ఏదో తవ్వి తీస్తామని షో నడపడం వెనుక అసలు ఉద్దేశం వేరు. ఈ పేరుతో కీలక వ్యక్తులను అరెస్టు చేసి, ప్రధాన ప్రతిపక్ష శ్రేణుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయడం మొదటిది. తమ పరిపాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడం రెండవది.

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన ఓ వైఫల్యాల పుట్ట. అవినీతి విశృంఖలంగా మారింది. చిరువ్యాపారులు 30 పర్సెంట్ 'యెల్లో ట్యాక్స్' కట్టలేక అల్లాడుతున్నారు. చికెన్, మటన్ అమ్మేవాళ్లను కూడా వదిలిపెట్టడం లేదు. జీఎస్టీ దూరని చోటుకి కూడా 'యెల్లో ట్యాక్స్' దూసుకుపోతున్నది. రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నది. లాభసాటి సంగతి దేవుడెరుగు, గిట్టుబాటు ధర కూడా దక్కలేదు. పేదవర్గాల పరిస్థితి మరింత దారుణం. 'సంపద' సృష్టించి సంక్షేమ పథకా లను అమలు చేస్తామని చెప్పారు. ఏడాది గడిచిపోయింది. 'తల్లికి వందనం' ఈ జూన్‌కు రెండేళ్ల బకాయి పడింది. 80 లక్షల మంది బడిపిల్లలకు 30 వేల చొప్పున చెల్లించాల్సి ఉన్నది. 'అన్నదాతా సుఖీభవ' కింద ఇరవై వేల చొప్పున రెండేళ్ల నిధులను ఈ జూన్‌లో జమ చేయవలసి ఉన్నది. అలాగే 'ఆడబిడ్డ నిధి' కూడా! 'పీ–ఫోర్' పథకం తెచ్చాం, డబ్బున్న వాళ్లు తృణమో పణమో ధర్మం చేస్తే 'ఆ సంక్షేమం'తో పండగ చేసుకోవచ్చని ఇవ్వాళ కర్నూలులో చంద్రబాబు చెప్పారు.

స్వయానా శాసనసభ డిప్యూటీ స్పీకర్ నియోజకవర్గంలో దశాబ్దాలుగా పేదలు నివాసముంటున్న గృహాలను అధికారులు నేలమట్టం చేస్తుంటే ఇదేమి అన్యాయమని ప్రశ్నించే దిక్కు కూడా లేదు. పేద బిడ్డలకు నాణ్యమైన విద్య కోసం గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అటకెక్కించారు. పేద ప్రజల వ్యతిరేక విధానాలు రాజ్యమేలుతున్నాయి. ఉద్దేశపూర్వకంగానే రైతాంగాన్ని దివాళా తీయించి రోడ్డెక్కించే పాలసీ అమలవుతున్నది. క్షయరోగంతో తీసుకుంటున్నవాడి నెత్తిన కిరీటం పెడితే అతడు వెలిగిపోతాడా? అమరావతిలో నాలుగు బంగళాలు కడితే రాష్ట్రంలోని విశాల ప్రజానీకం అభివృద్ధి చెందినట్టేనా? ... ఇటువంటి ప్రశ్నలు వేసే గొంతులు నొక్కే రాజ్యవిధానం ఇప్పుడు ఏపీలో అమలవుతున్నది. రాజ్యమే ఒక ఫ్యాక్షనిస్టు అవతారమెత్తి పరిపాలిస్తున్నది. ఎదురు మాట్లాడితే కేసులతో, కటకటాలతో బెదిరిస్తున్నది. ఈ ఫ్యాక్షనిజం కేవలం ప్రతిపక్ష రాజకీయ నేతల్నే టార్గెట్ చేయడం లేదు. గత ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కూడా వేటాడుతున్నది. ఇది భారతదేశంలో ఎన్నడూ, ఎక్కడా జరగని దారుణం. ముఠా తత్వానికి పరాకాష్ఠ.

ఈ మూడేళ్లు (జమిలితో 2028లో ఎన్నికలు జరిగే అవకాశం) ఎటువంటి ప్రతిఘటనా లేకుండా అమరావతి రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగిపోవాలని ఫ్యాక్షన్ పాలన భావిస్తున్నది. అందుకు ఢిల్లీ ఆశీస్సుల కోసం యువనేత శనివారం నాడు కుటుంబ సమేతంగా ప్రధానిని కలిశారు. తమరు అనుమతిస్తే ఏడాది ఉత్సవాల వెంటనే పట్టాభిషేకం చేసుకుంటానని అందుకు ఆశీర్వాదం కావాలని అడిగి ఉంటారని అంచనా. కుదరకపోతే ఈ నెలాఖరున కడపలో జరిగే 'మహానాడు'లో పార్టీ అధ్యక్ష స్థానమైనా యువగళానికి దక్కుతుందంటున్నారు. ఆ వెంటనే కూటమి ఏడాది పండుగ. ఇటువంటి పర్వదినాలు నిర్విఘ్నంగా గడిచిపోవాలనీ, ఎటువంటి నిరసనలూ వినిపించకూడదనీ 'నిశ్శబ్దీకరణ' కార్యక్రమాన్ని ఫ్యాక్షనిస్టు ప్రభుత్వం దీక్షతో అమలుచేస్తున్నది.

vardhelli1959@gmail.com

> ఏపీకి మద్యం సరఫరా చేస్తున్న 20 డిస్టిలరీలలో 14 చంద్రబాబు హయాంలో అనుమతి తెచ్చుకున్నవేనని సమాచారం. మిగిలిన ఆరు వేర్వేరు సమయాల్లో అనుమతి పొందాయి. జగన్ అనుమతించిన డిస్టిలరీ ఒక్కటి కూడా లేదు. ఈ విషయాలను పరిశీలించినప్పుడు ఎవరిది పారదర్శక విధానమో, ఎవరిది కుంభకోణ విధానమో గ్రహించడం బ్రహ్మ విద్యేమీ కాదు.
>
> ఈ కేసు నమోదు వెనుక రాజకీయ దురుద్దేశాలున్నాయని పిటిషనర్లు ప్రాథమికంగా రుజువు చేయగలిగారని సర్వోన్నత న్యాయస్థానం కూడా శుక్రవారం నాడు వ్యాఖ్యానించినట్టు వార్తలు వచ్చాయి. సాక్షులనూ, సహ నిందితులనూ ఫలానా విధంగా వాఙ్మూలం ఇవ్వాలని ఒత్తిడి చేయడం గానీ, బెదిరించడం గానీ, ప్రలోభపెట్టడం గానీ చేయవద్దని ఏపీ సీఐడీని సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించింది. రిమాండ్ రిపోర్టుల పేరుతో స్వీయ కవిత్వాన్ని ప్రచారం చేస్తున్నారని వినిపిస్తున్న ఆరోపణలకు సుప్రీం వ్యాఖ్యలు బలం చేకూర్చినట్లయింది. అసలు స్కామ్‌కు అవకాశమే లేనిచోట ఏదో తవ్వి తీస్తా మని షో నడపడం వెనుక అసలు ఉద్దేశం వేరు. ఈ పేరుతో కీలక వ్యక్తులను అరెస్టు చేసి, ప్రధాన ప్రతిపక్ష శ్రేణుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయడం మొదటిది. తమ పరిపాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడం రెండవది.

(pull quote above repeats text from the article)

మనమంతా ఒక్కటే... శాంతే మార్గం!

సందర్భం



జహారా బేగం

పోప్ లియో–14 ఈస్టర్ ఆదివారం రోజు ప్రసంగిస్తూ చెప్పిన 'మనమంతా ఒక్కటే' అనే మాటలు ప్రపంచంలో శాంతి నెలకొనడానికి ఆయన ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో తెలియచేస్తున్నాయి. మే 8న 267వ అగస్టినియన్ పోప్‌గా, సెయింట్ పీటర్ వారసుడిగా ఎన్నికైన పోప్ లియో మే 18న ఆ సర్వోన్నత చర్చి పదవిని స్వీకరించనున్నారు. రెండు వేల ఏళ్ల క్యాథలిక్ చర్చి చరిత్రలో ఆయన తొలి అమెరికన్ పోప్ కావడం విశేషం. అంతే కాదు ద్వంద్వ పౌరసత్వాలు (అమెరికన్, పెరువియన్) కలిగిన తొలి పోప్ కూడా ఆయనే. పారిశ్రామిక యుగం తొలినాళ్లలో సామాజిక న్యాయం కోసం, కార్మికుల హక్కుల కోసం గళమెత్తి నిరసన తెలిపిన పోప్ లియో–13 గౌరవార్థం ఆయనకు 'లియో–14' అనే పాపల్ పేరు (పోప్ అయ్యాక పెట్టే పేరు) పెట్టారు. ఆయన అసలు పేరు రాబర్ట్ ఫ్రాన్సిస్ ప్రివస్ట్.

పోప్ లియోది అమెరికాలోని చికాగో. కానీ జీవితంలో ఎక్కువ భాగం పెరూలోని చిక్లాయోలో గడిపారు. పెరువియన్ జీవనశైలిలో ఆయన మమేకమై వారితో కలిసిపోయారు. కేవలం ఆ భాష నేర్చుకోవడంతోనే ఆగిపోకుండా వారి జీవితాల్లోని పలు పార్శ్వాలను పరిశీలించారు. వారి బాధల్నీ, వేదనల్నీ గమనించారు. అణగారిన వర్గాల హక్కులు, అభ్యున్నతి కోసం పోరాడుతూ మారుమూల పల్లెల్లో సైతం ఆయన ప్రయాణించారు. ఎల్లవేళలా శాంతి, న్యాయం, మతస్వేచ్ఛ, సమానత్వం, దేశభక్తి, మనిషిని మనిషిగా గౌరవించడం వంటి అంశాల కోసం పని చేశారు. అందుకే పెరువియన్లు ఆయనను తమ కొత్త నాయకుడని పిలుస్తారు. ఇక పోప్ పదవిని ఓ అమెరికన్ స్వీకరిస్తాడన్న నమ్మకం చాలా మందికి చాలా కాలంపాటు లేదు. ఆ విధంగా చూస్తే ఇప్పుడు పోప్ లియో ఆ పదవిలోకి వచ్చి అమెరికన్ల ఆధ్యాత్మిక అంతస్తును పెంచారు.

1982లో ప్రీస్ట్‌గా మారిన పోప్ లియోకు చర్చి చదువులో పలు డిగ్రీలు ఉన్నాయి. ఇతరుల మాటలు ఆలకించడంలో, వారి అభిప్రాయాలను గౌరవించడంలో పోప్ లియోది అందె వేసిన చెయ్యి. ఈ గుణమే ఆయనను తోటివారికి, అంతర్జాతీయ నేతలకు దగ్గర చేశాయి. ఆంగ్లం, స్పానిష్, ఇటాలియన్, ఫ్రెంచ్, పోర్చుగీస్ భాషలు అనర్గళంగా మాట్లాడగలిగిన పోప్ లియో ఈ బహుభాషలను ఆడంబరం కోసం కాక, ప్రపంచంలోని అనేకులతో నేరుగా



పోప్ లియో–14

సంభాషించి, వారితో సత్సంబంధాలు ఏర్పరచుకునేందుకు ఉపయోగిస్తున్నారు. 2004, 2006లలో రెండుసార్లు లియో భారతదేశాన్ని సందర్శించారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో పర్యటించారు. ఆ సమయంలో ఆయన ఎటువంటి ప్రత్యేక వసతులూ కోరలేదు. చాలా నిరాడంబరంగా ఉన్నారు. ఆయన పద్ధతి, సామాన్య జీవనశైలి భారతీయులను ఆకట్టుకుంది.

పోప్ లియో రాబోయే రోజులలో ఎటువంటి ప్రభావం చూపబోతున్నారో ఆయన వెల్లడి చేస్తున్న భావాల ద్వారా అర్థం చేసుకునేందుకు ప్రపంచం ప్రయత్నిస్తున్నది. ఈస్టర్ ఆదివారం నాడు ఆయన చేసిన తొలి ప్రసంగంలో 'మూడో ప్రపంచ యుద్ధం రాకూడదని దేశాధినేతలను అభ్యర్థిస్తున్నాను' అన్నారు. ఇప్పటికే రెండు మహా యుద్ధాలను చూసిన ప్రపంచం మరో భారీ యుద్ధానికి సిద్ధంగా లేదని వివరించారు. తన ముందు పోప్‌గా ఉన్న ఫ్రాన్సిస్ సందేశమే తన సందేశమని ఆయన పేర్కొన్నారు. గాజాలో శాంతి నెలకొనాలని పిలుపునిచ్చారు. భారత్–పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని అభినందించారు. చేతిలో ఆయుధం పెట్టుకొని ఎవరూ ప్రేమను పంచలేరని, యుద్ధాల నిరోధానికి ఐక్యరాజ్య సమితి గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పోప్ లియో తన ప్రసంగంలో సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలతోపాటు దాని వెనకే ఉన్న దుష్పరిణామాల గురించి వివరించడం గమనార్హం. సాంకేతిక పరిజ్ఞానం ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలనీ, సర్వమానవాళి శ్రేయస్సును కాంక్షించాలనీ అంటున్న ఆయన మాటల్ని బట్టి చూస్తే, ఈ ఏఐ యుగంలో ఆధునిక సాధువులా కనిపిస్తున్నారాయన.

ఇటీవల అంతర్జాతీయ మీడియాతో పోప్ లియో మాట్లాడుతూ 'మీడియాను నియంత్రిస్తే కొంతమేర ప్రజల ఆలోచనా విధానాన్ని నియంత్రించినట్లు అవుతుంది' అన్నారు. క్రైస్తవులు సార్వజనీన మానవులని పోప్ మాట. అందర్నీ సమానంగా సోదరభావంతో చూడలేనివారు క్రైస్తవులు కారనేది ఆయన మాట.

ప్రపంచంలోని అనేక దేశాల మధ్య యుద్ధాలు నడుస్తున్నాయి. దాయాది దేశాల మధ్య సమస్యలు నెలకొన్నాయి. ఇవి ప్రస్తుతం పోప్ ముందున్న సవాళ్లు. తన తొలి ప్రసంగంలోనే శాంతి కోసం ఆయన పడిన తపనను బట్టి తప్పకుండా ఆయన ఈ సమస్యలకు పరిష్కారం చూపుతారని చాలామంది విశ్వసిస్తున్నారు. దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్నప్పుడు వారి మధ్య సయోధ్యను కుదిర్చి, యుద్ధాన్ని నివారించే పెద్దలు ఈ సమాజానికి చాలా అవసరం. అటువంటివారే పోప్. ప్రస్తుతం ప్రపంచమంతా యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో పోప్ ఏర్పరిచే శాంతిబాటలకు ఎంతో ప్రాధాన్యం ఉందని అందరూ భావిస్తున్నారు.

వ్యాసకర్త సామాజిక కార్యకర్త, అమెరికా

(నేడు లియో–14కు విశ్వ కథోలికా మతాధినేతగా పట్టాభిషేకం)

సుఖంలో సమస్య

బతికినన్నాళ్లూ జీవితం నుండి సుఖాలు 'పిండు'కొని అందినంత ఆనందాన్ని అనుభవించటమే జీవిత లక్ష్యం అన్నమాట వినటానికి బాగుంటుంది. కానీ, ఆచరణలో మాత్రం అంత గొప్ప ఫలితాలను ఇవ్వదు. ఎన్నెన్నో ఇబ్బందులనూ, ఇక్కట్లనూ కలిగిస్తుంది.

సుఖానుభవం ఉచితంగా దొరకదు. ఏ సుఖానికి తగిన మూల్యం దానికి చెల్లించాలి. అప్పటికప్పుడే లభించే క్షణిక సుఖాలకు ఆకర్షణ ఎక్కువ. ఆ



జ్యోతిర్మయం

ఆకర్షణల ఒత్తిడిలో తొందరపడి, సామాన్యుడు తరచుగా రూపాయి సుఖానికి పది రూపాయల మూల్యం చెల్లిస్తూ ఉంటాడు.

సుఖాలు అనేక రకాలు. కొన్ని అల్ప సుఖాలు, కొన్ని గొప్ప సుఖాలు. కొన్ని స్వల్పకాలిక సుఖాలు, కొన్ని దీర్ఘకాలిక సుఖాలు. ఉదాహరణకు మితిమీరిన మద్య సేవనంలో స్వల్పకాలిక సుఖాన్ని 'పిండు' కోవచ్చు. కానీ పది కాలాల పాటు ఆరోగ్యంగా బతకటమనే సుఖాన్ని 'పిండు' కోవటానికి, అది అడ్డుగోడ అయి కూర్చుంటుంది. లెక్కలలో జాగరూకత లేకపోతే, అనాలోచితమైన క్షణిక సుఖలాలసత వల్ల, సుదీర్ఘ జీవితంలో భారీ నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

మరొక సత్యం: సుఖం, సుఖం అనుకోవటమే కానీ, లౌకికమైన ఇంద్రియ సుఖాలన్నింటి వెనక, తోకలాగా, 'తాడుతో దబ్బనం'లాగా దుఃఖం సిద్ధంగా ఉంటుంది. ఏ ఇంద్రియ భోగమయినా, మితిమీరితే, దుర్భరమైన అనారోగ్యానికీ, అధిక వ్యయానికీ, అవమానాలకూ, అప్పుల బాధకూ గురిచేసి వేధిస్తుంది. 'భోగే రోగ భయం...' అన్న సూక్తి అతి ప్రాచీనం.

ఇంకొక కీలకం కూడా ఉంది. ఇంద్రియ భోగాల సుఖం 'పిండు'కోవడమంటే, ఇంద్రియాలు లాగిన వైపునకు వెళ్లిపోవటమే! ఇంద్రియ సుఖలోలత్వం అంటే, తన దేహేంద్రియాలను తన చెప్పుచేతలలో ఉంచుకొని శాసించాల్సిన యజమాని, క్రమంగా ఇంద్రియాలు ఎటు లాగితే అటు వెళ్లిపోయే బానిసగా మారటం. పోను పోను, అందులో సుఖం ఉండదు, 'వ్యసనం' మిగులుతుంది. అది ఊడిగం. తొలి దశలో లభించే సుఖం 'పిండు'కొనే తాపత్రయంలో, జీవితమంతా వెట్టిచాకిరీకి కుదురుకోవటం వివేకమవుతుందా?

శరీరమూ, ఇంద్రియాలూ సాధనాలు. వీటిని నియంత్రణలో ఉంచుకొని, సద్గురువులు చెప్పిన సాధన మార్గాలలో పయనించి, నిలకడయిన పరమానందాన్ని అంది పుచ్చుకోవటం జీవితం అసలు లక్ష్యం. ఆ విందు భోజనానికి వెళ్తూ, ఇంద్రియాల ఒత్తిడికి లొంగి, తోవలో ఎదురయిన రేగులూ, సీమచింతలూ, కసుగాయల కోసం ప్రలోభపడి, కడుపు నింపుకోవటం, ఆనందాన్ని 'పిండు'కొనేందుకు అనువైన మార్గం కాదు.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

మడుగులోకి రైతును లాక్కెళ్లిన మొసలి

- భీమానదిలో దాడి.. దొరకని ఆచూకీ



తిప్పణ్ణను మొసలి లాక్కెళ్లింది ఇక్కడే..

కృష్ణా: నారాయణపేట జిల్లా కృష్ణా మండలం కూసుమర్తి గ్రామ సమీపంలోని భీమా నదిలో శనివారం మధ్యాహ్నం మొసలి ఒక రైతుపై దాడిచేసి నీటి మడుగులోకి లాక్కెళ్లింది. వివరాలివి. కూసుమర్తి గ్రామానికి చెందిన రైతు జింకల్ తిప్పణ్ణ (50) వరి నారుమడి పోయడానికి.. తన పొలం పక్కన ఉన్న భీమా నదిలో మోటారు బిగించడానికి వెళ్లాడు. ఈ క్రమంలో నీటి మడుగులోని మోటార్ ఫుట్‌బాల్‌కు చెత్త ఉండటంతో.. దానిని తొలగించడానికి నీటిలోకి వెళ్లాడు. అదే సమయంలో అక్కడే ఉన్న మొసలి తిప్పణ్ణపై దాడి చేసింది. ఆయన కేకలు వేయడంతో.. చుట్టుపక్కల రైతులు వచ్చి రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అప్పటికే మొసలి తిప్పణ్ణను పూర్తిగా నీటిలోకి లాక్కెళ్లింది. దాదాపు 4 గంటల పాటు శ్రమించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

పనుల్లేక.. అప్పులు తీరక

- ఇద్దరు నేతన్నల బలవన్మరణం



రాకేశ్



సాగర్

సిరిసిల్లటౌన్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక సిరిసిల్లలో ఇద్దరు నేత కార్మికులు బలవన్మరణానికి పాల్పడ్డారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీవైనగర్‌కు చెందిన కొండ రాకేశ్ (44) నేత కార్మికుడు. కుటుంబ అవసరాల కోసం రూ.6 లక్షల వరకు అప్పు చేశాడు. స్థానికంగా వస్త్ర పరిశ్రమలో చాలా రోజులుగా పని దొరక్క.. అప్పులు తీర్చే మార్గం కనిపించక.. గురువారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. మృతునికి భార్య ఉజ్వల, కొడుకులు ఆదిత్య (14), నిహార్ (12) ఉన్నారు. సిరిసిల్ల ఇందిరానగర్‌కు చెందిన మేర్గు సాగర్ (38) కూడా నేత కార్మికుడు. అద్దె ఇంట్లో ఉంటున్నారు. భార్య అస్మిత బీడీలు చుడుతూ.. కూతురు మధుప్రియను చదివిస్తున్నారు. భార్య, కూతుళ్ల వైద్యం, ఇంటి అవసరాల నిమిత్తం.. తెలిసిన వారి వద్ద రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. శుక్రవారం రాత్రి సాగర్ ఉరి వేసుకున్నాడు. సొంతిల్లు కూడా లేని ఈ ఇద్దరు నేత కార్మికుల బలవన్మరణం స్థానికంగా విషాదం నింపింది.

ప్రణాళిక ప్రకారమే పులిని చంపారు

- వేటగాళ్లు పులి చర్మం, కాళ్లు, పళ్లు తీసుకెళ్లారు
- నిందితులను త్వరలోనే పట్టుకుంటాం
- ఎఫ్‌డీపీటీ శాంతారాం వెల్లడి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్‌డీపీటీ శాంతారాం

కాగజ్‌నగర్‌టౌన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ అటవీ రేంజ్ పరిధిలో చనిపోయింది పెద్దపులేనని ఎఫ్‌డీపీటీ శాంతారాం తెలిపారు. శనివారం ఆయన కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడ గ్రామంలోని వట్టివాగు సమీపంలో పులి కళేబరం లభించిందని చెప్పారు. అటవీ అధికారులకు ఆ ప్రాంతంలో కనిపించిన రక్తపు మరకల ఆధారంగా గాలించగా, సమీపంలోనే పులి కళేబరాన్ని వేటగాళ్లు పాతిపెట్టినట్లు గుర్తించారని తెలిపారు. ఆ కళేబరాన్ని బయటకు తీసి పరిశీలించగా చర్మం, కాళ్లు, పళ్లు లేవని, వేటగాళ్లు ప్రణాళిక ప్రకారం పులిని చంపి చర్మం, పళ్లు తీసుకెళ్లినట్లు గుర్తించామని చెప్పారు. సంఘటన స్థలం వద్ద విద్యుత్ లైన్‌కు తీగలు అమర్చి పులిని హతమార్చినట్లు తెలుస్తోందని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని, పశువైద్యాధికారుల సమక్షంలో పులి కళేబరాన్ని పంచనామా నిర్వహించి దహనం చేశామని వివరించారు. చర్మం, కాళ్లు, పళ్లు లేకపోవడంతో ఏ పులి మృతిచెందిందనేది ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తరువాత ప్రకటిస్తామని తెలిపారు. కరెంటు వైర్ల గురించి విద్యుత్ శాఖ అధికారులకు నివేదికలు సమర్పించామని చెప్పారు. కేసు విచారణ కొనసాగుతోందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఫారెస్ట్ అధికారి నీరజ్ టిబ్రేవాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మహదేవపూర్- కాళేశ్వరం రోడ్డుపై ట్రాఫిక్ జామ్



పుష్కరస్నానాలు ఆచరించేందుకు కాలినడకన తరలివస్తున్న భక్తులు

నట్టడవిలో తాగునీటికి తండ్లాట

- సరస్వతి పుష్కరాల మార్గంలో 5 గంటలు ట్రాఫిక్ జామ్
- కాళేశ్వరం – మహదేవపూర్ మధ్య 17 కిలోమీటర్ల మేర ఆగిన వాహనాలు
- భక్తుల రద్దీని అంచనా వేయలేకపోయిన అధికార యంత్రాంగం
- హోల్డింగ్ పాయింట్లు, వన్ వేలు ఏర్పాటుచేయకపోవటంతో ఇబ్బందులు

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతి పుష్కరాలకు భక్తుల తాకిడి అనూహ్యంగా పెరగటంతో శనివారం రోడ్లపై గంటలకొద్దీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో భక్తులు తాగునీటి కోసం కూడా అలమటించాల్సి వచ్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈ నెల 15వ తేదీన సరస్వతి పుష్కరాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు సుమారు 50 వేల మంది పుష్కర స్నానాలు ఆచరించగా, శుక్రవారం 80 వేల మంది భక్తులు వచ్చారు. వారాంతం కావడంతో శనివారం తెల్లవారుజాము నుంచే హైదరాబాద్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, మహబూబ్‌నగర్, నల్లగొండ తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో కాటారం, మహదేవ్‌పూర్ మీదుగా కాళేశ్వరం వైపు వచ్చారు. ఈ క్రమంలో ఉదయం 9 గంటలకు కాళేశ్వరం మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. కాళేశ్వరం నుంచి మహదేవ్‌పూర్ వరకు 17 కిలోమీటర్ల మేర ఆర్టీసీ బస్సులు, కార్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అదంతా అడవి ప్రాంతం కావటంతో ప్రయాణికులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. కొందరు చేసేది లేక కాలినడకన కాళేశ్వరానికి వెళ్లగా, మరికొందరు తమ వెంట తెచ్చుకున్న ఆహారాన్ని అడవిలోనే కూర్చొని తిన్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేలు బైక్‌పై అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నించారు. ఉన్నతాధికారులు స్వయంగా రంగంలోకి దిగినా సాధారణ పరిస్థితి నెలకొనడానికి 5 గంటల పాటు కష్టపడాల్సి వచ్చింది.

తప్పిన అంచనాలు...

దక్షిణ కాశీగా పేరొందిన గోదావరి, ప్రాణహిత నదుల సంగమ స్థానమైన కాళేశ్వరంలో సరస్వతి (అంతర్వాహిని) పుష్కరాలు జరుగుతున్నాయి. ఈ పుష్కరాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తున్నారు. అయితే, భక్తుల సంఖ్యను అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. రెండేళ్లకు ఓసారి జరిగే మేడారం జాతరతోపాటు గతంలో గోదావరి పుష్కరాల సమయంలోనూ అప్పటి అధికారులు వన్ వే విధానం అమలు చేశారు. కాటారం, మహదేవ్‌పూర్ మీదుగా కాళేశ్వరానికి వచ్చిన వాహనాలను తిరుగు ప్రయాణంలో మద్దులపల్లి, అన్నారం, గుండ్రాత్‌పల్లి, దామెరకుంట, గంగారం మీదుగా భూపాలపల్లి, హనుమకొండ, పెద్దపల్లి, కరీంనగర్‌కు పంపించే వారు. ఇప్పుడు వన్ వే ఏర్పాటు చేయకపోవడంతోనే ట్రాఫిక్ సమస్య తలెత్తిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

భక్తుల ఆగ్రహం

ట్రాఫిక్ నియంత్రణకు మార్గమధ్యలో హోల్డింగ్ పాయింట్స్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో సమస్య తీవ్రత పెరిగింది. అడవిలో హోల్డింగ్ పాయింట్స్ ఏర్పాటు చేసి ఉంటే ట్రాఫిక్ సమస్య తలెత్తిన చోట వాహనాలను ఆ పాయింట్లకు మళ్లించి, రద్దీ తగ్గించే వీలుండేది. ఇవేవీ చేయకపోవటంపై భక్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

పుష్కర స్నానంతో పులకించిన భక్తజనం

సరస్వతి పుష్కరాలకు శనివారం భక్తుల రద్దీ భారీగా పెరిగింది. కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో వేలమంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించి, శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కుటుంబ సమేతంగా శనివారం ఉదయం పుష్కర స్నానాలు ఆచరించారు. పితృదేవతలకు పిండప్రదాన పూజలు నిర్వహించి, గోదావరిలో తర్పణాలు వదిలారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ పుష్కర స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తుని తపోవనం పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి విశేష పూజలు చేసి పుష్కర స్నానాలు ఆచరించారు. నదీమాతకు పండ్లు, పూలు, పాలు, నైవేద్యం సమర్పించారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. రాత్రి 8 మంది కాశీ వేదపండితులు నవరత్నమాలిక హారతి నిర్వహించారు.

అవసరమైతే భూభారతిలో మార్పులు

- పేదవారికి న్యాయం జరిగేందుకు చట్టాన్ని సవరిస్తాం: మంత్రి పొంగులేటి

చిలప్‌చెడ్/కొండాపూర్: భూభారతి చట్టంలో అవసరమైతే మార్పులు చేసేందుకు ప్రభుత్వం వెనుకాడబోదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్, మెదక్ జిల్లా చిలప్‌చెడ్‌లో శనివారం జరిగిన భూ భారతి సదస్సుల్లో ఆయన మాట్లాడారు. భూభారతి చట్టంలో తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ వద్ద సమస్య పరిష్కరించుకోవచ్చని, వీరితో కాకపోతే ప్రత్యేక ల్యాండ్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేశామన్నారు. పేదవారికి న్యాయం జరిగేందుకు అవసరమైతే చట్టాన్ని సవరిస్తామన్నారు. భూభారతితో ఏ రైతు అభద్రతకు గురికావొద్దన్నారు. భూభారతిని ఆసరాగా చేసుకోని ఏ అధికారైన రైతులు, భూస్వాములను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగస్టు 15 నాటికి భూ సమస్య లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి చట్టం దొరల చుట్టమైతే.. కాంగ్రెస్ సర్కారు తీసుకొచ్చిన భూ భారతి పేదోడి చట్టమని మంత్రి పేర్కొన్నారు. త్వరలో ప్రతీ గ్రామానికి రెవెన్యూ అధికారిని నియమిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు పట్టా పాసుబుక్‌లను పంపిణీ చేశారు.

భూభారతి సదస్సుకు బీజేపీ ఎంపీ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని చిలప్‌చెడ్‌లో మంత్రి పొంగులేటి అధ్యక్షతన జరిగిన భూ భారతి అవగాహన సదస్సుకు బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుతోపాటు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సునీతారెడ్డి కూడా హాజరయ్యారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఇద్దరూ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



మహిళకు ఇందిరమ్మ ఇల్లు పత్రం ఇస్తున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సునీతారెడ్డి, రఘునందన్‌రావు

ఈసారి అంతా సాఫీగానే..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ విషయంలో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు ఆందోళనలు నిర్వహించిన ఘటనలున్నాయి. ఇదే నియోజకవర్గంలో గతంలో కొండా సురేఖ పాల్గొన్న బడిబాట కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. అయితే చిలప్‌చెడ్‌లో జరిగిన సదస్సు మాత్రం సాఫీగా కొనసాగింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అకాల వర్షం.. కొట్టుకుపోయిన ధాన్యం



సూర్యాపేట జిల్లా రామన్నగూడెం కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అకాల వర్షాలు అన్నదాతలను అవస్థలపాలు చేస్తూనే ఉన్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు కురిసిన వానలతో రైతులు ఆగమాగం అయ్యారు.

- ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ, జైనథ్, ఉట్నూరు, మంచిర్యాల జిల్లా చెన్నూరు, జైపూర్, భీమారం, కోటపల్లి, దండేపల్లి, లక్సెట్టిపేట, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం, కాగజ్‌నగర్, నిర్మల్ జిల్లాలో లక్ష్మణచాంద, సారంగాపూర్, నర్సాపూర్(జీ) మండలాల్లో కురిసిన వర్షాలతో కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడిసిపోయింది.
- సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక భారీ వర్షం కురిసింది. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. శనివారం రైతులు కొట్టుకుపోయిన ధాన్యాన్ని చూసి విలపించారు. కొనుగోళ్లు సక్రమంగా జరగక.. లారీలు రాక రోజుల తరబడి కొనుగోలు కేంద్రంలోనే ఉండాల్సి వస్తుందని చెప్పారు. తరచూ కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం మొలకెత్తడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వేర్వేరు చోట్ల పిడుగులు పడి ముగ్గురి దుర్మరణం

- మృతుల్లో ఇద్దరు విద్యార్థులు.. ఒకరు గొర్రెల కాపరి



ప్రసాద్



యశ్వంత్



సురేశ్

తూప్రాన్/మాచారెడ్డి(కామారెడ్డి): వేర్వేరు చోట్ల శనివారం సాయంత్రం పిడుగులు పడి ముగ్గురు మృత్యువాత పడ్డారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు కాగా, మరొకరు గొర్రెల కాపరి.

- మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని పడాల్‌పల్లి గ్రామానికి చెందిన 12 మంది క్రికెట్ ఆడుతున్నారు. సాయంత్రం సమయంలో భారీగా ఈదురుగాలులు వీయగా, ఆట ముగించి అందరూ ఇంటి బాట పట్టారు. వారిలో నలుగురు మాత్రం కుంటకట్టపై ఉన్న మామిడి కాయల కోసం వెళ్లారు. ఇదే సమయంలో భారీ వర్షంతో పిడుగు పడింది. ఈ ఘటనలో 9వ తరగతి చదువుతున్న గ్రామానికి చెందిన నడిపల్లి ఐలేని-లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు యశ్వంత్ (13), ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన పంబల్ల ముత్యాలు-లక్ష్మి దంపతుల రెండో కుమారుడు ప్రసాద్ (15) గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సుధాకర్-రజిత దంపతుల కుమారుడు రవికిరణ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పిడుగు పడిన సమయంలో కొంచెం దూరంలో ఉన్న బాలుడు భయంతో గ్రామంలోకి పరుగులు తీసి జరిగిన విషయం గ్రామస్తులకు చెప్పాడు. వారు ఘటనాస్థలికి చేరుకొని రవికిరణ్‌ను ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.
- కామారెడ్డి జిల్లా ఫరీదుపేట గ్రామానికి చెందిన మదిర సురేశ్ (23) తన బంధువు మహిపాల్‌తో కలిసి గొర్రెల మందను మేతకు తీసుకువెళ్లారు. వాడి గ్రామశివారులో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలుకావడంతో చెట్టుకిందకు చేరారు. ఆ సమయంలో పిడుగు పడి సురేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్పృహ కోల్పోయిన మహిపాల్‌ను స్థానికులు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి

అచ్చంపేట రూరల్/డిండి: వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బతో ఇద్దరు మృతి చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రైతు రామకృష్ణ (31) శనివారం సొంత పొలంలో వ్యవసాయ పనులకు ఉపక్రమించాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం తర్వాత అకస్మాత్తుగా కళ్లు తిరిగి పడిపోవడంతో.. కుటుంబ సభ్యులు అచ్చంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. రామకృష్ణకు భార్య సుమలత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నల్లగొండ జిల్లా డిండి మండల పరిధిలోని సింగరాజుపల్లి గ్రామానికి చెందిన పానుగోటి రామేశ్వరరావు (61) పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం వరకు గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించి ఇంటికి వచ్చి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఆయనకు గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్ద చికిత్స అందించి ఇంటికి తీసుకురాగా.. రాత్రివేళ నిద్రలోనే మృతి చెందాడు.

చెరుకు సాగులో ఏఐ!

- 'బారామతి' సాగు విధానం అమలు యోచనలో ప్రభుత్వం
- అధ్యయనం కోసం త్వరలో మహారాష్ట్రకు నిపుణుల బృందం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: చెరుకు సాగులో మహారాష్ట్రలోని బారామతిలో అనుసరిస్తున్న విధానాన్ని మన రాష్ట్రంలోనూ అమలు చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాంకేతికతను వినియోగించి బారామతిలో చెరుకు సాగు చేయగా, మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో ఈ విధానాన్ని అధ్యయనం చేయాలని కేన్ కమిషనరేట్ భావిస్తోంది. ఏఐ టెక్నాలజీ వినియోగిస్తే చెరుకు దిగుబడి గణనీయంగా పెరగడంతోపాటు, పంట సాగు వ్యయం కూడా తగ్గించుకోవచ్చు. పైగా తక్కువ నీటి వనరులతో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసేందుకు వీలు కలుగుతుంది. తద్వారా రైతులకు నికర ఆదాయం పెరుగుతుంది. ఈ విధాన అమలుపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకు నిపుణుల బృందం త్వరలో బారామతికి వెళ్లనుంది.



ఏఐ వినియోగం ఇలా....

భూమిలో ప్రత్యేక పరికరాలు: చెరుకు సాగు చేసే భూమిలో సాయిల్ థర్మా మీటర్లు, సాయిల్ మాయిశ్చర్ మీటర్లు, మొక్కల ఎదుగుదల తీరును పరిశీలించే ప్రత్యేక పరికరాలు ఉంచుతారు. ఈ పరికరాలను శాటిలైట్‌కు అనుసంధానిస్తారు. ఇవి ఎప్పటికప్పుడు భూమిలోని తేమశాతం, మొక్కకు అవసరమైన పోషకాలు, ఇతర అవసరాలను గుర్తించి శాటిలైట్‌కు అలర్ట్ ఇస్తాయి.

మానిటరింగ్ సెంటర్ ద్వారా పర్యవేక్షణ: వ్యవసాయ శాస్త్రవేత్తలు చెరుకు తోటను పరిశీలించేందుకు పొలాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మానిటరింగ్ సెంటర్ ద్వారా రైతులకు సూచనలు చేస్తారు. ఈ సాంకేతికతలకు మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థల సహకారం తీసుకుంటున్నారు.

మొక్కకు అవసరమైన సమయంలోనే.. అవసరం మేరకే నీరు పెట్టడం, నిర్దిష్ట సమయంలోనే నిర్దిష్ట పరిమాణంలో ఎరువులు వేయడం, పురుగు మందుల వినియోగం ఎప్పుడు చేయాలనేది ఎప్పటికప్పుడు ఈ పరికరాలు తెలియజేస్తాయి. తద్వారా నీటి వినియోగం తగ్గడంతోపాటు, ఎరువులు పురుగు మందుల వినియోగం తగ్గి సాగు వ్యయం తగ్గుతుంది.

రైతుల వద్ద నామినల్ చార్జీలు: ఇలాంటి అత్యాధునిక సాంకేతిక పరికరాలు, సేవల చార్జీలను భరించడం సాధారణ రైతులకు సాధ్యం కాదు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ సాంకేతికతను అందిస్తున్న సంస్థలకు సంబంధిత చక్కెర కర్మాగారాల నుంచి కొంత మొత్తాన్ని, రైతుల వద్ద నామినల్‌గా ఎకరానికి నిర్ణీత మొత్తాన్ని వసూలు చేస్తున్నారు.

ఇక్కడ దిగుబడి 30 టన్నుల లోపే..

రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 82 వేల ఎకరాల్లో చెరుకు సాగవుతోంది. అయితే ఈ పంట దిగుబడి కేవలం 30 టన్నుల లోపే ఉంటోంది. వాతావరణం అనుకూలించని సీజన్లలో దిగుబడి 20 నుంచి 25 టన్నులకు పడిపోవడంతో రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళుతున్నారు. ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్న బారామతిలో చెరుకు దిగుబడి పెరిగిందని, అందుకే ఇక్కడా ఈ విధానాన్ని అమలు చేయాలనుకుంటున్నారు.

వడ్లబస్తాలు తగలబెట్టి రైతుల ఆందోళన

- ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్



అమ్మాపురంలో రోడ్డుపై ధాన్యం బస్తాలు తగలబెట్టి ఆందోళన చేస్తున్న రైతులు

తొర్రూరు రూరల్: తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన రైతులు శనివారం రోడ్డుపై ధాన్యం బస్తాలు దహనం చేసి ఆందోళనకు దిగారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు సరిగా పెట్టడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ రైస్ మిల్లు వద్దకు తీసుకెళ్లినా దొడ్డు వడ్లు మాత్రమే కావాలని, సన్న రకం వడ్లు వద్దని లోడ్‌తో వెళ్లిన లారీలు, డీసీఎంలు, ట్రాక్టర్లను రోజుల తరబడి వేచి ఉంచి వెనక్కి పంపిస్తున్నారని తెలిపారు. దీంతో లారీలు, ట్రాక్టర్ వాళ్లు ఎవరూ రావడం లేదని అన్నారు. కాగా, రైతుల ఆందోళన సమాచారం తెలుసుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. త్వరగా కాంటాలు పెట్టి, ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు.

ఆకాశంలో నిఘా నేత్రం



ప్రయోగానికి సిద్ధంగా పీఎస్‌ఎల్‌వీ–సీ61

ఈఓఎస్‌-09 ప్రయోగం నేడే

- మోసుకెళ్లనున్న పీఎస్‌ఎల్‌వీ వాహకనౌక
- ప్రతికూల పరిస్థితుల్లోనూ నిరంతర సేవలు
- అత్యంత స్పష్టతతో కూడిన చిత్రాలు, డేటా

సూళ్లూరుపేట: పహల్గాం ఉగ్ర దాడి, అందుకు ప్రతీకారంగా పాక్‌ పీచమణచిన ఆపరేషన్‌ సిందూర్‌ నేపథ్యంలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్‌ మరో కీలక ముందడుగు వేస్తోంది. అత్యంత అధునాతనమైన నిఘా ఉపగ్రహం ఎర్త్‌ అబ్జర్వేషన్‌ శాటిలైట్‌ (ఈఓఎస్‌–09)ను ప్రయోగించనుంది. పీఎస్‌ఎల్‌వీ–సీ61 రాకెట్‌ ద్వారా దాన్ని కక్ష్యలోకి చేర్చేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సన్నద్ధమైంది. ఆదివారం ఉదయం 5.59 గంటలకు శ్రీహరికోటలోని మొదటి లాంచ్‌ ప్యాడ్‌ నుంచి ప్రయోగం జరగనుంది. 17 నిమిషాలకు ఉపగ్రహాన్ని 529 కిలోమీటర్ల ఎత్తులోని సన్‌ సింక్రనస్‌ పోలార్‌ ఆర్బిట్‌ (ఎస్‌ఎస్‌పీఓ)లో ప్రవేశపెడతారు. ఇది ఐదేళ్లపాటు సేవలందిస్తుందని ఇస్రో తెలియజేసింది. పోలార్‌ శాటిలైట్‌ లాంచ్‌ వెహికల్‌ (పీఎస్‌ఎల్‌వీ) శ్రేణిలో ఇది 63వ ప్రయోగం. కాగా ఇస్రో చరిత్రలో 101వ ప్రయోగం. ఈ ప్రయోగం ద్వారా టెస్ట్‌ వెహికల్‌–డీ2 (టీవీ–డీ2) మిషన్‌ను కూడా రోదసిలోకి పంపుతున్నారు. ఇస్రో చైర్మన్‌ డాక్టర్‌ కె.నారాయణన్‌ శనివారం చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో పూజలు చేయించారు.

సరిహద్దులపై డేగకళ్లు

మేఘాలు, దట్టమైన చీకటి కమ్ముకున్నా, తుఫాన్ల వంటివి చెలరేగినా చాలా ఉపగ్రహాలు మూగవోతాయి. కానీ ఈఓఎస్‌–09 అలా కాదు. అన్ని రకాల అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో, రేయింబవళ్లు బ్రహ్మాండంగా పని చేస్తుంది. సాధారణ ఆప్టికల్‌ శాటిలైట్లకు అడ్డుగోడలుగా నిలిచే మేఘాలు, వర్షాలు, దుమ్మూధూళి, పొగమంచు వంటివాటి గుండా కూడా భూమిని అత్యంత స్పష్టంగా చూడగలుగుతుంది. అత్యాధునిక సి బ్యాండ్‌ సింథటిక్‌ అపర్చర్‌ రాడార్‌ సాయంతో ఒక మీటర్‌ పరిధిలోని వస్తువులను కూడా కచ్చితత్వంతో ఫొటోలు తీస్తుంది.

- → రెండు దశాబ్దాల క్రితం రూపొందించిన పూర్తి దేశీయ రాడార్‌ ఇమేజింగ్‌ శాటిలైట్‌ (రిశాట్‌)–1కు ఈఓఎస్‌–09 నిఘా ఉపగ్రహం కొనసాగింపు.
- → చట్టవ్యతిరేక కార్యకలాపాలను, తీవ్రవాదుల ఉనికిని గుర్తించగలదు. వాహనాల కదలికలను కూడా అత్యంత స్పష్టంగా, కచ్చితంగా చిత్రించడం దీని ప్రత్యేకత.
- → ఇందుకోసం దీనికి హెచ్‌ఆర్‌ఎస్‌ (హై రిజల్యూషన్‌ స్పాట్‌లైట్‌), మీడియం రిజల్యూషన్‌ స్కాన్‌ (ఎస్‌ఏఆర్‌) వంటి అత్యాధునిక హంగులు అమర్చారు.
- → వ్యవసాయం, అడవుల పర్యవేక్షణ, విపత్తుల నిర్వహణ, పట్టణ ప్రణాళిక, జాతీయ భద్రత వంటి అంశాల్లో ఇది కీలకమైన సేవలు అందించనుంది.
- → దీని డేగకళ్లు పాక్‌ నుంచి చైనా దాకా మన 15 వేల కి.మీ. విస్తారమైన సరిహద్దులను, 7,500 కి.మీ. పొడవైన సముద్రతీరాన్ని అణువణువూ కాపు కాస్తాయి. ఎలాంటి అనుమానాస్పద కదలికలనైనా ఇట్టే పట్టేస్తాయి.
- → వరదల వంటి ప్రాకృతిక విపత్తుల వేళ మేఘాలను చీల్చుకుంటూ ఈఓఎస్‌–09 అందించే రియల్‌ టైం చిత్రాలు, డేటా నష్ట తీవ్రతను తక్షణం అంచనా వేయడంలో దోహదపడతాయి.



ఎర్త్‌ అబ్జర్వేషన్‌ శాటిలైట్‌ (ఈఓఎస్‌–09)

అంబేడ్కర్‌ భావజాలమే ఆదర్శం

ఆ మార్గమే సీజేఐగా నిలిపింది: జస్టిస్‌ గవాయ్‌

- ఆర్కిటెక్టు కావాలనుకుని లాయర్‌ అయ్యాను
- నాకు సిగ్గెక్కువ, అందుకే ఇంటర్వ్యూలు ఇవ్వను
- న్యాయ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళలు
- హైకోర్టులే ఆ మేరకు సిఫార్సు చేయాలి
- బార్‌ కౌన్సిల్‌ సన్మాన కార్యక్రమంలో సీజేఐ



సాక్షి, న్యూఢిల్లీ: ''రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ భావజాలమే నాకు ఆదర్శం. ఆయన మార్గమే నన్ను సీజేఐగా నిలబెట్టింది''అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్‌ రామకృష్ణ గవాయ్‌ తెలిపారు. సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను బార్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా (బీసీఐ) శనివారం ఘనంగా సన్మానించింది. యువ న్యాయవాది నుంచి అత్యున్నత స్థానానికి ఎదిగేదాకా తన న్యాయ ప్రస్థానంలోని ఆసక్తికరమైన విషయాలను సీజేఐ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ''చిన్నతనంలో నాకు ఆర్కిటెక్ట్‌ కావాలనే కోరిక ఉండేది. కానీ అంబేడ్కర్‌ ఆశయ సాధన, ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన ఆవశ్యకతను తండ్రి సూచించడంతో న్యాయ వృత్తిని ఎన్నుకున్నా. న్యాయమూర్తిగా అవకాశం వచ్చినప్పుడు స్వీకరించాలా వద్దా అన్న మీమాంసలో పడ్డా. న్యాయవాదిగానే కొనసాగితే ఎంతో డబ్బు సంపాదించవచ్చని చాలామంది సలహా ఇచ్చారు. అది నిజమే అయినా న్యాయమూర్తిగా అంబేడ్కర్‌ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లి సామాజిక, ఆర్థిక న్యాయ సాధనకు కృషి చేయొచ్చని నాన్న ఎప్పుడూ చెప్పేవారు. ఆయన మాటలకు కట్టుబడి న్యాయమూర్తిగా మారాను. ఆ నిర్ణయం తీసుకున్నందుకు ఇప్పుడెంతో సంతోషిస్తున్నా''అని చెప్పారు.

ఖాళీలను భర్తీ చేయాలి

న్యాయ నియామకాల్లో వైవిధ్యం పెరగాల్సిన అవసరాన్ని జస్టిస్‌ గవాయ్‌ నొక్కిచెప్పారు. ఆ పదవులకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల నుంచి మహిళలను వీలైనంత ఎక్కువగా సిఫార్సు చేయాలని హైకోర్టులకు సూచించారు.''ఈ విషయమై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో కూడా మాట్లాడాను. జడ్జి నియామకాలకు అర్హులైన మహిళా అభ్యర్థులు వారి హైకోర్టుల్లో లేని పక్షంలో సుప్రీంకోర్టులో ప్రాక్టీస్‌ చేస్తున్న ప్రతిభావంతుల నుంచి ఎంపిక చేసుకోవాలని సూచించాను. ఈ విషయంలో కొంతమేరకు సఫలీకృతమయ్యాం కూడా''అని వెల్లడించడంతో ఆహూతులు చప్పట్లతో అభినందించారు.

వాగ్దానాలు నా నైజం కాదు

సీజేఐ అయ్యాక చాలా మీడియా సంస్థలు తన ఇంటర్వ్యూ అడుగుతున్నట్టు జస్టిస్‌ గవాయ్‌ చెప్పారు. ''కానీ ఇవ్వలేకపోతున్నాను. ఇప్పుడే కాదు, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పటి నుంచీ మీడియాకు దూరంగానే ఉండేవాడిని. మీడియా అంటే నాకేమీ భయం లేదు. కానీ నాకు సిగ్గు చాలా ఎక్కువ''అని చెప్పి నవ్వులు పూయించారు. ''అదీ గాక ముందుగానే వాగ్దానాలు చేయడం నాకిష్టముండదు. అప్పట్లో ఇంటర్వ్యూల్లో అన్ని చెప్పాడు, చివరికి వాటిలో ఒక్కటీ చేయలేదని మీడియా మిత్రులే విమర్శించే ప్రమాదముంది. కనుక ఇంటర్వ్యూలు ఇవ్వనందుకు నన్ను వాళ్లు క్షమిస్తారనే ఆశిస్తున్నా''అంటూ చమత్కరించారు.

ప్రొటోకాల్‌ పక్కన పెట్టి మరీ జస్టిస్‌ త్రివేదికి సీజేఐ వీడ్కోలు

- చాంబర్‌కు వెళ్లి మరీ తోడ్కొని వచ్చారు
- వెల్లడించిన జస్టిస్‌ విశ్వనాథన్‌

జస్టిస్‌ గవాయ్‌ వినమ్రత, నాయకత్వ లక్షణాలు సాటిలేనివని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ కె.వి.విశ్వనాథన్‌ అన్నారు. శుక్రవారం రిటైరైన సహచర న్యాయమూర్తి జస్టిస్‌ బేలా ఎం.త్రివేదికి ప్రొటోకాల్‌ను పక్కన పెట్టిన మరీ ఘనంగా వీడ్కోలు పలికిన తీరే అందుకు గొప్ప నిదర్శనమన్నారు. ''ప్రొటోకాల్‌ ప్రకారం ధర్మాసనం కార్యకలాపాలు ముగిశాక మధ్యాహ్నం 1.30 సమయంలో ఇతర న్యాయమూర్తులంతా సుప్రీంకోర్టు ఆవరణలోకి వచ్చి రిటైరయ్యే న్యాయమూర్తికి సాదరంగా వీడ్కోలు పలుకుతారు. జస్టిస్‌ త్రివేది విషయంలో మాత్రం సీజేఐ ఎవరూ ఊహించని పని చేశారు. గ్రౌండ్‌ ఫ్లోర్‌లో ఉన్న తన చాంబర్‌ నుంచి రెండు అంతస్తులు ఎక్కి మరీ స్వయంగా జస్టిస్‌ త్రివేది చాంబర్‌లోకి వెళ్లి మమ్మల్ని ఆశ్చర్యపరిచారు. దాంతో మేం కూడా ఆయన్ను అనుసరించాం. సీజేఐ సారథ్యంలో అందరమూ కలిసి ఆమెను కోర్టు ప్రాంగణం దాకా సాదరంగా తోడ్కొని వచ్చాం. గార్డ్‌ ఆఫ్‌ ఆనర్‌తో ఘనంగా వీడ్కోలు పలికాం. ఇది నా దృష్టిలో అత్యంత అర్థవంతమైన వీడ్కోలు''అని చెబుతూ జస్టిస్‌ విశ్వనాథన్‌ భావోద్వేగానికి లోనయ్యారు.

గడువు దాటితే వెళ్లగొడతాం

వీసాదారులను హెచ్చరించిన భారత్‌లోని అమెరికా ఎంబసీ

న్యూఢిల్లీ: వీసా గడువు ముగిశాక కూడా అమెరికాలో ఉండిపోతే బహిష్కరణ వేటు వేస్తామని భారత్‌లోని అమెరికా ఎంబసీ శనివారం ప్రకటించింది. ఈ మేరకు యూఎస్‌ ఎంబసీ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్‌'ఖాతాలో శనివారం ఒక పోస్ట్‌చేసింది. ''అధికారికంగా అమెరికా గడ్డపై ఉండేందుకు ఇచ్చిన వీసా గడువు ఒకవేళ ముగిసిపోతే ఆయా వీసాదారులంతా తక్షణం అమెరికాను వీడాలి. లేదంటే మిమ్మల్ని బహిష్కరించాల్సి ఉంటుంది. బలవంతంగా తరలిస్తాం. భవిష్యత్తులో మళ్లీ అమెరికాకు రాకుండా శాశ్వత నిషేధం విధిస్తాం''అని ఆ పోస్ట్‌లో అమెరికా ఎంబసీ పేర్కొంది. ముందస్తు సమాచారం ఇవ్వకుండా అనధికార వలసదారులను స్వదేశానికి కాకుండా వేరే దేశాలకు పంపేందుకు అనుమతించాలంటూ ట్రంప్‌ సర్కార్‌ చేసిన అభ్యర్థనను యూఎస్‌ ఫెడరల్‌ అప్పీళ్ల కోర్టు తిరస్కరించిన మరుసటి రోజే అమెరికా ఎంబసీ ఇలా ప్రకటన చేయడం గమనార్హం.

చినాబ్‌ జలాల గరిష్ట వినియోగానికి కేంద్రం పథకం

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడి అనంతరం సింధూ జలాల ఒప్పందం నుంచి వైదొలగిన భారత ప్రభుత్వం చినాబ్‌ నదీ జలాలను గరిష్టంగా వినియోగించుకునేందుకు ఆలోచన చేస్తోంది. ఇందుకోసం ఈ నదిపై ప్రస్తుతమున్న రణ్‌బీర్‌ కాల్వ పొడవును 60 నుంచి 120 కిలోమీటర్లకు పెంచాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు చినాబ్‌ నీటిని సాగుకు మాత్రమే వాడుకుంటున్న భారత్‌, ఇకపై 3 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తికి కూడా వాడుకునేందుకు పథకం సిద్ధమైందని సీనియర్‌ అధికారి ఒకరు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన పనులను సత్వరమే ప్రారంభించేలా కేంద్రం ఆదేశాలిచ్చిందన్నారు. ఇప్పటి వరకు పాకిస్తాన్‌ చినాబ్‌ జలాలతో విద్యుదుత్పత్తి చేసిందని తెలిపారు. అంతేకాకుండా, చినాబ్‌ నదీ కాల్వపైన కథువా, రావి, పరగ్వాల్‌ల్లో పూడికతీత ఇప్పటికే మొదలైందని ఆయన వివరించారు.

అణు యుద్ధం జరిగేదేమో: షెహబాజ్‌ షరీఫ్‌

ఇస్లామాబాద్‌: తమ వైమానిక స్థావరాలపై భారత సైన్యం పెద్ద ఎత్తున దాడులు చేసిందని పాకిస్తాన్‌ ప్రధానమంత్రి షెహబాజ్‌ షరీఫ్‌ తాజాగా అంగీకరించారు. ఈ దాడుల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని, క్రమంగా అణుయుద్ధం కూడా జరిగి ఉండేదేమోనని ఆయన వ్యాఖ్యానించారు. కానీ, ఉద్రిక్తతలు హఠాత్తుగా ఆగిపోయానని ఆయన గుర్తుచేశారు. షెహబాజ్‌ షరీఫ్‌ శనివారం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

గూఢచర్యం ఆరోపణలపై మహిళా యూట్యూబర్‌ అరెస్ట్‌

ఐఎస్‌ఐ అధికారులతో జ్యోతికి సంబంధాలు

- వాట్సాప్‌, టెలిగ్రామ్‌, స్నాప్‌చాట్‌లో దేశ సున్నిత సమాచారం చేరవేత
- పలుమార్లు పాకిస్తాన్‌లో పర్యటన
- పాక్‌ హైకమిషన్‌ మాజీ ఉద్యోగితో సంబంధాలు



జ్యోతి మల్హోత్రా

చండీగఢ్‌: హరియాణాకు చెందిన ప్రముఖ మహిళా యూట్యూబర్‌ జ్యోతి మల్హోత్రా పాకిస్తాన్‌కు అనుకూలంగా గూఢచర్యానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ పోలీసులు అరెస్ట్‌చేశారు. పాకిస్తాన్‌ సైనిక నిఘా సంస్థ ఇంటర్‌ సర్వీసెస్‌ ఇంటెలిజెన్స్‌(ఐఎస్‌ఐ)కు భారతదేశానికి సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని చేరవేశారని జ్యోతిపై పోలీసులు అధికార రహస్యాల చట్టం, భారతీయ న్యాయ సంహిత చట్టాల కింద కేసు నమోదుచేశారు. శుక్రవారం ఆమెను హరియాణాలోని హిస్సార్‌లోని న్యూ అగ్రసేన్‌ ఎక్స్‌టెన్షన్‌ కాలనీలో అరెస్ట్‌చేశారు. స్థానిక కోర్టులో ప్రవేశపెట్టగా జ్యోతిని ఐదు రోజులపాటు పోలీస్‌ కస్టడీకి అప్పగిస్తూ జడ్జీ ఉత్తర్వులు జారీచేశారు. ఢిల్లీలోని పాకిస్తాన్‌ హై కమిషన్‌లోని ఒక ఉద్యోగితో జ్యోతి రహస్య సమాచారాన్ని పంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ పాకిస్తానీ అధికారిని మే 13వ తేదీన కేంద్ర ప్రభుత్వం తక్షణం భారత్‌ను వీడాలని ఆదేశించడం తెల్సిందే. పంజాబ్‌ పోలీసుల దర్యాప్తులో జ్యోతి విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. పాకిస్తానీ అధికారితో కలిసి గూఢచర్యం కేసులో పంజాబ్‌ పోలీసులు ఇప్పటికే ఒక మహిళ సహా ఇద్దరిని అరెస్ట్‌ చేయడం తెల్సిందే.

ఎవరీ జ్యోతి?

హిస్సార్‌కు చెందిన జ్యోతి 'ట్రావెల్‌ విత్‌ జో'పేరిట ఒక యూట్యూబ్‌ ఛానెల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ ఛానెల్‌కు 3.77 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ట్రావెల్‌ బ్లాగర్‌గా ఉంటూ దేశంలోని పలు ప్రాంతాలను పర్యటిస్తూ ఎన్నో వీడియోలు తీసి పోస్ట్‌చేశారు. ఈమె ట్రావెల్‌విత్‌జో1 ఇన్‌స్టాగ్రామ్‌ ఖాతాకు 1,32,000 మంది ఫాలోవర్లు ఉన్నారు. చైనా, పాకిస్తాన్‌, ఇండోనేసియాల్లోనూ వీడియోలు తీసింది. మే 16న జ్యోతిపై సివిల్‌ లైన్స్‌ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్‌ఐఆర్‌ వివరాల ప్రకారం జ్యోతి రెండేళ్ల క్రితం పాకిస్తాన్‌ వీసా కోసం ఢిల్లీలోని పాకిస్తాన్‌ హైకమిషన్‌కు వెళ్లింది. అక్కడ ఎహ్సాన్‌ ఉర్‌ రహీమ్‌ అలియాస్‌ డ్యానిష్‌తో ఈమెకు పరిచయం ఏర్పడింది. తర్వాత వీసా లభించాక మూడు సార్లు పాకిస్తాన్‌కు వెళ్లి వచ్చింది. ఆ సమయంలో డ్యానిష్‌ ఆదేశానుసారం అలీ అహ్వాన్‌ అనే వ్యక్తి ఈమెకు పాక్‌లో బస, రవాణా ఏర్పాట్లుచేశాడు. పాకిస్తాన్‌లో పర్యటించిన కాలంలో జ్యోతి అక్కడి ఐఎస్‌ఐ అధికారులను కలిసింది. షకీర్‌, రాణా షహబాజ్‌లతో పరిచయం పెంచుకుంది. షహబాజ్‌ ఫోన్‌నంబర్‌ను ఎవరూ గుర్తుపట్టకుండా తన స్మార్ట్‌ఫోన్‌లో జాట్‌ రంధావా అనే వేరే పేరుతో సేవ్‌చేసింది. వాట్సాప్‌, టెలిగ్రామ్‌, స్నాప్‌చాప్‌ యాప్‌లలో మాత్రమే వివరాలు పంపించేది. ఢిల్లీలోని పాకిస్తాన్‌ హైకమిషన్‌కు తరచూ వెళ్తూ అక్కడ డ్యానిష్‌ను ఎక్కువగా కలిసేది. అతని ద్వారా పాకిస్తానీ నిఘా బృందాలతో సంప్రతింపులు జరిపి భారత్‌కు చెందిన సున్నిత సమాచారాన్ని చేరవేసేది. డ్యానిష్‌తో ఈమెకు శారీరక సంబంధం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరూ కలిసి ఇండోనేసియాలోని బాలీ ద్వీపానికీ వెళ్లొచ్చారు. ఇటీవల పాకిస్తాన్‌ అనుకూల వీడియోలు తీసి పోస్ట్‌చేసింది. పాక్‌లో కతాస్‌ రాజ్‌ టెంపుల్‌సహా పలు హిందూ ఆలయాల్లో వీడియోలు తీసి పాకిస్తాన్‌ పట్ల ఇండియన్లలో మంచి అభిప్రాయం పెరిగేందుకు ప్రయత్నించింది.

ట్రంప్‌ 'బిగ్‌బాస్‌' షో!



వలసదారులకు ప్రైజ్‌మనీగా పౌరసత్వం!!

- బిగ్‌బాస్‌ తరహాలో 'ది అమెరికన్‌'రియాలిటీ టీవీ షో
- ఎపిసోడ్‌కు ఒకరి చొప్పున ఎలిమినేషన్‌

వాషింగ్టన్‌: రిపబ్లికన్‌ పార్టీ అగ్రనేత డొనాల్డ్‌ ట్రంప్‌ ఏంచేసినా వినూత్నమే. వివాదాస్పదమే. అదే పరంపరను కొనసాగిస్తూ ట్రంప్‌ సొంతంగా సరికొత్త రియాలిటీ షోకు తెరలేపనున్నారన్న వార్త ఇప్పుడు అగ్రరాజ్యంలో చక్కర్లు కొడుతోంది. బిగ్‌బాస్‌ రియాలిటీ షో తరహాలో ఇందులో పాల్గొనేవారంతా భిన్న రకాలైన పనులు(టాస్క్‌లు) పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే ఇందులో ప్రధానంగా అమెరికా జాతీయత కోణం దాగి ఉంది. మరీ ముఖ్యంగా ఇప్పటికే అనధికారికంగా అమెరికాకు పోటెత్తిన వలసదారులను మాత్రమే ఈ రియాలిటీ షోలో అభ్యర్థులుగా స్వీకరిస్తారు. గెలిచిన వారికి అమెరికా పౌరసత్వాన్ని కట్టబెడతారు. స్వదేశంలో అంతర్యుద్ధం, ప్రకృతి వైపరీత్యాలు వంటి అసాధారణ, అనివార్య పరిస్థితుల్లో కొందరు వలసదారులు తిరిగి స్వదేశానికి వెళ్లలేని పరిస్థితి ఉంది. అలాంటి వారిని ఎంపిక చేసి అమెరికా పౌరసత్వం ఇచ్చే అవకాశం ఉంది. ఈ ఎంపికకు రియాలిటీ షో మార్గాన్ని ట్రంప్‌ ప్రభుత్వం ఎంచుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రియాలిటీ షో వివరాలు ఇంకా బహిర్గత కాలేదు. ఇది ఇంకా అమెరికా ప్రభుత్వ వర్గాల వద్ద ప్రతిపాదన దశలోనే ఉందని తెలుస్తోంది. అన్ని రకాల అనుమతులు దాటుకుని ఈ రియాలిటీ షో వాస్తవరూపం దాల్చితే ఈ షోకు అనూహ్య ఆదరణ లభించడం ఖాయమని భావిస్తున్నారు. ఈ షోలో గెలిచిన విజేతకు మాత్రమే అమెరికా పౌరసత్వం బేషరతుగా ఇవ్వాలని ట్రంప్‌ ప్రభుత్వం యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

ఎవరిదీ ఆలోచన?

కెనడియన్‌–అమెరికన్‌ నిర్మాత రాబ్‌ వార్సాఫ్‌ ఈ ప్రతిపాదన తెచ్చారు. రియాలిటీ షో నియమ నిబంధనలతో సమగ్రంగా 35 పేజీల్లో ఒక రిపోర్ట్‌ను తయారుచేసి అమెరికా హోంల్యాండ్‌ సెక్యూరిటీ(డీహెచ్‌ఎస్‌) విభాగానికి సమర్పించారు. రాబ్‌ వార్సాఫ్‌ గతంలో సృష్టించిన 'డక్‌ డినాస్టీ', 'ది మిలియనీర్‌ మ్యాచ్‌మేకర్‌'రియాలిటీ షోలు విజయవంతమైంది. ''రాబ్‌ చేసిన ప్రతిపాదనను పరిశీలిస్తున్నాం. నిజంగా ఇదొక మంచి ఆలోచన. హక్కులతోపాటు అమెరికన్లలో దేశభక్తి, పౌర విధులను మరోసారి స్పష్టంగా స్మరణకు తెచ్చేలా షో ఉంటే బాగుంటుంది''అని హోంల్యాండ్‌ సెక్యూరిటీలో ప్రజాసంబంధాల మహిళా అసిస్టెంట్‌ సెక్రటరీ ట్రీసియా మెక్‌లాసిన్‌ అన్నారు. ఈ ప్రతిపాదన ఇంకా పరిశీలన దశలోనే ఉందన్నారు. ఈ ప్రతిపాదన ప్రస్తుతం హోం ల్యాండ్‌ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్‌ వద్ద పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఎలాంటి టాస్క్‌లు ఉండొచ్చు?

'ది అమెరికన్‌'పేరిట జరగబోయే ఈ రియాలిటీ టీవీ షోలో వలసదారుల్లో దేశభక్తి పెంచడంతోపాటు బాధ్యతాయుత పౌరునిగా మెలగాలంటే ఉండాల్సిన అర్హతలు, లక్షణాలను స్మరణకు తెచ్చేలా టాస్క్‌లు రూపొందించనున్నారు. వీటితోపాటు ఆద్యంతం ఆసక్తికరంగా, వినోదాత్మకంగా ఉండేందుకు పలు రకాల టాస్క్‌లు పెట్టనున్నారు. టెక్సాస్‌ లేదా ఫ్లోరిడాలో నాసా ప్రయోగకేంద్రాల వద్ద చిన్నపాటి రాకెట్‌ ఎగరేయడం, శాన్‌ఫ్రాన్సిస్కో గనిలో బంగారాన్ని తవ్వితీయడం(గోల్డ్‌ రష్‌), డెట్రాయిట్‌లో ఆటోమొబైల్‌ అసెంబ్లీ లైన్ల వద్ద మోడల్‌ 'టి'కారు ఛాసిస్‌ను బిగించడం, కన్సాస్‌లో గుర్రపుస్వారీ చేస్తూ తపాలాలు బట్వాడా చేయడం వంటి వినూత్న టాస్క్‌లు వలసదారులు పూర్తిచేయాల్సి ఉంటుంది.

నీట్‌-యూజీ ఫలితాలపై హైకోర్టు స్టే

సాక్షి, చెన్నై: తమిళనాడులో ఒక పరీక్షా కేంద్రంలో నీట్‌–యూజీ,2025 ప్రవేశపరీక్ష సమయంలో విద్యుత్‌ అంతరాయం కారణంగా అసౌకర్యం కల్గిందని, ఆ కారణంగా పరీక్ష ఫలితాల విడుదలను నిలిపివేయాలన్న అభ్యర్థనను మద్రాస్‌ హైకోర్టు సమ్మతించింది. ఈ మేరకు ఫలితాలను నిలిపివేయాలంటూ సంబంధిత అధికారులకు జస్టిస్‌ వి.లక్ష్మీనారాయణన్‌ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ అంశంలో తదుపరి వాదోపవాదనలను జూన్‌ రెండో తేదీన ఆలకిస్తామని బెంచ్‌ పేర్కొంది. చెన్నైలోని 'పీఎం శ్రీ'కేంద్రీయ విద్యాలయ సీఆర్‌పీఎఫ్‌–అవడిలోని పరీక్షా కేంద్రంలో పలువురు అభ్యర్థులు ఈనెల నాలుగో తేదీన నీట్‌–యూజీ పరీక్షరాసేందుకు సిద్ధమవగా మధ్యాహ్నం మూడు గంటల నుంచి 4.15 గంటలదాకా విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. భారీ వర్షం కారణంగా వెంటనే విద్యుత్‌ పునరుద్ధరణ సాధ్యంకాలేదు. అందుబాటులో ఎలాంటి జనరేటర్‌, ఇన్వెర్టర్లు లేవని 13 మంది అభ్యర్థుల తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదించారు. ''సరైన వెలుతురు లేకున్నా పరీక్ష రాయాల్సి వచ్చింది. వర్షం నీరు పరీక్ష గదుల్లోకి చేరడంతో కేటాయించిన సీట్లో కాకుండా కాస్తంత దూరంగా జరిగి కూర్చుని పరీక్ష రాయాల్సి వచ్చింది. ఇంత అసౌకర్యం, అంతరాయం, సమయం వృథా అయినా ఈ అభ్యర్థులకు అధికారులు అదనపు సమయం కేటాయించలేదు. దీంతో మొత్తం ప్రశ్నలకు వాళ్లు సమాధానాలు రాయలేకపోయారు. రాజ్యాంగంలోని ఆర్టికల్‌ 14 ప్రకారం చూస్తే ఇతర కేంద్రాల్లోని అభ్యర్థులతో పోలిస్తే వీళ్లకు సమాన అవకాశాలు, హక్కులు లభించలేదు. అందుకే ఈ విషయం తేలేవరకు పరీక్ష ఫలితాలను నిలిపివేసేలా ఉత్తర్వులు ఇవ్వండి''అని న్యాయవాదులు కోరారు.

కాంగ్రెస్‌కు బిగ్‌ షాక్‌

అఖిలపక్ష బృందంలోకి ఎంపీ శశి థరూర్‌

- పార్టీ ప్రతిపాదించిన నాలుగు పేర్లను పక్కనపెట్టిన కేంద్రం

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌పై భారత్‌ ప్రారంభించిన దౌత్య యుద్ధం కాంగ్రెస్‌ పార్టీలో చిచ్చురేపింది. ఉగ్రవాదులకు అండగా నిలుస్తున్న పాకిస్తాన్‌ తీరును ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సహా ప్రపంచ దేశాల్లో ఎండగట్టడానికి, ఉగ్రవాదంపై భారత్‌ వైఖరిని వివరించడానికి కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష నేతలతో ఏడు బృందాలు ఏర్పాటు చేసింది. కాంగ్రెస్‌ ప్రతిపాదించిన నాలుగు పేర్లను పక్కనపెట్టి, ఆ పార్టీ ఎంపీ శశి థరూర్‌ను ఎంపిక చేయడం సంచలనాత్మకంగా మారింది. అంతేకాకుండా ఓ బృందానికి శశి థరూర్‌ నేతృత్వం వహిస్తారని ప్రకటించడం గమనార్హం. కాంగ్రెస్‌కు, థరూర్‌కు మధ్య ఇటీవల దూరం పెరుగుతున్న సంగతి తెలిసిందే. బీజేపీ పట్ల ఆయన సానుకూలంగా మాట్లాడుతుండడం కాంగ్రెస్‌ జీర్ణించుకోలేకపోతోంది. ఏడు బృందాలకు సారథ్యం వహించే నేతల పేర్లను కేంద్రం ప్రకటించిన తర్వాత కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి, మీడియా ఇన్‌చార్జి జైరామ్‌ రమేశ్‌ స్పందించారు. తాము ప్రతిపాదించని వ్యక్తిని ఎంపిక చేయడం ఏమిటని ప్రశ్నించారు. ''పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్‌ రిజిజు మా పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు రాహుల్‌ గాంధీతో మాట్లాడారు. విదేశాలకు పంపించే ప్రతినిధి బృందాల్లో నియమించడానికి నలుగురు ఎంపీల పేర్లను ప్రతిపాదించాలని కోరారు. దాంతో రాహుల్‌ గాంధీ మా పార్టీ నుంచి ఆనంద్‌ శర్మ, గౌరవ్‌ గొగోయ్‌, సయ్యద్‌ నజీర్‌ హుస్సేన్‌, అమరీందర్‌సింగ్‌ రాజా వారింగ్‌ పేర్లను ప్రతిపాదిస్తూ కిరణ్‌ రిజిజుకు లేఖ రాశారు''అని జైరామ్‌ రమేశ్‌ చెప్పారు.

ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్‌కు దూరం!

శశి థరూర్‌ వైఖరి కొన్ని నెలలుగా కాంగ్రెస్‌ పార్టీలో చర్చనీయాంశంగా మారుతోంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి అనుకూలంగా ఆయన తన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ జోక్యం చేసుకోవడం పట్ల బీజేపీని విపక్షాలన్నీ తప్పుపట్టగా, శశి థరూర్‌ మాత్రం వెనుకేసుకొచ్చారు. ఆయన లక్ష్మణ రేఖ దాటారని కాంగ్రెస్‌ నాయకులు మండిపడ్డారు. కానీ, ఒక భారతీయుడిగా తన సొంత అభిప్రాయాలు వెల్లడించానని, తన వ్యాఖ్యలతో కాంగ్రెస్‌కు సంబంధం లేదని థరూర్‌ వివరణ ఇచ్చారు. కొన్ని రోజుల క్రితం కేరళలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతో శశి థరూర్‌ వేదిక పంచుకున్నారు. తమను ఒకే వేదికపై చూసి కొందరికి నిద్ర పట్టదని కూడా ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.



శశి థరూర్‌

గొప్ప గౌరవంగా భావిస్తున్నా: థరూర్‌

అఖిలపక్ష బృందానికి నాయకత్వం వహించే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం తనకు కల్పించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని కాంగ్రెస్‌ ఎంపీ శశి థరూర్‌ చెప్పారు. ''నా సేవలు అవసరమని కేంద్రం భావిస్తే అందుకు సిద్ధంగా ఉన్నా. దేశ ప్రయోజనాల పరిరక్షణ కోసం నా వంతు సేవలు కచ్చితంగా అందిస్తా.. జైహింద్‌'అని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం 'ఎక్స్‌'లో పోస్టు చేశారు.

పాక్‌పై దౌత్య యుద్ధానికి బృంద సారథులు వీరే

- ఏడుగురిని ప్రకటించిన కేంద్రం
- నెలాఖరు నుంచి విదేశాల్లో పర్యటన
- విపక్షాల నుంచి థరూర్‌, కనిమొళి, సూలే
- ఎన్డీఏనుంచి రవిశంకర్‌ ప్రసాద్‌, పండా, షిండే, ఝా

సాక్షి, న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం ఆపరేషన్‌ సిందూర్‌తో పాకిస్తాన్‌ను చావుదెబ్బ కొట్టిన భారత్‌ దౌత్యపరంగానూ బుద్ధి చెప్పడానికి సిద్ధమైంది. పాక్‌ అరాచకాలను, భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న తీరును ప్రపంచ దేశాలకు వివరించనుంది. ఇందుకోసం పలు పార్టీల నేతలు, ఎంపీలు, దౌత్యవేత్తలతో ఏడు బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందం నాలుగు నుంచి ఐదు దేశాల్లో పర్యటించనుంది. విపక్షాల నుంచి శశి థరూర్‌ (కాంగ్రెస్‌), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్సీపీ–పవార్‌), అధికార ఎన్డీఏ కూటమి నుంచి రవిశంకర్‌ ప్రసాద్‌, బైజయంత్‌ పాండా (బీజేపీ), సంజయ్‌ కుమార్‌ ఝా (జేడీయూ), శ్రీకాంత్‌ షిండే (శివసేన–షిండే) వాటికి సారథ్యం వహిస్తారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ శనివారం ఈ మేరకు వెల్లడించింది. బృందాల్లో సభ్యులుగా అనురాగ్‌ ఠాకూర్‌, అపరాజితా సారంగి, మనీశ్‌ తివారీ, అసదుద్దీన్‌ ఒవైసీ, అమర్‌ సింగ్‌, రాజీవ్‌ ప్రతాప్‌ రూడీ, సమిక్‌ భట్టాచార్య, బ్రిజ్‌లాల్‌, సర్ఫరాజ్‌ అహ్మద్‌, ప్రియాంక చతుర్వేది, విక్రమ్‌జిత్‌ సాహ్నీ, సస్మిత్‌ పాత్ర, భువనేశ్వర్‌ కలితాతో పాటు కేంద్ర మాజీ మంత్రి సల్మాన్‌ ఖుర్షీద్‌ తదితరులు ఉంటారు. వారంతా ఈ నెలాఖర్లో ఐరాస భద్రతా మండలితో పాటు పలు కీలక దేశాల్లో పర్యటిస్తారు.

ఏ బృందం ఏ దేశానికి...

శశి థరూర్‌: అమెరికా, పనామా, గయానా, బ్రెజిల్‌, కొలంబియా

సుప్రియా సూలే: ఈజిప్ట్‌, ఖతర్‌, ఇథియోపియా, దక్షిణాఫ్రికా

కనిమొళి: రష్యా, స్పెయిన్‌, గ్రీస్‌, స్లొవేనియా, లాత్వియా

సంజయ్‌ కుమార్‌ ఝా: జపాన్‌, సింగపూర్‌, దక్షిణ కొరియా, మలేషియా, ఇండోనేసియా

రవిశంకర్‌ ప్రసాద్‌: ఈయూ, బ్రిటన్‌, ఫ్రాన్స్‌, జర్మనీ, ఇటలీ, డెన్మార్క్‌

బైజయంత్‌ పండా: సౌదీ అరేబియా, కువైట్‌, బహ్రెయిన్‌, అల్జీరియా

శ్రీకాంత్‌ షిండే: యూఏఈ, లైబీరియా, కాంగో, సియెర్రా లియోన్‌

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 18 । మే । 2025



క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యల్ని పరిష్కరించండి

అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సూచన



శిక్షణ పత్రాలు అందజేస్తున్న కర్ణన్, రామేశ్వరరావు

రాయదుర్గం: ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అభిప్రాయపడ్డారు. బల్దియాలో కొత్తగా నియమితులైన 115 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు నెల రోజుల పాటు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను, సమస్యలను దృష్టిలో పెట్టుకొని అధికారులు పని చేయాలని సూచించారు. ఉద్యోగంలో కొత్తగా చేరిన ఏఈఈలు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే ఉద్యోగంలో తృప్తి మిగిలిపోతుందన్నారు. కార్యక్రమంలో 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు, సెంటర్ ఫర్ క్లైమెట్ చేంజ్ హెడ్ డాక్టర్ చంద్రకళ, ఫ్యాకల్టీ డాక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏఈఈలకు కమిషనర్ శిక్షణ పత్రాలను అందజేశారు.

టెండర్లు సరే.. పనులెలా?

భూసేకరణ సమస్యలు, కోర్టు వివాదాలు

సాక్షి, సిటీబ్యూరో: హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కింద ప్రభుత్వం గత డిసెంబర్‌లో దాదాపు రూ.6వేల కోట్ల మేర పనులకు పరిపాలన అనుమతులిచ్చింది. వాటిలో ప్రాధాన్యతలకనుగుణంగా రూ.2,400 కోట్ల పనులు చేపట్టాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించడంతో సంబంధిత ప్రాజెక్ట్ విభాగం అధికారులు ఆ దిశగా చర్యలకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.1800 కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తయ్యాయి. వీటిలో కేబీఆర్ చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల పనులను మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్, ట్రిపుల్ఐటీ, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో పనులకు కేఎన్ఆర్ అనే సంస్థ కాంట్రాక్టులు పొందినట్లు సమాచారం. రూ.150 కోట్ల అంచనా వ్యయంతో విరించి హాస్పిటల్–జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు టెండర్ల దశలో ఉన్నాయి. వాటికి కూడా దాదాపు నెల రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తవుతుంది. కానీ.. పనులెలా చేస్తారనేదే ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.

కేసులు పరిష్కారమైతేనే..

- కేబీఆర్ పార్కు చుట్టూ పనులకు కోర్టు కేసులున్నాయి. అవి పరిష్కారమైతేనే పనులు ప్రారంభించలేని పరిస్థితి. ఇది ఒకవైపు.. మరో వైపు భూసేకరణ పూర్తి కాలేదు. కేవలం కేబీఆర్ పార్కు చుట్టూ పనులకే కాదు విరించి–జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు సైతం భూసేకరణ జరగాల్సి ఉంది. దాదాపు 6.5 కి.మీ. పొడవైన 120 అడుగుల వెడల్పు రోడ్డు పనుల కు 81 ఆస్తులు సేకరించాల్సి ఉందని గుర్తించారు.
- కేబీఆర్ చుట్టూ ఫ్లై ఓ వర్లు, అండర్‌పాస్‌ల పనులకు మరో 218 ఆస్తులు సేకరించాల్సి ఉంది. ఒకవైపు భూసేకరణల సమస్యలు, మరోవైపు కోర్టు వివాదాల పరిష్కారం కాకపోవడం వంటి కారణాలతో ఈ పనులు ఎప్పుడు పట్టాలెక్కగలవో చెప్పలేని పరిస్థితి నెలకొంది. మిగతా ప్రాంతాల్లోని పనులకూ భూసేకరణలు చేయాల్సి ఉంది. వీటన్నింటికీ అవసరమైన నిధులు కూడా జీహెచ్ఎంసీ ఖజానాలో లేవు. ఈ నేపథ్యంలో ఎలా ముందుకు సాగుతారో వేచి చూడాల్సిందే.















బ్యూటీ క్వీన్.. ఆటల్లో ఫైన్..

గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియం మునుపెన్నడూ కనిపించనంత అందాలతో మెరిసిపోయింది. సుందరీమణుల ఆటలతో మురిసిపోయింది. మిస్ వరల్డ్ పోటీదారుల కోసం నిర్వహించిన ప్రత్యేక క్రీడా దినోత్సవం ఆద్యంతం అలరించింది. శనివారం నగరంలోని దీక్షా డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో ఫ్లాష్ మాబ్ ప్రదర్శనతో ఉత్సవం ప్రారంభమైంది. పోటీలకు ముందు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అత్యద్భుత క్రీడా ప్రతిభకు అందమైన కళాత్మకతను జోడింపు మరింత వన్నె తెచ్చింది. యోగా నమస్కార్ సెషన్ కొత్త శక్తిని అందించింది. బ్యాడ్మింటన్, షాట్ పుట్, ఫుట్‌బాల్, చెస్, బాస్కెట్ బాల్, కబడ్డీ తదితర ఆటల్లో ముద్దుగుమ్మలు సత్తా చాటారు. ఆటల ముగింపు తర్వాత నిర్వహించిన ఉత్సాహభరిత జుంబా సెషన్ పోటీదారులందరినీ నృత్యంతో ఏకం చేసింది.

– సాక్షి, సిటీబ్యూరో

ఇక అంగరంగ వైభవమే



జూన్ 26న ఆషాఢ మాసం బోనాలకు అంకురార్పణ

- జూలై 20న లాల్ దర్వాజా బోనాలు
- 21న పాతబస్తీలో అమ్మవారి ఘటాల ఊరేగింపు



చార్మినార్: ఈ ఏడాది ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను జూన్ 26న అంకురార్పణ జరగనుంది. ఈ సందర్భంగా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి నెలరోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా దేవాలయాల కమిటీల నూతన కార్యవర్గాల ఏర్పాటుతో పాటు పలు దేవాలయాలకు మరమ్మతులు, రంగులు, చిత్రాలు తదితర పనులను ప్రారంభించారు. అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపునకు అవసరమైన కళాకారులకు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. శనివారం సాయంత్రం మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయం ప్రాంగణంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల షెడ్యూల్‌ను కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ప్రకటించారు.

మిగతా దేవాలయాలకు సైతం ఆర్థిక సాయం అందించాలి..



ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా నగరంలోని కొన్ని పురాతన దేవాలయాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందుతోంది. మిగిలిన పురాతన దేవాలయాలకు సైతం నిధులను మంజూరు చేయాల్సిన అవసరముంది.

– గాజుల అంజయ్య, భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్

ఈసారి అక్కన్న, మాదన్న దేవాలయం కమిటీకి బాధ్యతలు..

ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించడానికి భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ సిద్ధమైంది. ఇందులో భాగంగా రొటేషన్ పద్ధతిలో జరిగే కమిటీ అధ్యక్ష బాధ్యతలను ఈసారి హరిబౌలిలోని అక్కన్న, మాదన్న దేవాలయం కమిటీకి అప్పగిస్తున్నట్లు ప్రస్తుత కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య పేర్కొన్నారు.

ఇదీ షెడ్యూల్..

- జూన్ 26న గోల్కొండ అమ్మవారికి మొదటి బోనంతో ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభం
- 29న విజయవాడ శ్రీ కనకదుర్గమ్మకు రెండో బోనం సమర్పణ
- జూలై 2న బల్కంపేట అమ్మవారికి మూడో బంగారు బోనం
- జూలై 4న, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి నాలుగో బోనం
- జూలై 10న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి 5వ బంగారు బోనం
- 13న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి భక్తుల బోనాల సమర్పణ
- 14న మాతంగి స్వర్ణలతతో రంగం.. అంబారీపై అమ్మవారి ఘటం ఊరేగింపు
- జూలై 11న పాతబస్తీలో కలశ స్థాపన
- జూలై 13న శాలిబండ నుంచి అమ్మవారి ఘట స్థాపన సామూహిక ఊరేగింపు
- 15న చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారికి ఆరో బంగారు బోనం
- జూలై 17న లాల్ దర్వాజా సింహ వాహిని అమ్మవారికి చివరి, 7వ బంగారు బోనం
- జూలై 20న పాతబస్తీతో పాటు నగరంలో బోనాల జాతర
- జూలై 21న పాతబస్తీలో అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపు

భాగ్యనగరాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతాం

మంత్రి పొన్నం ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌ను దేశంలోని ఇతర నగరాలకు రోల్‌మోడల్‌గా అభివృద్ధి చేస్తామని, శాంతిభద్రతలు, సుందరీకరణ పనులతో పాటు ప్రజా సమస్యల్ని పరిష్కరిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జీహెచ్ఎంసీకి సంబంధించిన అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, తదితర అన్ని అంశాలపై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ప్రజా సమస్యలతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టాల్సిన పనుల గురించి, ఇందుకు సంబంధించి కార్యాచరణ గురించి సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్యల్లేకుండా చర్యలు తీసుకున్నట్లే, వర్షా కాలంలోనూ ప్రజలకు ముంపు సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడంపై సమీక్షించినట్లు చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాల గురించి చర్చించినట్లు తెలిపారు. అధికారుల పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ సమస్యల్ని వెబ్‌పోర్టల్, మై జీహెచ్ఎంసీ యాప్ ద్వారా కూడా తెలియజేయవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేస్తామన్నారు.

చెత్త కనిపించినా.. వీధి దీపం వెలగకున్నా చర్యలు తప్పవు

నగరంలో చెత్త కనపడినా, వీధిదీపాలు వెలగకపోయినా బాధ్యులపై చర్యలు తప్పవని మంత్రి పొన్నం హెచ్చరించారు. నగరంలో చేపడుతున్న ఫ్లై ఓవర్లు, తదితర పనులకు భూసేకరణ వేగవంతం చేయాలని, పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. ఫలక్‌నుమా ఆర్‌ఓబీ జూలై, శాస్త్రిపురం ఆర్‌ఓబీ ఆగస్టులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. వర్షాకాల సమస్యలకు సంబంధించి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ప్రధాన రహదారుల్లోనీరు నిలిచే ప్రాంతాల్లో నియమిస్తున్న మాన్సూన్ బృందాల్ని అంతర్గత రోడ్లలో కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై తీవ్ర ఒత్తిడి ఉన్నందున ప్రత్యామ్నాయ డంప్‌యార్డులవసరమని శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్‌కోరగా, రంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి , సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఏర్పాటుకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపి, తనకు తెలియజేస్తే ప్రభుత్వం ద్వారా అందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ కర్ణన్ పాల్గొన్నారు.

మహా కసరత్తు!



హెచ్ఎండీఏ నిధుల సేకరణకు 'ట్రస్ట్ కాపిటల్'

- ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రణాళికలు
- మర్చంట్ బ్యాంకుగా వ్యవహరించనున్న సదరు సంస్థ
- పూచీకత్తుగా హెచ్ఎండీఏ భూములు, ఆదాయ మార్గాలు

సాక్షి, సిటీబ్యూరో: అభివృద్ధి ప్రాజెక్టుల కోసం నిధుల సేకరణపై హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) కసరత్తు చేపట్టింది. పలు జాతీయ, అంతర్జాతీయ బ్యాంకుల నుంచి రుణాల రూపంలో నిధులను రాబట్టేందుకు తాజాగా ట్రస్ట్ కాపిటల్ సంస్థను మర్చంట్ బ్యాంక్‌గా నియమించింది. ఈ సంస్థ ఆధ్వర్యంలోనే నిధులను సేకరించి పనులు చేపట్టనున్నారు. ఎలివేటెడ్ కారిడార్‌లు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు, ట్రిపుల్ ఆర్ వరకు రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర ప్రాజెక్టుల కోసం హెచ్ఎండీఏ దాదాపు రూ.20 వేల కోట్ల అంచనాలతో ఇప్పటికే ప్రణాళికలు రూపొందించిన సంగతి తెలిసిందే. నిధుల కొరత కారణంగా ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. మరోవైపు వివిధ ప్రాంతాల్లో హెచ్ఎండీఏ ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించిన లే అవుట్‌లలో కూడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇలా వివిధ రకాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రుణాలను సేకరించాలని నిర్ణయించారు. ఈ మేరకు మర్చంట్ బ్యాంకు (సలహాదారు)గా వ్యవహరించనున్న ట్రస్ట్ కాపిటల్ సంస్థ సలహాలు, సూచనలకనుగుణంగా హెచ్ఎండీఏ బాండ్ల రూపంలో రుణాలను సేకరించనుంది. ఇందుకోసం వివిధ మార్గాల్లో హెచ్ఎండీఏకు లభించే ఆదాయం, భూముల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ష్యూరిటీలుగా చూపించి నిధులు సమకూర్చుకోనుంది.

రియల్ భూమ్ లేకనే రుణాలు..

నగరంలోని వివిధ ప్రాంతాల్లో హెచ్ఎండీఏకు సొంత స్థలాలు ఉన్నాయి. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్ధత నెలకొనడంతో వీటి అమ్మకానికి అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. ఆయా భూములనే పూచీకత్తుగా బ్యాంకులకు ష్యూరిటీలుగా పెట్టి రుణాలను సేకరించనున్నారు. మరోవైపు హెచ్ఎండీఏ వెంచర్‌లకు ప్రొసీడింగ్‌లు, నిర్మాణరంగ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌లు వంటి వాటిపై ఫీజుల రూపంలో ప్రతి ఏటా దాదాపు రూ.1000 కోట్ల వరకు లభిస్తుంది. ఇటీవల ట్రిపుల్ ఆర్ వరకు పరిధి పెరిగిన దృష్ట్యా మరికొంత ఆదాయం పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా. హెచ్ఎండీఏ ప్రణాళికా విభాగం ద్వారా లభించే ఈ ఆదాయానికి ప్రత్యేకంగా 'ఎస్క్రో' ఖాతాను తెరిచే ప్రతిపాదన ఉంది. దీనిద్వారా బాండ్లు, రుణాల రూపంలో రూ.5 వేల కోట్ల వరకు సేకరించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎలివేటెడ్ టోల్ చార్జీలు..

హెచ్ఎండీఏ నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌లు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్ల నుంచి కూడా టోల్ చార్జీలు వసూలు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. టోల్ చార్జీల ద్వారా వచ్చే ఆదాయాన్ని చూపించి బాండ్లు సేకరించాలని నిర్ణయించారు. రైతుల నుంచి మరిన్ని భూములను సేకరించి ట్రిపుల్ ఆర్ వరకు లే అవుట్‌లను అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.

కీలక అడుగులు!

మూసీ పునరుజ్జీవానికి మూడంచెల ప్రణాళిక

- తొలి దశలో నదీ గర్భంలో నిర్మాణాల తొలగింపు
- రెండో దశలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లల నిర్ధారణ
- మూడో దశలో ప్రైవేట్ స్థలాల సేకరణకు నిర్ణయం



సాక్షి, సిటీబ్యూరో: మూసీ పునరుజ్జీవానికి కీలక అడుగులు పడ్డాయి. మూడంచెల్లో మూసీ సుందరీకరణ చేపట్టాలని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులు నిర్ణయించారు. తొలుత మూసీ నదీగర్భంలోని నిర్మాణాలను తొలగించనున్నారు. అనంతరం రెండో దశలో మూసీ ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లను నిర్ధారించనున్నారు. ఇక మూడో దశలో మూసీ సుందరీకరణకు అవసరమైన భూములను సేకరించనున్నారు.

ఆక్రమణదారులతో సమావేశం..

నదీ గర్భంలో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు తొలుత ఎంఆర్‌డీసీఎల్ అధికారులతో పా టు రెవెన్యూ, పోలీసు, బల్దియా అధికారులు సంయుక్తంగా ఆక్రమణదారులతో మాట్లాడనున్నారు. వీరందరికీ ఇప్పటికే సిద్ధంగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేయడంతో త్వరలోనే ఆయా కార్యాచరణకు సిద్ధంకానున్నారు.

స్థలాల సేకరణ..

- మూసీ గర్భంలోనే రెండు వేల అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. ఏళ్లుగా ఉంటున్న పేదలను ఖాళీ చేయిస్తే విమర్శలు వచ్చే అవకాశం ఉందని ఇక్కడి నివాసితులతో అధికారులు మాట్లాడనున్నారు. సీఎంఆదేశం మేరకు నిర్మాణాలను కూల్చివేయాలని నిర్ణయించారు.
- మొదటి దశలో నది గర్భంలో నిర్మించిన భవనాలను తొలగిస్తారు. రెండో దశలో నదీ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల హద్దులను నిర్ణయిస్తారు. దీంతో మూసీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి అక్రమ నిర్మాణాలకు తావు ఉండదు. అలాగే మూసీలోకి మురుగు నీరు చేరకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకుంటారు. అనంతరం మూడో దశలో మూసీ సుందరీకరణకు అవసరమైన స్థలాలను సేకరిస్తారు.

సోషల్ మీడియాలో వేధింపులు

నిందితుడు అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: సామాజిక మాధ్యమాల నకిలీ అకౌంట్లు సృష్టించి, అమాయకులను మోసం చేస్తున్న సైబర్ నిందితుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళానికి చెందిన కూన ధర్మారావు దిల్‌సుఖ్‌నగర్‌లోని బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, వెబ్‌సైట్లు నిర్వహిస్తూ అమాయకులను మోసం చేయడం ఇతని ప్రవృత్తి. ఈక్రమంలో యూట్యూబ్‌లో ఆన్‌లైన్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితురాలికి నకిలీ ఇన్‌స్టాగామ్, వాట్సాప్ ఖాతాల ద్వారా ధర్మారావు సంప్రదించాడు. ఆమె ఉత్పత్తులను కొనేందుకు ఆసక్తి ఉందని, కాకపోతే తాను ఒకసారి కలవాలనుకుంటున్నానని ఆమెకు తెలిపాడు. అతని ప్రతిపాదనకు బాధితురాలు నిరాకరించింది. దీంతో ఆగ్రహానికి గురైన నిందితుడు అసభ్యపదజాలంతో ఆమెకు సామాజిక మాధ్యమాలలో సందేశాలు, పోస్టులు పంపించాడు. దీంతో ఆమె ఆన్‌లైన్ వ్యాపారం దెబ్బతింది. ఈమేరకు బాధితురాలు ఈ ఏడాది ఫిబ్రవరిలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడు ధర్మారావును అరెస్టు చేశారు. అతని నుంచి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు, డెబిట్‌కార్డులు తదితర ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు.

మెట్రోను రక్షించండి

సాక్షి, సిటీబ్యూరో: 'హైదరాబాద్ మెట్రో నిర్వహణ ఖర్చులు గత ఐదేళ్లలో 160 శాతం పెరిగాయి. ఫలితంగా ఏటా రూ.6,600 కోట్ల నష్టం వాటిల్లుతోంది. సేవలను కొనసాగించడం భారంగా మారింది. తక్కువ మేరకు టికెట్ ఛార్జీలు పెంపు ద్వారానే మెరుగైన సేవలతో పాటు అదనపు సర్వీసులు అందించగలం' అంటూ హైదరాబాద్ మెట్రో రైల్ విభాగం ఆయా మార్గాల్లో నడిచే సర్వీసుల్లో ప్రచారం నిర్వహిస్తోంది. ఇటీవల దూరాన్ని బట్టి ఒక్కో టికెట్టుపై రూ.12 చొప్పున మెట్రో ఛార్జీలు పెంచిన విషయం తెలిసిందే. ఛార్జీల పెంపును ఇటు ప్రతిపక్ష పార్టీలతో పాటు ప్రయాణికులు తీవ్రంగా నిరసిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో సంస్థాగతంగా ఎదరవుతున్న ఆర్థిక ఇబ్బందులను ప్రయాణికులకు వివరించి, వారి నుంచి వస్తున్న వ్యతిరేకతను తగ్గించే చర్యల్లో భాగంగా ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొంది. సంస్థ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని, కాపాడాల్సిందిగా ప్రయాణికులకు విజ్ఞప్తి చేస్తుంది.

టయోటా ఆధ్వర్యంలో 'హైలక్స్ బూట్ క్యాంప్'



సాక్షి, సిటీబ్యూరో: టయోటా కిర్లోస్కర్ మోటార్, హర్ష టయోటా, మోడీ టయోటా, ఫార్చ్యూన్ టయోటాల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన 'హైలక్స్ బూట్ క్యాంప్' శనివారం ప్రారంభమైంది. కొండలు, గుట్టల మధ్య అహ్లాదంగా సాగిన ప్రారంభోత్సవ ప్రయాణం ఔత్సాహికులకు మంచి అనుభూతిని పంచింది. ఈ కార్యక్రమంలో టీకేఎం దక్షిణాది జీఎం మహారాజ్ ముఖర్జీ, తెలంగాణ స్టేట్ హెడ్ అజిత్ కుమార్, ఎఫ్ఎస్ఎంలు అవతార్‌సింగ్, వినాయక్, మార్కెటింగ్ హెడ్ పునీత్, సేల్స్ అండ్ మార్కెటింగ్ వీపీలు ప్రశాంత పాములపర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.

రూ.350 కోట్ల ప్రభుత్వ స్థలం

కబ్జాకు యత్నం

ఇద్దరు కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్: ప్రభుత్వ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డును తొలగిస్తూ..బ్లూ షీట్లపై రాసిన గవర్నమెంట్ ల్యాండ్ అనే అక్షరాలను తుడిపేస్తూ కబ్జా యత్నానికి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై క్రిమినల్ ట్రెస్పాస్ కేసు నమోదు చేయాల్సిందిగా షేక్‌పేట మండల తహశీల్దార్ వై.అనితారెడ్డి శనివారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఎదురుగా తట్టిఖానా వాటర్ రిజర్వాయర్‌ను ఆనుకుని మూడున్నర ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. గత కొన్నేళ్లుగా పార్థసారథి, ఆయన కుమారుడు విజయ భార్గవన్ ఇద్దరూ కలిసి ఈ స్థలంలో తిష్ట వేశారు. ఓ గదిని నిర్మించడమే కాకుండా రౌడీలను ఏర్పాటుచేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ అధికారుల కదలికలపై దృష్టిపెట్టి అక్రమంగా స్థలంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. వీరిద్దరిపై ఇప్పటికే షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు రెండుసార్లు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రెండుసార్లు ఎఫ్ఐఆర్ నమోదయ్యాయి. అయినా సరే వీరు ఏమాత్రం పట్టించుకోకుండా తిరిగి అదే స్థలంలో పాగా వేశారు. దీంతో శుక్రవారం రెవెన్యూ సిబ్బంది ఈ స్థలంలోకి వెళ్లి 12 సీసీ కెమెరాలు తొలగించి చుట్టూ గవర్నమెంట్ ల్యాండ్ అనే అక్షరాలు రాసి గేటుకు తాళం వేశారు. శనివారం తెల్లవారుజామున మళ్లీ వీరు ఈ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు తొలగించారో అక్కడే కొత్తవి ఏర్పాటుచేసినట్లు అధికారులు గుర్తించారు. గవర్నమెంట్ ల్యాండ్ అక్షరాలు తుడిపేసినట్లుగా రెవెన్యూ సిబ్బంది గమనించారు. ఎన్నిసార్లు కేసులు నమోదు చేసినా, ఫిర్యాదు చేసినా, హెచ్చరించినా, సీసీ కెమెరాలు తొలగించినా, గేటుక తాళాలు వేసినప్పటికీ కబ్జాదారులు ఏమాత్రం పట్టించుకోకుండా గేటు తాళాలు పగులగొట్టి రెవెన్యూ అధికారులకే సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలోనే తహశీల్దార్ మరోసారి వీరిద్దరిపై కేసు నమోదు చేయాల్సిందిగా ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు చేపట్టారు.



ప్రభుత్వ స్థలంలో హెచ్చరికలు రాస్తున్న షేక్‌పేట రెవెన్యూ సిబ్బంది

నగరంలో మరిన్ని ఇళ్లు నిర్మిస్తాం: మంత్రి పొన్నం



డబుల్ బెడ్‌రూమ్ ఇంటి పట్టాలు అందజేస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలంటే స్థలాలు లేకపోవడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ప్రాధాన్యం పెరిగిందని, అవసరమైతే మరిన్ని ఇళ్లను నిర్మించి పంపిణీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బోజగుట్టలో 515 మంది లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా వికలాంగులు, ఒంటరి మహిళలకు కింది ఫ్లోర్‌లలో కేటాయించడం జరిగిందని తెలిపారు. పట్టాలు అందుకున్న ప్రతి ఒక్కరికి 6 నెలల్లో 73 బ్లాక్సు నిర్మించి 1800 మందికి అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే అర్హులైన పేదలకు కొత్తగా రేషన్ కార్డులు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, డీఆర్వో వెంకటాచారి, ఆర్డీవో రామకష్ణ పాల్గొన్నారు.

బాధ్యతగా స్పందించి.. ట్రాఫిక్ జామ్‌ను నివారించి..

గూగుల్ ఉద్యోగికి ట్రాఫిక్ ఏసీపీ అభినందనలు

రాంగోపాల్‌పేట్: ట్రాఫిక్‌లో ఆగిపోయిన కారు యజమానికి సహకరించి ట్రాఫిక్ జామ్‌ను నివారించిన గూగుల్ ఉద్యోగిని ఉత్తర మండలం ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అభినందించారు. శుక్రవారం సాయంత్రం వైఎంసీఏ ఫ్లైఓవర్‌పై శాంత్రోతో ఓ 50 ఏళ్ల మహిళ డ్రైవ్ చేసికుంటూ వెళ్తుండగా కారు బ్యాటరీ ఫెయిల్ కావడంతో ఆగిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడంతో పాటు మహిళ కూడా ఏమి చేయాలో తోచని స్థితిలో ఉంది. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై అంబర్‌పేట్ వెళ్తున్న గూగుల్ ఉద్యోగి అభిషేక్ గమనించి తన వాహనాన్ని ఆపి ఆ కారును వైఎంసీఏ ఫ్లైఓవర్ మధ్యలో నుంచి ఉత్తర మండలం డీసీపీ కార్యాలయం వరకు తోసుకుంటూ వచ్చాడు. ఆ తర్వాత మళ్లీ నడుచుకుంటూ వెళ్లి తన వాహనం వద్దకు చేరుకుని వెళ్లిపోయాడు. ఈ సందర్భంగా శనివారం ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అభిషేక్‌ను పిలిపించి సత్కరించారు. సమాజం పట్ల ఒక బాధ్యత కలిగిన వ్యక్తిగా, మహిళ బాధను కూడా అర్థం చేసికుని వెంటనే స్పందించాడని అభినందించారు. ప్రతి రోజు నగరంలో 2 వేల కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నందున ప్రతి చోట పోలీసులు అందుబాటులో ఉండటం సాధ్యం కాదని, ఇలాంటి సందర్భంగా బాధ్యత గల పౌరులుగా ప్రతి ఒక్కరు స్పందించాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సతీష్‌రెడ్డి, కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



అభిషేక్‌ను సత్కరిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

మలక్‌పేటలో భారీ దొంగతనం

67 తులాల బంగారు ఆభరణాలు, నగదు చోరీ



చోరీకి గురైన నివాసంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మలక్‌పేట భారీ దొంగతనం జరిగింది. సుమారు 67.65 తులాల బంగారు ఆభరణాలు. కొంత నగదు చోరీకి గురయ్యాయి. చాదర్‌ఘాట్ పోలీసులు, బాధితుల కథనం ప్రకారం..ప్రైవేట్ జాబ్ చేస్తున్న మహమ్మద్ ఫహీముద్దీన్ చాదర్‌ఘాట్ అజంపురా వెయింగ్ బ్రిడ్జి సమీపంలో నివసిస్తున్నాడు. రెండు రోజుల క్రితం అతని తమ్ముడు ఖాజా మెయినుద్దీన్, అతని భార్య మరియం ఫాతిమాలు వారి నివాసంలో పడిపోవటంతో అబిడ్స్‌లోని ఓ హాస్పిటల్‌లో చేర్పించారు. వారిని చూసేందుకు ఫహీముద్దీన్ భార్య ఆస్పత్రికి వెళ్లగా, శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో కుమార్తెతో కలిసి భోజనం చేసి ఫహీముద్దీన్ నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి సుమారు ఒంటి గంట ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇంటి కిచెన్ విండో ద్వారా చొరబడి అలమారాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, ఇతర వస్తువులను దొంగిలించాడు. అలమారా తాళాలన్నీ ఓ చిన్న బ్యాగులో పెట్టి అక్కడే ఉంచడంతో దొంగ ఆ తాళాలు తీసుకొని అలమారాలోని అన్ని కంపార్ట్‌మెంట్లు తెరిచి విలువైన బంగారు ఆభరణాలు నగదు, మొబైల్ ఫోన్ దొంగలించాడు. ఉదయం 4 గంటలకు నిద్రలేచిన ఫహీముద్దీన్ ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించి చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.అల్మారాలో ఉన్న 67.65 తులాల బంగారు ఆభరణాలతో పాటు మొబైల్ ఫోన్, రాడో వాచ్, వీడియో కెమెరా, కొంత నగదు చోరీకి గురైనట్లు పేర్కొన్నాడు. కాగా మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మమురారి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్, ఎస్ఐలు తిరుపతి, భరత్‌లు తమ సిబ్బందితో కలిసి సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ క్లూస్ టీంలతో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై కొరడా

బంజారాహిల్స్: నెంబర్ ప్లేట్ లేకుండా, సరైన నెంబర్ ప్లేట్ పెట్టుకోకుండా వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు లేకుండా తిరుగుతున్న వాహనదారులపై వెస్ట్‌జోన్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 14 నుంచి మే 16వ తేదీ వరకు వెస్ట్‌జోన్ పరిధిలో నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న 880 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 108 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో ఉన్నాయి. మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 63, జూబ్లీహిల్స్‌లో 156, ఫిలింనగర్‌లో 155, పంజగుట్టలో 102, మధురానగర్‌లో 120, ఎస్ఆర్‌నగర్‌లో 99, బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో 86 వాహనాలను సీజ్ చేశారు. వీరందరూ సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర ధృవపత్రాలు తీసుకొని వచ్చి కోర్టులో జరిమానా చెల్లించిన తర్వాతనే పోలీస్ స్టేషన్‌లో సదరు వాహనానికి నెంబర్ ప్లేట్ బిగించిన తర్వాత వాటిని విడుదల చేస్తున్నారు. చాలా మంది నెంబర్ ప్లేట్ లేకుండా, మరికొంత మంది నెంబర్లు కనిపించకుండా ఛలానాల నుంచి తప్పించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

ప్రభుత్వ భూముల జోలికొస్తే ఉపేక్షించం

- తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి
- బాటసింగారంలో రూ.18 కోట్ల విలువైన భూమికి హద్దుల నిర్ధారణ

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిని ఉపేక్షించేది లేదని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని బాటసింగారం సర్వేనంబర్ 10/95, 10/96లోని మూడెకరాల ప్రభుత్వ భూమిని సర్వేయర్ జ్యోతి, ఆర్ఐ ఇందిరరాణితో కలిసి శనివారం సర్వే చేయించారు. హద్దులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హెచ్చరిక బోర్డులు నాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించామని తెలిపారు. వీరు నిత్యం నిఘా పెడుతారన్నారు. బోర్డు పాతిన ప్రభుత్వ భూమి మార్కెట్ విలువ సుమారు రూ.18 కోట్లు ఉంటుందని తెలిపారు. దీనికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన నాలుగు నిర్మాణాలను జేసీబీతో కూల్చివేయించామన్నారు.

ఉద్యోగం పేరిట మోసం

వెంగళరావునగర్: ఉద్యోగం పేరిట నగదు తీసుకుని మోసం చేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్.జీవన్ వెంగళ రావునగర్‌లో నివసిస్తూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆమె అత్త ఉర్మిళాదేవి టైలరింగ్ చేస్తుంది. డి.ప్రసన్నారెడ్డి అనే మహిళ తరచూ ఉర్మిళాదేవి వద్దకు వచ్చి జాకెట్లు కుట్టించుకుంటుంది. తనను హైకోర్టు అడ్వొకేట్‌గా పరిచయం చేసుకుంది. దీంతో ఉర్మిళాదేవి తన అల్లుడికి ఏదైనా జాబ్ చూడాలని ప్రసన్నా రెడ్డిని కోరింది. రూ. 15 లక్షలు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో నమ్మిన ఉర్మిళాదేవి 2022లో రూ.3.50 లక్షల వరకు ఇచ్చింది. ఇప్పటివరకు ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు సైతం చెల్లించలేదు. దీంతో తమను మోసం చేసిన ప్రసన్నా రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జీవన్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి నేతకు మంత్రి పరామర్శ



రహమత్‌నగర్: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామిని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్సీ ఆర్‌హిల్స్‌లో ఆయన నివాసంలో శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీ అనిల్ కుమార్, మేయర్ విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వెంగళరావునగర్: యూసూఫ్‌గూడ డివిజన్‌లోని శ్రీకృష్ణనగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ నేతలు అజారుద్దీన్, నవీన్ యాదవ్, ఫిరోజ్ ఖాన్, అసదుద్దీన్, కిరణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేశారో..ఫైన్ పడుద్ది..!

బంజారాహిల్స్: దుకాణాలు, పాన్ డబ్బాలు, మెస్‌లు, హోటళ్లు, చిన్న చిన్న టీ కొట్ల నిర్వాహకులు తస్మాత్ జాగ్రత్త. కొందరు వ్యాపారులు తమ షాపుల వద్ద పెద్ద డబ్బాలు ఏర్పాటు చేసి అందులో బ్లాక్ కవర్ ఉంచి చెత్తను వేసి తెల్లవారు జామున తమ సమీపంలోకి వచ్చే స్వచ్ఛ ఆటోలకు అందించాలని కొన్నాళ్లుగా జీహెచ్‌ఎంసీ అధికారులు సంబంధిత వ్యాపారులకు సూచిస్తున్నారు. అయినా చాలాచోట్ల కొందరు పట్టించుకోవడం లేదు. రాత్రిపూట షాపులు మూసేసిన తర్వాత షాపుల ఎదుట రోడ్డు పక్కనే చెత్తను గుట్టలుగా వేస్తున్నారు. దీంతో వారికి క్లాం వేసేందుకు జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ (శానిటేషన్) రఘుప్రసాద్, ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి, ఏఎంఓహెచ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ఎస్ఎఫ్ఏలు, రాంకీ సిబ్బంది రంగంలోకి దిగారు. తాజాగా శనివారం ఉదయం ఎంఎస్ మక్తాలో పర్యటించారు. దుకాణదారులకు బిన్లలో చెత్త ఎలా వేయాలి..? బ్లాక్ కవర్‌తో ఎలా కప్పి ఉంచాలి..? స్వచ్ఛ ఆటోకు ఎలా అందించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. షాపుల ఎదుట బిన్లు ఏర్పాటు చేసుకోకుండా చెత్త వేసేవారికి కొన్నేళ్లుగా జరిమానాలు విధిస్తున్న అధికారులు తాజాగా ఓ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.



ఎంఎస్ మక్తాలో దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న జీహెచ్‌ఎంసీ శానిటేషన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, డీసీ రజనీకాంత్‌రెడ్డి

◆ జీహెచ్‌ఎంసీ తీసుకువచ్చిన సీసీఎంఎస్ యాప్ ద్వారా ఎక్కడైనా చెత్త ఉంటే ఆ ఫొటోలు అప్‌లోడ్ చేసి సదరు వ్యాపారికి అక్కడికక్కడే జరిమానా విధిస్తున్నారు.

◆ సర్కిల్–17 పరిధిలో 35 మంది జవాన్లు ఉండగా వీరంతా ప్రతిరోజూ తమకు వచ్చే ఫిర్యాదుల మేరకు చెత్త పేరుకుపోయిన ప్రాంతాలకు వెళ్లి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి బేఖాతర్ చేస్తే యాప్‌లో ఆ ఫొటోలు అప్‌లోడ్ చేసి ఫైన్ విధిస్తున్నారు.

◆ ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోకి వచ్చే సోమాజీగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో 2 నెలల వ్యవధిలోనే 120 మంది వ్యాపారులకు యాప్ ద్వారా ఫైన్ విధించి రూ.1.40 లక్షలు వసూలు చేశారు.

◆ రెండోసారి, మూడోసారి కూడా ఇలాగే నిర్లక్ష్యం చేస్తే వారికి నోటీసులు ఇచ్చి ఉల్లంఘన కింద ట్రేడ్ లైసెన్స్‌ను కూడా రద్దు చేయాలని అధికారులు యోచిస్తున్నారు.

◆ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వేంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో కాంప్రెన్సివ్ చలాన్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా 2 నెలల వ్యవధిలో 34 మందికి జరిమానా విధించగా వీరి నుంచి రూ.82,300 లు వసూలు చేశారు.

తప్పనిసరిగా బిన్లు ఏర్పాటు చేసుకోవాలి..

ప్రతి వ్యాపారి తప్పనిసరిగా షాపు ఎదుట పెద్ద డబ్బాను ఏర్పాటు చేసుకోవాలి. అందులో బ్లాక్ కవర్ పెట్టి చెత్త నిండిన తర్వాత మూటగట్టి తమ సమీపంలోకి వచ్చే స్వచ్ఛ ఆటోకు అందించాలి. ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తున్నాం. అయినా మారకుంటే అవసరమైతే ట్రేడ్ లైసెన్స్ కూడా రద్దు చేసేందుకు వెనుకాడం. ఇక నుంచి వ్యాపారులు తప్పనిసరిగా తమ షాపుల ఎదుట బిన్లు ఏర్పాటు చేసుకోవాలి.

– రఘు ప్రసాద్, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ (శానిటేషన్)

అవగాహన కల్పిస్తున్నాం..

మా పరిధిలోని కిళ్లీ కొట్లు, టీ బండ్లు, రోడ్ల పక్కన మెస్‌లు, మెడికల్ షాపులు, వాణిజ్య సముదాయాలు, సూపర్ మార్కెట్లు, ఇతరత్రా దుకాణదారులకు కొన్నాళ్లుగా అవగాహన కల్పిస్తున్నాం. మా జవాన్లు ఆయా షాపులకు వెళ్లి బిన్లు ఏర్పాటు చేసుకోని వ్యాపారులకు జరిమానా విధించడమే కాకుండా అప్పటికప్పుడు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిఒక్కరూ సహకరిస్తేనే పరిసరాల శుభ్రత సాధ్యమవుతుంది.

– రజనీకాంత్‌రెడ్డి, ఉప కమిషనర్, ఖైరతాబాద్ సర్కిల్

పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలి



సమావేశంలో మినీ అంగన్‌వాడీ టీచర్లు

పంజగుట్ట: మినీ అంగన్‌వాడీ టీచర్లకు పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గతేడాది మంత్రి సీతక్క మినీ అంగన్‌వాడీలను కూడా ప్రధాన అంగన్‌వాడీలుగా గుర్తిస్తూ రూ. 13,650 జీతాలు ఇస్తూ, హెల్పర్‌ను కూడా నియమిస్తామని జీవో తీసుకువచ్చి ఆర్డర్ కాపీలు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. అయితే 3 నెలలు మాత్రమే పెంచిన జీతం ఇచ్చి, తర్వాత మళ్లీ పాత వేతనమే 7,800 మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. ఇదేంటని ప్రశ్నిస్తే సిస్టం అప్‌లోడ్ కాలేదని వచ్చే నెల నుంచి ఇస్తాం అంటూ 12 నెలలు గడిపారన్నారు. వెంటనే బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'కేర్'లో జాతీయ అల్ట్రాసౌండ్ లైఫ్ సపోర్ట్ వర్క్‌షాప్



బంజారాహిల్స్: సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియాతో కలిసి బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జాతీయ అల్ట్రాసౌండ్ లైఫ్ సపోర్ట్ వర్క్‌షాప్‌ను శనివారం నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ వైద్యులు హాజరయ్యారు. ట్రామా, కార్డియాక్ అరెస్ట్, షాక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో రోగుల పరిస్థితిని త్వరగా అంచనా వేసేందుకు అల్ట్రాసౌండ్ సాంకేతికలపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా సెమీ అకాడమిక్ చెయిర్ డాక్టర్ శ్రీనత్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు రక్షించాలంటే ఇలాంటి ప్రాక్టికల్స్ ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో కేర్ హాస్పిటల్స్ అసోసియేట్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్, సెమీబోర్డు అధ్యక్షురాలు సౌజన్య పట్టిబండ్ల, కేర్ హాస్పిటల్స్ జోనల్ సీఓఓ బిజునాయర్ పాల్గొన్నారు.

గోవులు తరలించకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి



పంజగుట్ట: బక్రీద్ పండుగ నేపథ్యంలో గోవులు తరలించకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని యుగ తులసీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె.శివకుమార్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పండగ అంటే ఏ మతానికి ఇబ్బంది లేకుండా చేసుకోవాలని కానీ పండగ ఒకరిది, దుఃఖం మరొకరిది అన్నట్లు బక్రీద్ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆవులను దయనీయంగా వధిస్తున్నారని తమ ఫౌండేషన్ హైకోర్టుకు లేఖ రాస్తే సుమటోగా కేసు నమోదు చేసి గోవులను కాపాడాలని తీర్పు ఇచ్చిందన్నారు. కానీ దానిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శ్రీనివాస్, శివస్వామి తదితరులు పాల్గొన్నారు.

జెండాల వద్ద భారీ బందోబస్తు



బంజారాహిల్స్: ప్రపంచ అందాల పోటీలు జరుగుతున్న నేపథ్యంలో పదిహేను రోజుల క్రితం సెక్రటేరియట్ ఈ పోటీలకు చిహ్నంగా మిస్ వరల్డ్ 2025 అనే ఆర్చిని ఏర్పాటు చేయడంతో పాటు వివిధ దేశాల జాతీయ జెండాలను ఏర్పాటు చేశారు. కాగా ఓ యువకుడు ఇక్కడ ఇజ్రాయేల్ దేశం జెండాను తొలగించి ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేసిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. శనివారం సైఫాబాద్ పోలీసులు ఈ జెండాలను ఎవ్వరూ తాకకుండా..తొలగించకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా దేశాల జెండాలను తొలగిస్తే కఠిన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

20న సెంట్రల్ లేబర్ ఆఫీసు ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ యూసుఫ్

హిమాయత్‌నగర్: కార్మిక వ్యతిరేక కోడ్‌లను వెంటనే రద్దు చేసి, పాత వాటినే పునరుద్ధరించాలని ఈనెల 20న కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె జూలై 9కి వాయిదా పడిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో యూసుఫ్ అధ్యక్షతన జాతీయ కార్మిక సంఘాల తెలంగాణ శాఖల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 20న రాజధానులు, జిల్లాకేంద్రాల్లో నిరసనలు, ర్యాలీలు నిర్వహించి సెంట్రల్ లేబర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు మెమోరాండం అందిస్తామన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, రాష్ట్ర నాయకులు టి.నర్సింహారెడ్డి, బి.వెంకటరాజం, బీహెచ్ఈఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి కుమార స్వామి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ఉపాధ్యక్షురాలు ఎస్.ఎల్.పద్మ పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.18, నల్లవంకాయ.18, పొడుగువంకాయ.18, బెండకాయ.35, పచ్చిమిర్చి.35, బజ్జీమిర్చి.35, క్యాప్సికం.43, పచ్చికాకరకాయ.35, పందిరిబీర.35, క్యాబేజీ.11, క్యారెట్.27, దొండకాయ.19, గుండు బీన్సీస్.85, గింజచిక్కుడు.50, గోకరకాయ.40, కీర.18, దోసకాయ. 23, బీట్‌రూట్.21, ఉల్లిగడ్డ.14, ఆలుగడ్డ. 24, చామగడ్డ.35, మొరంగడ్డ.19, కందగడ్డ.95, క్యాలీఫ్లవర్ 23, సొరకాయ.10, పొట్లకాయ.18, అరటికాయ.11, మునగకాయ.4, మామిడికాయ.55, ముల్లంగి.4–5, ఉల్లిపొరక.35. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

నిమ్స్ విస్తరణ పనులపై కలెక్టర్ సమీక్ష

లక్డీకాపూల్: నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) విస్తరణ పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శనివారం నిమ్స్ ఆస్పత్రిలో నిమ్స్ విస్తరణ ప్రాజెక్టులోచేపట్టిన పనుల వివరాలు, పురోగతిపై ఆయన సమీక్షించారు. బ్లాకుల వారీగా జరుగుతున్న పనుల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్అండ్‌బీ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. 19.54 ఎకరాలలో 26,19,209 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.1698 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రాజెక్టులో ఇంతవరకు 35 శాతం పురోగతి సాధించగా, డిసెంబర్ 2026 నాటికి పనులు పూర్తయ్యేలా లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమ్స్ విస్తరణ ప్రాజెక్టులో చేపడుతున్న పనులకు సంబంధించిన పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్టు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–13లోని హిందూ శ్మశానవాటిక పక్కన ఖాళీ స్థలంలో శనివారం తెల్లవారుజామున గంజాయి సేవిస్తున్న నలుగురిని బంజారాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ముగ్గురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, ఓ మైనర్‌ను బాలుర పునరావాస కేంద్రానికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–11లోని గౌరీశంకర్‌కాలనీకి చెందిన సందీప్‌కుమార్, రోడ్డునంబర్–12లోని ఎన్‌బీనగర్‌కు చెందిన నితీశ్‌కుమార్, నదీమ్ ఓ మైనర్ గంజాయి తాగుతున్నారు. పోలీసులు దాడి చేసి వీరిని అదుపులోకి తీసుకుని 6 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



పంజగుట్ట: గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 11న ఉదయం ఓ గుర్తుతెలియని వ్యక్తి నిమ్స్ ఆసుపత్రి ఎదుట గల గోకుల్ టవర్స్ ముందు పడి ఉన్నట్లు పంజగుట్ట పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పెట్రో కార్–2 సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 15న మృతి చెందినట్లు గాంధీ సిబ్బంది పంజగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉంటాయని, మెడకు ఎడమవైపు పుట్టుమచ్చ ఉందని ఆచూకీ తెలిసిన వారు పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ఓయూలో సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ధర్మనిధిపై సదస్సు జరిగింది. శనివారం ఓయూ బీసీ సెల్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని సెమినార హాలులో జరిగిన కార్యక్రమానికి వీసీ ప్రొ.కుమార్ అధ్యక్షత వహించగా మాజీ వీసీ ప్రొ.గోపి ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వీరబ్రహ్మేంద్ర స్వామి గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొ.గౌరీశంకర్, ప్రొ.వెంకట రాజయ్య, అద్దూరి రవీంద్రచారి పాల్గొని ప్రసంగించారు.

ఇంజినీరింగ్ ఫీజుల పెంపు తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్ కోర్సుల ఫీజులు పెంపు నిర్ణయం తగదని ఏఐఎస్ఎఫ్, ఏబీవీపీ నాయకులు శనివారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డికి వినతి పత్రాలు సమర్పించారు.ఫీజులు పెంచితే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కాలేజీల్లో అధ్యాపకుల వివరాలు మౌలిక వసతులను వర్సిటీ అధికారులు పరిశీలించాలన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

కాచిగూడ: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే భవిత ఉన్నతంగా ఉంటుందని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్, పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత మాచన రఘునందన్ పేర్కొన్నారు. శనివారం ఆయన కాచిగూడలో మాట్లాడుతూ... మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యువతకు, విద్యార్థులకు పొగాకు నియంత్రణపై కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు.

'అవినీతి మంత్రులను బర్తరఫ్ చేయాలి'



మాట్లాడుతున్న రాష్ట్రీయ లోక్‌దళ్ జాతీయ ప్రధాన కార్యదర్శి త్యాగి, రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ కుమార్

పంజగుట్ట: పోరాడి సాధించుకున్న తెలంగాణలో గత పదేళ్లు గుంటనక్కలు పాలిస్తే, ఇప్పుడు తోడేళ్లు పాలిస్తున్నాయని తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ (టీఆర్ఎల్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్ మండిపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. కొందరు మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారు అని మంత్రి కొండా సురేఖ ఓపెన్‌గా చెబుతుందని, పర్సంటేజీలు తీసుకుంటున్న మంత్రులను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై త్వరలోనే గవర్నర్‌ను కలిసి కోరతామని పేర్కొన్నారు. రాష్ట్రీయ లోక్‌దళ్ జాతీయ ప్రధాన కార్యదర్శి త్రిలోక్ త్యాగి మాట్లాడుతూ.. తమ పార్టీ తెలంగాణలో బలపడేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

'హైకోర్టు తీర్పు అమలు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

హిమాయత్‌నగర్ : జిల్లా బాలభవన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి డిప్యూటేషన్, ప్రమోషన్లు, బదిలీలు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర బాల భవన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు కె.వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఎ.విజయలక్ష్మి కోరారు. శనివారం నిర్వహించిన రాష్ట్ర బాల భవన్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించగా జిల్లా బాల భవన్ ఉద్యోగులకు ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు, డిప్యూటేషన్లు కల్పించాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారని దీనిని 4 వారాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ నగర శాఖ అధ్యక్షుడు కట్కూరి శ్రీకాంత్, కార్యదర్శి హరికృష్ణ పంతులు, ప్రభాకర్ రెడ్డి, అవినాష్, అమరేందర్, రాజు, మల్లికార్జున్, బాలభవన్ శివకుమార్, ఉమాబాల, లావణ్య, ప్రసన్న, అయేశా, కృష్ణ, అనురాధ, ఉమ, సత్యం, శంకర్, వెంకటేశ్వర్లు, అనిల్ కుమార్, సాయి చరణ్ పాల్గొన్నారు.

రేపు మెగా కంటి వైద్య శిబిరం

రహమత్‌నగర్: మాజీ కార్పొరేటర్ బండపల్లి చంద్రమ్మ వర్ధంతిని పురస్కరించుకుని రేపు రహమత్‌నగర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్ తెలిపారు. రహమత్‌నగర్‌లో ప్రచార కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పరిసర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ మీడియా కన్వీనర్‌గా రమేశ్

పంజగుట్ట: రెడ్‌క్రాస్ హైదరాబాద్ జిల్లా శాఖ మీడియా కన్వీనర్, ఏజీఎం ఇన్‌చార్జిగా నీలం రమేశ్ నియామకమయ్యారు. ఈ మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి చేతులమీదుగా శనివారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ నిర్వహించే అన్ని కార్యక్రమాలను మీడియా ద్వారా ప్రజల్లోకి చేరవేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రెడ్‌క్రాస్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

'వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు చట్టం ఉపసంహరించుకోవాలి'



మాట్లాడుతున్న ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు

హిమాయత్‌నగర్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు హజరత్ మౌలానా ఖలీద్ సయూఫుల్లా రహమాన్ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బోర్డు ప్రతినిధులు మౌలానా సయ్యద్ అక్బర్ నిజాముద్దీన్, మౌలానా జాఫర్ పాషా, మౌలానా గయాస్ అహ్మద్ రసాది, ముఫ్తి ఉమర్ అబిదీన్ క్వాస్మీ మదాని, జలీషా యాసిన్ సుల్తానా మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దశలవారీగా ఆందోళనలు చేపడుతాని తెలిపారు.

జోనల్ వ్యవస్థను రద్దు చేసి కోడిగుడ్ల టెండర్లు కేటాయించాలి



హిమాయత్‌నగర్: జోనల్ వ్యవస్థను రద్దు చేసి 33 జిల్లాలకు కోడిగుడ్ల టెండర్లను కేటాయించాలని తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని కోరింది. బషీర్‌బాగ్‌లోని నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఫెడరేషన్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ రావు, ఎన్ఈసీసీ చైర్మన్ గుర్రం శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ బాలకృష్ణ రెడ్డి, ఎగ్ సెంట్రల్ కమిటీ మెంబెర్ కసిరెడ్డి నారాయణరెడ్డి, కోశాధికారి కొండల్ రావు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పౌల్ట్రీ రైతులు 1267పైగా ఉంటే కేవలం ఐదుగురికి మాత్రమే టెండర్లు వచ్చేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇటీవల వచ్చిన బర్డ్ ఫ్లూ కారణంగా పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం వీరిని ఆదుకునేందుకు, టెండర్లలో అవకతవకలు జరగకుండా చూడాలని కోరారు. అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరా టెండర్లలో 33 జిల్లాల్లో సాధ్యం కాకుంటే ఉమ్మడి 10 జిల్లాలను ప్రాతిపదికన తీసుకుని కేటాయించాలని విన్నవించారు. రైతులు సుధాకర్‌రెడ్డి, రంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, సాయికృష్ణ, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- జీఎస్‌టీ డే సందర్భంగా నెక్లెస్ రోడ్‌లోని థ్రిల్ సిటీ సమీపంలోని పీవీ జ్ఞానభూమి వద్ద ఫిట్ ఇండియా క్యాంపెయిన్–2025 పేరిట సైకిల్ మారథాన్ 2025 ఉదయం 6 గంటలకు జరుగుతుంది.
- రాయదుర్గంలోని టీ–వర్క్స్‌లో ఉదయం 5.30 గంటలకు ఎల్వీప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో విటాథాన్ 2025 రన్ జరుగుతుంది.
- మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- సెక్రటేరియెట్‌ను సందర్శించనున్న మిస్ వరల్డ్ పోటీల అందాలభామలు
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మైలార్‌దేవ్‌పల్లి గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 నుంచి ఉదయం 11 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 7విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

'భవిష్యవాణి' స్వర్ణలతకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు



పట్టాను అందుకుంటున్న స్వర్ణలత

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర సందర్భంగా రంగంలో భవిష్యవాణి వినిపించే స్వర్ణలతకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేసింది. శనివారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి, మహంకాళి ఈవో మనోహర్‌రెడ్డి సమక్షంలో పట్టాను స్వర్ణలతకు అందించారు. స్వర్ణలత కొన్నేళ్ల నుంచి వెస్ట్ మారేడుపల్లిలో నివాసం ఉంటున్నా ఇటీవల అక్కడ నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌లలో ఆమెకు పట్టా ఇవ్వలేదు. గతంలో ఆమె ప్రభుత్వానికి కూడా అనేకమార్లు దరఖాస్తు చేసుకుంది. కానీ, ఎట్టకేలకు ఇప్పుడు ప్రభుత్వం ఇంటిని కేటాయించడంపట్ల ఆమె ఆనందం వ్యక్తం చేసింది.

సిరామిక్ మిశ్రమాల్లో పురోగతి

హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ బృందం చేసిన కృషికి ఫలితం



శేషుబాయి




రాజశేఖరన్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ బృందం చేసిన కృషికి ఫలితం లభించినట్లయింది. ప్రొ.వి.శేషుబాయి నాయకత్వంలోని పరిశోధనా బృందానికి నానోమెట్రిక్ ఆల్ఫా అల్యూమినా ప్లేట్‌లెట్లతో బలోపేతం చేయబడిన సిరామిక్ మిశ్రమాల తయారులో వారు అనుసరించిన వినూత్న పద్ధతికి ఇటీవల పేటెంట్ మంజూరైంది. ఈ మేరకు హెచ్‌సీయూ అధికారులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేటెంట్ పొందిన సాంకేతికతలో ఎల్ఏపీఓ4తో పూత పూసిన ఆల్ఫా- అల్యూమినీ ప్లేట్‌లెట్‌లతో అల్యూమినాను బలోపేతం చేయడం, లోడింగ్ సమయంలో పగుళ్ల విక్షేపం, శక్తి వెదజల్లడాన్ని ప్రోత్సహిస్తుంది. ఆల్ఫా- అల్యూమినా అత్యంత స్థిరమైన రూపం కాబట్టి, మిశ్రమాన్ని అధిక ఉష్ణోగ్రతల వరకు ఉపయోగించవచ్చు. ఈ మిశ్రమ పదార్థం స్థిరత్వం, బలం ఏరోస్పేస్, ఆటోమొబైల్ భాగాల్లో థర్మల్ ఇన్సులేటర్లుగా, డెంటల్ ఇంప్లాంట్లుగా ఉపయోగించడానికి అనువైనదిగా చేస్తాయి. ప్రొఫెసర్ డాక్టర్ వి.శేషుబాయి నాయకత్వంలో జరిగిన ఈ పరిశోధనలో డాక్టర్ రాజశేఖరన్, డాక్టర్ పి.జీవన్‌కుమార్, పాలీరోజ్, డాక్టర్ ఎ. రజనీకాంత్ పాల్గొన్నారు.

31న 'సూపర్' అవార్డుల ప్రదానం

హిమాయత్‌నగర్: ఈ నెల 31న దివంగత నటుడు సూపర్‌స్టార్ కృష్ణ పేరిట 'సూపర్' అవార్డులను వివిధ రాష్ట్రాల్లోని పలు రంగాల ప్రముఖులకు ఎల్.వి.ప్రసాద్ ల్యాబ్‌లో ప్రదానం చేయనున్నట్లు ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీపీసీ ఇండియా) అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య జంగా, పాకలపాటి విజయ్ వర్మ తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు



చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర మీడియా సెల్ చైర్మన్‌గా కిరణ్ బేజాడిని నియమించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎఫ్‌టీపీసీ ఇండియా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఫిలిం సమ్మిట్స్, ఫిలిం టూరిజాన్ని అభివృద్ధి చేయడంలో నిరంతరంపాటు పడుతుందని పేర్కొన్నారు. ఇటీవల యునైటెడ్ నేషన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించడం గర్వకారణమని అన్నారు. ఫిలిం ఇండస్ట్రీకి సహకారం అందిస్తానని కిరణ్ బేజాడి తెలిపారు. సినీ నటులు ఆహారిక, సాల్మన్ శాని, వి–5 సీఈవో, ఎండీ కె.వెంకటేష్, భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం రాంపల్లి, ప్రధాన కార్యదర్శి మున్నూడు చందు, నటీనటులు యు.రాజేశ్వరి, ఇంటర్నేషనల్ ఫ్యాషన్ డిజైనర్ భార్గవి వినాయక్ పాల్గొన్నారు.

అనుమతులకు ముందే అడ్డదారులు

కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్ అడ్మిషన్ల జోరు!

- రంగంలో మార్కెటింగ్ ఏజెంట్లు
- అధ్యాపకులకు తప్పని టార్గెట్లు
- ఐఐటీ, మెడిసిన్ పేరుతో ఆకట్టుకునే ప్రయత్నాలు
- పట్టని ఇంటర్మీడియట్ అధికారులు



సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్ కాలేజీలు అడ్మిషన్ల కోసం అడ్డదారులు తొక్కుతున్నాయి. కాలేజీలకు గుర్తింపు, రెన్యువల్స్ ప్రక్రియ పూర్తికాకముందే ఈ వ్యవహారం నడుపుతున్నాయి. పైగా విద్యాసంవత్సరం కూడా ఇంకా ఆరంభం కాలేదు. బోర్డు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం గమనార్హం. ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఎలాంటి సంబంధం లేకపోయినా, జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయా కాలేజీలు తమ ఖాతాలో జమ చేసుకుని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. భవిష్యత్తులో ఐఐటీ, మెడిసన్ సీట్లు ఖాయమన్న నమ్మకాన్ని కలిగించేలా ప్రచారస్త్రాలు వినియోగిస్తున్నాయి. ఏకంగా మార్కెటింగ్ ఏజెంట్లను రంగంలోకి దింపాయి. చివరకు ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు సైతం టార్గెట్లు విధిస్తున్నాయి. అడ్వాన్స్‌గా రూ.10 వేలు చెల్లించినవారికి సీటు రిజర్వ్ చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ఇంటర్ బోర్డు యంత్రాంగంలో ఉలుకూపలుకూలేదు. తప్పుడు ప్రకటనలు చేస్తున్న కళాశాలపై కనీసం మందలింపు నోటీసులు కూడా జారీ చేయకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

అడ్డగోలు ఫీజులు

ప్రధాన కార్పొరేట్ విద్యాసంస్థలు కేవలం ట్యూషన్ ఫీజు పేరిట సీటుకు రూ.1.40 లక్షల నుంచి రెండు లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయి. హాస్టల్ వసతికి అదనంగా మరో రూ.50 నుంచి రూ.లక్ష వరకు స్లాబ్ విధించాయి. మరోవైపు పుస్తకాలు, రికార్డులు, ల్యాబ్, ఇతర చార్జీలు అదనం. ఏసీ క్యాంపసుల్లో మరో 30 శాతం ఫీజు వసూలు చేస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా ఒక్కో అడ్మిషన్‌పై మార్కెంటింగ్ ఏజెంట్లకు రూ.20 వేల వరకు కమిషన్లు ఇస్తున్నాయి. పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కొంత మేరకు ఫీజులో రాయితీ కల్పిస్తున్నారు. తల్లిదండ్రులు ముందే మొత్తం ఫీజు చెల్లిస్తుండటంతో కళాశాల పరిస్థితులు ఎలా ఉన్నా రెండేళ్ల కొనసాగక తప్పడం లేదు.

గ్రేటర్‌లో 88 ప్రైవేటు కాలేజీలకే గుర్తింపు

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్–మల్కాజిగిరి జిలా పరిధిలో 640పైగా ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. అందులో ప్రధాన కార్పొరేట్ కళాశాలల బ్రాంచిలే అధికం. మొత్తం మీద ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు పొందిన కళాశాలలు 88కు మించి లేవని ఆన్‌లైన్ అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2025–26 సంత్సరానికి ఇప్పటి వరకు హైదరాబాద్ జిల్లా పరిధిలో 39, రంగారెడ్డి జిల్లా పరిధిలో 23, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో 26 ప్రైవేటు కళాశాలలకు మాత్రమే గుర్తింపు ఉన్నట్లు తెలుస్తోంది.

అంబటి కృష్ణమూర్తిపై క్రిమినల్ చర్యలు తీసుకోండి

డీజీపీకి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నేతల ఫిర్యాదు



డీజీపీకి వినతి పత్రం అందజేసిన ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడిగా చలామణి అవుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అంబటి కృష్ణ మూర్తిపై తక్షణమే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని శనివారం డీజీపీ డాక్టర్ జితేందర్‌ను రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి.జనక్ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి.చంద్రశేఖర్, ఆదిల్ షరీఫ్, ఉపాధ్యక్షులు త్యాగరాజన్, సమ్మయ్య, ధర్మపురి, జె.శంకర్ రావు, సోషల్ మీడియా చైర్మన్ వికాస్ కుమార్ యాదవ్ తదితరులు కలిసి ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. కృష్ణమూర్తి ఐఎన్‌టీయూసీ పేరును, బ్యానర్‌ను దుర్వినియోగం చేస్తూ అక్రమ దందాలు చేస్తున్నారని, వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం సంస్థ ఖ్యాతిని దెబ్బతిస్తున్నారని డీజీపీకి వివరించారు. చట్టబద్ధమైన, దీర్ఘకాలిక నాయకత్వంతో జి.సంజీవ రెడ్డి ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడిగా నేటికీ కొనసాగుతున్నారని, దేశ వ్యాప్తంగా 4 కోట్లమంది కార్మిక సభ్యత్వం ఉన్న ఐఎన్‌టీయూసీ నాటి నుండి నేటి వరకు దశాబ్దాల నిజాయితీతో కార్మికుల హక్కులు, వారి సంక్షేమం కోసం పోరాడుతోందని తెలిపారు.

'ఫార్మ్ డి'ని ఎంబీబీఎస్, బీడీఎస్‌లా గుర్తించాలి



ఇందిరాపార్కు వద్ద జరిగిన సమావేశంలో ఫార్మ్‌డి అభ్యర్థులు

కవాడిగూడ: క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్–2010 చట్టం ప్రకారం ఫార్మ్ డి విద్యార్థులను కూడా ఎంబీబీఎస్, బీడీఎస్‌ల మాదిరిగా గుర్తించాలని తెలంగాణ ఫార్మ్ డి డాక్టర్స్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ శీలం వెంకటేష్, కార్యదర్శి కె.మహాలక్ష్మి, కన్వీనర్ డాక్టర్ పి.సూర్యతేజ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ ఫార్మ్ డి డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. 12 ఏళ్లుగా ఫార్మ్ డి పట్టభద్రుల కోసం ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా ఆలస్యం చేస్తున్న ప్రభుత్వాల తీరును తీవ్రంగా నిరసించారు. ఫార్మసీ చట్టం –1948ను సవరించి ఆధునిక ప్రజారోగ్యం క్లినికల్ ప్రాక్టీస్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆధునీకరించాలని కోరారు. ఫార్మసీ ప్రాక్టీస్ నిబంధనలు 2015ను అమలు చేయాలన్నారు. ఫార్మ్ డి హోల్డర్లను క్లినికల్ ఫార్మసిస్టులుగా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా, జిల్లా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర ఆరోగ్య సంరక్షణ వైద్యులుగా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ కె.వికాస్, సమన్వయకర్త డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఉదయ్, అమల తేజ, నిఖిలేష్ పాల్గొన్నారు.

'మేరా దేశ్ మేరీ జిమ్మేదారి' ప్రదర్శన

లామకాన్‌లో షార్ట్ ఫిల్మ్‌ని వీక్షించిన సఫాయి కర్మచారులు



లక్డీకాపూల్: రీసైకిల్ క్లినెక్ సంస్థ రూపొందించిన 'మేరా దేశ్ మేరీ జిమ్మేదారి' షార్ట్ ఫిల్మ్ వ్యర్థాల నిర్వహణలో సరికొత్త స్ఫూర్తిని నింపిందని పలువురు సఫాయి కర్మచారులు అన్నారు. వ్యర్థాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యత తెలుసుకోవాల్సిన అవసరాన్ని చూపించారన్నారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని లామకాన్‌లో ప్రదర్శించిన ఈ షార్ట్ ఫిల్మ్‌ను పలువురు సఫాయి కర్మచారులు తమ పిల్లలతో వీక్షించారు. వ్యర్థాలు సేకరించేవారి కష్టమైన జీవితాన్ని కళ్లకు కట్టినట్టు ప్రదర్శించిన సంస్థ వ్యర్థాల నిర్వహణ, మార్పు అవసరాన్ని చాటి చెప్పింది. వ్యర్థాలు సేకరించే వారు నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో వెన్నెముకగా ఉంటారు. కానీ వారు సమాజంలో గుర్తింపు లేకుండా ఉన్నారు. ఈ చిత్రంతో వారి కష్టాలను ప్రపంచానికి చూపించి, ప్రజలను శుభ్రత పరిరక్షణలో తమ పాత్రను పునఃసమీక్షించమని కోరుకునే దిశగా ఈ షార్ట్ ఫిల్మ్‌ని చిత్రీకరించినట్టు రీసైకిల్ మార్కెటింగ్ డైరెక్టర్, ఫౌండింగ్ మెంబర్ చేతస్ బరేగర్ అన్నారు. రీసైకిల్ బ్రాండ్ మార్కెటింగ్ అధికారి సౌర్య భట్టాచార్జి మాట్లాడుతూ సఫాయి కర్మచారుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని వ్యర్థాలను రోడ్లపై పడవేయకుండా బాధ్యతగా వ్యవహరించి వారి జీవితాల్లో మార్పు కోసం కృషి చెయ్యాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సఫాయి కర్మచారులు తమ వ్యక్తిగత కష్టాలు పంచుకున్నారు. కుటుంబానికి తన ఒక్కడి సంపాదనే ఆధారమని బాబు అనే సఫాయి కర్మచారుడు పేర్కొన్నారు.

బీపీని తగ్గించుకుందాం!

నిమ్స్‌లో జరిగిన ప్రపంచ రక్తపోటు దినోత్సవ ర్యాలీ పిలుపు



లక్డీకాపూల్: మరణానికి దారి తీసే అధిక రక్తపోటును తగ్గించుకుందామని పలువురు వైద్యులు పిలుపునిచ్చారు. అధిక రక్తపోటును గుర్తిద్దాం.. నియంత్రిద్దాం.. ఎక్కువ కాలం జీవిద్దామంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అధిక రక్తపోటుపై అవగాహన దినోత్సవం సందర్భంగా శనివారం నిమ్స్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్డియాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రామకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ నిమ్స్ స్పెషాలిటీ బ్లాక్ నుంచి పంజాగుట్ట మెయిన్ గేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ రామ కుమారి మాట్లాడుతూ అధిక రక్తపోటు, దానివల్ల తలెత్తే సమస్యల గురించి అవగాహన పెంచడానికే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జాగ్రత్తలు తీసుకుంటే మరణాల సంఖ్యను తగ్గించవచ్చని, పొగాకు, మద్యపానం, ఉప్పు వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. వ్యాయామం, శారీరక శ్రమను అలవాటు చేసుకోవాలని హితవు చెప్పారు. జీవనశైలి గాడి తప్పడంతోనే చిన్నవయసులోనే అధిక రక్తపోటు సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ రేడియాలజిస్ట్ శిరందాస్ శ్రీనివాసులు, కార్డియాలజీ వైద్యనిపుణులు, పీజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హాల్‌టికెట్లు ఇవ్వలేదని నిజాం కాలేజీలో ఆందోళన

గన్‌ఫౌండ్రీ: డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు హాల్ టికెట్లను మంజూరు చేయకపోవడంపై నిజాం కళాశాల విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ తీరుపై మండిపడుతూ శనివారం బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాల ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ పరీక్షలు రాసేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులను 9 గంటల తర్వాత లోపలికి అనుమతించబోమంటూ గేట్లకు తాళాలు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ సొంత నిర్ణయంతో ఒక సాఫ్ట్‌వేర్‌ను తీసుకువచ్చి అందులో విద్యార్థుల హాజరు శాతం లేదంటూ హాల్‌టికెట్లు ఇవ్వకపోవడంతో మండిపడ్డారు. కళాశాలలో కనీస మౌలిక వసతులు లేవని, అధ్యాపకుల తప్పిదాలకు విద్యార్థులను బలిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు.

పరీక్షలు రాయలేకపోయిన 300 మంది విద్యార్థులు

హాల్‌టికెట్లు లేకపోవడంతో డిగ్రీ 2వ, 3వ సంవత్సరాలకు చెందిన దాదాపు 300 మంది విద్యార్థులు పరీక్షలను రాయలేకపోయారు. విద్యార్థుల ఆందోళన ఉధృతం కావడంతో పోలీసులు కళాశాల ప్రాంగణంకు చేరుకొని పెద్ద ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేశారు.

సమ్మె కాలానికి వేతనంలో కోత

ఓయూ వీసీ చర్యలపై కాంట్రాక్టు అధ్యాపకుల ఆవేదన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కాంట్రాక్టు అధ్యాపకుల నిరవధిక సమ్మె కాలానికి వేతనంలో 12 రోజుల మేర కోత విధించారు. దీంతో అధ్యాపకులకు రూ.25 వేల చొప్పున వేతనం తగ్గింది. వైస్ చాన్సలర్ ప్రొ.కుమార్ చర్యలపై కాంట్రాక్టు అధ్యాపకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వేతనంలో కోత విధించడమే కాకుండా తీవ్ర జాప్యం చేసి ఈ నెల 16న వేతనాలు చెల్లించారన్నారు. అతి తక్కువ వేతనంతో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాల్లో కోత విధించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రొ.తిరుపతిరావు, ప్రొ.సత్యనారాయణ, ప్రొ.రామచంద్రం వీసీలుగా ఉన్న సమయంలో 23 రోజుల వరకు సమ్మె చేసినా వేతనంలో కోత విధించడలేదని గుర్తు చేశారు. సమ్మెకాలానికి వేతనం చెల్లించినా అప్పట్లో సెలవు రోజుల్లో అదనంగా పని చేయించుకున్నారని తెలిపారు. వేతనంలో కోతలపై వీసీ ప్రొ.కుమార్ పునరాలోచన చేయాలని కోరారు.

అందాల భామలను ఆకర్షించేలా..

- ఎన్టీఆర్ మార్గ్‌లో సెల్ఫీ పాయింట్ ఏర్పాటు
- రేపు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు రాక
- ప్రయాణించే మార్గాల్లో రంగురంగుల విద్యుద్దీపాలు, స్వాగత తోరణాల



ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆర్చి

బంజారాహిల్స్: మిస్ వరల్డ్ పోటీల నిమిత్తం హైదరాబాద్‌కు విచ్చేసిన ప్రపంచ దేశాల అందాల భామలను ఆకర్షించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వారు ప్రయాణించే రహదారులన్నీ రంగురంగుల విద్యుద్దీపాలతో మెరుస్తున్నాయి. స్వాగత తోరణాలు దర్శనమిస్తున్నాయి. ఆదివారం సాయంత్రం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తోపాటు సచివాలయాన్ని అందాల భామలు సందర్శించనున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్, సచివాలయ ప్రాంగణంతోపాటు బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12తోపాటు ఆయా రహదారులను జీహెచ్ఎంసీ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తోంది. ఎన్టీఆర్ మార్గ్‌లో, బడా గణేష్ నిమజ్జనం జరిగే చోట తెలంగాణ చరిత్రకు అద్దంపట్టే సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా ఎన్టీఆర్ మార్గ్‌లో రాష్ట్ర పక్షి పాలపిట్ట, రాష్ట్ర జంతువు కృష్ణజింకతో ఏర్పాటు చేసిన ఆర్చి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది. వీటిని చూస్తున్న పర్యాటకులు ఈ ఆర్చీలలో కూర్చొని ఫొటోలతోపాటు సెల్ఫీలు తీసుకుంటూ సరదా పడుతున్నారు. శనివారం మధ్యాహ్నం ఇక్కడ సుందరంగా తీర్చిదిద్దిన ఆర్చిని, సచివాలయం ముందు వివిధ దేశాల జాతీయ పతాకాలను అధికారులు ఏర్పాటు చేశారు. సచివాలయం చుట్టుపక్కల పచ్చదనం– పరిశుభ్రతతో తీర్చిదిద్దగా, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్, తెలుగు తల్లి విగ్రహం ప్రాంతాలన్నీ కనువిందు చేస్తున్నాయి. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అశ్వక దళాలు, జాగిలాలు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సుందరాంగులు వస్తున్న నేపథ్యంలో పోలీసు విభాగం శనివారం రిహార్సల్స్ నిర్వహించింది. అశ్వక దళాలు, శిక్షణ పొందిన పోలీసు జాగిలాలు, పోలీసు బ్యాండ్‌తో ఘన స్వాగతం పలకనున్నారు. ఈ మేరకు ముస్తాబైన గుర్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, అధికారులు వీరికి స్వాగతం పలకనున్నారు. పోలీసు జాగిలాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. కనీవినీ ఎరగని రీతిలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజగుట్ట, ఖైరతాబాద్, సచివాలయం ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. పలుచోట్ల ట్రాఫిక్ ఆంక్షలు కూడా విధిస్తున్నారు.

చెరువులో మట్టిపోస్తే క్రిమినల్ కేసులు

- శిఖం భూముల్లో నిర్మాణ వ్యర్థాలు పారబోయొద్దు
- బిల్డర్లు, ట్రాన్స్‌పోర్టర్లకు హైడ్రా హెచ్చరిక



సాక్షి, సిటీబ్యూరో: చెరువుల్లో మట్టి, నిర్మాణ వ్యర్థాలు పోస్తే కఠిన చర్యలుంటాయని హైడ్రా హెచ్చరించింది. చెరువులపై నిరంతరం నిఘా ఉంటుందని, మట్టి పోసిన వారిని పట్టుకుని క్రిమినల్ కేసులు పెడతామని పేర్కొంది. ఈ మేరకు రియల్ ఎస్టేట్ సంస్థలు, బిల్డర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, ఆయా సంఘాల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతకు చెరువుల పరిరక్షణ ఎంతో అవసరమని, ఆ దిశగా హైడ్రా పనిచేస్తోందని తెలిపారు. బిల్డర్లు ట్రాన్స్‌పోర్టర్లు కలిసి మట్టిని ఎక్కడ పోయాలో ముందుగానే ఒక అవగాహనకు రావాలని సూచించారు. ఎవరికి వారుగా వ్యవహరించి మట్టిని తరలించే పని కాంట్రాక్టర్‌కు అప్పగించామని, ఆయన ఎక్కడ పోస్తే మాకేంటి అనేట్టు బిల్డర్లు వ్యవహరిస్తే అందరిపైనా కేసులు పెడతామని హెచ్చరించారు. ట్రాన్స్‌పోర్టు ఖర్చులు మిగులుతాయని దగ్గర్లోని చెరువుల ఒడ్డున పడేసేవారి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఈ నంబర్లకు సమాచారం ఇవ్వండి..

చెరువుల్లో మట్టిపోసి నింపుతున్న వారి సమాచారం ఇవ్వాలని నగర ప్రజలను కమిషనర్ రంగనాథ్ కోరారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఫోన్ నంబరు 9000113667 కేటాయించామని, హైడ్రా ట్విట్టర్ అకౌంట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. చెరువులో మట్టి పోస్తున్న లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, మట్టిని సర్దుతున్న జేసీబీల వీడియోలను కూడా పంపించాలని సూచించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



పిల్లలకు నగదు బహుమతులు అందజేస్తున్న మంత్రి సీతక్క

గన్‌ఫౌండ్రీ: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. శనివారం రవీంద్రభారతిలో యూనిఫైడ్ కౌన్సిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో నిర్వహించిన వివిధ ఒలింపియాడ్ టాలెంట్ సెర్చ్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒలింపియాడ్ పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు అవుతాయని పేర్కొన్నారు. మలేషియా, సింగాపూర్, అమెరికా వంటి విదేశీ విద్యార్థులతో మన విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొని సత్తా చాటడం అభినందనీయమని కొనియాడారు. ఈ పోటీల్లో 30కి పైగా దేశాల నుంచి 10 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం టాప్ ర్యాంక్ సాధించిన 250 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ల్యాప్‌టాప్, నగదు బహుమతులను అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు, పాఠశాలలకు బెస్ట్ ఫెర్ఫామెన్స్ స్కూల్స్ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో సినీనటుడు ప్రదీప్, వ్యక్తిత్వ వికాస నిపుణులు దేవి పట్టాభిరామ్, లీడర్‌షిప్ కోచ్, గంపా నాగేశ్వర్‌రావు, యునిఫైడ్ కౌన్సిల్ సీఈఓ కల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై స్కూల్ బస్ డ్రైవర్లకు అవగాహన



సాక్షి, సిటీబ్యూరో: ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో శనివారం స్కూల్ బస్ డ్రైవర్‌లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జేటీసీ రమేష్ మాట్లాడుతూ స్కూళ్లు తెరిచే నాటికి అన్ని బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని, పిల్లలను స్కూళ్లకు తీసుకెళ్లేటప్పుడు, తిరిగి ఇంటి వద్ద దించే సమయంలో అన్ని విధాలుగా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరిమితికి మించిన వేగంతో బస్సులు నడపవద్దని హెచ్చరించారు. ఫిట్‌నెస్ కలిగిన వాహనాల్లోనే పిల్లలను తీసుకెళ్లాలని, ప్రతి బస్సులో అటెండర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా స్కూల్ బస్సుల నిర్వహణపై రూపొందించిన కరపత్రాలను అందజేశారు. ఖైరతాబాద్ ప్రాంతీయ రవాణా అధికారి పురుషోత్తంరెడ్డి, ఎంవీఐలు సత్యనారాయణ, సురేష్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ నగరాభివృద్ధికి సమష్టి కృషి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



రిజర్వాయర్‌ను ప్రారంభిస్తున్న కిషన్ రెడ్డి, పొన్నం ప్రభాకర్,మేయర్,కార్పొరేటర్లు

రహమత్‌నగర్: వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరాభివృద్ధికి స్థానిక ఎంపీగా, కేంద్ర మంత్రిగా కేంద్ర ప్రభుత్వం తరపున తోడ్పాటును అందిస్తానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రహమత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ రూ.5.75 లక్షలతో నూతనంగా నిర్మించిన జీఎల్ఎస్ఆర్ రిజర్వాయర్‌ను శనివారం ఆయన రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కూమార్ యాదవ్, మేయర్ విజయలక్ష్మీతో కలిసి ప్రారంభించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చేనీరు తప్ప గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అదనంగా చుక్కనీరు కూడా అందించలేదని ఆరోపించారు. ఈ మహానగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాల్సిన అవసరముందని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని, కేంద్రం ఈ దిశగా సహకరించాలని కోరారు. నగరం వేగంగా విస్తరిస్తున్న దృష్ట్యా త్వరలోనే దాదాపు రూ.7 వేల కోట్ల వ్యయంలో 20 టీఎంసీ నీటిని నగరానికి అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నదని మంత్రి చెప్పారు. రిజార్వయర్ ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గైర్హాజరు కావడం చర్చనీయశంగా మారింది. కార్యక్రమంలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్, సీజీఎం ప్రభు, డీజీఎం వాహబ్, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మహ్మద్ అజహరుద్దీన్, కార్పొరేటర్లు సీఎ న్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్ తదతరులు పాల్గొన్నారు.

టికెట్ కొని.. ఆరా తీసి..



లక్డీకాపూల్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ బస్సులో టికెట్ కొని మరీ ప్రయాణించారు. శనివారం మంత్రి సిటీ బస్సులో పంజాగుట్ట నుంచి లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్ వరకు ప్రయాణించారు. మంత్రితోపాటు నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ కూడా ఉన్నారు. మహాలక్ష్మీ పథకం అమలు తీరు గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఫ్రీగా బస్సుల్లో ప్రయాణం చేయడం వల్ల డబ్బులు ఆదా అవుతున్నాయని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. నగరంలో తిరిగేందుకు కొత్త బస్సులు భారీ సంఖ్యలో వచ్చాయని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 18, మే, 2025



నైనై తుర్కియే

భారత్-పాకిస్తాన్ యుద్ధంలో పాకిస్తాన్‌కు మద్దతుగా నిలిచిన తుర్కియే, అజర్ బైజాన్‌లపై సర్వత్రా ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్‌తో సహా తెలుగు రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు టూర్లను రద్దు చేసుకున్నారు. ఈ రెండు రోజుల్లోనే భారీ ఎత్తున బుకింగ్స్ రద్దయినట్లు నగరానికి చెందిన టూర్ ఆపరేటర్లు, ట్రావెల్స్ సంస్థల నిర్వాహకులు తెలిపారు. వేసవి సెలవుల సందర్భంగా ప్రతి సంవత్సరం పెద్ద సంఖ్యలోనే పర్యాటకులు తరలివెళ్తారు. ఈ సంవత్సరం కూడా సుమారు లక్ష మందికి పైగా పర్యాటకులు తుర్కియే, అజర్‌బైజాన్‌ల సందర్శనకు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నట్లు అంచనా.


- సాక్షి, సిటీబ్యూరో



- తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు లక్ష మందికి పైగా ప్రణాళికలు
- పాక్‌కు మద్దతు తెలిపిన తుర్కియేపై పర్యాటకుల నిరసన
- ప్రత్యామ్నాయంగా వియత్నాం, దుబాయ్, బ్యాంకాక్‌లకు బారులు
- వేసవి సెలవుల నేపథ్యంలో విదేశీయానంపై నగరవాసుల మక్కువ

భారీగా రద్దయిన తుర్కియే, అజర్ బైజాన్ పర్యటనలు







తుర్కియే, అజర్‌బైజాన్ దేశాల్లో అందమైన పర్యాటక ప్రదేశాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటం వల్ల చాలామంది కుటుంబాలతో సహా టూర్లకు వెళ్తుంటారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛందంగానే ఈ రెండు దేశాల పర్యటనలను రద్దు చేసుకోవడం విశేషం. మరోవైపు ట్రావెల్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సైతం తుర్కియే, అజర్‌బైజాన్‌ల బుకింగ్‌లను రద్దు చేయాలని అన్ని ప్రాంతాలకు చెందిన టూర్ ఆపరేటర్లకు సర్క్యులర్‌ను విడుదల చేసింది.

- తెలుగు రాష్ట్రాలకు చెందిన టూర్ ఆపరేటర్లు తమ వద్దకు వచ్చే బుకింగ్‌లను నిలిపివేస్తున్నట్లు నగరానికి చెందిన వాల్మీకి టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ వ్యవస్థాపకుడు హరికిషన్ తెలిపారు. రెండు, మూడు రోజులుగా నగరం నుంచి సుమారు 10 వేల మందికి పైగా పర్యాటకులు తమ టూర్లను రద్దు చేసుకున్నట్లు తెలిపారు.

ఆ రెండు దేశాలకే ఎందుకు..

సాధారణంగా హైదరాబాద్ నుంచి ఎక్కువ మంది దుబాయ్, సింగపూర్, మలేషియా, శ్రీలంక, థాయ్‌లాండ్ పర్యటనలను ఎంపిక చేసుకుంటారు. కానీ కొంతకాలంగా తుర్కియే, అజర్‌బైజాన్‌లకు డిమాండ్ పెరిగింది. ఇక్కడ చారిత్రక ప్రదేశాలు, వైల్డ్ లైఫ్ టూర్లు, సాంస్కృతిక కేంద్రాలు, ఆకట్టుకొనే అందమైన పార్కులు ఉన్నాయి. తుర్కియేలో కేవలం సినిమా షూటింగ్‌లకే కాకుండా ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు ఎన్నో అందమైన ప్రదేశాలు ఉన్నాయి. అలాగే చారిత్రక ఇస్తాంబుల్ నగరం పర్యాటకులకు ఒక గొప్ప అనుభూతి కలిగిస్తుంది. ఇక్కడ ఉన్న బ్లూ రివర్ ఒక ప్రత్యేకమైన ఆకర్షణ. హగీష్ సోఫియా చారిత్రక మ్యూజియం కూడా పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటుంది. పురాతన కట్టడాలు, కోటలు, గొప్ప ఆర్కిటెక్చర్‌తో నిర్మించిన భవనాలు ఎన్నో ఉన్నాయి. అలాగే అజర్‌బైజాన్‌లోని పాతనగరం బాకు మరో ప్రముఖ పర్యాటక కేంద్రం. వందల సంవత్సరాల నాటి చారిత్రక, సాంస్కృతిక విశేషాలకు ఇది నిలయం. హైదర్ అలియేవ్ కల్చరల్ సెంటర్, జొరాస్ట్రియన్ల చారిత్రక ఫైర్ టెంపుల్ వంటివి ఆకట్టుకొనే ప్రదేశాలు.

షాపింగ్ సెంటర్..

మినీ చైనాగా పేరొందిన తుర్కియో నుంచి పెద్ద ఎత్తున వ్యాపార కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. మార్బుల్స్, ఫర్నీచర్, యాపిల్స్ దిగుమతి ఎక్కువగా ఉంది. అలాగే ఈ దేశానికి వెళ్లిన పర్యాటకులు కూడా తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేసేందుకు చాలా షాపింగ్ సెంటర్లు ఉన్నాయి. ఇస్తాంబుల్‌లోని గ్రాండ్ బజార్ అతి పెద్ద స్ట్రీట్ మార్కెట్. సుమారు 4 వేలకుపైగా షాపింగ్ మాల్స్ ఇక్కడ ఉన్నాయి. దేశ, విదేశాలకు చెందిన వివిధ రకాల వస్తువులు ఇక్కడ లభిస్తాయి. దుస్తులు, ఆభరణాలు, టర్కి, పర్షియన్ సంస్కృతిని ప్రతిబింబించే కళాత్మక వస్తువులు, కార్పెట్లు, డ్రైఫ్రూట్స్ లభిస్తాయి. అలాగే అంకారాలోని అంకామాల్, కెనెరాలోని ఆస్కార్‌బజార్ వంటి మార్కెట్లు, షాపింగ్ సెంటర్లు పర్యాటకులను ఆకట్టుకుంటాయి.



ఉందిగా.. ప్రత్యామ్నాయం..

తుర్కియే, అజర్‌బైజాన్ టూర్లను స్వచ్ఛందంగా రద్దు చేసుకుంటున్న పర్యాటకులు ప్రత్యామ్నాయంగా వియత్నాం, దుబాయ్, మలేసియా, బ్యాంకాక్, ఇండోనేషియా తదితర దేశాలను సందర్శించేందుకు వెళ్తున్నారు. 'ఆ రెండు దేశాల బుకింగ్స్ రద్దు చేసుకుంటున్న వారు ఎక్కువ మంది వియత్నాంను ఎంపిక చేసుకుంటున్నారు.' కూకట్‌పల్లికి చెందిన ఓ ట్రావెల్స్ సంస్థ ప్రతినిధి తెలిపారు.

నో సప్లిమెంట్స్ ప్లీజ్..



మీకు విటమిన్ ఇ లోపం ఉంది.. మీకు ప్రొటీన్స్ సరిపోవడం లేదు.. ఈ సప్లిమెంట్స్ తీసుకోండి.. అంటూ సూచించే వైద్యులు, పోషకాహార నిపుణులతో పాటు వాటిని వినియోగించే నగరవాసులూ పెరిగిపోయారు. ఈ నేపథ్యంలో సప్లిమెంట్స్‌ను అతిగా వినియోగించవద్దని నగరానికి చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) ఇటీవల నిర్వహించిన ఓ పరిశోధన ఫలితం ఆధారంగా సూచిస్తోంది. అధిక సప్లిమెంట్స్ వాడకం హానికరం అంటున్న ఎన్ఐఎన్.. దానికి ప్రత్యామ్నాయ మార్గాలను కూడా సూచిస్తోంది. - సాక్షి, సిటీబ్యూరో

- ఆహారం నుంచి అందే పోషకాలే మంచివి
- అధిక నూనెల వినియోగం హానికరం
- మై ప్లేట్ ఫర్ ది డే రూపకల్పన
- స్పష్టం చేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్

బలవర్ధకమైన ఆహారాల నుంచి దొరకని పోషకాలను సప్లిమెంట్లు/మాత్రలు/క్యాప్సూల్స్ అందిస్తాయి అనేది నిజమే అయినా కొన్ని పోషకాలను సప్లిమెంట్‌లుగా తీసుకోవడం వల్ల ఇతర పోషకాల సహజ శోషణకు ఆటంకం కలుగుతుందని ఎన్ఐఎన్ హెచ్చరిస్తోంది. రోజువారీ పోషకాహార అవసరాలను తీర్చడానికి సప్లిమెంట్లపై అధికంగా ఆధారపడటం ఆరోగ్యానికి హానికరం అని స్పష్టం చేస్తోంది. తాము సూచించిన 'మై ప్లేట్ ఫర్ ది డే'లో సూచించిన సమతుల ఆహారం ద్వారా అందేవి మరే ఏ విటమిన్ లేదా మినరల్ సప్లిమెంట్లు అందించలేవని స్పష్టం చేస్తోంది.



'మై ప్లేట్ ఫర్ ది డే'

మన రోజువారీ అవసరాలకు అనుగుణంగా అన్ని పోషకాలు మన శరీరానికి అందేందుకు మై ప్లేట్ ఫర్ ది డే అనే ఆసక్తికరమైన మెనూను ఎన్ఐఎన్ రూపొందించింది. ఇది మన ఆహారంలో అవసరమైన పోషకాహార స్పష్టతను అందిస్తుంది. రోజువారీ ఆహారం కోసం వివిధ ఆహార సమూహాల ఖచ్చితమైన నిష్పత్తులను అర్థం చేసుకోవడానికి ఇది మార్గనిర్దేశం చేస్తుంది. ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులను ప్రోత్సహించడానికి 'భారతీయుల పోషక అవసరాలు' ఆధారంగా దీన్ని డిజైన్ చేశారు.

రోజుకి 2వేల కిలో కేలరీల ఆహారం కోసం..

- కూరగాయలు ఆకు కూరలు: 400 గ్రాములు (ముడి బరువు),
- మిల్లెట్లతో సహా తృణధాన్యాలు: 260 గ్రాములు,
- పండ్లు: 100 గ్రాములు,
- పప్పులు/గుడ్లు/మాంసపు ఆహారాలు: 85 గ్రాములు,
- గింజలు విత్తనాలు: 30 గ్రాములు,
- కొవ్వులు నూనె: 27 గ్రాములు,
- పాలు/పెరుగు: 300 మి.లీ.



రోజుకు 2వేల కేలరీలు.. అదే ఆరోగ్యానికి మేలు

వ్యక్తులు(చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాల ఆరోగ్య సమస్యలు ఉన్నవారు కాకుండా) తమ పోషక అవసరాలను తీర్చుకునేందుకు రోజుకి 2 వేల కిలో కేలరీలు/ఆహారాన్ని తీసుకోవాల్సి ఉంటుందని 'మై ప్లేట్ ఫర్ ది డే' చెబుతోంది. అయితే ఇది కేవలం కేలరీలు అందించే ఆహారం మాత్రమే కాకూడదని, దీనిలో శరీరానికి అవసరమైన అమైనో ఆమ్లాలు, కొవ్వు ఆమ్లాలు, ఖనిజాలు, ప్రొటీన్లు, విటమిన్లు ఇతర బయోయాక్టివ్ సమ్మేళనాలు.. ఇలా ఆరోగ్యపరమైన అవసరాలను తీర్చడానికి సరైన నిష్పత్తిలో ఉండాలని సూచిస్తోంది.



శోషించే ఆహారమే.. మేలు

ఆరోగ్యకరమైన సహజ ఆహారాలను శరీరం బాగా గ్రహిస్తుంది. అంతేకాకుండా అవి ఎక్కువ జీవ లభ్యతను కలిగి ఉంటాయి. విటమిన్లు ఖనిజాల తీవ్రమైన కొరతతో బాధపడుతున్న వ్యక్తుల కోసం, అన్ని సూక్ష్మపోషకాలు, బయోయాక్టివ్ సమ్మేళనాలు, ఫంక్షనల్ ఫుడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు మొదలైన వాటిని తగినంతగా తీసుకోవడం మంచిదని ఎన్ఐఎన్ సూచిస్తోంది. ఈ నేపథ్యంలో అన్ని పోషకాలతో కూడిన 'మై ప్లేట్ ఫర్ ది డే' ఎలా ఉండాలో డిజైన్ చేసి అందిస్తోంది.

కొన్ని సూచనలు..

- రోజుకు 20-25 గ్రాముల కంటే ఎక్కువ చక్కెర తీసుకోకూడదు. సీఫుడ్ ద్వారా అవసరమైన కొవ్వు ఆమ్లాలు పొందవచ్చు.
- మట్టి పాత్రల్లో వంట వండటం ఆరోగ్యకరమైన పద్ధతి. ఇవి తక్కువ నూనెతో వంటకు అనుకూలంగా ఉంటాయి. పోషకాలను మెరుగ్గా నిలిపి ఉంచుతాయి.
- ఐరన్ పాత్రల్లో సాంబార్ వంటి పదార్థాలను ఉంచకపోవడం మంచిది. నాన్-స్టిక్, గ్రానైట్ స్టోన్ వంట పాత్రలను వీలైనంత వరకు తగ్గించాలి.

స్నాక్స్.. ఆరోగ్యకరంగా..

అవసరమైన కేలరీలకు మించకుండా స్నాక్స్ తినడం వల్ల నష్టం లేదు. కొన్ని రకాల స్నాక్స్ బరువు తగ్గడానికి సహకరిస్తుంది అంటున్నారు పోషకాహార నిపుణులు డాక్టర్ రోహిణి పాటిల్. స్నాక్స్‌గా ఆయన గుప్పెడు కాలిఫోర్నియా ఆల్మండ్స్ సూచిస్తున్నారు. ఈ బాదంలో ప్రోటీన్, మెగ్నీషియం, విటమిన్ ఇ జింక్ వంటి 15 ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. గుండె ఆరోగ్యం, చర్మ ఆరోగ్యం, బరువు నిర్వహణకు ఇవి బెస్ట్, అలాగే నూనె లేకుండా వండిన మూంగ్ దాల్ చిల్లా బరువు తగ్గడానికి అనుకూలమైన మరొక చిరుతిండి. మూంగ్ దాల్(పెసర పప్పు)లో పొటాషియం, మెగ్నీషియం, ఇనుము, రాగి పుష్కలంగా ఉంటాయి. జీర్ణక్రియ, గుండె ఆరోగ్యం రెండింటికీ మంచిది. పెసర శనగల మొలకలతో తయారైన భేల్‌లో రుచికరమైన స్నాక్. దోసకాయ, టమోటాలు, పచ్చి మామిడి, నిమ్మరసంతో కలిపిన మొలకలు, భేల్ ఫైబర్, విటమిన్లు, ఖనిజాలను అందిస్తుంది.





ఫ్యాషన్ వీక్.. మోడల్స్ వాక్..

మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీలోని లులు మాల్‌లో మోడల్స్ ర్యాంప్ వాక్ చేస్తూ సందడి చేశారు. లులు ఫ్యాషన్ వీక్‌ను శనివారం డైరెక్టర్ జోసెఫ్ సుందర్ దర్శకత్వంలో వివిధ కంపెనీల దుస్తులు ధరించి ర్యాంప్ వాక్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నటి, బిగ్‌బాస్ ఫేం దివి, నటుడు పృథ్వీ, ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ ప్రకృతి కంభం, రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ షేక్, రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్, జనరల్ మేనేజర్ విమేష్ తదితరులు పాల్గొన్నారు.



లులు మాల్‌లో సందడి చేసిన నటులు



వారాంతంలో.. నేర్చుకుందాం..

నగరంలో నేడు పలు విభాగాల్లో వర్క్‌షాప్‌లు

సాక్షి, సిటీబ్యూరో: వారం రోజుల పాటు ఉద్యోగ బాధ్యతలు, వ్యాపార లావాదేవీలు, కుటుంబ వ్యవహారాలతో బిజీగా గడిపేస్తున్న నగర ప్రజలు వారాంతంలో మాత్రం ఏదైనా కొత్తగా ట్రై చేద్దామనే ఆలోచన చేస్తున్నారు. ఇటువంటి వారిని ఆకట్టుకోవడానికి వివిధ సంస్థల ఆధ్వర్యంలో మట్టి పాత్రల తయారీ, పెయింటింగ్స్, బేకింగ్, క్యాండిల్ తయారీ, రెసిన్ ఆర్ట్ తదితర రంగాల్లో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి కొంత సమయం కేటాయిస్తున్నారు. ప్రవేశ రుసుముగా కొంత నామమాత్రపు ఫీజు సైతం వసూలు చేస్తారు. కొన్ని చోట్ల నిర్వాహకులే వస్తువుల తయారీకి అవసరమైన ముడి సరుకులు అందిస్తుండగా, మరికొన్ని సందర్భాల్లో మనమే తీసుకెళ్లాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ వర్క్‌షాప్‌లు నడుస్తాయి.

మట్టి పాత్రల తయారీ

మట్టి పాత్రల తయారీపై నగరంలో పెద్దఎత్తున ఆదివారం వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి గచ్చిబౌలి హార్ట్‌కప్ కాఫీ, లాస్ట్ హౌస్ కాఫీ, హౌస్ ఆఫ్ గౌర్మెట్, తదతర ప్రాంతాల్లో లైవ్ వర్క్‌షాప్‌లు ప్రారంభమవుతాయి. మట్టితో మమేకం కావడం, ప్రకృతితో కలిసిపోవడం, ప్రశాంతమైన వాతావరణంలో మట్టితో పాత్రలు తయారు చేయడం అనేది ప్రత్యేక అనుభూతినిస్తుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఒక్కో వ్యక్తికి గంట నుంచి 3 గంటల పాటు పాత్రలు తయారు చేయడానికి అవకాశం కల్పిస్తారు. తయారు చేసిన కుండలు, ఇతర పాత్రలు ఏవైనా మన వెంట తీసుకెళ్లిపోవచ్చు. ఇవి తీపి జ్ఞాపకాలుగా గుర్తుంటాయి. మట్టి, యంత్రాలు, అన్నీ నిర్వాహకులే సమకూర్చుతారు.



కొవ్వొత్తుల తయారీలో శిక్షణ

జూబ్లీహిల్స్‌లోని మకావు కిచెన్ అండ్ బార్‌లో హేండ్ మేడ్ కొవ్వొత్తుల తయారీపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మనకు నచ్చిన డిజైన్, మోడల్స్‌లో కొవ్వొత్తులు తయారు చేసుకోవచ్చు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు వర్క్‌షాప్ ఉంటుంది.



రెసిన్ ఆర్ట్

రంగులు కలపడం, కొత్త డిజైన్లకు అంకురార్పన చేయడం, ఆర్ట్‌తో ప్రశాంతమైన వాతావరణాన్ని క్రియేట్ చేయడం, అద్భుతమైన, మెస్మరైజింగ్ రెసిన్ ఆర్ట్ వర్క్‌షాప్‌ను మాకోబ్రూ వరల్డ్ కాఫీ బార్, అమోరోసో హైదరాబాద్‌లలో ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రెండు గంటల పాటు కొనసాగుతుంది. 8 ఏళ్ల పైబడిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుంది.

కేక్ తయారీపై..

నార్సింగిలోని మైథూస్ బ్రేవ్ పబ్ అండ్ కిచెన్ ఆధ్వర్యంలో కేక్ తయారీపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభమవుతుంది. తయారీ విధానంలో మెలుకువల నేర్చుకోవచ్చు. తదుపరి ఇంటోనే కొత్త రుచులను పర్ఫెక్ట్‌గా సిద్ధం చేసుకునే కాన్ఫిడెన్స్ లెవల్స్ పెరుగుతాయి.



మొబైల్ వాడకం కోవిడ్-19 తరువాత భారత్‌లో గణనీయంగా పెరిగింది. డేటా ఫర్ ఇండియా 2025 ఫిబ్రవరి నివేదిక ప్రకారం.. ఈ విషయంలో 10-19 ఏళ్ల వయసువారు ముందంజలో ఉన్నారు. మొబైల్ వినియోగంలో నైపుణ్యత పట్టణ ధనిక వర్గం పిల్లలకే పరిమితం కాలేదు. గ్రామాల్లోనూ పెరిగింది. ఇప్పటికే మైనర్లు పరిమితులతో కూడిన మొబైల్ వాలెట్స్, పాకెట్ మనీ డిజిటల్ వాలెట్స్, యూపీఐ సర్కిల్‌ను విరివిగా వాడుతున్నారు. 10 ఏళ్లకుపైబడిన మైనర్లు వారి సేవింగ్స్, టర్మ్ డిపాజిట్ ఖాతాలను వ్యక్తిగతంగా తెరిచి, నిర్వహించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవలే అనుమతించింది. ఈ నేపథ్యంలో డిజిటల్ పేమెంట్లు మరింత ఊపందుకుంటాయని బ్యాంకింగ్ నిపుణులు భావిస్తున్నారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్



మైనర్లూ బ్యాంకింగ్స్

కొత్త మార్కెట్‌కు తెరలేపిన ఆర్‌బీఐ నిర్ణయం

దేశంలో భారీగా పెరగనున్న డిజిటల్ పేమెంట్స్

మొబైల్ వినియోగంలో ఇప్పటికే మైనర్ల జోరు

పిల్లల కోసం ఇప్పటికే పరిమిత మొబైల్ వాలెట్స్

కేంద్ర ప్రభుత్వ యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్-2024 (అసర్) నివేదిక ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లోని 14-16 ఏళ్ల వయసున్న 75 శాతంపైగా పిల్లలు డిజిటల్ హోమ్ వర్క్‌ను పూర్తి చేయడానికి స్మార్ట్‌ఫోన్లను విజయవంతంగా వినియోగిస్తున్నారు. విద్య, వినోద అంశాలతోపాటు, యూపీఐ పేమెంట్లకు కూడా స్మార్ట్ ఫోన్ల వాడకం పెరిగింది. ఇప్పుడు ఆర్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం ఈ వాస్తవిక పరిస్థితికి అద్దం పడుతోంది. అంతేకాదు డిజిటల్ పేమెంట్స్ రంగంలో కొత్త మార్కెట్‌కు తెరలేపింది. భవిష్యత్ కస్టమర్ల సంఖ్యను పెంచుకునేందుకు బ్యాంకులకు మార్గం ఏర్పడింది. మైనర్లను బ్యాంకింగ్ వైపునకు తీసుకు రావడానికి ఫిన్‌టెక్ కంపెనీలు, ఆర్థిక సంస్థలు పోటీపడడం ఖాయంగా కనిపిస్తోంది.

ప్రయోజనం ఏమంటే..

తల్లిదండ్రులు/సంరక్షకుల ద్వారా మైనర్లకు బ్యాంక్ ఖాతా తెరిచే అవకాశం ఇప్పటికే ఉంది. అయితే మైనర్లు వ్యక్తిగతంగా ఖాతాను నిర్వహించడం వల్ల గతంలో లేని పలు అదనపు ప్రయోజనాలు ఇప్పుడు ఉన్నాయి. సొంత ఖాతా ఉంటే యూపీఐ చెల్లింపులు సులభం అవుతాయి. అంతేకాదు, తరచూ చిన్నపాటి కొనుగోళ్లు జరిపే 14-18 ఏళ్ల పిల్లలు ఈ మార్పు వల్ల ప్రయోజనం పొందుతారు. స్కూల్ లేదా ట్యూషన్ క్లాస్ నుంచి ఇంటికి చేరేందుకు బైకులను యాప్‌ల ద్వారా బుక్ చేసుకోవడం, క్యాంటీన్‌లో ఆహారం, స్టేషనరీ కొనుక్కోవడం.. ఇలాంటి వాటికి వీలవుతుంది. దీనివల్ల మైనర్లు చేసే డిజిటల్ లావాదేవీలు మరింత పెరుగుతాయనేది సుస్పష్టం. కాగా, యువత రుణం అందుకోవడం, పెట్టుబడుల విషయంలో డిజిటల్ వేదికలు పెను మార్పులు తెచ్చాయి. చిన్నచిన్న రుణాలకు యువ కస్టమర్లు పెద్ద ఎత్తున ఫిన్‌టెక్ కంపెనీలు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల తలుపు తడుతున్నారు.



ఇప్పటికే మైనర్ల కోసం..

బ్యాంకులు ఇప్పటికే.. తల్లిదండ్రులతో కలిసి సంయుక్తంగా నిర్వహించే మైనర్ ఖాతాలకు అనుసంధానించిన డెబిట్ కార్డులు, మొబైల్ యాప్స్‌ను అందిస్తున్నాయి. అలాగే 13-18 ఏళ్ల వయసున్న వారి కోసం గూగుల్ పే వాలెట్స్ వంటి పరిమితులతో ఉపయోగించే మొబైల్ వాలెట్స్, బ్యాంక్ ఖాతా అవసరం లేని జూనియో, ఫ్యామ్‌పే, ఫైప్ తదితర పాకెట్ మనీ డిజిటల్ వాలెట్స్ కూడా మైనర్ల కోసం కొలువుదీరాయి. ప్రాథమిక యూపీఐ వినియోగదారుకు చెందిన బ్యాంక్ ఖాతా నుంచి యూపీఐ సర్కిల్ ఫీచర్ ద్వారా ద్వితీయ వినియోగదారు లావాదేవీలు నిర్వహించవచ్చు. ద్వితీయ వినియోగదారుకు స్వంత బ్యాంక్ ఖాతా లేకపోయినా.. ప్రాథమిక వినియోగదారు తరఫున చెల్లింపులు చేయవచ్చు. పరిమితులు, అనుమతులను నిర్దేశించడం ద్వారా ప్రాథమిక వినియోగదారుడు ఈ లావాదేవీలను నియంత్రించవచ్చు.

ఆర్థిక అక్షరాస్యతలో..

ఆర్‌బీఐ 2023లో చేపట్టిన సర్వేలో పెద్దవారితో పోలిస్తే 30 ఏళ్లలోపు వారిలో ఆర్థిక అక్షరాస్యత తక్కువగా ఉందని తేలింది. నేషనల్ కౌన్సిల్ ఫర్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ సర్వే-2019 ప్రకారం 18-29 ఏళ్ల వయసువారిలో 30 శాతం మందికి మాత్రమే ఆర్థిక అక్షరాస్యత ఉంది. 10 ఏళ్లకు పైబడ్డ మైనర్లను బ్యాంకింగ్ వ్యవస్థలోకి అనుమతించడం ఆర్థిక అక్షరాస్యత పెంచే కార్యక్రమాల్లో ఒకటిగానే చూడాలన్నది నిపుణుల భావన. సొంత ఖాతాకు, ఆర్థిక లావాదేవీలకు చిన్నతనంలోనే యాజమాన్య హక్కులు దక్కడం వల్ల అవసరాలకు తగ్గట్టుగా నిధులు కేటాయించడంతోపాటు డబ్బులు దాచుకుంటారు. ఆర్థిక క్రమశిక్షణ అలవాటు అవుతుంది.

భారత్‌లో **70 కోట్లకుపైగా** స్మార్ట్‌ఫోన్ యూజర్లు ఉన్నారు.

టెలికాం రెగ్యులేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ప్రకారం దేశంలో మొబైల్ కనెక్షన్ల సంఖ్య **100 కోట్లకుపైమాటే.**

2020తో పోలిస్తే 2023 నాటికి 10-14 ఏళ్ల వయసువారి మొబైల్ వాడకం మూడున్నర రెట్లు, 15-19 ఏళ్ల విభాగంలో రెండు రెట్లకు దూసుకెళ్లింది.

నేషనల్ కౌన్సిల్ ఫర్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ సర్వే-2019 ప్రకారం భారతీయుల్లో ఆర్థిక అక్షరాస్యత ఉన్నవారి వాటా 30 శాతంలోపే. వయసుల వారీగా ఆర్థిక అక్షరాస్యత శాతం ఇలా ఉంది.

వయసు	శాతం
18-29	30
30-49	27
50-69	25
70-80	23

మొత్తం: 27

హిందూ అవిభాజ్య కుటుంబాలు మినహా.. వయసుల వారీగా వ్యక్తిగత కరెంట్, టర్మ్, సేవింగ్స్ డిపాజిట్ల శాతం

వయసు	2023 డిసెంబర్	2024 డిసెంబర్
10-17	0.8	0.8
18-24	3.2	3.1
25-39	20.4	19.7
40-59	36.7	36.5
60 ఆపైన	38.6	39.6

ఆధారం: ఆర్‌బీఐ

రాజకీయ ప్రేరేపిత కేసే..

రూ.3,200 కోట్ల కుంభకోణం అన్నది కట్టుకథే

- వైఎస్సార్‌సీపీ హయాంలో ఎక్సైజ్ శాఖ ఆదాయం పెరిగింది
- మరి ఖజానాకు నష్టం ఎక్కడ జరిగినట్టు?
- కనీసం ఒక్క ఆధారాన్ని కూడా చూపించని సిట్
- చంద్రబాబు హయాంలోనే మద్యం కుంభకోణం
- ఆధారాలతో సహా నిగ్గు తేల్చిన సీఐడీ
- మద్యం కేసులో బాబు బెయిల్ మీద ఉన్నారు
- ఆ అవినీతిని మరుగుపరిచేందుకే అక్రమ కేసు
- ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి తరఫున వాదనలు వినిపించిన మాజీ ఏజీ శ్రీరామ్
- ఇద్దరికీ 20 వరకు రిమాండ్ విధించిన న్యాయస్థానం

సాక్షి, అమరావతి: 'సిట్ నమోదు చేసింది పూర్తిగా రాజకీయ ప్రేరేపిత కేసు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంపై ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ కారణాలతోనే అక్రమ కేసు పెట్టింది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు అవినీతిపై నమోదైన కేసులను కప్పిపుచ్చేందుకే ఈ కేసును నమోదు చేసింది'అని మాజీ అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది శ్రీరామ్ ఏసీబీ న్యాయస్థానానికి వివరించారు. 2019-24 మధ్య మద్యం విధానంతో ప్రభుత్వ ఖజానాకు రూ.3,200 కోట్లు నష్టం వాటిల్లిందన్న సిట్ అభియోగానికి ఎలాంటి ప్రాతిపదిక లేదని స్పష్టం చేశారు. అందుకు సంబంధించి న్యాయస్థానానికి కనీసం ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోయారని గుర్తు చేశారు. దీన్నిబట్టి స్కామ్ అనేది ఒక కట్టుకథ అని స్పష్టం చేశారు. సీఐడీ కేసును ఆ దర్యాప్తు సంస్థ పరిధిలోని ఇతర పోలీసు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. ఈ కేసులో సిట్ అక్రమంగా అరెస్టు చేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డిల తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరామ్ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో శనివారం వాదనలు వినిపించారు. వారిద్దరిని సిట్ అధికారులు అక్రమంగా అరెస్టు చేశారని నిబంధనలను ఉటంకిస్తూ వివరించారు. అంశాల వారీగా శ్రీరామ్ వినిపించిన వాదనలు ఇలా ఉన్నాయి...

చంద్రబాబు ప్రభుత్వం 5 డిస్టిలరీల నుంచే 69శాతం మద్యం కొనుగోళ్లు చేసింది

చంద్రబాబు అవినీతి కేసులను కప్పిపుచ్చేందుకే సిట్ ఈ అక్రమ కేసు నమోదు చేసింది. ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపిత కేసు. దీనివెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని.. వాటిని ఎంతమాత్రం కొట్టిపారేయలేమని సుప్రీం కోర్టు కూడా అభిప్రాయపడింది. నిందితుల ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విచారిస్తూ ఆ విషయాన్ని స్పష్టం చేసింది. రాజకీయ పక్షపాతం, దురుద్దేశాలకు న్యాయపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది కూడా. 2014-19 మధ్యన చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై పలు కేసులు న్యాయస్థానాల్లో విచారణలో ఉన్నాయి. ఆ ఐదేళ్లలో ప్రభుత్వ మద్యం విధానం ద్వారా పాల్పడిన అవినీతిని సీఐడీ నిర్ధారించి బాబుతో పాటు పలువురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో ఆయన ముందస్తు బెయిల్‌పై ఉన్నారు. బాబు ప్రభుత్వం కేవలం 5 డిస్టిలరీల నుంచే ఏకంగా 69 శాతం మద్యం కొనుగోళ్లు చేసినట్లు సిట్ తన రిమాండ్ రిపోర్టులోనే పేర్కొంది. మంత్రి మండలికి తెలియకుండా మద్యం దుకాణాలు, బార్లపై ప్రివిలేజ్ ఫీజును రద్దు చేశారు. ఆ కేసులో ఆయన ముందస్తు బెయిల్‌పై ఉన్నారు. దాన్నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సిట్ ద్వారా ఈ అక్రమ కేసు నమోదు చేయించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఖజానా ఆదాయం పెరిగింది

2019-24లో రూ.3,200 కోట్ల కుంభకోణం జరిగిందని ఏ ప్రాతిపదికన నిర్ధారించామన్నది సిట్ చెప్పడమే లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్తగా ఒక్క డిస్టిలరీకి కూడా అనుమతి ఇవ్వలేదు. 2014-19 మధ్య కంటే 2019-24 మధ్య రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ఆదాయం పెరిగింది. 2018-19లో ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.16 వేల కోట్లు ఉంటే 2023-24లో రూ.24 వేల కోట్లకు చేరుకుంది. ఇక కుంభకోణంపై సిట్ వద్ద ఒక్క ఆధారం కూడా లేదు. కేవలం సిట్ అధికారులు తాము బెదిరించి తీసుకున్న కొందరు డిస్టిలరీల ప్రతినిధుల వాంగ్మూలాలను మాత్రమే చూపిస్తున్నారు. ఆ డిస్టిలరీలన్నీ 2014-19లో అప్పటి ప్రభుత్వ హయాంలో లబ్ధి పొందినవే. అవే డిస్టిలరీలను తర్వాతి ప్రభుత్వం 2019-24లో కొనసాగించింది.

సీఐడీ కేసును పోలీసులు ఎలా దర్యాప్తు చేస్తారు?

అసలు ఈ కేసు రాజకీయ ప్రేరేపితం. కేసు నమోదు నుంచి సీఐడీకి అప్పగించడం, సిట్ ఏర్పాటు అంతా చట్టానికి విరుద్ధంగా సాగుతోంది. ఈ కేసును సీఐడీ డీజీ పర్యవేక్షిస్తారు అని సిట్‌ను ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవోలో ప్రభుత్వం పేర్కొంది. సిట్‌ను ప్రత్యేక పోలీస్ స్టేషన్‌గా గుర్తించింది. కానీ, సిట్‌లో ఉన్న సభ్యుల్లో అత్యున్నత అధికారి విజయవాడ పోలీస్ కమిషనర్. మిగిలిన సభ్యులు ఆయన కంటే జూనియర్లు. మరి వీరందరూ సీఐడీ పరిధిలోకి వస్తారా? తాము సీఐడీ పరిధిలోకి వస్తామని వారిని న్యాయస్థానంలో అఫిడవిట్ సమర్పించమనండి. వారుఅఫిడవిట్ సమర్పిస్తే తదనుగుణంగా మేం తదుపరి చర్యలు చేపడతాం. సీఐడీ పరిధిలోకి రాని పోలీస్ అధికారులు ఈ కేసును ఎలా దర్యాప్తు చేస్తారు? సిట్ నమోదు చేసిన ఈ కేసు విజయవాడ ఏసీబీ న్యాయస్థానం పరిధిలోకి రాదు.

17ఏ కింద ముందస్తు అనుమతి తీసుకోలేదు

ఈ కేసులో నిందితులు ప్రతి ఒక్కరిపై దర్యాప్తునకు 17ఏ కింద ముందే అనుమతి తీసుకోవాలి. మొత్తంగా అందరిపై ఒకేసారి 17ఏ కింద అనుమతి తీసుకున్నామని.. కేరళ హైకోర్టు తీర్పును ఉటంకిస్తూ సిట్ చెబుతున్నది సరికాదు. ప్రతి ఒక్కరిపై విడివిడిగా 17ఏ కింద అనుమతి తీసుకోవాలని సుప్రీంకోర్టు విస్పష్టంగా ప్రకటించింది. (ఈ అంశంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించిందని సిట్ న్యాయవాదులు చేసిన వాదనను న్యాయవాది శ్రీరామ్ తోసిపుచ్చారు). 2023లో అప్పటి మాజీ సీఎం చంద్రబాబు అరెస్టుకు సంబంధించి 17ఏ వర్తిస్తుందా వర్తించదా అనే అంశంపై సుప్రీంకోర్టు చెప్పినదాన్ని ప్రస్తుతం సిట్ న్యాయవాదులు వక్రీకరిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం 2018 కంటే ముందే జరిగింది కాబట్టి 17ఏ వర్తించదు. 2018కు ముందు జరిగిన కేసులకు 17ఏ వర్తిస్తుందా వర్తించదా అనే విషయాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక ధర్మాసనానికి నివేదించారు. అంతేగానీ, 2018 ఆ తర్వాత నమోదయ్యే కేసుల్లో నిందితులు ప్రతి ఒక్కరిపై విడివిడిగా 17ఏ కింద దర్యాప్తునకు అనుమతి తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొంది. ఆ ప్రకారం సీఎంవోలో కార్యదర్శిగా చేసిన కె.ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులు. వారిపై కేసులకు విడివిడిగా 17ఏ కింద అనుమతి తీసుకోవాల్సిందే. ఈ నిబంధనను సిట్ ఉల్లంఘించింది కాబట్టి ఇది అక్రమ అరెస్టే అవుతుంది.

హడావుడిగా అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు చెప్పింది

ముందస్తు బెయిల్ ఇవ్వనంత మాత్రాన నిందితులను హడావుడిగా అరెస్టు చేయకూడదని సుప్రీంకోర్టు చెప్పింది. అరెస్టుకు ఉన్న అధికారాన్ని పోలీసులు దుర్వినియోగం చేయొద్దని ఇటీవలే స్పష్టం చేసింది. కచ్చితమైన ఆధారాలు ఉంటేనే అరెస్టు చేయాలని చెప్పింది. కానీ, ఈ అక్రమ కేసులో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా సిట్ స్పష్టమైన ఆధారాలేమీ చూపలేకపోయింది. కనీసం న్యాయస్థానానికి కూడా సమర్పించనే లేదు. ఇక ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి దేశం విడిచివెళ్లే అవకాశం ఉంది కాబట్టి అరెస్టు చేస్తున్నామని సిట్ చెప్పడం పూర్తిగా అవాస్తవం. నిందితులుగా చేర్చకముందే వారికి వ్యతిరేకంగా సిట్ లుక్ ఔట్ నోటీసులు జారీ చేసింది. సిట్ అక్రమంగా అరెస్టు చేసింది.

నిబంధనలకు విరుద్ధంగా అరెస్టు

ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను శుక్రవారం రాత్రి అరెస్టు చేసే క్రమంలో సిట్ అధికారులు నిబంధనలను ఉల్లంఘించారు. అరెస్టుకు ప్రాతిపదిక, కారణాలను నిందితులకు తెలపాలి. కానీ, వారికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. వారి కారు డ్రైవర్‌కు చెప్పామని రిమాండ్ నివేదికలోనే సిట్ అధికారులు పేర్కొన్నారు.

20 వరకు రిమాండ్ విధించిన న్యాయస్థానం

సిట్ అరెస్టు చేసిన రిటైర్డ్ ఐఏఎస్ కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డికి న్యాయస్థానం ఈ నెల 20 వరకు రిమాండ్ విధించింది. వారిద్దరిని సిట్ అధికారులు శనివారం ఉదయం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఇరు పక్షాల వాదనల అనంతరం న్యాయస్థానం రిమాండ్ విధించింది. వారికి ప్రత్యేక వసతులు కల్పించాలని తన ఆదేశాల్లో పేర్కొంది. ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని సిట్ అధికారులు విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.



విజయవాడ కోర్టుకు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని తీసుకొస్తున్న సిట్ అధికారులు

కాపీ పేస్ట్ కుట్ర.. అదే సిట్ రిమాండ్ నివేదిక

రెడ్‌బుక్ కుట్రనే సిట్ తన దర్యాప్తు నివేదిక పేరిట మరోసారి కనికట్టు చేసింది. ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డికి జ్యుడీషియల్ రిమాండ్ విధించాలని కోరుతూ న్యాయస్థానంలో దాఖలు చేసిన రిమాండ్ నివేదికే ఆ విషయాన్ని వెల్లడించింది. పూర్తిగా అవాస్తవాలు, అభూత కల్పనలతోనే రిమాండ్ నివేదిక రూపొందించిందని స్పష్టమైంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టు చేసిన రాజ్ కెసిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఇతర నిందితుల రిమాండ్ నివేదికల్లో పేర్కొన్న కట్టుకథనే కాపీ పేస్ట్ చేసింది. ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా కనీసం ఒక్క ఆధారాన్ని కూడా చూపించలేకపోయింది. ఈ కేసు దర్యాప్తు పేరిట డిస్టిలరీల ప్రతినిధులు, ఇతర సాక్షులను తాము బెదిరించి నమోదు చేసిన అబద్ధపు వాంగ్మూలాలనే అరెస్టుకు ప్రాతిపదికగా చూపించడం సిట్ కుట్రను బట్టబయలు చేసింది.

ఎన్నికల పిటిషన్ తిరస్కరణ కుదరదు

- విచారణ ఎదుర్కోవాల్సిందే..
- ఎమ్మెల్యే మాగంటికి తేల్చిచెప్పిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల పిటిషన్‌లో ప్రాథమిక ఆధారాలున్నందున ఇప్పుడే తిరస్కరించలేమని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ (బీఆర్ఎస్)కు హైకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల పిటిషన్‌లో విచారణ ఎదుర్కోవాల్సిందేనని తేల్చిచెప్పింది. ఈవీఎంల్లో అవకతవకలు జరిగాయనేందుకు తగిన ఆధారాలు సమర్పించాలని కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్‌ను ఆదేశించింది. అజారుద్దీన్ పిటిషన్‌ను తిరస్కరించాలంటూ గోపీనాథ్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. నవీన్‌యాదవ్, అజారుద్దీన్ దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేయాలని కోరుతూ గోపీనాథ్ వేసిన మధ్యంతర అప్లికేషన్(ఐఏ)ను గత సెప్టెంబర్‌లో హైకోర్టు కొట్టివేసింది. దీనిపై ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించగా, సీపీసీ నిబంధన 11 ప్రకారం మళ్లీ విచారణ చేయాలని గత మార్చిలో హైకోర్టుకు సూచించింది. దీంతో మాగంటి ఐఏపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. 39 బూత్‌ల్లోని ఈవీఎంల్లో అవకతవకలు జరిగాయని, వీవీపాట్‌లకు, పోలింగ్ ఏజెంట్‌ల లెక్కలకు పొంతన లేదని అజారుద్దీన్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఈవీఎంల మార్పు, బ్యాలెట్ యూనిట్ నంబర్లకు పొంతన లేకపోవడంపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఈవీఎంలకు కొన్నింటికి సీల్ లేదని, కొత్తగా ఈవీఎంలు ఏర్పాటు చేసినప్పుడు ఏజెంట్ల అనుమతి తీసుకోలేదని చెప్పారు. అనేక అక్రమాలు చోటుచేసుకున్న గోపీనాథ్ ఎన్నికను రద్దు చేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎన్నికల పిటిషన్ విచారణకు ప్రధాన పిటిషనర్ (అజారుద్దీన్) ప్రాథమిక ఆధారాలు సమర్పించారని, వాటిని న్యాయస్థానం ముందు సమర్పిస్తామని చెబుతున్నారన్నారు. మాగంటి ప్రస్తావించిన సుప్రీంకోర్టు తీర్పులు ఈ అంశంలో వర్తించవన్నారు. విచారణ చేపట్టి ఇరుపక్షాల వాదనలు పూర్తిగా విన్న తర్వాతే తుది తీర్పు వెల్లడిస్తామని తేల్చిచెప్పారు.

చచ్చేలా కొట్టి.. మూత్రం తాగించి..

- బీటెక్ చదువుతున్న దళిత విద్యార్థిపై ఏపీలో దాష్టీకం
- కులం పేరుతో దూషించొద్దని అన్నందుకు హాకీ స్టిక్‌లు, రాడ్లతో అమానుషంగా దాడి



చికిత్స పొందుతున్న విద్యార్థి జేమ్స్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: దళితుడిగా పుట్టడమే ఓ బీటెక్ విద్యార్థికి శాపంగా పరిణమించింది. సీనియర్ అన్న గౌరవం కూడా లేకుండా జూనియర్ విద్యార్థి తరచూ కులం పేరుతో దూషించడం తగదని చెప్పడమే పాపమై పోయింది. ఫలితంగా రౌడీషీటర్లతో కలిసి దళిత విద్యార్థిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. కారులో కిడ్నాప్ చేసి దారుణంగా కొట్టారు. కత్తులతో తలపై కోశారు. అరవకుండా నోట్లో డ్రాయర్ (అండర్ వేర్) కుక్కారు. హాకీ స్టిక్‌లు, రాడ్లతో దాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా మూత్రం తాగించారు. ఇంత తీవ్ర అవమానంతో న్యాయం కోసం వెళ్తే పోలీసులు తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి మిన్నకుండిపోయారు. ఈ అమానవీయ ఘటనకు సంబంధించి బాధిత విద్యార్థి విడుదల చేసిన వీడియో వైరల్‌గా మారింది. తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలోని ఓ కళాశాలలో జేమ్స్ అనే విద్యార్థి బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలోని తన జూనియర్ యశ్వంత్ నాయుడు తరచూ కులం పేరుతో దూషిస్తూ, జేమ్స్‌ను తీవ్రంగా అవమానిస్తున్నాడు. ఇటీవల యశ్వంత్ మరోసారి తీవ్రంగా అవమానించడంతో అలా మాట్లాడటం తగదని జేమ్స్ బదులిచ్చాడు. దీంతో అతనిపై యశ్వంత్ నాయుడు కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మంగళం సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న తన బావను కలిసేందుకు జేమ్స్ వెళ్లాడు. ఆ విషయం తెలుసుకున్న యశ్వంత్ నాయుడు.. రౌడీషీటర్ రూపేష్, మరో రౌడీషీటర్ చోట బ్లేడ్, కిరణ్, జగ్గ, నానిలతో కారులో అక్కడికి వెళ్లాడు. జేమ్స్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకొని బూతులు తిడుతూ.. కులం పేరుతో దూషించాడు. ఆపై కారులో అందరూ పిడిగుద్దులు గుద్దుతూ హాకీ స్టిక్స్, రాడ్లతో ఇష్టం వచ్చినట్టు కొట్టారు. కత్తితో తలపై గాయ పరిచారు. మూత్రం పోసి తాగించారు. బాధితుడు అవరకుండా నోట్లో డ్రాయర్ కుక్కారు.

లాడ్జిలో బంధించి మరోమారు దాడి

జేమ్స్‌ను తిరుచానూరు సమీపంలోని ఓ లాడ్జిలోకి తీసుకెళ్లి చేతులు, కాళ్లు కట్టేసి ఓ గదిలో బంధించారు. ఒకటిన్నర రోజులపాటు చిత్రహింసలకు గురిచేశారు. హోటల్ యజమానితో పాటు అందరూ మరోమారు దాడి చేశారు. ముఖంపై మూత్రం పోశారు. కత్తితో పొడవడానికి ప్రయత్నిస్తుండగా కొంత మంది అక్కడికి రావడంతో వారంతా అక్కడ నుంచి వెళ్లిపోయారు. జేమ్స్ అపస్మారక స్థితిలో ఉండగా.. అక్కడికి వచ్చిన వారు (ఎవరో తెలియదు) కట్లు విప్పి ఆస్పత్రికి తరలించారు. కొంచెం కోలుకున్న తర్వాత తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి జరిగిన విషయం పోలీసులకు వివరించాడు. ఆ మేరకు ఫిర్యాదు చేస్తే ఫిర్యాదు స్వీకరించ లేదు. వారిపై కేసు కట్టేంత ధైర్యం తమకు లేదని నిస్సిగ్గుగా స్పష్టం చేశారు. సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్‌లోనే ఉండి బతిమాలినా పట్టించుకోలేదు. మరుసటి రోజు పోలీసుస్టేషన్‌కు వెళితే ఫిర్యాదులో కొంత మంది పేర్లు తొలగించి మరో ఫిర్యాదు ఇస్తే తీసుకుంటామని తెలిపారు. తనకు న్యాయం జరగకపోతే ఆత్మహత్య చేసుకుంటానని జేమ్స్ చెప్పడంతో పోలీసు సిబ్బందే తూతూ మంత్రంగా ఫిర్యాదు రాసి బాధితుడి వద్ద సంతకం తీసుకున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తీవ్రంగా బెదిరించారని బాధితుడు వాపోయాడు. నిందితులకు అధికార టీడీపీ అండ ఉండటంతో కేసు తీసుకోవడానికి పోలీసులు వెనకాడుతున్నట్లు సమాచారం.

ప్రాణాలు పోతుంటే ఏం చేస్తున్నారు?

లిఫ్టుల పరిస్థితిపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: అపార్ట్‌మెంట్లలో లిఫ్టులు సరిగా లేక ప్రాణాలు పోతున్న ఘటనలు తరుచూ జరుగుతున్నాయని, దీనిపై ఏ చర్యలు తీసుకున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఈ మేరకు నోటీసులు జారీచేసి.. సుమోటో పిల్‌గా విచారణ చేపట్టి, ఎందుకు ఆదేశాలు జారీ చేయకూడదో చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను వేసవి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది. లిఫ్టుల భద్రతకు సంబంధించి ప్రభుత్వం నిబంధనలను సరిగా అమలు చేయని కారణంగా పలుచోట్ల చిన్నారులు, పెద్దలు ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన ఘటనలు ఉన్నాయంటూ హైకోర్టుకు ఒకరు లేఖ రాశారు. సుమోటోగా విచారణకు స్వీకరించి, ప్రభుత్వం సరైన చట్టం చేసేలా ఆదేశించాలని కోరారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన పలు ఘటనలను కోర్టు దృష్టికి తెచ్చారు. దీనికి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి అంగీకారం తెలియజేయడంతో రిజిస్ట్రీ 'సుమోటో టేకెన్‌అప్ పిల్'గా విచారణకు స్వీకరించింది. దీనిపై ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకా యారా ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ముఖ్యకార్యదర్శి, న్యాయ శాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది.

బాబుకు 'ఈనాడు' నిత్య సన్మానం

పాత్రికేయానికి తీరని అవమానం

2021లో సెకీ ఒప్పందం.. 2023లో సెకీ సీఎండీగా గుప్తా నియామకం

ఇప్పుడు గుప్తా తొలగింపునకు ఆ ఒప్పందంతో ఏ లెక్కన లింకు!?

ఈనాడు ఎల్లో జర్నలిజంపై విస్తుపోతున్న విద్యుత్ రంగ నిపుణులు

- వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను హక్కుగా అందించాలని సెకీతో గత సర్కార్ ఒప్పందం
- ఇదివరకెన్నడూ లేనంత తక్కువ ధరకు యూనిట్ రూ.2.49కే కొనుగోలు



సాక్షి, అమరావతి: ఎద్దు ఈనిందంటే గాటికి కట్టేయండన్న చందంగా తయారైంది ఎల్లో మీడియా. ప్రజలు ఏమనుకుంటారన్న సిగ్గూ, ఎగ్గూ లేకుండా చంద్రబాబు కోసం ఎంతగా బరితెగించడానికైనా నా సై అంటోంది. వలువలూడదీసుకుని పచ్చి అబద్ధాలను అచ్చేస్తోంది. వ్యవసాయానికి పగటి పూట 9 గంటల పాటు ఉచిత విద్యుత్‌ను 30 ఏళ్ల పాటు హక్కుగా అందించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ-సెకీ)తో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై విషం చిమ్ముతూనే ఉంది. ఈ ఒప్పందానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) వరకు అన్ని విధాలుగా ఆమోదం లభించింది. అయినా గత ప్రభుత్వంపై బురద జల్లాలి.. జగన్‌పై నిందలు వేయాలి.. ఒప్పందంపై విషం గక్కాలి.. అనే అజెండాతో అర్థం లేని ఆరోపణలు చేస్తూ టీడీపీ కరపత్రం ఈనాడు, ఎల్లో మీడియా అసత్య కథనాలను వండివారుస్తూనే ఉంది. తాజాగా సెకీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) రామేశ్వర్ ప్రసాద్ గుప్తాను ఆ పదవి నుంచి తప్పించడాన్ని గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందంతో ముడిపెట్టి ఈనాడు పచ్చి అబద్ధాలతో శనివారం ఓ తప్పుడు కథనాన్ని అచ్చేసింది. ఎప్పుడో 2021లో జరిగిన ఒప్పందానికి 2023లో సీఎండీగా చేరిన అధికారికి సంబంధం ఏమిటనే కనీస ఇంగిత జ్ఞానం లేకుండా దిగజారుడు రాతలతో తన నైజాన్ని చాటుకుంది. ఈనాడు మార్కు జర్నలిజంపై విద్యుత్ రంగ నిపుణులు విస్తుపోతున్నారు. 'సెకీ'తో ఒప్పందం కారణంగా విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లపై ఆర్థిక భారం పడుతుందని, అంతర్ రాష్ట్ర ప్రసార చార్జీ (ఐఎస్‌టీఎస్)ల నుంచి మినహాయింపు లభించదని ఇప్పటికే అనేక సార్లు అసత్య కథనాలను రాసి భంగపడ్డ టీడీపీ కరపత్రం ఇప్పుడు అభూత కల్పనలతో ప్రజలను ఏమార్చాలని చూస్తోంది. యూనిట్ రూ.2.49 చవక ధరకే సౌర విద్యుత్‌ను అందించే సెకీ ఒప్పందంపై ఇంతగా విషం చిమ్ముతున్న ఈనాడు.. అంతకు దాదాపు రెట్టింపు ధర యూనిట్ రూ.4.60తో చంద్రబాబు ప్రభుత్వం యాక్సిస్ అనే ప్రైవేటు సంస్థ నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకుంటే మాత్రం కళ్లున్న గుడ్డి వాడిలా నటిస్తోంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అది జర్నలిజమా? లేక బ్రోకరిజమా?

ఈనాడుపై వైఎస్సార్‌సీపీ మండిపాటు

'వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యక్తిత్వ హననం కోసం పత్రిక పేరుతో ఇంతగా దిగజారిపోతారా? నిస్సిగ్గుగా పచ్చి అబద్ధాలు రాస్తారా? ఈనాడుది జర్నలిజమా? లేక బ్రోకరిజమా?' అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సూటిగా ప్రశ్నించింది. సెకీ విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై ఈనాడు పత్రిక చేస్తున్న అసత్యాలను ఖండిస్తూ 'ఎక్స్'లో ఆ పార్టీ ఈ మేరకు పోస్టు చేసింది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 18-5-2025

అరుదైన ప్రతిభ : శీతల్ దేవి



ఫేమస్ బ్రాండ్లకు ఫేవరెట్ స్టార్ : అనన్య పాండే



వింటి ‘నారి’

జేమ్స్ ‘బ్రాండ్’

‘రెండు చేతులు లేవు కదా... విల్లు ఎలా పడతావు?’ అని అడిగారు. ఆ ప్రశ్నకు తన విల్‌పవర్‌తోనే సమాధానం చెప్పిన శీతల్ దేవి ఆర్చర్‌గా అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోంది. స్కూల్ రోజుల నుంచి వెటకారాలు ఎదుర్కొన్న అనన్య పాండే చిత్రసీమలోకి అడుగు పెట్టిన తరువాత ట్రోలింగ్ బారిన పడింది. ఆ వెటకారాలకు తన పనితీరుతోనే సమాధానం చెప్పిన అనన్య పాండే ప్రస్తుతం ఆసియాలోని ప్రసిద్ధ బ్రాండ్‌లకు బ్రాండ్ అంబాసిడర్. ‘ఫోర్బ్స్ 30 అండర్ 30 ఆసియా 2025’ జాబితాలో చోటు సాధించిన శీతల్‌దేవి, అనన్య పాండేల గురించి...

‘విజేతలు తమ దగ్గర లేని వాటి గురించి ఆలోచించరు. ఉన్నదాన్ని గురించే ఆలోచిస్తారు. దాంట్లో నుంచే శక్తి పుట్టిస్తారు’

అవును. జమ్ముకశ్మీర్‌కు చెందిన శీతల్‌కు ఫోకోమేలియా అనే అరుదైన వ్యాధి కారణంగా రెండు చేతులు లేవు. కిస్త్వార్‌లోని తన గ్రామంలో మేకలు కాసేది. శీతల్‌కు రెండు చేతులు లేకపోవచ్చు. అయితే అసాధారణమైన చురుకుదనం ఉంది. ఆ చురుకుదనమే భారత సైన్యం నిర్వహించిన ఆటల పోటీల్లో పాల్గొనేలా చేసింది.

ఆ ఆటల్లో ఆర్చరీ శీతల్‌ను బాగా ఆకట్టుకుంది.

‘ఆర్చర్ కావాలనుకుంటున్నాను’ అన్నప్పుడు...

‘రెండు చేతులు లేవు కదా...అది ఎలా సాధ్యం?’ అన్నారు అక్కడ ఉన్నవాళ్లు.



ఆర్చరీలోలో ఎంతోమందిని చూసి స్ఫూర్తి పొందాను. ఇప్పుడు నన్ను చూసి స్ఫూర్తి పొందుతున్న వాళ్లను చూసి సంతోషంగా ఉంది

తన కాళ్ల వైపు చూసింది. అవును... తన కాళ్లనే చేతులుగా మలుచుకొని చిన్న పల్లె, జిల్లా, రాష్ట్రం దాటి అంతర్జాతీయ స్థాయిలో ఆర్చరీలో ఎన్నో అద్భుత విజయాలు సాధించింది. పారాలింపిక్ మెడలిస్ట్‌గా చరిత్ర సృష్టించింది ఆర్చర్ శీతల్ దేవి.

‘ఆర్చరీ నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆర్చరీకి ముందు నేనెవరో ఎవరికీ తెలియదు. ఇప్పుడు మన దేశంలో ఎంతోమందికి నేను తెలుసు. ఆర్చరీలోలో ఎంతోమందిని చూసి స్ఫూర్తి పొందాను. ఇప్పుడు నన్ను చూసి స్ఫూర్తి పొందుతున్న వాళ్లను చూస్తే సంతోషంగా ఉంది’ అంటుంది స్టార్ ఆర్చర్ శీతల్‌దేవి.

‘వెక్కిరింపులు, వెటకారాలకు తల ఒగ్గితే ఎప్పటికీ తల ఎత్తలేవు’

స్కూల్ రోజుల్లో అనన్య పాండేను తోటి పిల్లలు ‘టూత్‌పిక్ లెగ్స్’ ‘ఫ్లాట్ స్క్రీన్’లాంటి నిక్‌నేమ్‌లతో వెక్కిరించేవాళ్లు. సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఆమె పేరు ముందు ‘గ్లామర్ డాల్’ అనే విశేషణం తప్పనిసరిగా ఉండేది.

‘నెపో బేబీ’ అని కూడా అంటుండేవారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్ సరే సరి.

నటనకు సంబంధించిన విమర్శలు కూడా వచ్చేవి. సినిమాలకు ముందు పాండే ఏ ఫిల్మ్ స్కూల్‌లో చేరలేదు. చిన్నప్పుడు సినిమా సెట్స్‌కు వెళ్లింది కూడా లేదు. నిర్మాణాత్మక విమర్శలు వినబడిన తరువాత మాత్రం తన నటనను మరింత మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెట్టింది. ‘అనన్య నటన అద్భుతం’ అనే ప్రశంస వినిపించడానికి ఎంతో కాలం పట్టలేదు.



వెటకారాలు, విమర్శలకు బాధ పడి ఉంటే....అనన్య పాండే ఎక్కడో ఆగిపోయేది.

‘విమర్శలు, వెటకారాలను సీరియస్‌గా తీసుకుంటే అది మోయలేనంత భారం అవుతుంది. ఆ భారం మనల్ని ముందుకు వెళ్లకుండా నిలువరిస్తుంది’ అంటుంది అనన్య పాండే.

‘మొదట్లో తన ప్రత్యేకత కనిపించేది కాదు. ఎందుకంటే గతంలో ఎంతోమంది చేసిన పాత్రలే అనన్య పాండే చేసింది. కానీ ఇప్పుడు అలా కాదు. తాను మాత్రమే చేయగలిగే పాత్రలు చేస్తోంది’ అంటుంది ఫిలిమ్ క్రిటిక్ అనుపమ చోప్రా.

ఇప్పుడు ఫేమస్ బ్రాండ్‌లకు పాండే ఫేవరెట్ స్టార్ అయింది. ఫ్రెంచ్ ఫ్యాషన్ హౌజ్ ‘చానల్’, నెట్‌ఫ్లిక్స్, మాస్ ఓరియెంటెడ్ ‘స్కెచర్’కు మన దేశం నుంచి తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా తన ప్రత్యేకతను చాటుకుంది. ప్రస్తుతం అనన్య పాండే దక్షిణ ఆసియాలోని ఎన్నో లగ్జరీ బ్రాండ్‌లకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంది.



పిల్లలూ... ఇంతకు ముందు రేడియోలో బాలానందం అనే ప్రోగ్రామ్ ఉండేది. పిల్లల చేత ఆ ప్రోగ్రామ్‌లో మాట్లాడించేవారు. ఇప్పుడు మనమే రేడియో ప్రోగ్రామ్‌లాంటిది చేయవచ్చు. దానినే ‘పాడ్‌కాస్ట్’ అంటారు. మనకు నచ్చిన విషయాలు మాట్లాడి, రికార్డు చేసి డిజిటల్ ప్లాట్‌ఫామ్ మీద అప్‌లోడ్ చేస్తే మీ పాడ్‌కాస్ట్‌ను విని అభిమానులయ్యేవారుంటారు. ఈ సమ్మర్‌లో మీ కాలనీలోని పిల్లలతో కలిసి పాడ్‌కాస్ట్‌లు చేయండి. అందుకు ఏం చేయాలంటే....

పాడ్‌కాస్ట్ చేద్దామా?



పిల్లలూ... మీరు రేడియో వినే ఉంటారు. మామూలు రేడియో వినకపోయినా కారులోని రేడియో వినే ఉంటారు. రేడియోలో ఒక ప్రోగ్రామ్ అయిపోయాక మరోసారి ఆ ప్రోగ్రామ్ వినాలంటే కుదరదు. అదే ఆ ప్రోగ్రామ్‌ను రికార్డు చేసి ఒక చోట పెట్టి కావాల్సినప్పుడల్లా కావాల్సినన్నిసార్లు వినే ఏర్పాటు చేస్తే? పాడ్‌కాస్ట్ అలాంటిదే. మీరు మీ సొంత ప్రోగ్రామ్స్ రికార్డు చేసి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో పెడతారు. వాటిని ఎవరు కావాలన్నా ఎప్పుడు కావాలన్నా వింటారు. ఇప్పుడు పాడ్‌కాస్టింగ్ చాలా మంచి హాబీ. డబ్బులు కూడా వస్తాయి... వినేవాళ్లు పెరిగితే. పాడ్‌కాస్ట్ అంటే కేవలం ఆడియో ప్రోగ్రామ్ మాత్రమే. ఒకరు/లేదా కొంతమంది మాట్లాడుకునే మాటలను రికార్డు చేసి ఇతరులకు వినిపించడమే పాడ్‌కాస్టింగ్ అంటే.

దానికి ఏం కావాలి?

కంప్యూటర్ కానీ ల్యాప్‌టాప్ కానీ ఉంటే సరిపోతుంది. రికార్డు చేయడానికి మైక్ ఉండాలి. రికార్డు చేసేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ ఫ్రీగా దొరుకుతుంది. రికార్డ్ అయిన కార్యక్రమాన్ని ‘ఎంపి3’ ఫార్మాట్‌లో మార్చి పాడ్‌కాస్ట్ ప్లాట్‌ఫామ్స్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ ప్లాట్‌ఫామ్స్‌ను సబ్‌స్క్రయిబ్ చేసుకుని ఆ పని చేయవచ్చు. ఇదంతా చాలా సులువు పనే.

పాడ్‌కాస్ట్‌లో ఏం మాట్లాడతారు?

మనుషులకు మాటలు ఇష్టం. మీరు ఏం మాట్లాడినా వింటారు. ఉదాహరణకు ‘నేనూ... మా కుక్కపిల్ల’ అనే సిరీస్‌లో మీరు వరుసగా పాడ్‌కాస్ట్ చేయవచ్చు. ఒక్కో ఎపిసోడ్‌లో మీ కుక్కపిల్లతో మీరు పడుతున్న తంటాలు, అదంటే మీకెంత ఇష్టమో, అది మీరు స్కూల్‌కు వెళ్లినప్పుడు ఎలా ఎదురుచూస్తుందో, మీ ఫుడ్‌ను ఎలా లాక్కుంటుందో ఇవన్నీ మాట్లాడి రికార్డు చేసి పెడితే వినేవాళ్లు ఉంటారు.

ఇంకా ఏం మాట్లాడొచ్చు పాడ్‌కాస్ట్‌లో...

- తెలుగు పద్యం: వేమన, సుమతి, భాస్కర శతకాల్లో నుంచి ఒక్కో పద్యం తీసుకుని అది మీకు ఎందుకు ఇష్టమో అందులోని నీతి ఏమిటో మీ ఫ్రెండ్‌కు వివరిస్తూ పాడ్‌కాస్ట్ చేయొచ్చు.
- తెలుగువారి హిస్టరీ నుంచి మీకు నచ్చిన విషయాలను పాడ్‌కాస్ట్ చేయొచ్చు.
- సినిమాల మీద చేయొచ్చు.
- ఐ.పి.ఎల్ మేచెస్ మీద చేయొచ్చు.
- మై డ్రీమ్స్.. అని చేయొచ్చు. ఇవి మీ లక్ష్యాలే కాదు... మీ కలలు కూడా చెప్పొచ్చు.

పాడ్‌కాస్ట్ చేసే విధం

పాడ్‌కాస్ట్ అంటే చదవడం కాదు. నోట్స్ ముందు పెట్టుకుని చదివితే ఎవరూ వినరు. పాడ్‌కాస్ట్‌ను ఒక డైలాగ్‌లాగా మాట్లాడుతున్నట్టుగా చేయాలి. అఫ్‌కోర్స్... మీరు కొంత నోట్స్ రాసుకున్నా అది పాయింట్స్ గుర్తు రావడానికే తప్ప యథాతథంగా చదవకూడదు. ‘మా అమమ్మ’ అనే టాపిక్ మీద కబుర్లు చెబుతున్నట్టుగా మాట్లాడితే వింటారు.

ఇంటర్వ్యూలు

పాడ్‌కాస్ట్‌లో ఇంటర్వ్యూలు బాగుంటాయి. మీరు మీ అమ్మను, నాన్నను, అన్నయ్యను ఇంటర్వ్యూ చేయొచ్చు. క్లయిమేట్ చేంజ్ గురించి మీ సైన్స్ టీచర్‌ను ఆహ్వానించి ఇంటర్వ్యూ చేయొచ్చు. సెల్‌ఫోన్ అడిక్షన్ మీద ఒక డాక్టర్‌ను ఇంటర్వ్యూ చేయొచ్చు. ఇలాంటి వాటికి మమ్మీ, డాడీ సపోర్ట్ తీసుకోవచ్చు. రాబోయే వానాకాలంలో వూళ్లో వాన నీరు వెళ్లాలంటే గవర్నమెంట్ ఏయే పనులు మొదలెట్టాలో చెప్పేలా ఒక పాడ్‌కాస్ట్ చేయొచ్చు. హ్యారీపోటర్ మీద, అవేంజర్స్ మీద మీ ఫ్రెండ్స్‌ను ఇంటర్వ్యూ చేస్తూ పాడ్‌కాస్ట్ చేయొచ్చు.

పాడ్‌కాస్ట్ చేయడం వల్ల మీ ఆలోచనలు, మాట, సమయస్ఫూర్తి పెరుగుతాయి. రీసెర్చ్ చేయడం వల్ల చాలా విషయాలు తెలుసుకుంటారు. ఇంటర్వ్యూలు చేయడం వల్ల ఎక్స్‌పర్ట్‌లతో పరిచయాలు జరుగుతాయి. పేరు వస్తుంది. ఇన్ని మేళ్లు జరుగుతాయి కనుక ట్రై చేయండి. ఈ సెలవుల్లో పాడ్‌కాస్టర్‌గా మారండి. ఆల్ ది బెస్ట్.

హెల్త్



కొత్త అమ్మలూ... కొన్ని సమస్యలు!

ఓ మహిళ తల్లి అయ్యాక ఆ మాతృమూర్తి ఎదుర్కొనే సమస్యలు ఎన్నెన్నో. ఓ తల్లి ఎదుర్కొనే సాధారణ సమస్యలూ, వాటికి సమాధానాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ... ఇవి ఆ తల్లులకు ఉపయోగపడతాయని ఆశిస్తూ...

ఓ తల్లి అమ్మగా మారాక బిడ్డ పాలు తాగకపోయినా లేదా పాలు తాగాక ఆ చిన్నారికి విరేచనాలవుతున్నా, బిడ్డకు కడుపునొప్పి వచ్చినా... ఇలా ఏం జరిగినా తల్లికి ఆందోళనే. తల్లులు ఎదుర్కొనే కొన్ని సాధారణ సమస్యలనూ, సమాధానాల్నీ చూద్దాం.

పాలు సరిగా పడుతున్నామా అనే సందేహమా?

కొత్తగా తల్లిగా మారిన మహిళల్లో చాలామందికి తాము సరిగానే పాలుపడుతున్నామా లేదా అనే సందేహం వస్తుంటుంది. ఒక రొమ్ము ఫీడ్ చేస్తున్నప్పుడు దానిలో పాలు అయిపోయేవరకు బిడ్డ తాగుతున్నాడా అని డౌటొస్తుంటుంది. రొమ్ము మార్చడమెప్పుడో తెలియక కంగారొస్తుంటుంది. ఇలాంటి సందేహాలకు కొన్ని సూచనలివి... సాధారణంగా పిల్లలు పాలు తాగే ప్రక్రియ 10-15 నిమిషాల్లో పూర్తి అవుతుంది. అప్పుడే పుట్టిన పిల్లలు పాలుతాగడానికి అలవాటు పడటానికి కాస్త టైమ్ పట్టవచ్చు. చాలా మంది పిల్లలు ఒక పక్క పాలు తాగి సంతృప్తిపడతారు. కానీ కొందరు ఒక పక్క తాగి మళ్లీ మరో పక్క కూడా తాగుతారు. పాలు పట్టేటప్పుడు చివరలో వచ్చేవాటిని హైండ్ మిల్క్ అంటారు. ఈ పాలలో ఎక్కువ క్యాలరీస్ ఉండి, బిడ్డ బరువును పెంచడానికి ఎక్కువగా సహాయపడతాయి. బిడ్డ మామూలుగా రోజుకు ఐదారు సార్లు మూత్ర విసర్జన చేస్తూ, బరువు పెరుగుతుంటే ఆ బిడ్డకు తల్లి పాలు సరిపోతున్నాయని అర్థం.

తల్లిలో బిడ్డకు సరిపోయినన్ని పాలు పడాలంటే...

బిడ్డకు తగినన్ని పాలు పడాలంటే తల్లులు అన్ని రకాల పోషకాలతో కూడిన సమతులాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యం.పాలిచ్చే తల్లుల ఆహారంలో ఆకుకూరలు తప్పనిసరిగా ఉండాలి. రోజూ తాము తీసుకునే ఆహారంలో ఆకుకూరల్ని మార్చుతుండటం వల్ల పాల ఫ్లేవర్ మారుతూ బిడ్డ పాలు తాగడానికి ఉత్సాహం చూపుతుంది. తల్లులకు ఉండకూడనిది మానసిక ఆందోళన. బిడ్డకు పాలు సరిపోతాయా లేదా అని ఆందోళన చెందకుండా, మానసికంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆనందంగా ఉండటం వల్ల పాలు ఉత్పత్తి అయ్యే హార్మోన్లు కూడా బాగాస్రవించి పాలు పెరగడానికి అవకాశమెక్కువ.

వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం....

పాలిచ్చే తల్లులు తమ రొమ్ము దగ్గర వ్యక్తిగత పరిశుభ్రత (పర్సనల్ హైజీన్) పాటించడం ఎంతో అవసరం. రొమ్ములను పరిశుభ్రంగా ఉంచుకోవడం బిడ్డ ఆరోగ్యానికి మేలు చేసే అంశం. బిడ్డకు వచ్చే ఎన్నో ఇన్ఫెక్షన్లనుంచి ఇది కాపాడుతుంది. ఇక తల్లి ఒరిగి పడుకుని బిడ్డకు పాలు పట్టడం కంటే కూర్చుని పాలివ్వడం మంచిది.



బిడ్డలకు వచ్చే కడుపునొప్పి...

కొందరు చిన్నారి బిడ్డలు ఎప్పుడూ ఏడుస్తుంటారు. కారణం చెప్పడానికి నెలల చిన్నారికి మాటలు రావు. బిడ్డ అలా ఏడుస్తుంటే తల్లికి ఏమీ పాలుపోదు. నెలల పిల్లలు అలా ఏడుస్తున్నారంటే కారణం వాళ్ల తొలి సమస్య కడుపునొప్పి. వైద్యపరిభాషలో దాన్ని ‘ఇన్‌ఫ్యాంటైల్ కోలిక్’ అంటారు. అందుకే ఈ కంప్లెయింట్‌తో వెళ్లిన పిల్లలకు కడుపునొప్పి తగ్గే మందు ఇస్తుంటారు చిన్న పిల్లల వైద్యులు. పిల్లలు ఏడుస్తున్నప్పుడు ఆందోళన పడకుండా డాక్టర్ దగ్గరకు వెళ్లి ఇన్‌ఫ్యాంటైల్ కోలిక్‌కు మందు తీసుకోవడం తల్లి చేయాల్సిన మొదటి పని.

నెలల బిడ్డకు విరేచనాలవుతుంటే...

కొన్నిసార్లు పాలు తాగగానే నెలల పిల్లలకు విరేచనాలు అవుతుంటాయి. తల్లికి పెద్ద సందేహం... తన పాలు సరిపడకపోవడం వల్లనే అలా జరుగుతుందేమోనని. నెలల వయసప్పుడు పాలు తాగగానే విరేచనాలు కావడం పిల్లల్లో చాలా మామూలుగా జరిగేదే. పాలు సరిపడకపోవడం అన్నది చాలా తక్కువ మంది పిల్లల్లోనే జరుగుతుంది. విరేచనాలు అవుతున్నప్పటికీ పిల్లలకు తల్లిపాలు పట్టిస్తూ ఉండాలి. కాకపోతే గమనించాల్సిందేమిటంటే... బిడ్డ బరువు ఏమైనా తగ్గుతుందేమో చూడాలి. బరువు తగ్గనంతవరకు బిడ్డకు ఎలాంటి సమస్యా ఉండదు. విరేచనాలు అవుతున్నాయనే కారణంతో తల్లిపాలు ఇవ్వడాన్ని ఆపడం ఎంతమాత్రమూ మంచిది కాదు. అలా ఆపితే వాళ్లు మరింత డీ-హైడ్రేషన్‌కు లోనవుతారు. అది చిన్నారులకు మరింత ముప్పు తెచ్చిపెట్టవచ్చు. బిడ్డ తాలూకు ప్రతి అవయవం ఎదుగుదలకు, చిన్నారి వికాసానికి (మైల్‌స్టోన్స్‌కు) తల్లిపాలకు మించిన ఆహారం లేదు. దానికి మించిన ప్రత్యామ్నాయమూ లేదు. అందుకే బిడ్డకు తల్లిపాలు పట్టడమే చాలా ఉత్తమం. ఒకవేళ ఇలా పాలుపడుతునప్పటికీ బరువు పెరగడం లేదని గమనిస్తే అప్పుడు వెంటనే పిల్లల వైద్యుని సంప్రదించాలి. అప్పుడు వాళ్లు విరేచనాలకు వేరే కారణాలేమైనా ఉన్నాయా అని చూసి, దానికి తగిన చికిత్స అందిస్తారు.



డా॥ లక్ష్మీ వేదప్రకాశ్
సీనియర్ నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రిషియన్

బాబు / పాప సరిగా అన్నం తినడం లేదా?

చిన్నారి పుట్టాక వాళ్లకు ఘనాహారం అలవాటు చేశాక... వాళ్లు పెరిగి పెద్దయ్యే వరకూ దాదాపుగా ప్రతి తల్లీ చేసే ఫిర్యాదు ఇదే. అన్నం పెడితే బిడ్డ సరిగా తినడం లేదంటూ ప్రతి తల్లీ తమ డాక్టర్‌ను ఏదో ఒక సందర్భంలో అడిగి తీరుతుంది. బిడ్డకు అన్ని పోషకాలూ అందేలా ఆరోగ్యకరమైన ఆహారం పెడుతున్నప్పుడు వాళ్లు తిన్నంత తినిపించాలి. వాళ్లు వద్దన్న తర్వాత ఒకటి రెండుసార్లు తినిపించాక ఇక తినమంటూ మారాం చేస్తే ఆపేయాలి. అంతేతప్ప వాళ్లను బతిమాలి, బెదిరించి, బలవంతంగా తినిపించకూడదు. ఇలాంటి పిల్లల్లో చూడాల్సిందేమిటంటే వాళ్లేమైనా చురుగ్గా ఉండటంలేదా, బరువు తగ్గుతున్నారా అని గమనించాలి. ఇక వాళ్లు చురుగ్గా ఆడుకుంటూ, తమ వికాసానికి తగిన తెలివితేటలను చూపుతూ, మునపటి కంటే బరువు తగ్గకుండా క్రమంగా పెరుగుతుంటే ఆందోళన చెందాల్సిన అవసరమే లేదు. ఒకవేళ వారు బరువు పెరగకపోయినా లేదా తగ్గుతున్నా వాళ్లకు లోపల ఏదైనా సమస్య ఉండవచ్చు. ముఖ్యంగా కిడ్నీలు, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం... ఈ నాలుగు ప్రధాన అవయవాలకు సంబంధించిన కారణాలు ఏవైనా అయి ఉండవచ్చు. కొన్నిసార్లు జన్యుపరమైన అంశాల వల్ల లేదా వంశపారంపర్యంగా తల్లిదండ్రుల ఎత్తు/ఆకృతిని బట్టి కూడా బరువు పెరగకపోవచ్చు. లేదా తినిపిస్తున్నప్పటికీ పౌష్టికాహార లోపం వల్ల కూడా బరువు పెరగకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో మాత్రం తప్పనిసరిగా డాక్టర్‌కు చూపించి, తగిన చికిత్స అందించాలి.



హైబీపీ అదుపులోకి ఇలా!

హైబీపీ అనేది జీవనశైలికి సంబంధించిన ఓ ఆరోగ్య సమస్య. ఇది ఒకసారి కనిపించాక ఇక దాదాపు బాధితుల జీవితకాలమంతా హైబీపీ వాళ్ల జీవనాన్నీ, అలవాట్లను ప్రభావితం చేస్తుంది. సాధారణంగా నార్మల్‌గా 120 / 80 ఉండాల్సిన బీపీ కొలత అంతకంటే ఎక్కువగా ఉండటాన్ని హైబీపీ లేదా హైపర్ టెన్షన్‌గా చెబుతారు.

హైబీపీ ప్రధానంగా జన్యు కారణాల వల్లనే వస్తుంది. అయితే వాళ్ల జీవనశైలిలో భాగంగా వాళ్లు తీసుకునే ఆహారం, దేహానికి దొరికే వ్యాయామం అలాగే వాళ్లు అనుభవించే ఒత్తిడి... ఇవన్నీ హైబీపీ వచ్చేందుకు కారణమవుతుంటాయి.

నివారణ ఇలా...

ఆరోగ్యకరమైన జీవనశైలితో హైబీపీని చాలావరకు నివారించవచ్చు. అదెలాగో చూద్దాం.

ఆహార పరంగా:

- ఆహారంలో సోడియమ్ మోతాదులు ఎక్కువగా తీసుకోవడం నేరుగా బీపీని పెంచుతుంది. అందుకే ఉప్పు ఎక్కువగా ఉండే ప్రాసెస్‌డ్ ఆహారాలు, క్యాన్‌డ్ ఫుడ్స్, ఉప్పు ఎక్కువగా ఉండే శ్నాక్స్ వంటివి తగ్గించాలి.
- పొటాషియమ్ ఉండే ఆహారాలతో బీపీ నియంత్రణలో ఉంటుంది. అందుకే పొటాషియమ్ మోతాదులు ఎక్కువగా ఉండే అరటి పండ్లు, చిలగడదుంపలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి.
- ఆహారంతో హైబీపీని నియంత్రించడాన్ని ‘డయటరీ అప్రోచ్ టు స్టాప్ హైపర్‌టెన్షన్’గా చెబుతారు. ఇందులోని మొదటి అక్షరాలను తీసుకుని సంక్షిప్తంగా ఈ పద్ధతిని ‘డ్యాష్’గా పేర్కొంటారు. డ్యాష్ ఆహారాల్లో భాగంగా తాజా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు, కొవ్వు తక్కువగా ఉండే ప్రోటీన్‌లతో హైబీపీని నియంత్రించవచ్చు.

వ్యాయామం ఇలా...

- ప్రతివారం కనీసం 150 నిమిషాలకు తగ్గకుండా ఏదో ఒక వ్యాయామం చేస్తుండటం మంచిది.

మానసిక ఒత్తిడి...

- దీర్ఘకాలిక ఒత్తిడి హైబీపీకి కారణమవుతుంది. అందుకే ఒత్తిడిని అదుపు చేసేందుకు యోగా, ధ్యానం, శ్వాసవ్యాయామాల వంటి ప్రక్రియలు అనుసరించడం మేలు.

మద్యం, పొగతాగడానికి దూరంగా...

- మద్యం, పొగతాగే అలవాట్లు హైబీపీని మరింత ప్రేరేపిస్తాయి. అందుకే ఆ అలవాట్లకు దూరంగా ఉండటం మంచిది. అంతేకాదు... పొగతాగని వారితో పోలిస్తే పొగతాగేవారిలో... రక్తనాళాల్ని పెళుసుగా మార్చే ‘అథెరో స్క్లిరోసిస్’ అనే సమస్య 10 ఏళ్ల ముందుగా వస్తుందని అనేక అధ్యయనాల్లో తేలింది.



మరికొన్ని ఇతర సూచనలు...

- స్థూలకాయం ఉన్నవారు బరువు తగ్గించుకోవాలి. దాంతో బీపీ ముప్పు గణనీయంగా తగ్గుతుంది.
- రోజూ కనీసం 7 – 9 గంటలు కంటినిండా నిద్రపోవాలి.
- ఇక క్రమం తప్పకుండా బీపీ పరీక్షించుకుంటూ ఉంటూ దాన్ని బట్టి జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ ఉండాలి.
- హైబీపీ ఉన్నవారు క్రమం తప్పకుండా డాక్టర్ సూచించిన మోతాదులో మందులు తీసుకుంటూ ఉండాలి. డాక్టర్‌కు చెప్పకుండా మానేయడం సరికాదు.

చివరగా... బీపీ రీడింగ్‌ను క్రమం తప్పకుండా ఖచ్చితమైన రీతిలో చూసుకుంటూ, దాన్ని అదుపులో ఉంచుకోవడం ద్వారా సుదీర్ఘకాలం పాటు మామూలుగానే జీవించడం సాధ్యమవుతుంది.



డా॥ అంజని ద్వారంపూడి
కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్



టైటిల్ పోరుకు యూకీ బాంబ్రీ జోడీ

ఈ ఏడాది రెండో డబుల్స్ టైటిల్ సాధించేందుకు భారత టెన్నిస్ అగ్రశ్రేణి క్రీడాకారుడు యూకీ బాంబ్రీ విజయం దూరంలో నిలిచాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న బోర్డెక్స్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-175 టోర్నమెంట్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో రెండో సీడ్ యూకీ-గాలోవే జంట 6-3, 7-6 (7/3)తో మూడో సీడ్ రాఫెల్ మటోస్-మార్సెలో మెలో (బ్రెజిల్) జోడీపై విజయం సాధించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-గాలోవే ఆరు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 59 సర్వీస్ పాయింట్లలో ఇండో-అమెరికన్ జంట 49 పాయింట్లు సొంతం చేసుకుంది. తొలి రౌండ్‌లో యూకీ-గాలోవే 6-0, 7-6 (7/1)తో జాకుబ్ పాల్ (స్విట్జర్లాండ్)-డేవిడ్ పెల్ (నెదర్లాండ్స్)లపై, క్వార్టర్ ఫైనల్లో 7-5, 6-3తో క్వెంటిన్ హేల్స్-అల్బాలో ఒలివెట్టి (ఫ్రాన్స్)లపై గెలుపొందారు. నేడు జరిగే ఫైనల్లో నాలుగో సీడ్ ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్)-లుకాస్ మెడ్లెర్ (ఆస్ట్రియా)లతో యూకీ-గాలోవే తలపడతారు. ఈ ఏడాది అలెక్సీ పాపిరిన్ (ఫ్రాన్స్)తో జతగా యూకీ బాంబ్రీ దుబాయ్ ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ సాధించాడు.

బుమ్రాపై భారం వద్దు!

- గిల్ లేదా పంత్ సరైన ఎంపిక
- భారత టెస్టు కెప్టెన్సీపై మాజీ కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్య



దుబాయ్: భారత టెస్టు జట్టు కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్, రిషభ్ పంత్‌లలో ఒకరిని ఎంచుకోవడం సరైన నిర్ణయం అవుతుందని మాజీ ఆటగాడు, కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ జట్లకు నాయకత్వం వహించిన అనుభవం ఉండటంతో పాటు వారి వయసు కూడా తక్కువని అతను అన్నాడు. టాప్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను సారథిగా చేస్తే అతనిలోని బౌలర్ పదును కోల్పోయే ప్రమాదం ఉందని రవిశాస్త్రి హెచ్చరించాడు. 'ఆస్ట్రేలియాతో సిరీస్‌లో బుమ్రా కెప్టెన్‌గా వ్యవహరించడం ఆ సమయంలో సరైన నిర్ణయమే. అయితే ఇప్పుడు మాత్రం అతడిని రెగ్యులర్ కెప్టెన్‌గా చేయడం నాకు ఇష్టం లేదు. బుమ్రా కెప్టెన్ అయితే బౌలర్‌గా అతను బలహీనంగా మారిపోవచ్చు. అతని ఫిట్‌నెస్ ప్రకారం ప్రతీ టెస్టు తర్వాత సమీక్ష చేయాల్సిన పరిస్థితి ఉంది. పైగా గాయం నుంచి కోలుకొని వస్తున్నాడు. ఐపీఎల్‌లో ఆడినా అవి నాలుగు ఓవర్ల మ్యాచ్‌లే. టెస్టుల్లో 10-15 ఓవర్లు వేయగలడా. బౌలింగ్‌తో పాటు కెప్టెన్సీ ఒత్తిడిని తట్టుకోగలడా అనేది సమస్య' అని రవిశాస్త్రి విశ్లేషించాడు. తన అభిప్రాయం ప్రకారం గిల్ లేదా పంత్ భారత టెస్టు టీమ్‌ను సమర్థంగా నడిపించగలరని అతను చెప్పాడు. గిల్ విదేశాల్లో పరుగులు చేయలేడనే అపవాదును మాజీ కెప్టెన్ తిప్పికొట్టాడు. 'గిల్ వయసు 25 ఏళ్లే. అతను కెప్టెన్‌గా రాణించేందుకు తగినంత సమయం ఉంది. గిల్‌తో పాటు పంత్‌కు కూడా కనీసం మరో పదేళ్ల కెరీర్ మిగిలి ఉంది. ప్రశాంతంగా ఉంటూ పని చేసుకుపోయే తత్వంతో గిల్ సమర్థుడైన నాయకుడు కాగలడు. విదేశాల్లో పరుగులు సమస్య కాదు. ముందు అతడిని తగినన్ని టెస్టులు విదేశాల్లో ఆడనివ్వండి. ఆ తర్వాత సత్తా ఏమిటో తెలుస్తుంది. అతనిలాంటి క్లాస్ ఆటగాడు ఎక్కడైనా పరుగులు చేయగలడు' అని రవిశాస్త్రి తన అభిప్రాయ వ్యక్తం చేశాడు.

కోల్‌'కథ' ముగిసె...

- ఐపీఎల్ 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి నైట్‌రైడర్స్ అవుట్
- భారీ వర్షంతో బెంగళూరు, కోల్‌కతా మ్యాచ్ రద్దు



బెంగళూరు: మెరుపులతో ఐపీఎల్-2025 మళ్లీ మొదలవుతోందని సంబరపడిన అభిమానికి మొదటి రోజే నిరాశ ఎదురైంది. అందరూ ఆసక్తిగా ఎదురు చూసిన మ్యాచ్ వర్షార్పణం కావడంతో విరామంలో మరో రోజు చేరింది. శనివారం జరగాల్సిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) జట్ల మధ్య మ్యాచ్ వాన కారణంగా పూర్తిగా రద్దయింది. సాయంత్రం నుంచి విరామం లేకుండా వాన పడటంతో కనీసం టాస్‌కు కూడా అవకాశం లేకుండా పోయింది. నిర్ణీత సమయానికి దాదాపు మూడు గంటల తర్వాత రాత్రి 10:30కి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. విరాట్ కోహ్లి టెస్టు రిటైర్మెంట్ తర్వాత వీరాభిమానంతో వైట్ జెర్సీల్లో మైదానానికి పెద్ద సంఖ్యలో వచ్చిన ఫ్యాన్స్ అతని ఆట చూడకుండానే నిష్క్రమించాల్సి వచ్చింది. వాన కొద్దిసేపు ఆగితే చాలు... అత్యుత్తమ డ్రైనేజీ సౌకర్యం ఉన్న చిన్నస్వామి మైదానంలో మ్యాచ్‌కు అంతా సిద్ధం చేయవచ్చని భావించినా ఏ దశలోనూ వర్షం తెరిపి నివ్వలేదు. కనీసం 5 ఓవర్ల మ్యాచ్ కోసం కటాఫ్ టైమ్ రాత్రి గం. 10:56 కాగా... దానికి కూడా అవకాశం లేదని అర్థం కావడంతో మరో అర గంట ముందే మ్యాచ్‌ను రద్దు చేశారు.

నాలుగో జట్టుగా...

శనివారం మ్యాచ్ ఫలితం తర్వాత డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ 'ప్లే ఆఫ్స్' అవకాశాలు కోల్పోయిన నాలుగో జట్టుగా నిలిచింది. 13 మ్యాచ్‌ల తర్వాత కేకేఆర్ ఖాతాలో కేవలం 12 పాయింట్లే ఉన్నాయి. ఇప్పటికే మూడు జట్లు 14 కంటే ఎక్కువ పాయింట్లు సాధించగా... 14, 13 పాయింట్లు ఉన్న ముంబై, ఢిల్లీ మధ్య మరో మ్యాచ్ మిగిలి ఉంది. కాబట్టి చివరి మ్యాచ్ నెగ్గినా... 14 పాయింట్లతో కోల్‌కతా ముందంజ వేసే అవకాశం లేదు. మరోవైపు బెంగళూరు 17 పాయింట్లతో అగ్ర స్థానానికి చేరి 'ప్లే ఆఫ్స్'లో తమ స్థానాన్ని దాదాపుగా ఖాయం చేసుకుంది.



రహానే, విరాట్ కోహ్లి



ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
బెంగళూరు	12	8	3	1	17	0.482
గుజరాత్	11	8	3	0	16	0.793
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	11	6	4	1	13	0.362
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లక్నో	11	5	6	0	10	-0.469
హైదరాబాద్	11	3	7	1	7	-1.192
రాజస్తాన్	12	3	9	0	6	-0.718
చెన్నై	12	3	9	0	6	-0.992

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ X పంజాబ్
వేదిక: జైపూర్
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

ఢిల్లీ X గుజరాత్
వేదిక: ఢిల్లీ
రాత్రి 7: 30 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీజ

దోహా: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ తొలి రౌండ్‌లోనే ఓటమి చవిచూసింది. శనివారం మొదలైన ఈ మెగా ఈవెంట్‌లో ప్రపంచ 34వ ర్యాంకర్ శ్రీజ 11-9, 8-11, 6-11, 5-11, 2-11తో ప్రపంచ 84వ ర్యాంకర్ సుథాసిని సావెట్టబట్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. 33 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జాతీయ మాజీ చాంపియన్ శ్రీజ తన సొంత సర్వీస్‌లో 17 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 15 పాయింట్లు గెలిచింది. మరోవైపు సుథాసిని తన సొంత సర్వీస్‌లో 27 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 26 పాయింట్లు సాధించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో దియా చిటాలె (భారత్) 11-4, 11-7, 11-3, 14-12తో సోఫియా జువాన్ జాంగ్ (స్పెయిన్)పై గెలిచి రెండో రౌండ్‌కు చేరింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మనుశ్ షా (భారత్) 11-6, 2-11, 11-7, 6-11, 11-5, 11-6తో టియాగో అపోలోనియా (పోర్చుగల్)ను ఓడించి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు.

అహిక-సుతీర్థ జోడీ బోణీ

మహిళల డబుల్స్ విభాగంలో అహిక ముఖర్జీ-సుతీర్థ ముఖర్జీ (భారత్); దియా చిటాలె-యశస్విని (భారత్) జోడీలు శుభారంభం చేశాయి. తొలి రౌండ్‌లో అహిక-సుతీర్థ 4-11, 11-9, 10-12, 11-9, 11-7తో ఓజ్గె యిలిజ్-ఏస్ హరాక్ (తుర్కియే)లపై... దియా-యశస్విని 9-11, 11-2, 11-9, 11-8తో మర్జాబో మగ్దియెవా-అసెల్ ఎర్కెబయెవా (ఉజ్బెకిస్తాన్)లపై గెలిచారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో మనుశ్ షా-మానవ్ ఠక్కర్ (భారత్) ద్వయం 11-7, 11-8, 11-9తో పీటర్ రిబార్-డెని కొజుల్ (స్లొవేనియా) జోడీపై విజయం సాధించింది.

పియాస్ట్రికి పోల్ పొజిషన్

నేడు ఎమిలియా రొమాగ్నా గ్రాండ్‌ప్రి



వెర్‌స్టాపెన్, పియాస్ట్రి, జార్జి రసెల్

ఇమోలా (ఇటలీ): ఫార్ములావన్ 2025 సీజన్‌లో ఐదో విజయంపై మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి గురి పెట్టాడు. శనివారం జరిగిన ఎమిలియా రొమాగ్నా గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ సెషన్‌లో పియాస్ట్రి అందరికంటే వేగంగా ల్యాప్‌ను 1 నిమిషం 14.670 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. తద్వారా నేడు జరిగే ప్రధాన రేసును పియాస్ట్రి తొలి స్థానం నుంచి ప్రారంభించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) రెండో స్థానం నుంచి, జార్జి రసెల్ (మెర్సిడెస్) మూడో స్థానం నుంచి రేసును మొదలుపెడతారు. 24 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఆరు రేసులు ముగిశాయి. పియాస్ట్రి నాలుగు రేసుల్లో (చైనా, బహ్రెయిన్, సౌదీ అరేబియా, మయామి) విజేతగా నిలిచాడు. లాండో నోరిస్ (మెక్‌లారెన్), వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) ఒక్కో రేసులో గెలిచారు. డ్రైవర్స్ పాయింట్ల పట్టికలో పియాస్ట్రి 131 పాయింట్లతో నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... 115 పాయింట్లతో నోరిస్ రెండో స్థానంలో, 99 పాయింట్లతో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో ఉన్నారు.

సాక్షి సినిమా

సంక్రాంతికి రఫ్ఫాడించేద్దాం

చిరంజీవి హీరోగా రూపొందనున్న తాజా చిత్రం 'మెగా 157' (వర్కింగ్ టైటిల్). అనిల్ రావిపూడి దర్శకత్వంలో అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నయనతారను ఖరారు చేసినట్లు ప్రకటించి, స్పెషల్ వీడియో రిలీజ్ చేశారు. ఈ వీడియోలో నయనతార... తన టీమ్‌తో తెలుగులో మాట్లాడటం, కారు ప్రయాణంలో చిరంజీవి క్లాసిక్ పాటలు వినడం, 'హలో మాస్టర్... కెమేరా కొంచెం రైట్ టర్నింగ్ ఇచ్చుకోమ్మా' అని చెప్పడం ఆకట్టుకున్నాయి. ఫైనల్‌గా అనిల్ రావిపూడి, నయనతార కలిసి సంక్రాంతికి రఫ్ఫాడించేద్దాం అని చెప్పడంతో ఈ వీడియో ముగిసింది. ''సైరా నరసింహారెడ్డి, గాడ్‌ఫాదర్' చిత్రాల తర్వాత చిరంజీవి-నయనతార కలిసి మూడోసారి నటించనున్న చిత్రమిది. ఈ సినిమా ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. చాలాకాలం తర్వాత చిరంజీవి కంప్లీట్ హ్యూమరస్ రోల్‌లో కనిపించనున్నారు. త్వరలో షూటింగ్ ఆరంభిస్తాం'' అని యూనిట్ తెలిపింది. 2026 సంక్రాంతికి రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమేరా: సమీర్ రెడ్డి.



నయనతార, అనిల్ రావిపూడి

నో అప్‌డేట్!



ఎన్టీఆర్

హీరోల పుట్టినరోజు వస్తోందంటే అభిమానుల జోష్ మామూలుగా ఉండదు. తమ అభిమాన హీరో నటిస్తున్న సినిమాల నుంచి కొత్త పోస్టర్, టైటిల్, టీజర్... ఇలా ఏదో ఒక అప్‌డేట్ వస్తుందని ఆశిస్తుంటారు. అయితే ఈసారి ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు ఈ హీరో నటిస్తున్న తెలుగు సినిమా అప్‌డేట్ ఏమీ ఉండదు. ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్). ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టి. సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. కాగా ఈ నెల 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా 'ఎన్టీఆర్ నీల్' నుంచి అప్‌డేట్ ఉంటుందని ఫ్యాన్స్ ఆశించారు. అయితే.. ఆ రోజు ఎటువంటి అప్‌డేట్ ఉండదని మేకర్స్ స్పష్టం చేశారు. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటించిన హిందీ చిత్రం 'వార్ 2' నుంచి ఎన్టీఆర్ అప్‌డేట్ రానుండటంతో 'ఎన్టీఆర్ నీల్' అప్‌డేట్‌ని పోస్ట్‌పోన్ చేసినట్లు ప్రకటించారు. ఇక 'వార్' ఈ ఏడాది ఆగస్టు 14న, 'ఎన్టీఆర్ నీల్' 2026 జూన్ 25న రిలీజ్ కానున్నాయి. ఇదిలా ఉంటే... ఎన్టీఆర్, ప్రియమణి జంటగా, మోహన్‌బాబు, మమతా మోహన్‌దాస్ కీలక పాత్రల్లో రూపొందిన చిత్రం 'యమదొంగ'. రాజమౌళి దర్శకత్వం వహించిన ఈ సినిమాని ఎన్టీఆర్ బర్త్ డేని పురస్కరించుకుని నేడు రీ రిలీజ్ చేస్తున్నారు.

తెలుగులో కేసరి ఛాప్టర్ 2



'కేసరి ఛాప్టర్ 2' పోస్టర్

అక్షయ్ కుమార్ హీరోగా నటించిన చిత్రం 'కేసరి ఛాప్టర్ 2: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ జలియన్‌వాలా బాగ్'. ఆర్. మాధవన్, అనన్యా పాండే ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. కరణ్ సింగ్ త్యాగీ దర్శకత్వం వహించారు. ధర్మా ప్రొడక్షన్స్, లియో మీడియా కలెక్టివ్, కేప్ ఆఫ్ గుడ్ ఫిలిమ్స్ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 18న హిందీలో విడుదలైంది. సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ 'కేసరి ఛాప్టర్ 2'ని ఈ నెల 23న తెలుగులో విడుదల చేస్తోంది. తాజాగా తెలుగు ట్రైలర్‌ని విడుదల చేశారు. ''జలియన్‌వాలా బాగ్ హత్యాకాండ తర్వాత జరిగిన సంఘటనలతో 'కేసరి ఛాప్టర్ 2' రూపొందింది. ఈ చిత్రం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతూ ఇప్పటికే సుమారు రూ. 100 కోట్ల వసూళ్లు సాధించింది. కోర్ట్ సన్నివేశాల్లో అక్షయ్ కుమార్ భావోద్వేగమైన నటనకు విశేష ప్రశంసలు లభించాయి. 'కేసరి ఛాప్టర్ 2' తెలుగు ప్రేక్షకులకు పవర్‌ఫుల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించనుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

ముగ్గురు హీరోలతో కష్టం అనుకున్నా! - దర్శకుడు విజయ్ కనకమేడల



''**చా**లామంది ఫ్రీమేక్‌లు చేస్తున్నారు. కానీ... మేం అధికారికంగా రీమేక్ (తమిళ హిట్ ఫిల్మ్ 'గరుడన్'కు తెలుగు రీమేక్ 'భైరవం') చేశాం. అయినా ప్రేక్షకులు ఏ సినిమా బాగున్నా చూస్తారు. అది రీమేకా... ఫ్రీమేకా? అని పెద్దగా ఆలోచించరు. 'భైరవం' సినిమా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది. నా ప్రతి సినిమాలో ఉండే ఓ సామాజిక సందేశం ఈ సినిమాలోనూ ఉంది'' అని అన్నారు దర్శకుడు విజయ్ కనకమేడల. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ హీరోలుగా నటించిన చిత్రం 'భైరవం'. అదితీ శంకర్, ఆనంది, దివ్యా పిళ్లై హీరోయిన్లుగా నటించారు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో పెన్ స్టూడియోస్ అధినేత జయంతిలాల్ గడా సమర్పణలో కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విజయ్ కనకమేడల మాట్లాడుతూ-''తమిళ సినిమా 'గరుడన్' కథ కమర్షియల్‌గానూ నాకు నచ్చింది. తెలుగులోనూ ముగ్గురు హీరోలతో చేయొచ్చనిపించింది. కథ అనుకున్నప్పుడే సాయి గారిని హీరోగా ఫైనల్ చేశాం. రోహిత్, మనోజ్‌గార్లను ఆ తర్వాత కలిస్తే, వారూ ఓకే చెప్పారు. కథలో ఈ ముగ్గురు హీరోలకు సమ ప్రాధాన్యత ఉంటుంది. మొదట్లో ముగ్గురు హీరోలతో సినిమా చేయడం కష్టమేమో అనిపించింది. కానీ... ఈ ముగ్గురు ఆఫ్ స్క్రీన్‌లోనూ మంచి మిత్రులు. దాంతో నా పని సులువైంది. ఇక 'భైరవం' కథ విషయానికొస్తే... ముగ్గురు స్నేహితుల ఫ్యామిలీల మధ్య జరిగే కథ. ఒక గ్రామంలో గుడి ఉంటుంది. ఆ గుడి క్షేత్రపాలకుడు భైరవుడు. ఆ భైరవుడి రూపం నుంచి సినిమాకి 'భైరవం' అని టైటిల్ పెట్టాం. కథలో ఒక హీరోకు (బెల్లంకొండ సాయిశ్రీనివాస్ పాత్రను ఉద్దేశించి) చిన్నప్పట్నుంచి కాలభైరవుడు పూనతాడు. ఎందుకు? ఏమిటి? అనేది సినిమా చూస్తే తెలుస్తుంది. సినిమాలో మంచి ఎమోషన్ ఉంది. యాక్షన్ సీక్వెన్స్‌లూ అలరిస్తాయి. నా తర్వాతి సినిమా ఇంకా ఖరారు కాలేదు. నా దగ్గర చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్‌గార్లకు తగిన కథలు ఉన్నాయి'' అని అన్నారు.

తెలుగులో ఏస్



విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి హీరోగా, రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఏస్'. అరుముగ కుమార్ దర్శకత్వంలో 7సీఎస్ ఎంటర్‌టైన్మెంట్స్‌పై అరుముగ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదల కానుంది. ఈ చిత్రం తెలుగు విడుదల హక్కుల్ని శ్రీ పద్మిణి సినిమాస్ దక్కించుకుంది. పద్మ సమర్పణలో శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్‌పై బి. శివప్రసాద్ ఈ సినిమాని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయనున్నారు. ''ఏస్' కోసం ప్రముఖ ప్రొడక్షన్ కంపెనీలు పోటీ పడినా తెలుగు విడుదల హక్కులను మేము దక్కించుకోవడం సంతోషంగా ఉంది. ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు భాషల్లో ఈ నెల 23న రిలీజ్ చేయబోతున్నాం'' అన్నారు బి. శివ ప్రసాద్.

టైటిల్‌తోనే విజయం సాధించారు - మారుతి



జనార్దన్ ఆచారి, ప్రవీణ్, మారుతి, హర్ష, ఎస్‌జె శివ

''బకాసుర రెస్టారెంట్' టైటిల్ చాలా బాగుంది. మంచి టైటిల్ పెట్టడంతో సిని మాపై పాజిటివ్ వైబ్ ఉంది. సినిమా కూడా బాగుంటుందనే అనుభూతి కలుగుతోంది. ఈ చిత్రం టైటిల్‌తోనే విజయం సాధించారు. తప్పకుండా ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారుతి చెప్పారు. ప్రవీణ్ ప్రధాన పాత్రలో, వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్‌జే శివ దర్శకత్వంలో ఎస్‌జే మూవీస్‌పై లక్ష్మయ్య ఆచారి, జనార్దన్ ఆచారి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి మారుతి ముఖ్య అతిథిగా హాజరై, ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ- ''మారుతిగారి దర్శకత్వంలో వచ్చిన 'ప్రేమకథా చిత్రమ్' నా కెరీర్ సెట్ కావడానికి ఎంతో ఉపయోగపడింది. ఆయన నా సినిమా ట్రైలర్‌ని రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''ఇలాంటి కథతో ఇప్పటివరకు తెలుగులో సినిమా రాలేదు. ఇందులోని ప్రతి పాత్రని బాగా డిజైన్ చేయడం జరిగింది'' అని ఎస్‌జే శివ తెలిపారు. ''శివ ఈ లైన్ చెప్పగానే బాగా నచ్చింది. పాత్రకు తగ్గ ఆర్టిస్టులు కుదిరారు. మా సినిమా తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని జనార్దన్ ఆచారి చెప్పారు. ''కుటుంబంతో కలిసి అందరూ థియేటర్‌లో ఎంజాయ్ చేయాల్సిన చిత్రం ఇది'' అని వైవా హర్ష పేర్కొన్నారు.

- అడవిలో అడ్వెంచర్ చేస్తున్న హీరోలు
- కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' ట్రైలర్ లాంచ్
- 'కాన్స్'లో నమస్తే!
- ఓటీటీలో స్ట్రీమ్ అవుతున్న 'విద్యాపతి'

విశేషాల కోసం 'సాక్షి' ప్లస్ ఈ పేపర్ చూడండి.

ఈ పుట్టినరోజు చాలా ప్రత్యేకం



సుమయా రెడ్డి

''నా జీవితంలో ఈ పుట్టినరోజు చాలా ప్రత్యేకం. నేను హీరోయిన్‌గా నటించి, నిర్మించిన 'డియర్ ఉమ' ఇటీవల విడుదలై, ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు తెచ్చుకుంది'' అని నటి, నిర్మాత సుమయా రెడ్డి తెలిపారు. ఆమె కథ అందించి, హీరోయిన్‌గా నటించి, నిర్మించిన చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేశ్ మహాదేవ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పృథ్వీ అంబర్ హీరోగా నటించారు. ఈ సినిమా ఏప్రిల్ 18న విడుదలైంది. నేడు (మే 18) సుమయా రెడ్డి బర్త్ డే. ఈ సందర్భంగా సుమయ మాట్లాడుతూ- ''ఓ తెలుగమ్మాయి హీరోయిన్‌గా, రచయితగా, నిర్మాతగా తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు సంపాదించడం అంటే చిన్న విషయం కాదు. కానీ, 'డియర్ ఉమ'కి మంచి గుర్తింపు, ప్రశంసలు అందుకున్నాను. ఇక మా సుమ చిత్రా ఆర్ట్స్ బ్యానర్‌లో కొన్ని చిత్రాలు చేయనున్నాను. అలాగే హీరోయిన్‌గా కొన్ని ప్రాజెక్టులకు చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

తెలంగాణ సినీ కార్మికులకు పని కల్పించండి

\- ప్రతాని రామకృష్ణ గౌడ్



''ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు విడిపోయి 11 ఏళ్లకు పైగా అవుతోంది. రెండు రాష్ట్రాల్లో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్స్ (ఎఫ్‌డీసీ) ఏర్పడ్డాయి. కానీ, తెలంగాణ సినీ కార్మికులు పని లేక కష్టాలు పడుతున్నారు. వారికి పని కల్పించండి'' అని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్, నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ కోరారు. నేడు (మే 18) ఆయన పుట్టినరోజు సందర్భంగా శనివారం రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ- ''తెలంగాణలో ఎంతో మంది ప్రతిభగల సాంకేతిక నిపుణులు ఉన్నారు. వాళ్లకు అవకాశాలు ఇవ్వాలి. ప్రభుత్వం కూడా జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలి. ఇక నా దర్శకత్వంలో తెరకెక్కిన 'దీక్ష' చిత్రం జూన్‌లో విడుదల కానుంది. అలాగే నా దర్శకత్వంలో 'ఉమెన్స్ కబడ్డీ' అనే చిత్రాన్ని ప్రారంభించనున్నాను'' అన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



వైశ్య/30yrs / MBA / Own Business/ 12 Lac Income / 25 Acres Land/ కోట్ల ప్రాపర్టీ గల వరుడికి వధువు కావలెను. Ph: 8522098546 [H-783538]

బెస్త, గంగపుత్ర, అగ్నికుల క్షత్రియ/B.Tech/ Govt. Asst. ఇంజనీర్ / ఎలక్ట్రికల్ Dept/ 90,000/-PM /5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9550166072 [HA-15166]

కుమ్మరి/M.Tech, IIT / C.Govt. Asst. ఇంజనీర్/RWS / 80,000/-PM / 6' ఎత్తు /29 సం॥ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 9618008271 [HA-15166]

హిందూ/కుల ప్రసక్తి లేదు/28/5'8"/B.Tech, SWE, Working well Fargo (Bank), 1L PM, సొంత ఇల్లు Hydలో గల వరునికి వధువు కావలెను. Ph: 7032135461 [HA-15171]

రజక/కట్న ప్రసక్తి లేదు/B.Tech/Govt. బ్యాంక్ మేనేజర్/యూనియన్ బ్యాంక్/ 80000/-Pm/5'10" ఎత్తు / 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 7075953400, 8897459038 [HA-15171]

హిందూ కుల, కట్న ప్రసక్తి లేని 34/5'7"/ 9L PA SWE/ బిజినెస్ Hyd లో సొంత ఇల్లు వున్న అందమైన వరునికి, 1వ, 2 వ సంప్రదాయ పేద కుటుంబం వధువు కావలెను. 83329 96699 [B-755611]

5.5/21y/బి.టెక్, 2వ సం॥, ఉత్తమ తెలివి గల వరునికి ఇల్లరికం గాని, విడో గాని, ఆస్తి ఉన్న వారికి, ఆర్య వైశ్యులకు మాత్రమే. నంద్యాల జిల్లా. డైరెక్ట్- Ph: 70955 39022. [SCA25003782]

★

ఆర్యవైశ్య అబ్బాయి 1989 MEd ప్రైవేట్ లెక్చరర్, 36 వేలు, ఆస్తి 1 కోటి నల్లగొండ. కోమట్ల అమ్మాయి కావలెను 1వ. వీరయ్య M9HB మునుగోడ్ రోడ్. [Y-SCA25003798]

SC-Mala-Hindu 2nd Marriage PG 5'10"/ 40y / SWE. 1,60,000/-PM Wants Good Hindu Bride only. 8187861989. No Brokers [H-821060]

★★

డైరెక్ట్:/కుల పట్టింపు లేదు/5'5"/50Yrs/ కాపు. నెలకు యాభై వేల ఆదాయం కలిగి రూ. 40 లక్షల స్థిరాస్తి గల వ్యక్తికి మంచితనమున్న వధువు కావలెను. పిల్లలున్నా ఓకె. Cont: 8919549274 [H-1273265]

వరుడు కావలెను



రెడ్డి/2nd మ్యారేజ్/కుల, ఆస్తి పట్టింపు లేదు/30Y, H: 5'4"/ సొంత బిజినెస్స్ Medical Shop & Clinic గల అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) అన్ని కులాల, వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 9121516873 [HA-15171]

ఆది-ఆంధ్రా/24/5'3"/ఫెయిర్/B.Tech (EEE) System Engineer MNC Hyd వెల్ సెటిల్డ్ వధువుకు Working in MNC Lead/Head గల వెల్ సెటిల్డ్ వరుడు కావలెను. Ph: 9948516705 [H-804895]

రెడ్డి/2nd మ్యారేజ్ (కుల-ఆస్తి) ప్రసక్తి లేదు 33Y, B.Com/Business & Properties గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం) OK. అన్ని వయస్సుల-కులాల వారికి 1st, 2వ సంబంధాలు కలవు. Ph: 9704782370 [HA-15171]

వైశ్య/49Y / విడో / MBA / Own School/ Govt. Pentioner / 110 Acres Land/ 32 Lac Income/ కోట్ల ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 7330635548 [H-783538]

క్షత్రియ/విడో /50Y /Govt Job/Own Business /Director/70 Acres Land/23 Lac Income/కోట్ల ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను కుల ప్రసక్తి లేదు. Ph: 9966787546 [H-783538]

కమ్మ/ 50y / విడో / అగ్రికల్చర్ జాబ్/ గ్రానైట్/Iran Factory/80 Acres Land/ కోట్ల ప్రాపర్టీ కలిగిన వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7993818296 [H-783538]

నాయుడు / 50Y / విడో / Govt. పెన్షనర్ / Own Petro Pump / 90 Acres Land 3 L/PM/కోట్ల ప్రాపర్టీ కలిగిన వధువుకి FC/ BC వరుడు కావలెను. Ph: 9347216440 [H-783538]

రెడ్డి/విడో / Govt. Rtd పెన్షనర్, Railway అకౌంటెంట్, 48 years, సొంత ఇల్లు, రైస్ బిజినెస్, 4 Lakh PM, పిల్లలులేని వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తి లేదు. 7732054195 [H-783667]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel- kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/BIG Business/B.Tech/ 1982/ 5'8"/250Cr/Needs UnMarried or even Married(Divorcee) Compatible * Cont: K.C. Reddy Hyd. Ph: 9347807015

Reddy/BIG Business/B.Tech/MBA / 1994 /6'/800Cr *96/6'/500Cr *98/6'/450Cr *95/ 5'7"/2000Cr *95/5'8"/250Cr *90/6'/ 1000Cr * Cont: K.C. Reddy Hyd. Ph: 9849321309

Reddy/Business/B.Tech/MBA *Rich *95/ 5'10"/300Cr *95/6'/150Cr *97/5'11"/100Cr *91/6'/75Cr *94/5'11"/150Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/Business/Rich Family / B.Tech/ *94/6'/50Cr *89/6'/40Cr *94/6'/70Cr *97/ 5'9"/100Cr *93/5'7"/50Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/IIT/SWE/1998/5'11" *2000/ 5'11" *96/6' *94/5'11" *94/5'11" *94/5'9" *96/5'6" *93/5'11" *93/5'10" *96/5'7" * Cont: K.C. Reddy- Hyd. Ph: 9347807015

Reddy/MBBS/MD/96/6'/50Cr *95/ 5'10"/ 200Cr *USA-Doc *92/6' *95/5'8" *92/5'11" *75/6' *95/5'11" *98/5'8" * Cont: K.C. Reddy- Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1998/5'11"/ 230K/30Cr *93/5'11"/240K/25Cr *94/5'11"/ 400K/30Cr *93/5'11"/350K/100Cr * Cont: K.C.Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/ H1/ USA *93/5'8"/205K/ 20Cr *96/6'/110K/80Cr *95/5'10"/260K/100Cr *95/ 5'7"/ 300K/10Cr * Cont: K.C. Reddy Mar-Bureau-Pvt Ltd-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/Catholic *B.Tech/MS/H1 / USA/ 1994/ 5'8"/200K/ *USA-Citizen/1986/ 5'7"/200K/ *90/ 6'/ 90K/15Cr (Canada) * Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015

Reddy/ Divorcee/B.Tech/MS/Business /1981/5'8"/1000Cr *89/5'11"/60L/yr/30Cr *79/5'9"/300Cr *90/5'11"/230K / 80Cr * Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015

వరుడు కావలెను

Reddy/B.Tech/Most Beautiful *1998/ 5'8"/ 50Cr *94/5'4"/90Cr *95/5'5"/100Cr *2000/ 5'6"/100Cr *99/5'7"/100Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/B.Tech/Most Beautiful *1995/ 5'5"/70Cr *97/5'4"/100Cr *94/5'10"/60Cr *97/5'5"/25Cr *96/5'8/40Cr *94/5'3"/300Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/B.Tech/Most Beautiful *1999/ 5'8"/20Cr *95/5'3"/50Cr *93/5'3"/1000Cr *88/5'3"/300Cr *98/5'5"/30Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1994/5'8"/ 8Cr *94/5'4"/30Cr *97/5'4"/100Cr *96/ 5'3"/ 30Cr *98/5'4"/10Cr *99/5'6"/100Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/MBA / IIM / Most Beautiful/ 2000/5'4"/White/300Cr-Needs Well Settled Hyd * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015 /9849321309

Reddy/MBBS / PG-Doc *1998/5'5"/50Cr *96/ 5'3"/ 50Cr *95/5'5"/100Cr *98/5'7"/ 70Cr *97/5'6"/ 500Cr *90/5'6"/100Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/IIT/BITS/*1997/5'4"/ 25L/yr/6Cr *2000/5'7"/45L/yr / 10Cr *96/5'7"/ *94/ 5'4"/*97/5'4"/200K *95/5'6"/200K * Cont : K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/MBBS / USA-Doc *1996 / 5'2" * 95/ 5'5" *95/5'7" *96/5'2" *95/5'2" *96/5'5" *87/5'4" *91/5'1" *98/5'3" * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015 /9849321309

Reddy/Divorcee/India *B.Tech 1991/ 5'8"/ 6Cr *94/5'4"/10Cr *93/5'4"/10Cr *91/5'4"/ 10Cr *85/5'5"/400Cr *93/5'6"/50Cr * Cont: K.C. Reddy - Hyd-Ph: 9347807015

Reddy/Divorcee/MBBS/PG/Docs/1994/ 5'5"/50Cr *86/5'6"/50Cr *93/5'8"/40Cr *86/ 5'4"/20Cr *92/5'3"/9Cr * Cont: K.C. Reddy -Hyd-Ph: 9849321309/9347807015 [D-570]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No:3, Banjara Hills (TV-9, Opp: Colony) (Near The Leela Hotel) Hyderabad. (Tuesday & Wednesday Holiday) Timings : 10 AM - 5 PM. www.avinashreddy.com +91 9848011818 / +91 9393311818

వధువు కావలెను

రెడ్డి NewJersey, BS, 27, 6' 2", SWE, 120 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి California, BE, MS, 28, 5' 9", SWE, 50 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 26, 5' 10", SWE, 100 K, 50 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి Austin, BE, MS, 26, 5' 7", Analyst, 200 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Tennessee, BE (NIT), MS, 30, 6', Sr. SWE, Rich Family, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి SFO, BE, MS, 34, 5' 11", SWE, 295 K, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 11", Residency Doctor, 10 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, NewYork, BS, MS, 28, 5' 2", 100 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 27, 5' 7", SWE, 101 K, 8 Crores, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, NewYork, BS, MS, 29, 5' 5", Sr. Analyst, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 28, 5' 4", 10 Crores, USA, Fair: Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Seattle, BE, MS, 29, 5' 4", SWE, 200 K, H1, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి NewJersey, BE (NIT), MS, 28, 5' 3", Product Manager, 150 K, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Florida, BE, MS, 29, 5' 4", SWE, 120 K, 3 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. [LETTER]

OC/ విడో / Fair / Govt. Job / సొంత ఇల్లు/3 ఎకరాల వ్యవసాయ భూమి గల వధువుకి వరుడు కావలెను. Ph: 6281849287 [H-783667]

BC/విడో/50y/5'3"/Private School Teacher/2 ఎకరాల వ్యవసాయ భూమి సొంత ఇల్లు గల వధువుకి మధ్య తరగతి వరుడు కావలెను. Ph: 9182832814 [H-783667]

కమ్మ-రెడ్డి/ కుల పట్టింపు లేదు / ఏజ్ : 50yrs/ లేట్ & 2nd Mach/5'4"/ ఫెయిర్/ Govt. జాబ్ 90K (pm)/ప్రాపర్టీ గల వధువుకి ఇల్లరికం వరుడు కావలెను. # 9581120134 [H-783667]

రెడ్డి/విడో/50Y/ప్రాపర్ గుంటూరు సొంత అపార్ట్‌మెంట్స్ / సొంత హాస్టల్స్/రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను (అర్జెంట్) (నో బ్రోకర్స్) (ఇల్లరికం OK) ఫోన్ : 7799083500, 7386660643 [H-783667]

క్రిస్టియన్ మాదిగ/B.Tech/C.Govt. స్టెనో గ్రాఫర్ / రైల్వే/45000/-PM/5'4" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-15166]

SC హిందూ మాల/ఏకైక కుమార్తె/ B.Tech/ C.Govt. Asst. మేనేజర్/ఇండియన్ బ్యాంక్/1 Lakh PM/5'5" ఎత్తు 26 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9908222406 [HA-15166]

2వ పెళ్లి/ కుల ప్రసక్తి లేదు / B.SC Agri / C. Govt.P.O/SBI బ్యాంక్/80,000/-PM/ 5'4"ఎత్తు/32 సం॥ల పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15166]

రెడ్డి/విడో/కుల, ఆస్తి, ప్రసక్తి లేదు/Age: 35/ Qly: Degree. Pvt Job గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) అన్ని కులాల వారికి వివాహాలు చూడబడును. Ph: 8121347478 [HA-15171]

రెడ్డి/కుల పట్టింపు లేదు/26y, 5'3" B.Tech పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. 9133640971 [HA-15171]

మాల/క్యాథోలిక్/25Y/5'7"/B.Tech/Fair /Software Engineer Same Caste/ మంచి కుటుంబానికి చెందిన Job చేసే వరుడు కావలెను. నో బ్రోకర్స్. Ph: 7674014378 [HA-15171]

ముదిరాజ్ / B.Tech / C.Govt. క్యాషియర్ / Union Bank/ 42,000PM/ 5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9515942275 [HA-15171]

రజక/B.Tech / C.Govt. బ్యాంకు PO/ SBI / 55000/-PM / 5'4"ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15171]

డైరెక్ట్ CNB, రిచ్ ST కొండదొర 28 సం॥, B.Tech, జీతం : 30 లక్షలు P/A అందమైన వధువుకు వరుడు కావలెను. వాట్సాప్ : 77949 11952 [SCA25003666]

Reddy 25/5'3"/ MBBS MD 30Cr. Beautiful Looking for Doctor/ Business Groom from well Settled Reddy family, no brokers. Ph: 8008138863 [HA-15171]

★

Aryavysya/ 34yrs / Fair, good looking/ 5'5"/5 Cr Prop., 20 LPA/ with 7yrs boy/for 2nd marriage. Seeks 35-38yrs well employed Vysya/Brahmin groom preferably at Bangalore, 1st/2nd marriage with or W/o Kids. 9980563027 [HA-15165]

★★

యాదవ:32 Yrs/5'.4"/B.Tech/ప్రభుత్వ ఉద్యోగినికి తగిన ప్రభుత్వ ఉద్యోగి/ఆర్థిక స్తోమత గల వరుడు కావలెను. డైరెక్ట్ సంప్ర: 79974 86067, నో బ్రోకర్స్. [T-2286]

వేదికలు



Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7093016945 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15175]

15 రో॥ అన్ని కులాల వారికి తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి మ్యారేజి లైన్స్. Wanted Branch Runners. ✆ 94418 29644, 9849058673, 94407 85888, 9493661288 (W) [B-623]

Arya Vysya పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7093016945 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15175]

Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7093016945 /Blue Trend Matrimonial (P) Ltd. [HA-15175]

Personal Service: సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్, VIP వారికి అన్ని కులముల వారికి పెళ్ళి సంబంధాలు చూడబడును. పూర్ణ మ్యాట్రిమోని,తిరుపతి, 70937 22724. [T-3262]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15175]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph:7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15175]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-1495]

క్లుప్తంగా...

20 మంది మావోయిస్టుల అరెస్ట్

- భారీగా ఆయుధాలు, విప్లవ సాహిత్యం స్వాధీనం : ఎస్పీ శబరీశ్

ములుగు: కర్రి గుట్టల నుంచి తప్పించుకునే క్రమంలో ములుగు జిల్లాలోకి ప్రవేశించిన 20 మంది మా వోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 16న వెంకటాపురం(కె) మండలం పాలెం ప్రాజెక్ట్ సమీపంలో చేపట్టిన వాహన తనిఖీల్లో ఆరుగురిని, 17వ తేదీన వాజేడు పరిధిలోని మురుమ్మూరు అటవీ ప్రాంతంలో చేపట్టిన సెర్చ్ ఆపరేషన్‌లో ఏడుగురిని, కన్నాయిగూడెం మండలంలోని గుత్తికోయగూడెం సమీపంలో చేప ట్టిన పెట్రోలింగ్‌లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం ఎస్పీ డాక్టర్ శబరీశ్ వీరి అరెస్ట్ చూపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మావోయిస్టులకు గిరిజ న గ్రామాల ప్రజలు సహకరించొద్దని సూచించారు. కాగా, మావోయిస్టు పార్టీకి చెందిన 8 మంది సభ్యులు ఎస్పీ డాక్టర్ శబరీశ్ సమక్షంలో లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో మాడ్ డివిజినల్ కమిటీ సభ్యుడు మడకం ఐతా అలియాస్ ఉద్దంసింగ్, ఆరుగురు సభ్యులు, ఒకరు మిలీషియా సభ్యుడు ఉన్నారు. లొంగిపోయిన వారికి తక్షణ సహాయంగా రూ. 25 వేల చొప్పున డీడీలు అందించారు.

వలస కార్మికులకు మలేసియాలో క్షమాభిక్ష

మోర్తాడ్ (బాల్కొండ): మలేషియాలో చట్టవిరుద్ధంగా ఉంటున్న వలస కార్మికులు ఎలాంటి జైలు శిక్ష లేకుండా స్వదేశాలకు తిరిగి వెళ్లడానికి అక్కడి ప్రభుత్వం ఆమ్నెస్టీ (క్షమాభిక్ష) ప్రకటించింది. చట్టవిరుద్ధంగా ఉంటున్న విదేశీ వలస కార్మికుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో వారిని నియంత్రించాలని మలేసియా హోం మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా తాజాగా క్షమాభిక్షను ప్రకటించింది. వీసా గడువు ముగిసిన వారు, పాస్‌పోర్టు చేతిలో లేనివారు ఎలాంటి క్రిమినల్ కేసులను ఎదుర్కోకుండానే స్వదేశాలకు వెళ్లడానికి అవకాశం ఉంది. క్షమాభిక్ష నిర్ణయం సోమవారం నుంచి అమలులోకి రానుంది. ఇది వచ్చే ఏడాది ఏప్రిల్ 30వ తేదీ వరకు అమలులో ఉంటుంది. మలేసియాలో చట్టవిరుద్ధంగా ఉంటున్న తెలంగాణ వలస కార్మికుల సంఖ్య 6 వేల వరకు ఉంటుంది.

క్షమాభిక్షను ఉపయోగించుకోవాలి

మలేషియాలో చట్టవిరుద్ధంగా ఉంటున్న తెలంగాణ వలస కార్మికులు అక్కడి ప్రభుత్వం ప్రకటించిన క్షమాభిక్ష అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా అక్కడే ఉన్నా.. కంపెనీలు, వ్యాపారులు పనులు ఇచ్చే పరిస్థితి ఉండదు. అందువల్ల వీసాలు లేని వారు స్వదేశానికి తిరిగి రావడమే మంచిది

– స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు, తెలంగాణ

క్యాంపులు పెట్టి.. కట్టడి చేసి...

- దండకారణ్యంలో ప్రతి 5 కిలోమీటర్లకు ఒక క్యాంప్
- బేస్‌క్యాంప్ అండతో అడవుల్లోకి ప్రభుత్వ పథకాలు
- మావోయిస్టులు మళ్లీ అటువైపు రాకుండా చర్యలు
- నక్సలైట్ల ఆయువుపట్లన్నీ క్రమంగా బలగాల చేతుల్లోకి
- కర్రిగుట్టల వద్ద కూడా బేస్‌క్యాంప్‌ల వ్యూహం అమలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కొద్దిరోజుల క్రితం వరకు మావోయిస్టుల పెట్టని కోటలా ఉన్న కర్రిగుట్టలు ఇప్పుడు పూర్తిగా భద్రతా బలగాల అధీనంలోకి వచ్చాయి. మావోయిస్టుల షెల్టర్‌జోన్‌గా ఉన్న తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రిగుట్టలను ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ పేరుతో భద్రతా దళాలు జల్లెడ పట్టాయి. ఏప్రిల్ 21 నుంచి మే 11 వరకు జరిగిన ఈ ఆపరేషన్‌తో కర్రిగుట్టల ప్రాంతం మొత్తం భద్రతా దళాల ఆధీనంలోకి వచ్చింది. దీంతో దండకారణ్యంలో మావోయిస్టులకు సంబంధించిన ప్రధాన స్థావరాలన్నీ ప్రభుత్వ బలగాల చేతుల్లోకి వచ్చినట్టయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. మరోసారి ఈ ప్రాంతాలకు మావోయిస్టులు రాకుండా చూడడంతో పాటు ప్రభుత్వ పరంగా కనీస అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు వీలుగా ఇక్కడ క్యాంపులు ఏర్పాటు చేస్తోంది.



మావోయిస్టు నేత మడావి హిడ్మా సొంతూరైన పూవర్తిలో బేస్‌క్యాంప్ ఏర్పాట్లు (ఫైల్)

కర్రిగుట్టల చుట్టూ ఉన్న పూజారి కాంకేర్, తడపల, పామునూరు, పెనుగోలు ప్రాంతాల్లో క్యాంపులు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

క్యాంపులతో అడవిలోకి అడుగు

ఆపరేషన్ గ్రీన్‌హంట్ మొదలైనప్పటి నుంచి నిర్విరామంగా కూంబింగ్ చేపట్టి ఎన్‌కౌంటర్లు జరిపినా భద్రతా దళాలు ఆశించిన ఫలితాలు సాధించలేకపోయాయి. దీంతో బస్తర్ అడవుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, తన ఉనికి కనిపించేలా చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందుకోసం దండకారణ్యంలో విరివిగా బేస్‌క్యాంపులు ఏర్పాటు చేస్తూ వచ్చింది. అడవుల్లో రోడ్లు, మొబైల్ కనెక్టివిటీ, ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పిస్తూ వచ్చారు. ఆ తర్వాత దశలో విద్యుత్, అంగన్‌వాడీ సెంటర్లు ఏర్పాటు చేశారు. పనుల నాణ్యతపై విమర్శలు ఉన్నప్పటికీ క్యాంపుల ఆసరాతో ప్రభుత్వ యంత్రాంగం అడవుల్లో అడుగుపెట్టగలిగింది.

5 కిలోమీటర్లకో క్యాంపు

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ పనులు సజావుగా సాగేందుకు భద్రతా దళాల రక్షణ అవసరంగా మారింది. దీంతో ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక బేస్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నారు. కర్రిగుట్టల సమీపంలో పూజారి కాంకేర్ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన బేస్ క్యాంపులో తొలుత 800 మంది జవాన్లు విధుల్లో ఉంటారు. ఈ క్యాంపు కేంద్రంగా చుట్టుపక్కల గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు క్రమం తప్పకుండా అడవుల్లో కూంబింగ్ చేస్తూ ఆ ప్రాంతంలోకి మావోయిస్టులు రాకుండా అడ్డుకుంటారు. ఆ క్యాంపు ఏర్పాటైన వంద రోజుల్లోపు అక్కడి నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో మరో క్యాంప్ ఏర్పాటు చేస్తారు. అక్కడ కూడా 800 మంది జవాన్లను ఉంచి, పూజారి కాంకేర్ క్యాంపులో జవాన్ల సంఖ్యను 600లకు కుదిస్తారు. ఇలా అడవిలోకి చొచ్చుకెళ్లే వ్యూహం అమలు చేస్తున్నారు.

సానుకూల ఫలితాలు..

క్యాంపుల వ్యూహం భద్రతా దళాలకు ఊహించని విజయాన్ని అందించింది. 2024 ఫిబ్రవరిలో పీఎల్‌జీఏ కంపెనీ వన్ కమాండర్ మడావి హిడ్మా సొంత గ్రామం పూవర్తిలో క్యాంపు ఏర్పాటైతే.. ఏడాది తిరిగేసరికి కొండపల్లి, కవరుగట్టు, జీడిపల్లి క్యాంపులు వచ్చాయి. ఒకప్పుడు ఈ ప్రాంతాలన్నీ మావోయిస్టు పార్టీకి గుండెకాయలా పని చేశాయి. ఇక్కడే ఆయుధ తయారీ, గెరిల్లా ఆర్మీకి సైనిక శిక్షణ శిబిరాలు నిర్వహించారు. బలగాల క్యాంపుల ఏర్పాటుతో ఇప్పుడిక్కడ మావోయిస్టుల ఉనికి మాయమైంది. ఒకప్పుడు కాలిబాటలకే పరిమితమైన ఈ ప్రాంతాల మీదుగా ఇప్పుడు రోజుకు రెండు ట్రిప్పుల బస్ సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి.

కొలువుదీరేదెప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి

వస్తుంది. అప్పటివరకు వేచి చూడక తప్పదని అధికారవర్గాలు అంటున్నాయి.

కోర్టు కేసులతో..

గ్రూప్–1 కేటగిరీలో 503 ఉద్యోగాల భర్తీకి 2022 ఏప్రిల్‌లో నోటిఫికేషన్ వెలువడింది. రెండుసార్లు ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించినప్పటికీ ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో లోపాలతో వాటిని ప్రభుత్వం రద్దు చేసింది. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పోస్టుల సంఖ్యను 563కు పెంచి టీజీపీఎస్సీ ద్వారా 2024 ఫిబ్రవరిలో కొత్తగా నోటిఫికేషన్ జారీ చేసింది. అదే ఏడాది జూన్‌లో ప్రిలిమినరీ పరీక్షలు, అక్టోబర్‌లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. ఈ ఏడాది మార్చిలో టీజీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్స్ ఫలితాలు విడుదలతోపాటు తుది జాబితాను ప్రకటించింది. అయితే, మెయిన్స్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ఎంపిక ప్రక్రియలో తప్పులు జరిగాయని పలువురు అభ్యర్థులు కోర్టుకు వెళ్లటంతో భర్తీ ప్రక్రియను నిలిపేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో నియామక ప్రక్రియ ఆగింది.

- గ్రూప్–1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తయిన తర్వాతే గ్రూప్–2, గ్రూప్–3 పోస్టులు భర్తీ చేయాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. అలా అయితేనే కిందిస్థాయి పోస్టులు ఖాళీ కాకుండా ఉంటాయని భావిస్తోంది.
- గతేడాది డిసెంబర్‌లో గ్రూప్–4 కేటగిరీలో 8,180 ఉద్యోగాలను కమిషన్ భర్తీ చేసింది. వాళ్లంతా విధుల్లో చేరారు. ఆ సమయంలో అవరోహణ పద్ధతిని పాటించకపోవడంతో తదుపరి ఎగువస్థాయి పోస్టులు భర్తీ చేసే సమయంలో ఖాళీలు తప్పవని అధికారులు చెబుతున్నారు.
- ఈ నేపథ్యంలో గ్రూప్–1 తుది జాబితాను వేగంగా విడుదల చేసినప్పటికీ నియామకాల ప్రక్రియ చివరి నిమిషంలో కోర్టు ఆదేశాలతో నిలిచింది. తుది తీర్పు వచ్చే వరకు ఈ ప్రక్రియ ముందుకు సాగే అవకాశం లేదు.
- గ్రూప్–1 నియామకాలు పూర్తయ్యే వరకు గ్రూప్–2, గ్రూప్–3 పోస్టులు భర్తీ ముందుకు సాగే పరిస్థితి లేదు.

కేటగిరి	పరీక్ష తేదీ	దరఖాస్తు	హాజరు	శాతం
గ్రూప్-1 ప్రిలిమ్స్	09.06.2024	4,03,645	3,02,172	74.0
గ్రూప్-1 మెయిన్స్	అక్టోబర్ 21-27	31,403	21,093	67.17
గ్రూప్-2	డిసెంబర్ 15-16	5,51,855	2,55,490	46.30
గ్రూప్-3	నవంబర్ 17-18	5,36,400	2,69,483	50.24

కోటి మంది స్త్రీలను కోటీశ్వరుల్ని చేస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను మహిళలకు అప్పగించాం. సమర్థవంతంగా నిర్వహిస్తే మరో వేయి మెగా వాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి వ్యాపారాన్ని అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నాం'అని సీఎం ప్రకటించారు. 'మహిళా శక్తిని కాంగ్రెస్ ఎన్నడూ తక్కువగా అంచనా వేయలేదు. మహిళా శక్తికి చేయూత ఇచ్చేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం, అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు అప్పగించాం, విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టడం, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ తదితరాల వ్యాపారాలు అప్పగించాం. అదానీ, అంబానీలకు పరిమితమైన వ్యాపారాల్లో మహిళలను ప్రోత్సహిస్తూ, శిల్పారామంలో ఎస్‌హెచ్‌జీల ఉత్పత్తుల ప్రదర్శనకు స్టాల్స్‌ను కేటాయించాం'అని రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

గ్రామీణ ప్రాంతాల్లోనూ వి హబ్


'వి హబ్ గత ఏడేళ్లుగా మహిళా పారిశ్రామికవేత్తల సాధికారత కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ వి హబ్ కార్యకలాపాలు సాగుతున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరా మిషన్ మహిళా శక్తి –2025'విధానానికి అనుగుణంగా 'విమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రామ్'ను వి హబ్ తెచ్చింది. దీనిద్వారా మహిళలు ఉద్యోగ కల్పన, సంపద సృష్టి, కొత్త తరం పారిశ్రామికవేత్తలకు ప్రేరణ దిశగా అడుగులు వేస్తున్నారు. వి హబ్ ద్వారా త్వరలో జిల్లాల్లో 'విమెన్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్', 'స్కిల్ డెవలప్‌మెంట్, మినీ మాన్యుఫాక్చరింగ్ హబ్‌లు ఏర్పాటవుతాయి. పెద్దపల్లి, పరకాల, నల్లగొండ, వికారాబాద్‌లో త్వరలో ఈ సెంటర్లు ప్రారంభమవుతాయి. వీటిలో మహిళలకు స్థానికంగా నైపుణ్య శిక్షణ, ఉత్పత్తి సదుపాయాలు, మార్కెట్‌తో అనుసంధానం వంటి అనేక వసతులు సమకూరుతాయి'అని రేవంత్ చెప్పారు. కార్యక్రమంలో ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ శర్మ, వి హబ్ సీఈఓ సీత పల్లచొల్లా, అసోసియేట్ డైరెక్టర్ ఊహ సజ్జా తదితరులు పాల్గొన్నారు.

17 అవగాహన ఒప్పందాలు

విమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రామ్ ప్రారంభం సందర్భంగా వి హబ్ 17 కీలకమైన అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (హైదరాబాద్), ట్రిపుల్ ఐటీ బాసర, గీతమ్ యూనివర్సిటీ, గోదావరి, పెద్దపల్లి గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలు, తారా డిగ్రీ కాలేజీ (సంగారెడ్డి), మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీ, అగ్రి హబ్, హెచ్‌పీ ఇండియా సేల్స్, హైసియా, ఐకోనియా, టీఆర్‌డీ స్టూడియోస్, 1ఎం1ఎంబీ, నిర్మాణ్ ఫౌండేషన్ వంటి సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థల జాబితాలో ఉన్నాయి. 'విమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రామ్'కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ, వరల్డ్ బ్యాంక్ సహకారంతో నడుస్తుంది. ఈ కార్యక్రమం ద్వారా వచ్చే రెండేళ్లలో తెలంగాణలోని 140 మంది మహిళల నేతృత్వంలోని ఎంఎస్ఎంఈలు వ్యాపార అభివృద్ధిని వేగవంతం చేస్తాయి. 'గ్రాస్ రూట్ యూత్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్' ద్వారా గ్రామీణ యువతలో సృజనాత్మకత, సార్టప్ దృక్పథాన్ని పెంపొందిస్తారు. 6 వేల మందికి పైగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మాట తప్పని మాస్టారు

- టెన్త్‌లో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు విమాన ప్రయాణం
- సొంత ఖర్చుతో విశాఖ తీసుకెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు



విమాన ప్రయాణానికి సిద్ధమైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

రామగిరి(మంథని): పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచన విద్యార్థులను సొంత ఖర్చుతో విమానంలో విశాఖ తీసుకెళ్తానని ప్రకటించారు. ఈ మేరకు ఉత్తమ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థినులను ఆదివారం విమానంలో విశాఖ తీసుకెళ్తున్నారు. ఆయనే పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్కా రాంకిషన్‌రావు. పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సొంత ఖర్చుతో విమానంలో విశాఖ తీసుకెళ్తానని గతంలో ఆయన ప్రకటించారు. ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో పాగాల రసిత 558 మార్కులు, శ్రీమంతుల లోహిత 557 మార్కులు సాధించారు. ఇచ్చిన మాట ప్రకారం హెచ్ఎం శనివారం విద్యార్థినులతో కలిసి హైదరాబాద్ బయలుదేరారు. వీరు ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో విమానం ఎక్కనున్నారు. రాంకిషన్‌రావు 2002 నుంచి 2009 వరకు సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో.. ఉత్తర తెలంగాణలో తొలిసారి ఎన్ఆర్ఐ సహకారంతో పాఠశాల అభివృద్ధి చేయించారు. 2009 నుంచి 2015 వరకు కమాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో అనారోగ్యంతో ఉన్న ఇద్దరు పిల్లలకు శస్త్రచికిత్స చేయించారు. 2015 నుంచి 2024 వరకు ఎఫ్‌సీఐ ప్రభుత్వ పాఠశాలలో 39 మంది విద్యార్థులున్న తెలుగు మీడియం పాఠశాలను ఇంగ్లిష్ మీడియంగా మార్చారు. విద్యార్థుల సంఖ్య పెంపు కోసం సొంత ఖర్చుతో దూర ప్రయాణ పిల్లలకు టాటా ఏస్ వాహనం సమకూర్చారు. తాజాగా బేగంపేటలో పదో తరగతి చదువుతున్న 23 మంది విద్యార్థులకు సొంత ఖర్చుతో సుమారు రూ.50 వేల విలువైన స్టడీ కార్నర్ (టేబుల్, చైర్, ల్యాంప్, ప్యాడ్)లను సమకూర్చారు.

క్లుప్తంగా...

ఉత్తమ సేవలతోనే పోలీసు శాఖకు ప్రతిష్ట

- ఎస్‌హెచ్‌వోలతో సమీక్షలో డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్‌: పోలీస్‌ సిబ్బంది ఉత్తమ సేవలందిస్తేనే.. పోలీస్‌ శాఖ ప్రతిష్ట పెరుగుతుందని డీజీపీ డాక్టర్‌ జితేందర్‌ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలకు చెందిన స్టేషన్‌ హౌస్‌ ఆఫీసర్లతో (ఎస్‌హెచ్‌వోలతో) డీజీపీ జితేందర్‌ శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది శిక్షణలో నేర్చుకున్న చట్టాలను తప్పనిసరిగా అమలు చేస్తూ ఎదగాలని సూచించారు. తద్వారా పోలీస్‌ శాఖ ప్రతిష్ట పెరుగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్‌ శాఖకు దేశంలో మంచి పేరు ఉందని గుర్తు చేశారు. ఆ పేరు నిలుపుకొనేందుకు ఎస్‌హెచ్‌వోలు కృషి చేయాలని కోరారు. శాంతిభద్రతల అడిషనల్‌ డీజీ మహేష్‌ భగవత్‌ మాట్లాడుతూ, నకిలీ విత్తన ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో శాంతిభద్రతల ఏఐజీ రమణకుమార్‌, డీఎస్పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఐఏఎస్‌ నుంచి రూ.3.37 కోట్లు కొల్లగొట్టి..

- సైబర్‌ నేరగాళ్లపై కేసు నమోదు చేసిన టీజీసీఎస్‌బీ

సాక్షి, హైదరాబాద్‌: తాము చెప్పిన ట్రేడింగ్‌ యాప్‌లలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి సైబర్‌ నేరగాళ్లు ఓ మాజీ ఐఏఎస్‌ అధికారి (72) నుంచి రూ.3.37 కోట్లు కొల్లగొట్టారు. దీనిపై సదరు మాజీ అధికారి శనివారం టీజీ సైబర్‌ సెక్యూరిటీ బ్యూరో (టీజీ సీఎస్‌బీ)కు ఫిర్యాదు చేశారు. వివరాలు.. సోమాజిగూడలో నివాసం ఉంటున్న మాజీ ఐఏఎస్‌ అధికారి కాజా రత్నకిషోర్‌కు ఆన్‌లైన్‌లో ధని సెక్యూరిటీస్‌ పేరుతో వెబ్‌సైట్‌ కనిపించింది. ట్రేడింగ్‌ ప్లాట్‌ఫామ్‌గా తెలుసుకున్న ఆయన ట్రేడింగ్‌ చేసేందుకు ఆసక్తి చూపాడు. సైబర్‌ నేరగాళ్లు కొన్నాళ్లు వాట్సాప్‌ చాటింగ్‌ ద్వారా నమ్మకాన్ని పెంచి ధని చాట్‌ పేరుతో లింక్‌ పంపించి ఆయనకు పాస్‌వర్డ్‌తో లాగిన్‌ ఇచ్చారు. ఈ క్రమంలోనే అర్జున్‌ మెహతా పేరుతో ఓ మహిళ సంప్రదింపులు జరిపింది. ఇలా మ్యూచువల్‌ ఫండ్స్‌, ఐపీఓ, ఆప్షన్స్‌ ట్రేడింగ్‌ ప్లాట్‌ఫామ్‌లో సబ్‌స్క్రిప్షన్‌ చేయించారు. ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ ఆధారిత మ్యూచువల్‌ ఫండ్స్‌గా నమ్మించారు. ట్రేడింగ్‌ ఆప్షన్స్‌ సిఫార్సు చేసి భారీ ఆఫర్ల ఆశ చూపారు. తాను పెట్టిన పెట్టుబడిలో లాభాలను విత్‌డ్రా చేసుకునేందుకు రత్నకిషోర్‌ యత్నించగా సాధ్యపడలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్‌ పోలీసులను ఆశ్రయించారు. టీజీసీఎస్‌బీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైసెన్స్‌డ్‌ సర్వేయర్ల శిక్షణకు భారీగా దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్‌: లైసెన్స్‌డ్‌ సర్వేయర్ల శిక్షణ కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. శనివారం గడువు ముగిసే సమయానికి.. 8,500 మందికి పైగా.. దరఖాస్తు చేసుకున్నట్లు రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి. దరఖాస్తులను సోమవారం నుంచి పరిశీలిస్తారని తెలిపాయి. ఈ వారంలోనే శిక్షణకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి 50 రోజుల శిక్షణ అనంతరం.. జూలై చివరి నాటికి లైసెన్స్‌డ్‌ సర్వేయర్లను అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నాయి.



ఆచారమా? అరాచకమా?

చిరుతపులులకు అతీంద్రియ శక్తులు ఉంటాయా? మన దగ్గర ఉన్నవాటి గురించి తెలియదు గానీ.. కాంగోలోని వాటికి మాత్రం ఉంటాయట. వాటికి బ్లాక్‌ మ్యాజిక్‌ తెలుసట. చేతబడిలాంటివీ చేసేస్తాయట. అలాగని.. అక్కడి ఆషవ్‌ ప్రాంత గిరిజన ప్రజలు నమ్ముతారు. ఫొటోలోని చిరుత ముఖం, కాళ్లు కనపడకుండా ఆకులతో చుట్టినది అందుకే. అలా చుట్టకుంటే.. గ్రామస్తులపై బ్లాక్‌ మ్యాజిక్‌ చేసేస్తుందన్నది వారి భయం. ఇక తర్వాత ఏం చేస్తారో తెలుసా? వారి ఆచారం ప్రకారం దాన్ని చంపి.. ఆ మాంసాన్ని తెగ పెద్దలు తింటారు. దాని వల్ల ఆ చిరుతకున్న శక్తులు తమకు వస్తాయన్నది వారి నమ్మకం. ఈ వింత ఆచారాన్ని ఇప్పటివరకూ ఎవరూ ఫొటో తీయలేదట. ఇదే ఫస్ట్‌ టైం. పాల్‌జాన్‌ అనే ఫొటోగ్రాఫర్‌ తీసిన ఈ చిత్రానికి ఎన్విరాన్‌మెంటల్‌ ఫొటోగ్రఫీ అవార్డు-2025లో జ్యూరీ ప్రశంసలు దక్కాయి.

కరోనా.. సింగపూర్‌లోనా..

- ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న కేసుల్లో 70 శాతం ఇక్కడే వెలుగులోకి
- కేపీ–1, కేపీ–2 వేరియంట్లుగా గుర్తింపు
- వీటితో పెద్దగా ప్రమాదం లేదంటున్న వైద్యులు



సాక్షి, హైదరాబాద్‌: కరోనా కాల సర్పం మరోసారి పడగ విప్పుతోంది. కరోనా వైరస్‌ కొత్త వేరియంట్లకు సంబంధించిన కేసులు వివిధ దేశాల్లో మళ్లీ నమోదవుతున్నాయి. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్‌) ఈ నెల 12 నుంచి 16 వరకు పరీక్షించిన 25 నమూనాల్లో జేఎన్‌– వేరియంట్‌కు సంబంధించి 21 కేసులు కరోనా పాజిటివ్‌గా తేలాయి. వీటిలో 19 కేసులు గోవాలో, కేరళ, మహారాష్ట్రలో ఒక్కోటి ఉన్నాయి. ఐసీఎంఆర్‌ ఈ వేరియంట్‌పై జీనోమ్‌ సీక్వెన్సింగ్‌ ద్వారా పరిశోధనలు కొనసాగిస్తోంది. సింగపూర్‌లో కేపీ–1, కేపీ–2 కొత్త వేరియంట్ల కారణంగా కేసులు పెరుగుతున్నాయి. వీటిని జేఎన్‌ –1 అనే ఒమిక్రాన్‌ ఉప వేరియంట్‌కు చెందినవిగా గుర్తించారు.

క్రమంగా పెరుగుతున్న కేసులు

ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న కేసులో 70 శాతం సింగపూర్‌లోనే వెలుగు చూస్తున్నాయి. అక్కడ ఈ నెల 5 నుంచి 11వ తేదీ మధ్య 25,900 కొత్త కేసులు నమోదయ్యాయి. అంతకు ముందు వారంలో అక్కడ 13,700 కేసులు నమోదు కాగా, వారంలోనే భారీగా పెరిగాయి. కేపీ–1, కేపీ–2 వేరియంట్లు ప్రస్తుతం నమోదవుతున్న కేసులలో రెండు నుంచి మూడో వంతు ఉన్నాయి. ఇవి ఒమిక్రాన్‌ జేఎన్‌–1 ఉప వేరియంట్‌కు చెందినవి. సింగపూర్‌ ఆరోగ్య శాఖ నిర్వహించిన పరిశోధనల్లో ఈ వేరియంట్ల ప్రభావం చాలా తక్కువగా ఉన్నట్లు తేలింది. హాంకాంగ్‌లో మే 15 నాటికి రోజువారీ కేసులు 1.9 రెట్లు పెరిగాయి. కేపీ–2, కేపీ–3 వేరియంట్లు పెరుగుతుండడం వల్ల కొందరు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. అమెరికాలో కేపీ–2 వేరియంట్‌ కేసుల వాటా 28 శాతం ఉన్నాయి. కెనడాలో మే 16 వరకు కేసులు 11 శాతం పెరిగినట్లు గుర్తించారు. యూకే, దక్షిణాఫ్రికాలో కూడా కరోనా కొత్త వేరియంట్‌ కేసులు వెలుగుచూశాయి.

మనదేశంలో అధికంగా కేపీ–2 కేసులు

మనదేశంలో కేపీ–1, కేపీ–2 వేరియంట్లు నమోదయ్యాయి. అధికారిక డేటా ప్రకారం కేపీ–2 వేరియంట్‌ కేసులు 290, కేపీ–1 వేరియంట్‌కు చెందిన 34 కేసులు గుర్తించారు. ఈ వేరియంట్లు తేలికపాటి లక్షణాలను చూపిస్తుండడంతో ప్రమాదమేమీ లేదని చెబుతున్నారు. కాగా కరోనా కొత్త వేరియంట్లను గుర్తించేందుకు అవసరమైన జీనోమ్‌ సీక్వెన్సింగ్‌ కోసం ఇండియా చివరిసారిగా 2024 నవంబర్‌ 24న నమూనాలు పంపింది. ఆ తరువాత నుంచి కొత్త వేరియంట్లు గుర్తించే ప్రయత్నాలు తగ్గిపోయాయి. కొత్త వేరియంట్ల కేసుల్లో తేలికపాటి జలుబు, దగ్గు, గొంతు నొప్పి, మలబద్ధకం, మైగ్రేన్‌ వంటి లక్షణాలు ఉన్నాయి, వీటివల్ల పెద్దగా ప్రమాదమేమీ లేదని వైద్యులు చెబుతున్నారు. వృద్ధులు, ఇతర వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్‌ ధరించడం, స్వల్ప లక్షణాలు ఉన్నా పరీక్షలు చేయించుకోవడం, స్వీయ సంరక్షణ పాటించడం ముఖ్యమని తెలిపారు. ప్రభుత్వ సూచనలను పాటించడం ద్వారా ఈ వేరియంట్లను సమర్థంగా ఎదుర్కోగలమని వైద్య నిపుణుడు డాక్టర్‌ కిరణ్‌ మాదాల పేర్కొన్నారు.

చర్చలంటూ జరిగితే ఆక్రమిత కశ్మీర్‌పైనే..

- భారత్‌ అంతరంగిక వ్యవహారాల్లో అమెరికా, చైనా జోక్యం అవసరం లేదు
- తిరంగా ర్యాలీలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ట్యాంక్‌బండ్‌పై జరిగిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రజలు. (ఇన్‌సెట్‌లో) వెంకయ్యనాయుడు, విద్యాసాగర్‌ రావు, సతీశ్‌రెడ్డి

కవాడిగూడ(హైదరాబాద్‌): 'కశ్మీర్‌ భారతదేశంలో అంతర్భాగం. ఒకవేళ చర్చలు జరిగితే ఆక్రమిత కశ్మీర్‌ కోసమే. ఈ విషయంలో అమెరికా, చైనా జోక్యం అవసరం లేదు. మన సమస్యను పరిష్కరించుకునే సత్తా మన దేశానికి ఉంది'అని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఇందుకోసం ఐకమత్యాన్ని చాటాలని ఆయన దేశ పౌరులను పిలుపునిచ్చారు. ఆపరేషన్‌ సిందూర్‌ విజయవంతమైన సందర్భంగా సైనికులకు సంఘీభావంగా సిటిజన్స్‌ ఫర్‌ నేషనల్‌ సెక్యూరిటీ ఫోరం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం లోయర్‌ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్‌ విగ్రహం నుంచి చిల్డ్రన్స్‌పార్కు వద్ద ఉన్న యుద్ధట్యాంక్‌ వరకు వేలాదిమందితో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్నవారు జాతీయ జెండాలు చేతబూని జై జవాన్‌, జై కిసాన్‌, వందేమాతరం, భారతమాతకి జై అంటూ నినదించారు. ఈ ర్యాలీలో వెంకయ్యనాయుడుతోపాటు పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ నరసింహారెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మహారాష్ట్ర మాజీ గవర్నర్‌ సీహెచ్‌ విద్యాసాగర్‌రావు, బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్‌, కొండా విశ్వేశ్వరరెడ్డి, నగేశ్‌, ఆర్‌.కృష్ణయ్య, బీజేపీ శాసన సభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎస్‌ రెడ్డి, ఎమ్మెల్యే పైడి రాకేశ్‌ రెడ్డి, ఎంఆర్‌పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, మాజీ ఎంపీ జయప్రద, సినీనటి మంచు లక్ష్మి, రక్షణ శాఖ సలహాదారు సతీశ్‌ రెడ్డి, కల్నల్‌ గంగప్రసాద్‌, నగేష్‌, లెఫ్టినెంట్‌ జనరల్‌ రవిప్రసాద్‌, నారాయణన్‌, మేజర్‌ జనరల్‌ రజత్‌, సింగర్‌ మంగ్లీ, బీజేపీ నేతలు మాధవీలత, చింతల రాంచంద్రరెడ్డి, రాంచందర్‌రావు, కాసం వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్‌ కొడుకు నందమూరి రామకృష్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ మనదేశాన్ని కాపాడుకోవడానికి మాత్రమే ఎదురుతిరిగామని, ప్రధాని నరేంద్రమోదీ విలక్షణవ్యూహంతో వ్యవహరించారన్నారు.

- సీహెచ్‌ విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ హైదరాబాద్‌ నగరం ఉగ్రవాదులకు అడ్డగా మారిందని కొన్ని రాజకీయ శక్తులు వారికి ఆశ్రయం కల్పిస్తున్నాయన్నారు. హైదరాబాద్‌ కేంద్రంగా రెచ్చిపోతున్న ఉగ్రవాదులకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని ఇందుకోసం అందరూ ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.
- తిరంగ ర్యాలీలో పాల్గొన్న మందకృష్ణ మాదిగ కాలికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించారు.

మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ నంబర్‌వన్‌

సీవీ ఆనంద్‌కు అభినందనలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: మాదకద్రవ్యాల నియంత్రణలో 138 దేశాలతో పోటీపడిం తెలంగాణ పోలీసం ప్రపంచంలో నంబర్‌ వన్‌ స్థానాన్ని సాధించడం గర్వంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి పేర్కొన్నారు. దుబాయ్‌లో ఇటీవల నిర్వహించిన వరల్డ్‌ పోలీస్‌ సమ్మిట్‌లో ఎక్సలెన్స్‌ ఇన్‌ యాంటీ నార్కోటిక్స్‌ అవార్డు'కేటగిరీలో హైదరాబాద్‌ నార్కోటిక్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరోకి మొదటి బహుమతి లభించింది. ఈ సందర్భంగా తెలంగాణ పోలీస్‌ను, హైదరాబాద్‌ సీపీ సీవీ ఆనంద్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు శనివారం ఎక్స్‌లో ఒక పోస్ట్‌ పెట్టారు. 'వివిధ రంగాల్లోం ప్రపంచానికి తెలంగాణ రోల్‌ మోడల్‌గా ఉండాలన్నది నా ఆకాంక్ష. ఈ ఘనతను సాధించినం హైదరాబాద్‌ నార్కోటిక్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ చీఫ్‌ సీవీ ఆనంద్‌కు, ఆయన బృందానికి ప్రత్యేక అభినందనలు. డ్రగ్స్‌ ఫ్రీ తెలంగాణ కోసం నేను కంటున్న కలలను సాకారం చేయడానికిం కృషి చేస్తున్న ప్రతి పోలీసుకుం మద్దతుగా ఉంటాను'అని సీఎం తన పోస్టులో పేర్కొన్నారు.



చికిత్స అనంతరం బాలురతో డా.సాయి సతీష్‌ వైద్య బృందం

కుడివైపు ఉన్న గుండెను.. ఎడమ వైపు పెట్టేశారు!

- కుడివైపున గుండెతో పుట్టిన బాలుడు
- శస్త్ర చికిత్సతో తిరిగి ఎడమవైపునకు మార్చిన నిమ్స్‌ వైద్యులు
- మరో కేసులో నిమిషానికి 220 సార్లు కొట్టుకుంటున్న గుండెను కంట్రోల్లోకి తెచ్చిన డాక్టర్లు

లక్డీకాపూల్‌: గతి తప్పిన గుండెను నిమ్స్‌ విజయవంతంగా సరిచేసింది. అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్స ద్వారా 15 ఏళ్ల బాలుడికి పునర్జన్మ ప్రసాదించింది. మరో కేసులో నిమిషానికి 220 సార్లు కొట్టుకుంటున్న గుండెను అదుపులోకి తెచ్చినట్లు నిమ్స్‌ సీనియర్‌ కార్డియాలజీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ఓరుగంటి సాయి సతీష్‌ తెలిపారు. శనివారం నిమ్స్‌ లెర్నింగ్‌ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ చికిత్సల వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా తీగలబంజరకు చెందిన షేక్‌ జాన్‌ పాషా కుమారుడు షేక్‌ నాగుల్‌ మీర్‌ (15) బాల్యం నుంచి గుండెదడ, ఛాతీ నొప్పితో బాధపడుతున్నాడు. 15 రోజుల క్రితం నిమ్స్‌కు అతడిని తీసుకురాగా డెక్స్‌ట్రోకార్డియా సమస్యతో బాధపడుతున్నట్టు గుర్తించారు. బాలుడికి ఛాతీకి ఎడమ వైపున ఉండాల్సిన గుండె కుడి వైపున ఉన్నట్లు గుర్తించారు. ఇది చాలా అరుదుగా పుట్టుకతో వచ్చే గుండె వ్యాధి అని డాక్టర్‌ సతీష్‌ చెప్పారు. వోల్ఫ్‌ పార్కిన్సన్‌ వైట్‌ (డబ్ల్యూపీడబ్ల్యూ) సిండ్రోమ్‌ సమస్యను 3డీ మ్యాపింగ్‌తో క్లిష్టమైన రేడియో ఫ్రీక్వెన్సీ క్యాథటర్‌ అబ్లేషన్‌ (ఆర్‌ఎఫ్‌ఏ) చికిత్సతో సరిచేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా గుండె దడ సమస్యతో బాధపడుతున్న నైనిష్‌(14) అనే బాలుడికి కూడా విజయవంతంగా చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఇద్దరికీ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్‌ చేశామని చెప్పారు. ప్రైవేట్‌ ఆసుపత్రుల్లో అయితే ఈ చికిత్సకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చవుతుందని వివరించారు. సమావేశంలో కార్డియాలజిస్టులు హేమంత్‌, సునీత, అజేయ, మౌనిక తదితరులు పాల్గొన్నారు. గుండె సమస్యతో బాధపడుతున్న తమ కుమారుడికి నిమ్స్‌ వైద్యులు పునర్జన్మ ప్రసాదించారని నైనిష్‌ తల్లి జ్యోత్స్న చెప్పారు. వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్‌ అడ్వాన్స్‌డ్‌ హాల్‌ టికెట్లు విడుదల

సాక్షి, హైదరాబాద్‌: ఈ నెల 22వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్‌ అడ్వాన్స్‌డ్‌ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇంటర్‌ బోర్డ్‌ హాల్‌ టికెట్లను విడుదల చేసింది. సంబంధిత కాలేజీల నుంచి లేదా టీజీబీఐ వెబ్‌సైట్‌ నుంచి హాల్‌ టికెట్లు పొందవచ్చని ఇంటర్‌ బోర్డ్‌ కార్యదర్శి కృష్ణఆదిత్య ఓ ప్రకటనలో తెలిపారు.

సైబర్‌ 'సిమ్‌'లపై సీబీ'ఐ'

- ఆపరేషన్‌ చక్ర–5లో భాగంగా తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో సోదాలు
- సైబర్‌ నేరాలకు వాడుతున్న సిమ్‌ కార్డులకు గుర్తింపుపై దృష్టి

సాక్షి, హైదరాబాద్‌: సైబర్‌ నేరగాళ్లు ఉపయోగించే సిమ్‌ కార్డులపై సీబీఐ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఆన్‌లైన్‌ ఆఫర్లు, లాటరీల పేరిట మోసాలు, డిజిటల్‌ అరెస్టు, ఇన్వెస్ట్‌మెంట్‌ మోసాలు ఇలా ప్రతి దానికీ సైబర్‌ నేరగాళ్లు ఫోన్‌కాల్స్‌ చేస్తున్నారు. అమాయకులకు వల వేసేందుకు వాట్సాప్‌, మెసేజ్‌లు, ఏపీకే ఫైల్స్‌ లింక్‌లు పంపడం లేదంటే బ్యాంకు అధికారులమని, పోలీస్‌, కస్టమ్స్‌..ఇలా ఏదో పేరుతో కాల్స్‌ చేస్తున్నారు. దీనికోసం తప్పుడు ధ్రువపత్రాలతో వందలకొద్దీ సిమ్‌కార్డులను కొనుగోలు చేస్తున్న కేటుగాళ్లు.. వాటిని వాడి సైబర్‌ మోసాలకు తెగబడుతున్నారు. సైబర్‌ ముఠాల మూలాలను దెబ్బకొట్టడమే లక్ష్యంగా సీబీఐ అధికారులు ఇటీవల తెలంగాణ సహా దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాల్లో ఆపరేషన్‌ చక్ర–5 పేరిట సోదాలు నిర్వహించారు. అనధికారిక సిమ్‌కార్డులు విక్రయిస్తున్న టెలికం ఆపరేటర్ల వివిధ పాయింట్‌ ఆఫ్‌ సేల్‌ ఏజెంట్లే టార్గెట్‌గా ఈ సోదాలు జరిగాయి.

టెలికం సర్వీస్‌ ప్రొవైడర్లతో సైబర్‌ నేరగాళ్లకు లింకులు

సీబీఐ అధికారులు అసోం, పశ్చిమబెంగాల్‌, బీహార్‌, ఉత్తర ప్రదేశ్‌, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులోని 42 ప్రదేశాల్లో ఏకకాలంలో సోదాలు జరిపారు. టెలికం సర్వీస్‌ ప్రొవైడర్లలో కొందరు ఎగ్జిక్యూటివ్‌లతో సైబర్‌ నేరగాళ్లు లింకు పెట్టుకొని అనధికారికంగా సిమ్‌కార్డులు పొందుతున్నట్టు సీబీఐ అధికారులు గుర్తించారు. ఆపరేషన్‌ చక్ర –5 సోదాల్లో భాగంగా ఐదుగురిని అరెస్టు చేశారు. వీరి నుంచి మొబైల్‌ ఫోన్లు, ఎల్రక్టానిక్‌ పరికరాలు, కేవైసీ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిని విశ్లేషిస్తున్న అధికారులు అందులో లభించే ఆధారాల ప్రకారం దర్యాప్తులో ముందుకు వెళ్లనున్నారు. సైబర్‌ నేరగాళ్ల చేతికి సిమ్‌ కార్డులు వెళ్లకుండా అడ్డుకోవడం ద్వారా మోసాలకు చెక్‌ పెట్టొచ్చన్న వ్యూహంతో సీబీఐ అధికారులు చర్యలు ప్రారంభించారు. మరోవైపు భారత టెలికం శాఖ అందుబాటులోకి తెచ్చిన చక్షు పోర్టల్‌ ద్వారా స్పామ్‌ కాల్స్‌, ఎస్‌ఎంఎస్‌లు, మోసపూరిత కమ్యూనికేషన్ల గురించి సాధారణ పౌరులు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. ఇలా సేకరించిన డేటాతో పాటు సోదాల ద్వారా సేకరించే సమాచారం ఆధారంగా కూడా దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


ఇసుర్రాయితో పప్పు పడుతున్న మహిళ


బండపై పచ్చడి నూరుతున్న ఆదివాసీ మహిళ


పసుపు దంచేందుకు రోకళ్లతో మహిళలు

దంచితే వ్యాయామం... రుబ్బితే ఆరోగ్యం!

- కానరాని ఒకనాటి రోళ్లు, ఇసుర్రాళ్లు
- మిక్సీలు, గ్రైండర్లతో యాంత్రికం
- రుచి కోల్పోతున్న ఆహార పదార్థాలు
- రోళ్లు, ఇసుర్రాళ్ల వాడకంతో ఆరోగ్యం
- ప్రస్తుతం ఆదివాసీ, గిరిజన ప్రాంతాలకే పరిమితం
- పట్టణాల్లో శుభకార్యాల వేళ వినియోగం

కరకగూడెం(భద్రాద్రి కొత్తగూడెం జిల్లా): ఒకప్పుడు ఇంటింటా వినిపించిన రోళ్ల చప్పుడు.. ప్రస్తుతం కనుమరుగైంది. మిక్సీలు, గ్రైండర్ల రాకతో.. సంస్కృతికి చిహ్నమైన రోలు, రోకలితో పాటు ఇసుర్రాళ్లు మూలన పడ్డాయి. ఫలితంగా అటు ఆరోగ్యం కరువైంది.. ఇటు వంటల్లో రుచి కూడా మాయమవుతోంది. పెళ్లిళ్ల వేళ పసుపు కొమ్ములు దంచడం, పండుగల సమయాన పిండి పట్టేందుకు రోలు, రోకలితో పాటు ఇసుర్రాయి వాడటం ఆనవాయితీగా ఉండేది. తద్వారా మహిళలు రోజువారీ తగినంత శ్రమించినా.. ఫలితం దక్కి ఆరోగ్యంగా ఉండేవారు. అయితే, జీవనశైలిలో మార్పుల ఫలితంగా.. ప్రస్తుతం రోళ్లు, రోకళ్లు కనుమరుగవగా.. కొన్ని గిరిజన పల్లెల్లో సంప్రదాయాలను ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

శుభకార్యాల్లో ప్రాధాన్యం

ఇసుర్రాళ్లను శుభకార్యాల్లో తప్పనిసరిగా ఉపయోగిస్తున్నారు. రోళ్లు, రోకలితో పెళ్లి ఇంట్లో పసుపు కొమ్ములు దంచడం ఆనవాయితీగా వస్తోంది. కానీ పట్టణాల్లో ఇవి ఎవరి వద్దా అందుబాటులో లేకపోవడంతో.. ఈవెంట్ మేనేజ్‌మెంట్ బాధ్యులు వీటిని సైతం అద్దెకు ఇవ్వడం విశేషం.

ఇసుర్రాళ్ల ప్రాధాన్యం

ఇసుర్రాళ్లు పురాతన కాలం నుంచి భారతీయ వంటశాలల్లో భాగంగా ఉన్నాయి. రాతితో తయారైన ఈ సాధనం ధాన్యాలు, మసాలా దినుసులు, ఇతర ఆహార పదార్థాలను విసరడానికి ఉపయోగించేవారు. ఇవి వంట సాధనంగానే కాక మహిళల సామాజిక సమావేశాలకు కేంద్రంగా నిలిచేవి. స్త్రీలు ఒకచోట చేరి ఇసుర్రాళ్లతో విసురుతూ మంచీచెడూ పంచుకునేవారు. శుభకార్యాల్లో ప్రధానంగా గృహప్రవేశం, వివాహ వేడుకలు, ఇతర పూజల్లో ఇసుర్రాయి వాడడం శుభసూచకంగా భావిస్తారు. కొన్నిచోట్ల కొత్తగా పెళ్లయిన స్త్రీ.. ఇసుర్రాళ్లతో ధాన్యాలు విసరడం ద్వారా.. తన గృహంలో సమృద్ధిని తెచ్చే శక్తిని తీసుకొస్తుందని నమ్ముతారు.

సంప్రదాయం నుంచి ఆధునికత వైపు..

గోధుమలు, బియ్యం, కూరగాయలు, మసాలా దినుసులు విసరడానికి ఇసురాళ్లు వాడేవారు. తద్వారా ఆహార పదార్థాల్లో పోషక విలువలు తగ్గకపోగా సహజమైన రుచి ఉండేది. కాలక్రమంలో వచ్చిన మిక్సీలు, గ్రైండర్లు సమయాన్ని ఆదా చేస్తున్నా.. ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం తగ్గాయని చెబుతారు. అయితే, ఇసుర్రాళ్లు ఇప్పుడు ఆధునిక డిజైన్లలో.. గ్రానైట్, మార్బుల్‌తో చేసి అమ్ముతుండడంతో కొందరు ఉపయోగిస్తున్నారు.

పరిపూర్ణ వ్యాయామం

ఇసుర్రాళ్లతో రుబ్బడం మహిళల పరిపూర్ణ శారీరక వ్యాయామంగా ఉండేది. ఈ ప్రక్రియలో చేతులు, భుజాలు, వీపు, కండరాలు బలపడతాయని.. శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడి ఒత్తిడి తగ్గుతుందని చెబుతారు. ఈ విషయాన్ని గుర్తెరిగి ఇసుర్రాళ్లను జీవనంలో భాగం చేసుకుంటే ఇంట్లో జిమ్ ఏర్పాటు చేసుకున్నట్లవుతుంది.

మూలాల్ని మరిచిపోతున్నారు



ఒకప్పుడు ప్రతి ఇంట్లో రోళ్లు, రోకళ్లు ఉండేవి. అందులో దంచిన కూరలు, పచ్చళ్లు ఎంతో రుచిగా ఉండేవి. మిక్సీలు, గ్రైండర్లు వచ్చాక పాత సాధనాలు మర్చిపోతున్నారు. రోళ్లు మన సంస్కృతికి గుర్తు. వీటిని మర్చిపోతే మూలాల్ని మర్చిపోయినట్టే.

– కొమరం సుబ్బలక్ష్మి, పద్మాపురం

ఇసుర్రాళ్లతో ప్రత్యేక రుచి



ఇసుర్రాళ్లు వంటలకు ప్రత్యేకమైన రుచిని ఇస్తాయి. మా అమ్మమ్మ, నాయనమ్మ రోట్లో రుబ్బి, దంచుతూ ఆరోగ్యంగా ఉండేవారు. నేను కూడా అప్పుడప్పుడు పచ్చళ్లు, కారాల తయారీకి రోలు వాడుతున్నాను. నాకు ఇది ఎంతో సంతృప్తిని ఇస్తుంది.

– జాడి విజయరాణి, శ్రీరంగాపురం.

సంప్రదాయ పద్ధతులతో ఆరోగ్యం



రోళ్లు, రోకళ్లను వాడే వారికి వ్యాయామం జరిగేది. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడి రక్తపోటు, మధుమేహం సమస్యలు తక్కువగా ఉండేవి. ఇసుర్రాళ్లతో దంచినా, రుబ్బినా ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. కానీ ఇప్పుడు శారీరక శ్రమ తగ్గింది.

– దుర్గాభవాని, ప్రభుత్వ వైద్యురాలు, పినపాక


కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలకు బలైన పెద్దపులి అవశేషాలను పరిశీలిస్తున్న అధికారులు

ఉచ్చులేసి.. చంపేసి..!

- విద్యుత్ ఉచ్చులతో అడవి జంతువుల వేట
- పెద్దపులులకు ప్రాణగండం
- కొన్ని సార్లు మనుషులకూ ముప్పు
- అడవుల్లో యమపాశాలుగా మారుతున్న కరెంట్ తీగలు


విద్యుత్‌తీగలకు అమర్చే వైరు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వేటగాళ్ల విద్యుత్ ఉచ్చుల కారణంగా వన్యప్రాణులు బలవుతున్నాయి. ఇటీవల కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు అటవీ సమీపంలో ఓ పులి విద్యుత్ తీగల ఉచ్చుకు బలైంది. గతంలో మంచిర్యాల, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, ములుగు జిల్లాల్లోనూ పులులు, ఇతర వన్యప్రాణులు విద్యుత్ తీగలతో ప్రాణాలు కోల్పోయాయి. వేసవిలో అడవి జంతువుల వేట కోసం వేటగాళ్లు తీగలను విద్యుత్ స్తంభాలకు కొక్కేలతో కలుపుతారు. జంతువులు ఎక్కువగా సంచరించే నీటికుంటలు, చెట్ల పొదలు, రాకపోకలు సాగించే మార్గాల్లో ఈ తీగలను ఒక అడుగు ఎత్తులో కర్రలకు కడతారు. కరెంట్ స్తంభం తీగలకు కొక్కెం వేసి కట్టే వైరుకు ఏదైనా జంతువు తాకగానే విద్యుదాఘాతంతో సెకన్లలో ప్రాణాలు కోల్పోతున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ తరహా ఉచ్చులతో అనేక వన్యప్రాణులు చనిపోతున్నాయి. వేటగాళ్ల ఉచ్చుకు చిక్కిన జంతువుల మాంసాన్ని పట్టణాలకు తీసుకెళ్లి అమ్మేస్తున్నారు. పెద్ద పరిమాణంలో ఉన్న జంతువు పడితే రూ.వేలల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వేటగాళ్లపై అధికారులు కేసులు నమోదు చేస్తున్నా పరిస్థితి మారడం లేదని అంటున్నారు. మరోవైపు పెద్దపులులు కూడా ఈ విద్యుత్ తీగలకు బలైపోతున్నాయి.

మనుషుల ప్రాణాలూ తీస్తున్నాయి..


వన్యప్రాణులను సులువుగా వేటాడేందుకు ఏర్పాటు చేసే విద్యుత్ తీగల ఉచ్చు కారణంగా పలు సందర్భాల్లో మనుషులు కూడా చనిపోతున్నారు. గత మార్చిలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నారాయణపూర్‌కు చెందిన పాల్కు రమేశ్ (45) ఇలాగే ఉచ్చు కారణంగా కరెంటు తీగలు తగిలి చనిపోయాడు. అలాగే గత ఏప్రిల్‌లో సిర్పూర్ టీ మండలం టోంకినికి చెందిన చౌదరి జయేందర్(19) అనే యువకుడు సొంత చేనులోనే విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడ్డాడు. అంతకుముందు నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి) మండలం నసీరాబాద్‌కు చెందిన రైతు బొందుగల మల్లయ్య(54) అడవి జంతువులు రాకుండా అమర్చిన విద్యుత్ కంచెకు తగిలి ప్రాణాలు కోల్పోయారు.

ఎక్కడ తీగలు ఉన్నాయో..

ఇదిలా ఉండగా వేటగాళ్లే కాకుండా అడవి జంతువుల బారి నుంచి పంటలను కాపాడుకునే క్రమంలో అనేక మంది రైతులకు కూడా విద్యుత్ తీగలను అమర్చడం అలవాటుగా మారింది. రాత్రి పది గంటల నుంచి వేకువజామున 4 గంటల వరకు విద్యుత్ సరఫరా అయ్యేలా తీగలు అమర్చుతున్నారు. ఆ సమయంలో ఎవరైనా అటు వెళ్తే ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు. దీనిని నివారించేందుకు అటవీ, విద్యుత్ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి.. రాత్రి వేళ గస్తీ చేయడం, విద్యుత్ స్తంభాల పరిశీలన వంటివి చేస్తున్నప్పటికీ పరిస్థితి మారడం లేదని చెపుతున్నారు. మరోవైపు రాత్రివేళ అడవిలోకి వెళ్లాలంటే ఎక్కడ తీగలు ఉన్నాయో తెలియక అటవీ శాఖ సిబ్బంది జంకుతున్నారు. దీంతో రాత్రి వేళ గస్తీ తగ్గడంతో మనుషులతోపాటు జంతువుల ప్రాణాలు పోతున్నాయి.

నాలుగు వారాల్లో సిల్ట్‌ను తొలగించండి

బుమ్రుక్కుద్దౌలా చెరువుపై పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుమ్రుక్కుద్దౌలా చెరువులో సిల్ట్, బురదను సొంత ఖర్చుతో తొలగించాలని పిటిషనర్ మహమ్మద్ ఇబ్రహీంను హైకోర్టు ఆదేశించింది. నాలుగు వారాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని, హైడ్రా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేసింది. ఒకవేళ అనధికారిక ప్రతివాది సహకరించకుంటే ఎఫ్‌టీఎల్‌గా గుర్తించిన భాగంలో సిల్ట్ తొలగింపుపై హైడ్రాకు స్వేచ్ఛ ఇచ్చింది. రాజేంద్రనగర్ మండలం బొమ్రుక్కుద్దౌలా గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 42, 50/1లోని 12.27 ఎకరాల తన పట్టా భూమిలో అధికారులు జోక్యం చేసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైదరాబాద్ టోలీచౌకికి చెందిన మహమ్మద్ ఇబ్రహీం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. భూమిపై గతంలోనే వివాదం ఉన్నందున పిటిషన్ సంబంధిత డాక్యుమెంట్లు, వివరాలను అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. ప్రిలిమినరీ నోటిఫికేషన్‌పై అతని వాదనలు వినాలని, వాటిని పరిశీలించి చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

మహా నగరంపై పగబట్టిన సీఎం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: మహానగరంపై సీఎం రేవంత్‌రెడ్డి పగబట్టి.. మూసీ, హైడ్రా పేరిట హైదరాబాద్‌లో సమస్యలు సృష్టించారని, ఇప్పుడు మెట్రో చార్జీలను పెంచారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తక్షణమే పెంచిన మెట్రో చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కొన్ని మహానగరాల్లో మెట్రో చార్జీలు పెంచితే.. ప్రయాణికుల తిరుగుబాటుతో వెనక్కి తీసుకున్నారన్నారు. ప్రజా రవాణాకు ఎన్ని రాయితీలు ఇచ్చినా తక్కువేనన్నారు. ప్రతిపాదించిన మెట్రో మార్గాల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు.

తప్పుడు కేసులో ఇరికించారు.. బెయిల్ ఇవ్వండి

హైకోర్టులో శ్రవణ్‌కుమార్ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: తప్పుడు వివరాలతో సీసీఎస్‌లో కేసు పెట్టి ఇరికించారని.. బెయిల్ ఇవ్వాలని కోరుతూ శ్రవణ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై ఆధారపడిన వృద్ధురాలైన తల్లి, భార్య, పిల్లలు ఉన్నారని.. పోలీసులు, సీసీఎస్‌తో కుమ్మక్కై కేసు పెట్టించారని పేర్కొన్నారు. ఇనుప ఖనిజం కొనుగోళ్లకు సంబంధించిన లావాదేవీలు బీఎన్‌ఎస్ సెక్షన్ 316(5) పరిధిలోకి రావన్నారు. తన అరెస్టు చట్టవిరుద్ధమని, రాజకీయ కారణాలతో కేసులో ఇరికించారని, తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై త్వరలో హైకోర్టు విచారణ చేపట్టనుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌కుమార్‌పై సీసీఎస్‌లో చీటింగ్ కేసు నమోదైన విషయం విదితమే. విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసి సీసీఎస్ అధికారులు.. ఐదు రోజుల క్రితం అరెస్టు చేశారు. గతంలో అఖండ ఎంటర్‌ప్రైజెస్‌కు శ్రవణ్ రూ.6 కోట్లు మోసం చేశారని బాధితులు ఫిర్యాదు చేశారు.

డాలస్ సభకు బీఆర్‌ఎస్ సన్నాహాలు

అమెరికా ప్రధాన నగరాల్లోసన్నాహక సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని డాలస్‌లో జూన్ 1న జరిగే రజతోత్సవ సభ సన్నాహాలను బీఆర్‌ఎస్ పార్టీ వేగవంతం చేసింది. ఇందులో భాగంగా రాబోయే పది రోజుల పాటు అమెరికాలోని పలు ప్రధాన నగరాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించనుంది. రజతోత్సవ సభతో పాటు మరుసటి రోజు జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవాలను కూడా ఇదే వేదికగా నిర్వహించాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పలువురు ముఖ్య నేత లు ఈ కార్యక్రమానికి హాజరవుతుండటంతో సభ నిర్వహణను బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ విభాగం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. అమెరికాలోని తెలంగాణ సంఘాలు, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని, పార్టీని బలోపేతం చేయాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. ఇప్పటికే బీఆర్‌ఎస్ అమెరికా విభాగం లాస్‌ఏంజెలిస్, కాలిఫోర్నియా, అట్లాంటా, జార్జియా, వాషింగ్టన్ డీసీ వంటి నగరాల్లో సన్నాహక సమావేశాలను నిర్వహించింది. ఇవేకాక మరికొన్ని నగరాల్లోనూ ఈ సమావేశాలను ఏర్పాటుచేయనున్నారు. డాలస్‌లో జరిగే రజతోత్సవ సభకు సంబంధించి ప్రచారం, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ విభాగం ఇప్పటికే పూర్తి చేసింది. కాగా, ఇదివరకే అమెరికాకు చేరుకున్న బీఆర్‌ఎస్ మాజీఎమ్మెల్యే బాల్కసుమన్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.


శనివారం ఢిల్లీలోని హోటల్ లలిత్‌లో జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్‌ను కలసిన బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి. చిత్రంలో వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్, బీసీఐ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జయాకర్, గోకుల్ రామారావు, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఎ.జగన్, కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, మాజీ కార్యదర్శి శాంతిభూషణ్ తదితరులు



చుక్క నీటికోసం ఎన్ని తిప్పలో

ఎండలు మండిపోతుండటంతో పశు పక్ష్యాదులు చుక్క నీటికోసం తిప్పలు పడుతున్నాయి. దాహంతో ఉన్న ఓ పావురం ఏసీ పైపు నుంచి వచ్చే నీటిని తాగేందుకు ఆపసోపాలు పడుతోంది. విజయవాడ గాంధీనగర్‌లో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



స్వర్ణశోభితం గోవిందం

ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వాన వెలిసిన తరువాత గోవిందరాజస్వామి ఆలయం ఇలా బంగారు వర్ణంలో మెరిసిపోయింది. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



ప్రమాదం సుమీ..

నెల్లూరు హరినాథపురం సెంటర్‌లోని ఈ హోర్డింగ్ ఈదురుగాలులకు చిరిగిపోయి అటూ ఇటూ ఊగుతూ ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. ఫ్లెక్సీ రహిత నగరంగా నెల్లూరుని మారుస్తామన్న ప్రజా ప్రతినిధులకు మాత్రం ఇది కనిపించడంలేదని స్థానికులు వాపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు.

తెనాలిలో తిరంగా ర్యాలీ



తెనాలి: పాకిస్తాన్‌తో జరిగిన ఘర్షణలో విజయం సాధించిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న తిరంగా ర్యాలీని శనివారం సాయంత్రం గుంటూరు జిల్లా తెనాలిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక చినరావూరులోని సత్యనారాయణ పార్కు నుంచి బోసురోడ్డు, మెయిన్‌రోడ్డు మీదుగా మార్కెట్ సెంటర్లోని గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన జరిగింది. 300 మీటర్ల భారత జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణకు మంత్రుల బృందం

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ వస్తున్న నేపథ్యంలో.. ఆయన పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రభుత్వం మంత్రుల బృందాన్ని నియమించింది. ఇందులో మంత్రులు లోకేశ్, సత్యకుమార్, వంగలపూడి అనిత, శ్రీబాల వీరాంజనేయస్వామి, కందుల దుర్గేశ్ ఉన్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ(రాజకీయ) ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నవతరానికి పుస్తక పఠనం అవసరం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్

నగరంపాలెం: నవతరానికి పుస్తక పఠనం అవసరమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ ఐదో వీధిలోని గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్ సర్వీసు ఆర్గనైజేషన్ ప్రాంగణంలో శనివారం ఏపీ అభ్యుదయ రచయితల సంఘం 90 ఏళ్ల సంబరాల్లో భాగంగా కవితా ప్రవంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా నాలుగు పుస్తకాలను ఆవిష్కరించారు. సభకు సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ ఈ పుస్తకాలను నవతరం చదవడం అవసరమని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అరసం జాతీయ సమితి అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఛాయారాజ్, ఎండ్లూరి సుధాకర్, నూతలపాటి గంగాధరం, పఠాభీల కవిత్వాన్ని ఈ తరం సులభంగా చదువుకునేలా అందిస్తున్న అరసం కృషి మరువలేనిదని ప్రశంసించారు. సభకు అధ్యక్షత వహించిన భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పుస్తకాలు కవి ఆత్మీయతను ప్రతిబింబించేలా ఉన్నాయని తెలిపారు. అనంతరం యుద్ధం– శాంతి అంశంపై కవితా గోష్టి నిర్వహించారు. బండికల్లు జమదగ్ని, మేడిశెట్టి సుభద్ర, హేమలత, ఎం.లలితకుమారి హాజరయ్యారు. కార్యక్రమంలో జనసాహితి దివికుమార్, రచయిత్రి మందరపు హైమావతి, అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోసూరి రవికుమార్ పాల్గొన్నారు.



దటీజ్ ది 'పవర్' ఆఫ్ జగన్

దక్షిణ డిస్కంలో భిన్నం.. కానీ..

మరోవైపు ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఎస్పీడీసీఎల్) మాత్రం రూ.3,346 కోట్ల ట్రూ అప్ చార్జీల వసూలుకు ఏపీఈఆర్సీని అనుమతి కోరింది. ఇందులోనూ 2024–25 ఏఆర్‌ఆర్‌లో రూ.2వేల కోట్లు సర్దుబాటు చేసేశారు. అంటే అప్పటికి డిస్కంకు ఆ మేరకు లాభం చేకూరినట్టే. ఇక మిగిలింది రూ.1,346 కోట్లు. డిస్కం దాఖలు చేసిన వడ్డీలను ఏపీఈఆర్సీ యథాతథంగా ఆమోదించదు. అందువల్ల ఈ ట్రూ అప్ కూడా తగ్గే అవకాశం ఉందని ఏపీఈఆర్సీ వెల్లడించింది.

గత ప్రభుత్వంలో భారీగా తగ్గిన డిస్కంల నిర్వహణ వ్యయాలు

- ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ కలిపి రూ.3,374.75 కోట్లు
- ఏపీ ట్రాన్స్‌కో నుంచి మిగిలింది రూ.1,059.76 కోట్లు
- మొత్తం రూ.4,434.51 కోట్లు ఆదా
- కూటమి ప్రభుత్వంపై ఈ మేరకు తగ్గిన భారం
- ఏపీఈఆర్సీకు డిస్కంల 'ట్రూ డౌన్ పిటిషన్లు' వెల్లడి

సాక్షి, అమరావతి: సమర్థుడైన నాయకుడి పాలనలో వ్యవస్థలు ఎంతగా అభివృద్ధి చెందుతాయన్నది చెప్పడానికి ఇదొక నిదర్శనం. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంస్కరణలు, తీసుకువచ్చిన వినూత్న విధానాల వల్ల విద్యుత్ పంపిణీ సంస్థల(డిస్కం) నిర్వహణ ఖర్చులు భారీగా తగ్గాయి. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర ప్రజలపై రూ.15,485 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోపింది. కానీ, గత ప్రభుత్వ హయాంలోని ఐదేళ్లలో మొత్తం రూ.4,434.51 కోట్ల నిర్వహణ ఖర్చులు ఆదా అయ్యేలా చేసింది. ఈ మేరకు డిస్కంలు దాఖలు చేసిన ట్రూ డౌన్ పిటిషన్ల వివరాలను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి తన వెబ్‌సైట్ ద్వారా వెల్లడించింది.

డిస్కంల మిగులు ఇలా..

- 2019–20 నుంచి 2023–24 వరకూ ఏపీఈపీడీసీఎల్ నిర్వహణా వ్యయాల ఆదా రూ.1,974.75 కోట్లు
- ఏపీసీపీడీసీఎల్ 2020–21 నుంచి 2023–24 వరకూ వ్యయ ఆదా రూ.1,400 కోట్లు.
- ఈ మొత్తం రూ.3,374.75 కోట్లు.
- ఇందులో కొంత మొత్తాలను 2024–25 వార్షిక ఆదాయ వ్యయ నివేదిక (ఏఆర్‌ఆర్)లో డిస్కంలు సర్దుబాటు చేసుకున్నాయి. అంటే వాటి రెవెన్యూ గ్యాప్‌ను భర్తీ చేసుకోవడానికి వినియోగించుకున్నాయి.
- ఈ విధంగా ఏపీఈపీడీసీఎల్ రూ.1,800 కోట్లు కలపగా, మిగిలిన రూ.174.75 కోట్లను సర్దుబాటు చేయాల్సి ఉంది.
- అదేవిధంగా ఏపీసీపీడీసీఎల్‌లో రూ.478.91 కోట్లు ఇప్పటికే 2024–25 ఏఆర్‌ఆర్‌లో కలిపారు. ఇంకా రూ.921.09 కోట్లు ఉన్నాయి.
- ఈ మొత్తం రూ.1,095.84 కోట్లు ప్రజలకు తిరిగి ఇచ్చేయాలా... లేక మరో ఏఆర్‌ఆర్‌లో సర్దుబాటు చేయాలా.. అనేది ఏపీఈఆర్సీ నిర్ణయిస్తుంది.

ట్రాన్స్‌కో ఆదా ఇది..

2019-20 నుంచి 2023-24 మధ్య ఏపీ ట్రాన్స్‌కో విద్యుత్ లైన్లను వినియోగించుకోవడంలోనూ విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కం) రూ.1,059.76 కోట్లు మిగిల్చాయి.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యుత్ ప్రసార వ్యవస్థ వినియోగానికి ఏపీఈఆర్సీ అనుమతించిన టారిఫ్ కంటే తక్కువగా డిస్కంలు వినియోగించాయి. ఇది ఏపీఈపీడీసీఎల్‌లో రూ.383.84 కోట్లు, ఏపీ ఎస్పీడీసీఎల్‌లో రూ.428.57 కోట్లు, ఏపీసీపీడీసీఎల్‌లో రూ. 247.35 కోట్లుగా ఉంది. వీటిని కూడా ఏఆర్‌ఆర్‌లో సర్దుబాటు చేశారు.

ఈ లెక్కన గత ప్రభుత్వ చర్యల కారణంగా కూటమి ప్రభుత్వంపై రూ.4,434.51 కోట్ల భారం తగ్గింది.

కొల్లేరులో తుపాకుల మోత

పక్షులను తోలటానికి నాటు తుపాకుల వాడకం

- నల్లమందు వినియోగించి పేలుళ్లు
- నెల్లూరు, తమిళనాడు నుంచి వలస కూలీల రాక
- తుపాకుల మిస్‌ఫైర్‌తో తరచూ ప్రమాదాలు
- కొల్లేరు అక్రమ చెరువులన్నింటి వద్ద ఇదే పరిస్థితి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పక్షులను తోలే సంప్రదాయ వలస కూలీలు నాటు తుపాకులను వినియోగించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. దశాబ్దాలుగా కొల్లేరులో నాటు తుపాకుల సంస్కృతి కొనసాగుతుండగా ఏటా పలువురు మృత్యువాతపడటం, గాయాలపాలవడం షరా మామూలుగా తయారైంది. పెద్ద పక్షులు చెరువుల్లోని చేపలను ఆహారంగా తీసుకోవడానికి వచ్చినప్పుడు నల్లమందు వినియోగించి తుపాకీ పేలుళ్ల శబ్దం చేస్తే కొన్ని గంటల పాటు చెరువు దరిదాపుల్లోకి రావు. దీంతో ఎక్కువ చెరువుల వద్ద గన్‌కల్చర్‌ను కొనసాగిస్తున్నారు. తాజాగా గత నెలలో మందుగుండు పేలి పది మంది గాయాలపాలై నలుగురు మరణించడం, అలాగే రెండు రోజుల క్రితం మిస్‌ఫైర్‌తో ముగ్గురు గాయాలైన ఘటన కొల్లేరులో చోటు చేసుకుంది.

చెరువుల కాపలా పనులు చేస్తూ..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు కృష్ణా జిల్లాలో 901 చదరపు కిలోమీటర్ల పరిధిలో 2,22,300 ఎకరాల్లో కొల్లేరు విస్తరించి ఉంది. 12 మండలాల్లో 3.50 లక్షల మంది ప్రజలు కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నారు. మంచినీటి సరస్సుగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. విదేశాల నుంచి శీతాకాలంలో లక్షల సంఖ్యలో పక్షులు వలస వచ్చి కొల్లేరులో గుడ్లు పొదిగి తిరిగి వెళ్తుంటాయి. ఏటా కొల్లేరుకు విదేశాల నుంచి లక్షన్నరకు పైగా వివిధ జాతుల పక్షులు వీటిలో అత్యధికంగా పెలికాన్ పక్షులు వస్తుంటాయి. కొల్లేరులో ఆక్రమణల పర్వం దశాబ్దాలుగా యథేచ్ఛగా సాగుతోంది. ప్రజాప్రతినిధుల అండదండలతో అక్రమ సాగు అనేది ఇక్కడ నిత్యకృత్యం. ఈ క్రమంలో కొల్లేరులో చేపల చెరువుల కాపలా పనులకు నెల్లూరు, తమిళనాడుకు చెందిన వలస కూలీల కుటుంబాలు నిర్వహిస్తుంటాయి. ప్రధానంగా పులికాట్ సరస్సు ప్రాంతం వద్ద ఉండే వీరు సీజన్‌లో ఇక్కడకు వచ్చి పనులు చూసుకుని వెళ్తుంటారు.

ప్రమాదం అంచున పని

స్థానికంగా కొల్లేరు ప్రాంతంలో నాటు తుపాకులు అద్దెకు ఇస్తుంటారు. కేవలం చెరువుల వద్దకు కాపలాకు మాత్రమే వీటిని వినియోగిస్తుంటారు. కొందరు వలస కూలీలు రోజూ కూలి కోసం ప్రమాద అంచున నిత్యం పనిచేస్తున్నారు. తుపాకుల పేలుళ్లు ప్రమాదమని తెలిసినా గత్యంతరం లేక ఇదే పని చేస్తున్నారు. ప్రత్యేకంగా ఒక కులానికి చెందిన వారే నాటు తుపాకులతో పక్షులను వేటాడుతుంటారు. గత నెలలో కైకలూరు నియోజకవర్గం భైరవపట్నంలో ఇవే కుటుంబాలకు చెందిన ఒక ఇంట్లో మందుగుండు పేలి పది ఇళ్లు తగలబడి నలుగురు మృత్యువాత పడగా ముగ్గురికి గాయాలయ్యాయి. అలాగే రెండు రోజుల క్రితం కై కలూరు మండలం రామవరంలో మందుగుండు పేలి చరణ్, మణి సతీష్, కందాపుల మణికి తీవ్ర గాయాలయ్యాయి.



నల్లమందుతో నాటు తుపాకులు

భాస్వరం, పొటాషియం వంటి పేలుడు పదార్థాలను నూరి నల్లమందును తయారు చేస్తారు. చిన్నపాటి రాపిడి జరిగితేనే పేలే స్వభావం ఉంటుంది. వీటిని నాటు తుపాకుల్లో నింపి గాల్లో పక్షులు వచ్చినప్పుడు కాల్పులు చేస్తుంటారు. ప్రధానంగా తమిళనాడు, రాష్ట్రంలోని సూళ్లూరుపేటకు చెందిన 150 కుటుంబాలు కై కలూరు, ఉండి నియోజకవర్గాల్లో నివాసం ఉన్నాయి. ఆక్వా చెరువుల యజమానులు రోజు కూలికి వీరిని తీసుకు వెళ్తుంటారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు చెరువు వద్ద నాటు తుపాకీతో కాపలా ఉంటే పెద్ద పక్షిని తోలితే రూ.200 నుంచి రూ.300 వరకు ఇస్తుంటారు.



నీళ్లున్నా నిష్ఫలం

నిండుగా డుడుమ, జోలాపుట్టు జలాశయాలు / తరచూ మరమ్మతుల్లో జనరేటర్లు / ఆరింటిలో నాలుగు మాత్రమే వినియోగం / మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో మెరుగుపడని ఉత్పాదన

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో ఆశించిన స్థాయిలో ఉత్పాదన జరగడం లేదు. గతేడాది కన్నా నీటి నిల్వలు మెరుగ్గా ఉన్నా జనరేటర్లు తరచూ మరమ్మతులకు గురవడంతో లక్ష్యం మేరకు ఉత్పత్తి చేయలేకపోతోంది. ఆరింటిలో నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయి. పాత యంత్రాలు కావడంతో ఎప్పుడు మొరాయిస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.

పుష్కలంగా నిల్వలు ఉన్న జోలాపుట్టు జలాశయం



ప్రాజెక్ట్	సాధారణ నీటిమట్టం	ప్రస్తుతం
(అడుగుల్లో)		
జోలాపుట్టు	2,750	2730
డుడుమ	2590	2575

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే ప్రధాన డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నా వినియోగించుకోవడంలో ఆంధ్రా–ఒడిశా అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నీటి నిల్వలు నిలకడగా ఉన్నాయి. గత కొద్ది నెలలుగా ఏజెన్సీలో చెదురుమదురుగా కురిసిన వర్షాలకు వరద నీరు అధికంగా వచ్చి చేరింది. దీంతో నీటి మట్టం క్రమేపీ పెరిగింది. జోలాపుట్టు జలాశయ నీటి మట్టం 2750 అడుగులు కాగా గురువారం నాటికి 2730.55 అడుగులుగా నమోదయింది. గత ఏడాది ఇదే రోజుకు 2697.95 అడుగులు నీటి నిల్వ ఉంది. డుడుమ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2590 అడుగులు కాగా ప్రస్తుతం 2575 అడుగులుగా ఉంది. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం దిగువున ఉన్న డుడుమ జలాశయానికి రెండు గేట్లు ఎత్తి వెయ్యి క్యూసెక్కుల నీటిని రెండు రోజులుగా విడుదల చేస్తున్నారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఏడాది పొడవునా విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీరు అందుబాటులో ఉందని జలాశయ అధికారులు చెబుతున్నారు.

120కు 80 మెగావాట్లు మాత్రమే ఉత్పాదన

మాచ్‌ఖండ్‌లో ఆరు యూనిట్లతో 120 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉంది. నాలుగు యూనిట్లలో 80 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. రెండు యూనిట్లు మరమ్మతుల్లోనే ఉన్నాయి. ఈ జలవిద్యుత్ కేంద్రంలో గత కొన్నేళ్లుగా జనరేటర్ల మరమ్మతులకు గురవుతుండటం వల్ల పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసిన పరిస్థితులు చాలా తక్కువగా ఉన్నాయి. ఆరు జనరేటర్ల సాయంతో 120 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేయాలి. వీటిలో 2,3,5,6 జనరేటర్లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. 1,4 నంబరు జనరేటర్లు మరమ్మతుల దశలో ఉన్నాయి.

మరమ్మతుల వైపే మొగ్గు?

ప్రాజెక్టు అధికారులు పాతబడిపోయిన జనరేటర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం లేదు. వీరు మరమ్మతులవైపే మొగ్గుచూపుతున్నారన్న విమర్శలున్నాయి. మరమ్మతుల వల్ల నిధులు వృథా తప్ప జలవిద్యుత్ కేంద్రానికి ఎటువంటి ఉపయోగం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు జనరేటర్లు మరమ్మతులకు పరిమితం అవడం వల్ల పూర్తిస్థాయిలో ఉత్పాదన సాధ్యం కావడం లేదు.



శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 70,970 మంది స్వామిని దర్శించుకున్నారు. 33,871 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.56 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 16 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చిన వెంకన్న క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చిన వెంకన్న దివ్య క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ వేసవి సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ అనివేటి మండపంలో పలువురు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.

వసంతోత్సవాలకు శ్రీకారం



చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక వసంతోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత స్వామివారిని వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు వేడుకగా స్నపన తిరుమంజనం జరిపించారు. సాయంత్రం కనులపండువగా ఊంజల్ సేవ చేపట్టారు. ఈ క్రమంలోనే దేవదేవేరులను తిరుచ్చిపై కొలువుదీర్చి ఊరేగించారు. వసంతోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నారు.

నారసింహుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చిన వెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శనివారం సాయంత్రం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తికి దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. న్యాయమూర్తి వెంట భీమడోలు కోర్టు జడ్జి ఎస్.ప్రియదర్శిని నూతక్కి ఉన్నారు.

సాహసం శ్వాసగా సాగిపో...

- అడవి నేపథ్యంలో అడ్వెంచరస్ సినిమాలు
- ఆసక్తి చూపిస్తున్న తెలుగు అగ్రహీరోలు


● మహేశ్‌బాబు


● పవన్ కల్యాణ్


● ఎన్టీఆర్


● రవితేజ

లక్ష్య సాధన కోసం అడవికి వెళ్తున్నారు హీరోలు. ఒకరిది నిధి అన్వేషణ అయితే, మరొకరిది పోరాటం. ఇంకొకరిది ఆధిపత్యం... ఇలా తెలుగు హీరోలు తమ తమ లక్ష్య సాధన కోసం అడవి బాట పట్టారు. సాహసమే శ్వాసగా ముందుకు సాగుతున్నారు. ఇలా అడవి మాదే... శత్రువుల వేట మాదే అంటున్న కొందరు తెలుగు హీరోలపై ఓ లుక్ వేద్దాం.

ఫారెస్ట్‌లో అడ్వెంచర్

ఫారెస్ట్‌లో మహేశ్‌బాబు ఏదో నిధి కోసం అన్వేషించనున్నారట. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామా మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమా ఆఫ్రికన్ ఫారెస్ట్ నేపథ్యంలో సాగుతుందని, ఈ చిత్రకథా రచయిత విజయేంద్ర ప్రసాద్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. సో... ఈ సినిమాలోని మేజర్ కథను మలుపు తిప్పే కీలక సన్నివేశాలు ఫారెస్ట్ నేపథ్యంతోనే ముడిపడి ఉంటాయనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఇటీవల ఈ సినిమాకు చెందిన ఓ భారీ షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో పూర్తయింది. ఓ భారీ సెట్‌లో ఈ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఈ షెడ్యూల్‌లో అడవి బ్యాక్‌డ్రాప్‌లో ఉండే కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారని తెలిసింది. ఇంకా ఈ సినిమా షూటింగ్‌కు ముందు రాజమౌళి కెన్యా వెళ్లి, అక్కడ కొన్ని లొకేషన్స్‌ను చూసి వచ్చారు. ఇలా ఈ సినిమా చిత్రీకరణ విదేశీ అడవుల్లోనూ ఉంటుందని తెలుస్తోంది. ప్రస్తుతం మహేశ్‌బాబు, రాజమౌళి వేసవి బ్రేక్‌లో ఉన్నారు. ఈ బ్రేక్ పూర్తవగానే మళ్లీ ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభిస్తారు. జూన్ రెండో వారంలో ఈ సినిమా చిత్రీకరణ తిరిగి ప్రారంభం కావొచ్చు. నెక్ట్స్ షెడ్యూల్ కోసం వారణాసిని తలపించేలా హైదరాబాద్ శివార్లలో ఓ భారీ సెట్‌ను తీర్చిదిద్దుతున్నారని, ఈ సెట్‌లోనే ఈ సినిమా షూటింగ్ ఉంటుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమాకు విజయేంద్రప్రసాద్, దేవ కట్టా డైలాగ్స్ అందిస్తున్నారు. ఇంగ్లిష్ డైలాగ్స్ కోసం ఓ హాలీవుడ్ రైటర్‌ను నియమించుకోవాలని రాజమౌళి ప్లాన్ చేస్తున్నారట. భారీ బడ్జెట్‌తో కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమా 2027లో విడుదల కానుందని సమాచారం.

వీరమల్లు అన్వేషణ

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన హిస్టారికల్ ఫిల్మ్ 'హరిహర వీరమల్లు'. 17వ శతాబ్దం నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. ఈ చారిత్రాత్మక చిత్రంలో పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ చేయగా, పంచమి అనే పాత్రలో హీరోయిన్‌గా నిధీ అగర్వాల్ నటించారు. కాగా ఈ సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలు అడవి నేపథ్యంతో ఉంటాయని తెలిసింది. ఓ నిధి అన్వేషణ కోసం వీరమల్లు తన బృందంతో కలిసి అడవికి వెళ్తాడని, ఆ సన్నివేశాలు ఆసక్తికరంగా ఉంటాయని ఫిల్మ్‌నగర్ భోగట్టా. 'హరిహర వీరమల్లు' సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం 'హరిహర వీరమల్లు: స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' చిత్రం జూన్ 12న విడుదల కానుంది. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఏఎమ్ రత్నం సమర్పణలో అద్దంకి దయాకర్ రావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

అడవిలో డ్రాగన్

ఫారెస్ట్‌లో అదిరిపోయే చేజింగ్ ఫైట్ చేస్తున్నారు హీరో ఎన్టీఆర్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా రూపొందుతున్న లేటెస్ట్ మూవీ 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఇటీవల కర్ణాటక లొకేషన్స్‌లో ప్రారంభమైన ఈ సినిమా చిత్రీకరణలో ఓ ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ సీన్ తీశారని తెలిసింది. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో ఈ ఫారెస్ట్ చేజింగ్ యాక్షన్ సీక్వెన్స్ ఓ హైలైట్‌గా ఉంటుందని, హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్స్ ఈ యాక్షన్ సీక్వెన్‌ని డిజైన్ చేశారని తెలిసింది. కాగా లండన్‌లోని ప్రఖ్యాత రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో 'ఆర్ఆర్ఆర్' సినిమా స్క్రీనింగ్‌కి హాజరయ్యారు ఎన్టీఆర్, అలాగే ఈ నెల 20న ఎన్టీఆర్ బర్త్ డే. సో... ఈ రెండు కారణాల వల్ల ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమా షూటింగ్‌కు తాత్కాలిక బ్రేక్ ఇచ్చారు. బర్త్ డే సెలబ్రేషన్స్ పూర్తి కాగానే ఎన్టీఆర్ తిరిగి 'డ్రాగన్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారని, రష్మికా మందన్నా ఓ కీలక పాత్ర చేయనున్నారని, మలయాళ నటుడు టొవినో థామస్ విలన్‌గా కనిపిస్తారనే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇక కల్యాణ్‌రామ్, కె. హరికృష్ణ, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జూన్ 25న విడుదల కానుంది. మరోవైపు ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన 'దేవర' సినిమాలో కొన్ని ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్ సన్నివేశాలు ఉన్నట్లుగా చూశాం. ఇటీవల 'దేవర 2' సినిమాను ఓ సందర్భంగా కన్ఫార్మ్ చేశారు ఎన్టీఆర్. ఇలా వచ్చే ఏడాది 'దేవర 2' సినిమా కూడా సెట్స్ పైకి వెళుతుందని ఊహించవచ్చు. సో... 'దేవర 2'లోనూ ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉంటాయని ఊహించవచ్చు.


● విష్ణు మంచు

అడవిలో జాతర


రవితేజ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ మూవీ 'మాస్ జాతర'. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. రవితేజ కెరీర్‌లోని ఈ 75వ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో లక్ష్మణ్ భేరి అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రవితేజ కనిపిస్తారు. కాగా ఈ సినిమాలో కూడా అడవి నేపథ్యంతో కూడిన సన్నివేశాలు ఉన్నాయని సమాచారం. అరకు, పాడేరు, ఆంధ్రా–ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల లొకేషన్స్‌లో 'మాస్ జాతర' సినిమా చిత్రీకరణ జరిగిందని తెలిసింది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా టాకీ పార్ట్ చిత్రీకరణ దాదాపు పూర్తయింది. సాంగ్స్ బ్యాలెన్స్ ఉన్నాయి. అతి త్వరలోనే ఈ సాంగ్ షూటింగ్స్‌ని కూడా పూర్తి చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. 'మాస్ జాతర' సినిమా జూలై చివర్లో లేదా ఆగస్టులో రిలీజ్ కావొచ్చు.


● విజయ్ దేవరకొండ

భక్త కన్నప్ప

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ఈ సినిమాలో తిన్నడు పాత్రలో కనిపిస్తారు విష్ణు మంచు. దైవత్వాన్ని నమ్మని తిన్నడు శివుడికి ఎలా వీరభక్తుడు అయ్యాడు? భక్త కన్నప్పగా ఎలా ప్రఖ్యాతి చెందాడు? అనే అంశాల ఆధారంగా 'కన్నప్ప' సినిమా ఉంటుందని తెలుస్తోంది. కథ రీత్యా ఈ సినిమా మేజర్ పార్ట్ అంతా అడవి నేపథ్యంతోనే ఉంటుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్స్.. వంటి ప్రమోషనల్ కంటెంట్... 'కన్నప్ప' సినిమా ఫారెస్ట్ నేపథ్యంతోనే సాగుతుందన్న విషయాన్ని మరింతగా స్పష్టం చేస్తున్నాయి. ప్రీతీ ముకుందన్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. మోహన్ బాబు, మోహన్‌లాల్, ఆర్. శరత్‌కుమార్, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్, బ్రహ్మాజీ, రఘుబాబు తదితరులు ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ముఖేష్ కుమార్ దర్శకత్వంలో మోహన్‌బాబు నిర్మించిన 'కన్నప్ప' చిత్రం జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.


● శర్వానంద్


● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

నిధి వేట

నిధి వేటలో ఉన్నారట అర్జున్. నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో మిస్టిక్ థ్రిల్లర్ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు 'వృషకర్మ'తో పాటు మరో రెండు టైటిల్స్‌ను పరిశీలిస్తున్నారట. ఈ చిత్రంలో నిధిని అన్వేషించే అర్జున్ పాత్రలో నాగచైతన్య, పురావస్తు శాస్త్రవేత్తగా మీనాక్షీ చౌదరి కనిపిస్తారు. ఇలా నిధి అన్వేషణలో భాగంగా అర్జున్ ఫారెస్ట్‌కి వెళతాడట. అక్కడ ఫారెస్ట్‌లో కొన్ని సాహసాలు చేస్తాడట. ఈ సినిమా కోసం ఓ గుహ సెట్‌ను రెడీ చేశారు మేకర్స్. ఈ గుహ సెట్‌లో వచ్చే యాక్షన్ సీక్వెన్స్ ఈ సినిమాలో చాలా కీలకంగా ఉంటుందని, ఈ సీక్వెన్స్ దాదాపు ఇరవై నిమిషాలు ఉంటుందని తెలిసింది. బాపినీడు సమర్పణలో సుకుమార్, బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది మే లేదా జూన్‌లో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

అరణ్యంలో భోగి

హీరో శర్వానంద్, దర్శకుడు సంపత్ నంది కాంబినేషన్‌లో రూపొందుతున్న పీరియాడికల్ రూరల్ యాక్షన్ డ్రామా ఫిల్మ్ 'భోగి'. 1960 నేపథ్యంలో సాగే ఈ మూవీలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, డింపుల్ హయతి మరో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఉత్తర తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథనం ఉంటుంది. ఈ సినిమా కోసం దాదాపు ఇరవై ఎకరాల్లో ప్రత్యేకమైన విలేజ్ సెట్‌ను ఏర్పాటు చేశారు మేకర్స్. కాగా ఈ సినిమాలోని కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు, కొంత భాగం అడవి నేపథ్యంలోనే ఉంటాయని తెలిసింది. ఈ మూవీ కోసం శర్వానంద్ ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో కేకే రాధామోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది ద్వితియార్ధంలో రిలీజ్ కావొచ్చు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

కిష్కింధపురిలో ఏం జరిగింది?

'కిష్కింధపురికి' ప్రేక్షకులను తీసుకు వెళ్లనున్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న మిస్టరీ అండ్ హారర్ థ్రిల్లర్ మూవీ 'కిష్కింధపురి'. ఇటీవల 'కిష్కింధపురి' సినిమా గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ రాత్రివేళ అడవిలోకి వెళ్లడం, అక్కడ వీరిద్దరూ ఎందుకోసమో వెతుకులాడంట వంటి విజువల్స్ కనిపించాయి. చూస్తుంటే... 'కిష్కింధపురి' మేజర్ సీన్స్‌లు అడవి నేపథ్యంలో ఉంటాయని, అది కూడా రాత్రివేళ సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయనీ తెలుస్తోంది. అర్చన సమర్పణలో సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాదిలోనే విడుదల కానుంది. అలాగే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా 'హైందవ' అనే మూవీ రూపొందుతోంది. లుదీర్ బైరెడ్డి దర్శకత్వంలో మహేశ్ చందు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నాలుగువందల ఏళ్ల క్రితం నాటి గుడి నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందట. ఈ సినిమాలోనూ ఫారెస్ట్ ఎపిసోడ్స్ ఉన్నాయని తెలిసింది. ఈ ఏడాదే ఈ సినిమా విడుదల కానుంది.

కింగ్‌డమ్

విజయ్ దేవరకొండ లేటెస్ట్ మూవీ 'కింగ్‌డమ్'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ఇది. ఈ సినిమా రెండు డిఫరెంట్ టైమ్ లైన్స్‌లో జరుగుతుందని, ఫ్లాష్ బ్యాక్ టైమ్‌లైన్ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు అడవి నేపథ్యంతోనే ఉంటాయని ఫిల్మ్ నగర్ సమాచారం. పైగా 'కింగ్‌డమ్' సినిమా టీజర్‌లోనూ అడవిని తలపించే కొన్ని షాట్స్ కనిపించాయి. అలాగే ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని తెలిసింది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ భోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జూలై 4న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది.

ఇలా అడవి నేపథ్యం, అడవి సన్నివేశాలు కీలకంగా సాగే మరికొన్ని సినిమాలు ఉన్నాయి.

- ముసిమి శివాంజనేయులు

కాన్స్‌లో నమస్తే..!


● అనుష్కా సేన్


● పారుల్ గులాటి

ప్రపంచవ్యాప్తంగా అందరూ ఎదురు చూసే ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఫ్రాన్స్‌లో జరిగే కాన్స్ చిత్రోత్సవాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. అందుకే ఈ వేడుకల్లో పాల్గొనే తారలు ప్రత్యేక దుస్తుల్లో ప్రత్యక్షమై కనువిందు చేస్తుంటారు. ప్రస్తుతం జరుగుతున్న 78వ కాన్స్ చిత్రోత్సవాల్లో ఇప్పటికే పలువురు నటీమణులు అదిరేటి డ్రెస్సుల్లో ఆకట్టుకోగా... తాజాగా మరికొందరు రెడ్ కార్పెట్‌పై మెరిశారు. భారతదేశం నుంచి ఈ చిత్రోత్సవాల్లో పాల్గొన్న అనుష్కా సేన్ పర్పుల్ ఫ్రాక్‌లో కలర్‌ఫుల్‌గా కనిపించారు. 'దేవోం కే దేవ్.... మహాదేవ్, బాలవీర్, ఝాన్సీ కీ రాణి' తదితర షోస్‌లో నటించిన అనుష్కా సేన్ భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తూ 'నమస్తే' అంటూ, అక్కడున్న వారికి అభివాదం చేయడం దేశం పట్ల ఆమెకున్న గౌరవానికి నిదర్శనంగా నిలిచింది. ఇక ఈ చిత్రోత్సవాల్లో ప్రదర్శితం కానున్న అనుపమ్ ఖేర్ దర్శకత్వంలో రూపొందిన 'తన్వీ ది గ్రేట్'లో నటించిన శుభాంగి దత్ మల్లెపువ్వుల తాజాదనాన్ని గుర్తు చేస్తూ తెల్లటి గౌనులో ఫ్రెష్‌గా కనిపించారు. అలాగే పలు పంజాబీ చిత్రాల్లోనూ, ఒక తెలుగు చిత్రం ('నీ జత లేక'), పలు హిందీ సీరియల్స్, టీవీ షోస్‌లో నటించిన పారుల్ గులాటి నిజమైన జుట్టుతో తయారు చేసిన ఫ్రాక్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ న్యాన్సీ త్యాగి స్వయంగా తానే తయారు చేసుకున్న గౌనులో, మ్యూజిక్ సెన్సేషన్ ఆస్టా గిల్ బంగారు రంగు గౌనులో మెరిసిపోయారు. ఇంకా హాలీవుడ్ తారలు ఏంజెలినా జోలి, ఎమ్మా స్టోన్ తదితరులు రెడ్ కార్పెట్ పై ఐ ఫీస్ట్‌గా నిలిచారు.


● శుభాంగి దత్

అమెరికన్ కాంటెంపరరీ వెస్టర్న్ ఫిల్మ్ 'ఎడింగ్టన్' స్పెషల్ ప్రీమియర్ కాన్స్‌లో ఓ హైలైట్‌గా నిలిచింది. ఆరి ఆస్టర్ డైరెక్షన్‌లో జోక్విన్ ఫీనిక్స్ ('జోకర్' సినిమా ఫేమ్), పెడ్రో పాస్కల్, ల్యూక్ గ్రిమ్స్, డీర్డ్రే ఓ కానల్, మైఖేల్ వార్డ్, ఆస్టిన్ బట్లర్, ఎమ్మా స్టోన్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ 'ఎడింగ్టన్' టీమ్ రెడ్ కార్పెట్ వాక్ చేసినప్పుడు ఓ గమ్మత్తైన సంఘటన చోటు చేసుకుంది. ఓ ఈగ ఎమ్మా స్టోన్ చుట్టూ తిరిగింది. ఆ ఈగను చూసి, ఎమ్మా స్టోన్ కొన్ని సరదా ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడం, ఆమె పక్కనే ఉన్న పెడ్రో పాస్కల్-ఆస్టిన్ బట్లర్‌లు ఆ ఈగను తోలడం వంటివి వీక్షకులను అలరించాయి. అలాగే ఈ ప్రీమియర్ తర్వాత ఈ సినిమాకు ఐదు నిమిషాల స్టాండింగ్ ఒవేషన్ దక్కింది. ఈ మూవీ జూలై 18న అమెరికాలో విడుదల కానుంది. ఇక ఈ సినిమా ప్రీమియర్‌కు ఏంజెలినా జోలీ హాజరవ్వడం స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది.


● ఎమ్మా స్టోన్, పెడ్రో పాస్కల్

పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్

కమల్‌హాసన్ హీరోగా నటించిన చిత్రం 'థగ్ లైఫ్'. ప్రముఖ డైరెక్టర్ మణిరత్నం తెరకెక్కించిన ఈ చిత్రంలో శింబు, త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్యా లక్ష్మి, జోజు జార్జ్, అభిరామి, నాజర్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం జూన్ 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై హీరో నితిన్ తండ్రి ఎన్. సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని శనివారం చెన్నైలో నిర్వహించారు. ''థగ్ లైఫ్' చిత్రంలో కమల్‌హాసన్ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో అదరగొడతారు. ఇది మామూలు ప్రతీకారం తీర్చుకునే కథ కాదు. ఒక సిద్ధాంత పోరాటం. ఈ భావోద్వేగ కథని మణిరత్నం అద్భుతంగా తీర్చిదిద్దారు. మా సినిమా థియేటర్లలో గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించనుంది. గతంలో 'విక్రమ్, అమరన్' లాంటి బ్లాక్‌బస్టర్లు అందించిన శ్రేష్ఠ్ మూవీస్ ఇప్పుడు 'థగ్ లైఫ్'ని భారీగా విడుదల చేస్తుండటం ఆనందంగా ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమేరా: రవి కె. చంద్రన్.


● శింబు, ఏఆర్ రెహమాన్, మణిరత్నం, కమల్‌హాసన్, త్రిష

ఓటీటీ ఇది చూడొచ్చు

వీడు మామూలోడు కాదు

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో కన్నడ చిత్రం విద్యాపతి ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఎవరికైనా ఆశ ఉండొచ్చు, అత్యాశ పనికి రాదు. ఇది అందరికీ తెలిసిన విషయమే. కానీ చాలామంది తమ తక్షణ అవసరాల కోసం అత్యాశకు పోయి అనర్థాలు కొని తెచ్చుకుంటుంటారు. ఆ తరువాత బాధ పడుతుంటారు. వాళ్ళలో కొద్దిమంది మాత్రమే తాము చేసిన తప్పులను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఆ కోవకు చెందిన కథే 'విద్యాపతి'. ఇది ఓ కన్నడ సినిమా. ఇషాన్ ఖాన్, హసీమ్ ఖాన్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన చిత్రం 'విద్యాపతి'. నాగభూషణ, మలైకా వసుపాల్ ఈ సినిమాలో హీరో హీరోయిన్లుగా నటించారు. ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమా తెలుగులోనూ లభ్యమవుతోంది. యాక్షన్ కామెడీ నేపథ్యంలో సాగే చిత్రం ఇది. దర్శకులు ఈ స్క్రీన్‌ప్లేని సరదా సరదాగా తీసుకువెళ్ళారు.



అసలీ 'విద్యాపతి' సినిమా కథేంటంటే... విద్య అనే సినిమా హీరోయిన్ పెద్ద స్టార్. ఆ హీరోయిన్‌ని అల్లరి చిల్లరగా తిరిగే హీరో మోసం చేసి పెళ్ళి చేసుకుంటాడు. అంతేనా... పెళ్ళి చేసుకుని ఆ అమ్మాయికి సంబంధించిన సినిమా వ్యవహారాలతో పాటు ఆస్తి పైన అప్పనంగా పెత్తనం చెలాయిస్తుంటాడు. అలా చెలాయిస్తూనే తన పేరును విద్యకు అనుసంధానంగా విద్యాపతిగా మార్చుకుని చెలామణి అవుతాడు. కానీ ఎప్పుడూ టైమ్ ఒకేలా ఉండదు కదా. విద్యకి విద్యాపతి చేసిన మోసం తెలిసి, తన ఇంటి నుండి గెంటేస్తుంది. అప్పటిదాకా ఫైవ్ స్టార్ భోగాలు అనుభవించిన విద్యాపతి తినడానికి, ఉండడానికి కూడా గతి లేక తన ఇంటికి వెళతాడు. విద్యాపతి తండ్రి బిరియానీ బండి నడుపుతుంటాడు. ఇంటికి తిరిగి వచ్చిన కొడుకును అసహ్యించుకుంటాడు. తెలివొచ్చే టైమ్‌లో అన్నీ తెలిసొస్తాయన్నట్టు మన విద్యాపతి కళ్ళు నేల మీదకు వచ్చి విద్య దగ్గర తన లవ్‌ను ప్రూవ్ చేసుకోవాలని ప్రయత్నిస్తుంటాడు. మరి... విద్యాపతి ప్రయత్నం ఫలించిందా లేక బెడిసికొట్టిందా అనేది మాత్రం సినిమాలోనే చూడాలి. ఓ మంచి లైన్‌తో దర్శకులు చక్కటి హ్యూమర్‌ను జోడించి, సినిమాను సరదాగా రూపొందించారు. గుడ్ మూవీ ఫర్ ది వీకెండ్.

– హరికృష్ణ ఇంటూరు

బిజినెస్ రీల్

హైదరాబాద్‌లో మెట్‌లైఫ్ టెక్నాలజీ హబ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బీమా సంస్థ మెట్‌లైఫ్ తాజాగా హైదరాబాద్, పుణెలో టెక్నాలజీ హబ్‌లను ఏర్పాటు చేసింది. ఇవి సొల్యూషన్స్ డెలివరీని మెరుగుపర్చడంతో పాటు సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ మైగ్రేషన్, ఐటీ మౌలిక సదుపాయాల ఆధునీకరణ మొదలైన అంశాల్లో తోడ్పాటు అందిస్తాయని కంపెనీ తెలిపింది. ఈ రెండింటితో పాటు నోయిడా, జైపూర్‌లో ఇప్పటికే ఉన్న హబ్‌లతో కలిపి భారత్‌లో తమ కార్యకలాపాల విభాగాన్ని మెట్‌లైఫ్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (ఎంజీసీసీ)గా వ్యవహరించనున్నట్లు వివరించింది.

ఎలక్ట్రిక్ వాహనాలకు టాటా మెగా చార్జింగ్ స్టేషన్లు




ముంబై: ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజం టాటా ఈవీ తొలిసారిగా 10 మెగాచార్జర్ స్టేషన్లను ప్రారంభించింది. ముంబై–అహ్మదాబాద్ హైవేపై మూడు, ఢిల్లీ–జైపూర్ హైవేలో నాలుగు, పుణె–నాసిక్ హైవేలో ఒకటి, బెంగళూరు.. ఉదయ్‌పూర్ నగరాల్లో చెరొకటి చొప్పున చార్జ్‌జోన్, స్టాటిక్ సంస్థల భాగస్వామ్యంతో వీటిని ఏర్పాటు చేసింది. ఇవి అత్యంత వేగంగా కేవలం 15 నిమిషాల్లోనే సుమారు 150 కి.మీ. రేంజికి సరిపడేంత చార్జింగ్ చేసుకునేందుకు వీలు కలిగిస్తాయి. ఈ స్టేషన్లలో రెస్ట్‌రూమ్‌లు, డైనింగ్ సదుపాయాలు ఉంటాయి. దేశవ్యాప్తంగా 500 మెగాచార్జర్లను ఇన్‌స్టాల్ చేయాలన్న లక్ష్యంలో భాగంగా వీటిని నెలకొల్పినట్లు టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ చీఫ్ స్ట్రాటెజీ ఆఫీసర్ బాలాజీ రాజన్ తెలిపారు. 2027 నాటికి ప్రస్తుతమున్న చార్జ్ పాయింట్లను రెట్టింపు స్థాయి పెంచడంపై సంస్థ దృష్టి పెడుతోంది.

అపోలో ఫార్మసీ, ఎస్‌బీఐ కో–బ్రాండెడ్ క్రెడిట్ కార్డు



న్యూఢిల్లీ: ప్రముఖ క్రెడిట్ కార్డుల జారీ సంస్థ ఎస్‌బీఐ కార్డ్, దిగ్గజ రిటైల్ ఫార్మసీ చెయిన్ అపోలో హెల్త్‌కో కీలక భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా అపోలో ఎస్‌బీఐ కార్డ్ సెలెక్ట్ కార్డ్‌ను ఆవిష్కరించాయి. ఈ కార్డ్ ద్వారా అపోలో ఫార్మసీతో పాటు అపోలో 24/7 యాప్‌లో ఆకర్షణీయమైన ఆఫర్లు పొందవచ్చు. ఫార్మసీ ఉత్పత్తులు, ఆరోగ్య పరీక్షలు, ఇతర పలు రకాల సేవలకు చెల్లింపులు చేయొచ్చు. అలాగే వెల్‌కమ్ గిఫ్ట్ కింద రూ.1,500 విలువ చేసే ఇ–గిఫ్ట్ వోచర్ లభిస్తుంది.

చార్జ్ పవర్‌తో ప్యూర్ జట్టు



న్యూఢిల్లీ: ఎనర్జీ స్టోరేజీ సొల్యూషన్స్ సంస్థ ప్యూర్ తాజాగా చార్జ్ పవర్‌తో జట్టు కట్టింది. అమెరికా, కెనడాలో ప్రవేశించేందుకు ఇది తోడ్పడనున్నట్లు సంస్థ తెలిపింది. కో–బ్రాండింగ్ రూపంలో అక్కడి మార్కెట్లలో తమ రెసిడెన్షియల్, కమర్షియల్, గ్రిడ్ స్కేల్ అప్లికేషన్స్‌ను అందించేందుకు వీలవుతుందని వివరించింది. అమెరికా ఎనర్జీ స్టోరేజీ మార్కెట్ వార్షికంగా సుమారు 14 శాతం వృద్ధితో 2033 నాటికి దాదాపు 71 బిలియన్ డాలర్లకు, కెనడా మార్కెట్ 16 శాతం వృద్ధితో 2030 నాటికి దాదాపు 18 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నట్లు తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

18-5-2025	
విశాఖ	540-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

టెలికంలో కొలువుల మేళా..

- హైదరాబాద్, చెన్నైలో ఫ్రెషర్స్ నియామకాలు
- ప్రథమార్ధంలో 45 శాతం హైరింగ్ అవకాశాలు
- ఆర్‌ఎఫ్ ఇంజినీర్లు, నెట్‌వర్క్ సెక్యూరిటీ అనలిస్టులకు డిమాండ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీ టెలికం రంగంలో భారీ స్థాయిలో నియామకాలు పెరుగుతున్నాయి. 2025 ప్రథమార్ధంలో కంపెనీలు 45 శాతం మంది ఫ్రెషర్లను తీసుకునే యోచనలో ఉన్నాయి. టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ కెరియర్ ఔట్‌లుక్ నివేదిక (2025 జనవరి–జూన్ ప్రథమార్ధం)లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం, టెలికం రంగం వేగంగా 5జీ నెట్‌వర్క్, క్లౌడ్ సిస్టమ్స్ వైపు మళ్లుతూ, సైబర్ సెక్యూరిటీకి పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితుల నేపథ్యంలో ఈ పరిశ్రమలో ఉద్యోగాల కల్పన గణనీయంగా ఉంటోంది. హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ, బెంగళూరులో ఫ్రెషర్ల హైరింగ్ స్థిరంగా కొనసాగుతోంది.

నైపుణ్యాలకు ప్రాధాన్యత

ప్రత్యేక నైపుణ్యాలకు ప్రాధాన్యతనిస్తూ ఆర్‌ఎఫ్ ఇంజినీర్లు, నెట్‌వర్క్ సెక్యూరిటీ అనలిస్టులు, ఫీల్డ్ టెక్నికల్ ఇంజినీర్లు, జూనియర్ డెవాప్స్ ఇంజినీర్లు, క్లౌడ్ నెట్‌వర్క్ ఇంజినీర్లు మొదలైన వారికి డిమాండ్ ఉంటోంది. హైరింగ్‌పై కంపెనీల ఆసక్తి, గతేడాది ద్వితీయార్ధంలో (జులై–డిసెంబర్) నమోదైన 48 శాతం నుంచి స్వల్పంగా కాస్త తగ్గినప్పటికీ నియామకాల జోరు మాత్రం కొనసాగుతోంది. ఆర్‌ఎఫ్ ఇంజినీర్లకు ఢిల్లీ (49 శాతం), అహ్మదాబాద్ (41 శాతం), కోయంబత్తూర్‌లో (35 శాతం) అత్యధికంగా డిమాండ్ నెలకొంది. నెట్‌వర్క్ సెక్యూరిటీ అనలిస్టులకు బెంగళూరు, ముంబై, నాగ్‌పూర్‌లో వరుసగా 48 శాతం, 43 శాతం, 38 శాతం మేర డిమాండ్ ఉంది. ఇక ఫీల్డ్ టెక్నికల్ ఇంజినీర్లకు హైదరాబాద్ (55 శాతం), కోల్‌కతా (48 శాతం), ఇండోర్‌లో (43 శాతం) ఎక్కువగా అవకాశాలు ఉన్నాయి. జూనియర్ డెవాప్స్ ఇంజినీర్లకు పుణె (44 శాతం), గురుగ్రాం (40 శాతం), కొచ్చిలో (35 శాతం) డిమాండ్ ఉంది. అటు క్లౌడ్ నెట్‌వర్క్ ఇంజినీర్లకు చెన్నై (51 శాతం), నాగ్‌పూర్ (45 శాతం), చండీగఢ్‌లో (37 శాతం) అత్యధికంగా నియామక అవకాశాలు నమోదయ్యాయి.

డొమైన్ సర్టిఫికేషన్లు కావాలి..

ఫ్రెషర్లకు టెలికం రంగంలో వివిధ విభాగాలవ్యాప్తంగా ఉద్యోగావకాశాలు ఉంటున్నప్పటికీ, నెట్‌వర్క్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డెవాప్స్‌లాంటి నిర్దిష్ట డొమైన్ నైపుణ్యాలకు ప్రాధాన్యత ఉంటోంది. ఆర్‌ఎఫ్ వైర్‌లెస్ ఇంజినీరింగ్, సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ నెట్‌వర్క్ ఆర్కిటెక్చర్‌లో సర్టిఫికేషన్లకు డిమాండ్ నెలకొంది. సంక్లిష్టమైన నెట్‌వర్క్ వినియోగాన్ని క్రమబద్ధీకరణ, మేనేజ్‌మెంట్ కార్యకలాపాల నిర్వహణకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్, టాస్క్ ట్రాకింగ్ ప్లాట్‌ఫాంలు లాంటి టెక్నాలజీ టూల్స్ వినియోగం కీలకంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో కేవలం సాంకేతిక నైపుణ్యాలతో సరిపెట్టుకోకుండా, ఉద్యోగార్థులు అనలిటికల్ రీజనింగ్, పరిస్థితులకు తగ్గట్లుగా తమను తాము మల్చుకోవడం, ఇంటర్‌పర్సనల్ కమ్యూనికేషన్ సహా సాఫ్ట్ స్కిల్స్‌పై కూడా దృష్టి పెట్టాలని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ వ్యవస్థాపకుడు, సీఈవో శంతను రూజ్ తెలిపారు. ''టెలికం పరిశ్రమ వృద్ధి చెందుతున్నప్పటికీ, కంపెనీలు కేవలం కార్యకలాపాల విస్తరణ కోసమే ఉద్యోగులను తీసుకోవడం లేదు. విశిష్టమైన నైపుణ్యాలున్న ప్రతిభావంతులను తీసుకోవడం ద్వారా భవిష్యత్ అవసరాలకు కూడా సర్వసన్నద్ధంగా ఉండాలని భావిస్తున్నాయి. ఆర్‌ఎఫ్, సైబర్‌సెక్యూరిటీ, క్లౌడ్ ఎకోసిస్టమ్స్‌లాంటి అంశాల్లో సర్టిఫికేషన్లు ఉన్న ఫ్రెషర్లు అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ప్రస్తుతం టెలికం విధుల్లో ఐటీ, డేటా కార్యకలాపాలు కూడా కలిసి ఉంటున్నాయి. కొన్నేళ్ల క్రితం ఇలా ఉండేది కాదు. ఇలా మారిన పరిస్థితులను బట్టి బోధనాంశాలను కూడా సవరించడంపై విద్యా సంస్థలు దృష్టి పెట్టాల్సి ఉంటుంది. అలాగే ఉద్యోగార్థులు కూడా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి'' అని చెప్పారు.

ఏఐ నిపుణులు @ 4 లక్షలు

- డిమాండ్–సరఫరా మధ్య 51 శాతం అంతరం
- రూ. 8–45 లక్షల పైగా స్థాయిలో ఆకర్షణీయమైన వేతనాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా కృత్రిమ మేధ (ఏఐ) నిపుణుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం వీరి సంఖ్య 4.16 లక్షలకు చేరింది. అయితే నిపుణులు లభిస్తున్నప్పటికీ, డిమాండ్–సరఫరా మధ్య ఏకంగా 51 శాతం అంతరం ఉంటోంది. భవిష్యత్ అవసరాలకు సన్నద్ధతను పెంచుకోవాల్సిన ఆవశ్యకతను ఇది సూచిస్తోందని స్టాఫింగ్ సేవల సంస్థ క్వెస్ కార్ప్ ఒక నివేదికలో వివరించింది. దీని ప్రకారం ఏఐ నిపుణుల నియామకాలు 2017 నుంచి ఎనిమిది రెట్లు పెరిగాయి. గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది మార్చి మధ్య కాలంలో ఏఐ, డేటా నిపుణులకు డిమాండ్ దాదాపు 45 శాతం పెరిగినట్లు క్వెస్ ఐటీ స్టాఫింగ్ సీఈవో కపిల్ జోషి తెలిపారు. జెన్‌ఏఐ ఇంజినీరింగ్‌లో పది ఉద్యోగావకాశాలు ఉంటే అన్ని అర్హతలు కలిగిన నిపుణుడు ఒక్కరే ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఏఐ విప్లవానికి సారథ్యం వహించే సామర్థ్యాలు భారత్‌కి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అయితే దీన్ని అందిపుచ్చుకోవాలంటే వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, విధానకర్తలు ఆ దిశగా త్వరితగతిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఆకర్షణీయ వేతనాలు..

ఎంట్రీ లెవెల్ నిపుణులకు వార్షికంగా రూ. 8–12 లక్షల స్థాయిలో వేతనాలు ఉంటున్నాయి. ఇక ఎస్‌ఎల్‌పీ, జెన్‌ఏఐలో 5–8 ఏళ్ల అనుభవమున్న వారికి రూ. 25–35 లక్షల వరకు జీతభత్యాలు ఉంటున్నాయి. అటు ప్రోడక్ట్ సంస్థలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో (జీసీసీ) సీనియర్ ప్రొఫెషనల్స్ రూ. 45 లక్షల పైగా అందుకుంటున్నారు.

- ఏఐ నియామకాల్లో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగం ముందు వరుసలో ఉంటోంది. దేశీయంగా మొత్తం ఏఐ డిమాండ్‌లో ఈ రంగం వాటా 24 శాతంగా ఉంటోంది. ఆ తర్వాత స్థానాల్లో ఐటీ సరీ్వసులు, హెల్త్‌కేర్ ఉన్నాయి.
- డేటా సైంటిస్టులు, ఎంఎల్ ఇంజినీర్లు, ఏఐ డెవలపర్లు, ఏఐ రీసెర్చర్లకు అత్యధికంగా డిమాండ్ ఉంటోంది. ఏఐ ప్రోడక్ట్ మేనేజర్లు, బిజినెస్ అనలిస్టులకు కూడా హైరింగ్ అవకాశాలు బాగుంటున్నాయి.
- నైపుణ్యాలపరంగా చూస్తే పైథాన్ ల్యాంగ్వేజ్ ఆధిపత్యం కొనసాగుతోంది. అలాగే టెన్సర్‌ఫ్లో, పైటార్చ్, కేరాస్‌లాంటి ఫ్రేమ్‌వర్క్‌లకు ప్రాధాన్యం ఉంటోంది. ఎన్‌ఎల్‌పీ, కంప్యూటర్ విజన్, జెనరేటివ్ ఏఐ, క్లౌడ్ (ఏడబ్ల్యూఎస్, అజూర్, జీసీపీ), ఎంఎల్‌ఆప్స్ నైపుణ్యాలను కంపెనీలు కోరుకుంటున్నాయి.
- జెన్‌ఏఐపరమైన నియామకాల్లో బెంగళూరు, ఢిల్లీ–ఎన్‌సీఆర్, హైదరాబాద్ ముందు వరుసలో ఉంటున్నాయి. మెట్రోల పరిధిని దాటి ఏఐ టాలెంట్ హబ్‌లు ఎదుగుతున్నాయనడానికి నిదర్శనంగా మొత్తం ఏఐ డిమాండ్‌లో ద్వితీయ శ్రేణి నగరాల వాటా ఇప్పుడు 14–16 శాతంగా ఉంది. వీటిలోనూ కొచ్చి, అహ్మదాబాద్, కోయంబత్తూర్ నగరాల వాటా 70 శాతంగా ఉంది.
- జీసీసీల నుంచి జెన్‌ఏఐకి డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. దేశీయంగా మొత్తం ఏఐ హైరింగ్‌లో జీసీసీల వాటా23 శాతంగా ఉంది.
- దేశీయంగా ఏఐ నైపుణ్యాలను పెంపొందించేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాలి. విద్యారంగం, పరిశ్రమ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలతో కలిసి పని చేయాలి. పరిస్థితులకు తగ్గట్లుగా నైపుణ్యాలను పెంపొందించే ప్రోగ్రాంలను రూపొందించాలి.

కన్సల్టెంట్లకు డిమాండ్



- 2024–25లో 38 శాతం వృద్ధి
- ఫ్లెక్సింగ్ ఇట్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా అనిశ్చితి, జాబ్ మార్కెట్లో అప్రమత్తత నెలకొన్నప్పటికీ తాత్కాలిక ప్రాతిపదికన సేవలందించే కన్సల్టెంట్లు, ఫ్రీలాన్సర్లకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో కన్సల్టెంట్లకు, ప్రాజెక్టులవారీగా సేవలందించే వారికి డిమాండ్ 38 శాతం పెరిగింది. అంతక్రితం రెండేళ్లు ఇది సగటున 17 శాతంగానే నమోదైంది. వైట్ కాలర్ గిగ్ సర్వీసుల ప్లాట్‌ఫాం 'ఫ్లెక్సింగ్ ఇట్' నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. సాధారణంగా సేవల రంగంలోనే ఫ్రీలాన్సర్లకు ప్రాధాన్యం ఉండేది. కానీ ప్రస్తుతం పారిశ్రామిక, తయారీ రంగాలు కూడా వారి సర్వీసులను పొందడంపై ఆసక్తి చూపుతున్నాయి. గిగ్ వర్కర్లను ఎక్కువగా తీసుకుంటున్న టాప్ –3 రంగాల్లో ఈ రెండూ కూడా వచ్చి చేరాయి. ఎఫ్‌ఎంసీజీ, కన్సల్టింగ్, బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా), హెల్త్‌కేర్ రంగాల్లో డిమాండ్ పటిష్టంగా కొనసాగుతుండగా.. కొత్తగా పరిశ్రమలు, తయారీ రంగాలు కూడా వారి సేవలను వినియోగించుకోవడానికి ముందుకు వస్తుండటం సానుకూలాంశమని ఫ్లెక్సింగ్ ఇట్ పేర్కొంది.

మారుతున్న హైరింగ్ తీరు ..

కొత్త టెక్నాలజీలు, మారిపోతున్న మార్కెట్ పరిస్థితులకు వ్యాపార సంస్థలు తమను తాము మల్చుకునే క్రమంలో నియామకాలపరమైన అవసరాలు మారుతున్నాయి. పరిస్థితిని బట్టి అప్పటికప్పుడు నిపుణులను నియమించుకోవడమనేది ప్రత్యర్థి సంస్థలతో పోటీపడటంలో ముందుండేందుకు ఉపయోగపడుతోంది. పలు కంపెనీలు తమ రిక్రూట్‌మెంట్ విధానాల్లో మార్పులు, చేర్పులు చేస్తున్నాయని ఫ్లెక్సింగ్ ఇట్ పేర్కొంది. పెద్ద ఎత్తున ఫ్రీలాన్సర్ల సేవలు తీసుకుంటున్నాయని వివరించింది. స్పెషలిస్ట్ నైపుణ్యాలున్న వారు అందుబాటులో ఉండటం, వేగవంతంగా అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వెసులుబాటు లభిస్తుండటమనేది ఇందుకు దోహదపడుతోందని పేర్కొంది. ఫ్లెక్సింగ్ ఇట్ ప్లాట్‌ఫాంలో వివిధ నైపుణ్యాలున్న 1,00,000 మంది పైగా కన్సల్టెంట్లు అందుబాటులో ఉన్నారు.

టెక్నాలజీలో అత్యధికం

ఫ్రీలాన్సర్లకు డిమాండ్ ఎక్కువగా ఉన్న రంగాల్లో వరుసగా మూడో ఏడాది టెక్నాలజీ విభాగం (25 శాతం) అగ్రస్థానంలో నిల్చింది. కృత్రిమ మేధ వినియోగం, డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం, డిజిటల్ పరివర్తన ధోరణి పెరుగుతుండటం ఇందుకు కారణం. ఇక స్ట్రాటెజీ..బిజినెస్ డెవలప్‌మెంట్ (15 శాతం) రెండో స్థానంలో, ఫైనాన్స్ (11 శాతం) మూడో స్థానంలో ఉన్నాయి. ఫ్రీలాన్సింగ్ అనేది కేవలం ప్రత్యేక నైపుణ్యాలు, టెక్నాలజీకి మాత్రమే పరిమితం కావడం లేదని, ఇతరత్రా విభాగాల్లోనూ పెరుగుతోందనేందుకు ఇది నిదర్శనమని ఫ్లెక్సింగ్ ఇట్ తెలిపింది. మరోవైపు, ఫ్రీలాన్సర్ల లభ్యత కూడా గణనీయంగా పెరుగుతోంది. గత రెండేళ్లలో కన్సల్టెంట్ల రిజిస్ట్రేషన్లు 127 శాతం పెరిగాయి. వీరిలో 59 శాతం మందికి పదేళ్ల లోపు అనుభవమే ఉంది. సంప్రదాయ పద్ధతిలో ఒక్కో మెట్టు ఎదుగుతూ పైకెళ్లడం కన్నా స్వతంత్రతను, రకరకాల ప్రాజెక్టులు చేయడం ద్వారా అనుభవాన్ని గడించేందుకు ప్రొఫెషనల్స్ ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ ధోరణికి మిలీనియల్స్ శ్రీకారం చుట్టగా, జెన్ జడ్ తరం దాన్ని వేగంగా అందిపుచ్చుకుంటోంది. గతంలో మధ్య స్థాయి, సీనియర్ ప్రొఫెషనల్స్ ఇలా ఫ్రీలాన్సింగ్ బాట పట్టే వారు. కానీ టెక్నాలజీ, మార్కెటింగ్, ఫైనాన్స్‌లాంటి రంగాల్లో నైపుణ్యాలున్న యువత ఫ్రీలాన్సింగ్ వైపు మొగ్గు చూపే ధోరణి పెరుగుతోంది. గత ఆర్థిక సంవత్సరం కన్సల్టెంట్లుగా కొత్తగా రిజిస్టర్ చేసుకున్నవారిలో 38 శాతం మంది మహిళలు ఉన్నారు.

రిమోట్ వర్కింగ్ వైపు మొగ్గు..

ఉద్యోగులను ఆఫీసులకు రప్పించాలా లేదా ఇంటి నుంచే పని చేసే విధానాన్ని కొనసాగించాలా అనే అంశాలపై కంపెనీలు ఇంకా డైలమాలో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ.. ఫ్రీలాన్సింగ్ విషయంలో రిమోట్ వర్కింగ్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటోంది. ప్రతి నాలుగు ప్రాజెక్టుల్లో ఒకటి పూర్తిగా రిమోట్ ప్రాజెక్టుగా ఉంటోంది. స్ట్రాటెజీ, టెక్నాలజీ, మార్కెటింగ్ విభాగాల్లో పట్టున్న భారతీయ కన్సల్టెంట్లు ఎక్కువగా గ్లోబల్ క్లయింట్లకు సర్వీసులు అందిస్తున్నారు. ఇలాంటి ప్రాజెక్టుల విషయంలో ఎక్కడి నుంచి పనిచేస్తున్నారు అనే దానికన్నా నైపుణ్యాలే కీలకంగా ఉంటుండటంతో రిమోట్ వర్కింగ్‌కి ప్రాధాన్యత ఉంటోంది.

ఎగుమతుల్లో పావు శాతం ఇంజనీరింగ్ ఉత్పత్తులే

- తర్వాతి స్థానాల్లో అగ్రి, ఫార్మా, ఎలక్ట్రానిక్స్
- 50 శాతం వాటా ఈ రంగాలదే
- గత కొన్నేళ్ల నుంచి వృద్ధి బాటలోనే
- బియ్యం ఎగుమతులు 12.5 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: ఇంజనీరింగ్, వ్యవసాయం, ఫార్మా, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు దేశ ఎగుమతుల్లో గణనీయమైన వాటా ఆక్రమిస్తున్నాయి. 2024–25లో నమోదైన మొత్తం ఎగుమతుల్లో ఈ రంగాల వాటాయే 50 శాతంగా ఉన్నట్టు కేంద్ర వాణిజ్య శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా 26.67 శాతం వాటాతో ఇంజనీరింగ్ ఉత్పత్తులు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. ఆ తర్వాత 11.85 శాతం ఎగుమతులు వ్యవసాయ రంగం నుంచి నమోదవగా.. ఫార్మా 6.96 శాతం, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతులు 8.82 శాతం చొప్పున ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఎగుమతుల్లో అత్యధికంగా ఎలక్ట్రానిక్స్ నుంచి 32.46 శాతం మేర వృద్ధి నమోదైంది. 2023–24లో 29.12 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు జరగ్గా.. 2024–25లో 38.58 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2021–22లో ఇవే ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 15.7 బిలియన్ డాలర్లతో పోల్చి చూస్తే మూడేళ్లలో 130 శాతం వరకు వృద్ధి చెందాయి. ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో కంప్యూటర్ హార్డ్‌వేర్, పెరిఫెరల్స్ వాటా 3.8 శాతంగా ఉన్నాయి. మూడేళ్లలో 101 శాతం పెరిగాయి. యూఏఈ, అమెరికా, నెదర్లాండ్స్, బ్రిటన్, ఇటలీ భారత ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతులకు ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి.

ఇంజనీరింగ్ ఎగుమతులు 117 బిలియన్ డాలర్లు

ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు 2023–24తో పోల్చి చూస్తే 2024–25లో 6.74 శాతం పెరిగి 117 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇంజనీరింగ్ ఎగుమతులకు అమెరికా, యూఏఈ, సౌదీ అరేబియా, బ్రిటన్, జర్మనీ కీలక మార్కెట్లుగా ఉన్నాయి. 2014–15 నుంచి 2020–21 వరకు దేశ ఇంజనీరింగ్ ఎగుమతులు 73–83 బిలియన్ డాలర్ల మధ్య ఉండగా.. 2021–22లో 112 బిలియన్ డాలర్లకు పెరిగాయి. అప్పటి నుంచి ఇవి ఏటా 100 బిలియన్ డాలర్లకు పైనే ఉంటున్నాయి. ఔషధాల ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరంలో 9.4% పెరిగి 30.47 బిలియన్ డాలర్లకు చేరగా, వ్యవసాయం, దాని అనుబంధ రంగాల ఉత్పత్తుల ఎగుమతులు 7.36% పెరిగి 52 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

200 దేశాలకు ఫార్మా ఎగుమతులు

భారత్ నుంచి 200 దేశాలకు ఔషధాల ఎగుమతులు జరుగుతున్నట్టు వాణిజ్య శాఖ డేటా తెలియజేస్తోంది. ముఖ్యంగా 2014–15 నుంచి ఫార్మా ఎగుమతులు ఏటేటా పెరుగుతూ వెళుతున్నాయి. వ్యవసాయ రంగం నుంచి మసాలా దినుసులు, కాఫీ, టీ, పొగాకు, బియ్యం, పండ్లు, కూరగాయలు, సముద్ర ఉత్పత్తుల్లో సానుకూల వృద్ధి నమోదైంది. దినుసుల ఎగుమతులు 4.45 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. చైనా, అమెరికా, యూఏఈ, బంగ్లాదేశ్, థాయిలాండ్ మసాలా దినుసులను ఎక్కువగా దిగుమతి చేసుకున్నాయి. మిరప, పసుపు, అల్లం, జీలకర్ర ఎగుమతులు ప్రధానంగా ఉన్నాయి.

కాఫీ ఎగుమతుల్లో మెరుగైన వృద్ధి

కాఫీ ఎగుమతులు 1.81 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2023–24లో కాఫీ ఎగుమతులు 1.29 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. కాఫీ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో ఏడో స్థానంలో ఉంది. ఇటలీ, రష్యా, జర్మనీ, యూఏఈ, బెల్జియం, యూఎస్‌కు రొబుస్టా కాఫీ ఎక్కువగా ఎగుమతి అయింది. దేశీయంగా కాఫీ ఉత్పత్తిలో కర్ణాటక మొదటి స్థానంలో ఉంటే, కేరళ రెండో స్థానంలో ఉంది. ఈ రాష్ట్రాలకు చెందిన కొన్ని రకాల కాఫీలకు భౌగోళిక గుర్తింపు (జీఐ) ఉండడం సానుకూలిస్తోంది. ఇక తేయాకు ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరంలో 0.92 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అసోం, పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు తేయాకు తయారీలో 81 శాతం వాటా కలిగి ఉన్నాయి.

పొగాకు ఉత్పత్తులు 2 బిలియన్ డాలర్లు

2024–25 సంవత్సరం ఎగుమతుల్లో పొగాకు ఉత్పత్తులు 1.98 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2023–24లో నమోదైన 1.45 బిలియన్ డాలర్లతో పోల్చితే మెరుగైన వృద్ధి కనిపించింది. ప్రపంచంలో పొగాకు ఉత్పత్తి పరంగా భారత్ రెండో అతిపెద్ద దేశంగా ఉంది. ప్రధానంగా యూఏఈ, బెల్జియం, ఇండోనేషియా, ఈజిప్ట్, యూఎస్ఏ, టర్కీకి పొగాకు ఎగుమతులు జరుగుతున్నాయి. గుజరాత్, ఆంధ్రప్రదేశ్, యూపీ, కర్ణాటక పొగాకు ఉత్పత్తిలో కీలక వాటా ఆక్రమిస్తుండగా, సుమారు 4.57 కోట్ల మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తోంది.

జోరుగా బియ్యం ఎగుమతులు

గత ఆర్థిక సంవత్సరంలో బియ్యం ఎగుమతులు రికార్డు స్థాయిలో 12.5 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2023–24లో ఇవి 10.4 బిలియన్ డాలర్లకు చేరాయి. ప్రపంచ బియ్యం ఎగుమతుల్లో భారత్ వాటా 40 శాతంగా ఉంది. ముఖ్యంగా సౌదీ అరేబియా, ఇరాన్, యూఎస్ఏ, యేమెన్‌కు బియ్యం ఎగుమతులు అధికంగా జరిగాయి. ఆ తర్వాత కూరగాయల ఎగుమతులు 3.9 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ద్రాక్ష, దానిమ్మ, మామిడి, అరటి, టమాటా ఎగుమతులు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు 7.2 బిలియన్ డాలర్లకు పెరిగాయి.


లాభాల్లోకి అలైడ్ బ్లెండర్స్

- క్యూ4లో రూ. 79 కోట్లు
- షేరుకి రూ. 3.6 డివిడెండ్



న్యూఢిల్లీ: లిక్కర్ తయారీ కంపెనీ అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిల్లరీస్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 79 కోట్ల నికర లాభం ఆర్జించింది. ప్రీమియం ఉత్పత్తుల అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 241 కోట్ల నికర నష్టం ప్రకటించింది. ఆఫీసర్స్ చాయిస్, స్టెర్లింగ్ రిజర్వ్ విస్కీ బ్రాండ్ల కంపెనీ మొత్తం ఆదాయం రూ. 1,757 కోట్ల నుంచి రూ. 1,935 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 6 శాతం పెరిగి రూ. 1,799 కోట్లను తాకాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 3.6 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది.

దివీస్ లాభం రూ. 662 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఫార్మా సంస్థ దివీస్ ల్యాబొరేటరీస్ నికర లాభం (కన్సాలిడేటెడ్) రూ. 662 కోట్లుగా నమోదైంది. అంతక్రితం క్యూ4లో ఇది రూ. 538 కోట్లు. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 2,303 కోట్ల నుంచి రూ. 2,585 కోట్లకు పెరిగింది. రూ. 2 ముఖ విలువ చేసే ఒక్కో షేరుపై కంపెనీ రూ. 30 తుది డివిడెండ్ ప్రకటించింది. దీనికి జులై 25 రికార్డు తేదీగా ఉంటుంది.

‘ప్లే ఆఫ్స్’ లక్ష్యంగా పంజాబ్ కింగ్స్



పరువు కాపాడుకునేందుకు రాజస్తాన్ రాయల్స్
- ఐపీఎల్‌లో నేడు కీలక పోరు
- మధ్యాహ్నం గం. 3:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

జైపూర్: ఐపీఎల్‌లో అనూహ్యంగా ఆగిపోయిన తమ ప్రస్థానాన్ని మళ్లీ మొదలు పెట్టేందుకు పంజాబ్ కింగ్స్ సిద్ధమైంది. మే 9న ధర్మశాలలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ సందర్భంగా శుభారంభం చేసిన తర్వాత మ్యాచ్ అర్ధాంతరంగా ఆగిపోవడంతో పంజాబ్ గెలుపు అవకాశం చేజార్చుకుంది. ఇప్పుడు లీగ్‌లో బలహీన జట్టుపై గెలిచి ‘ప్లే ఆఫ్స్’కు మరింత చేరువ కావాలని జట్టు భావిస్తోంది. నేడు జరిగే పోరులో రాజస్తాన్ రాయల్స్‌తో పంజాబ్ తలపడుతుంది. ‘ప్లే ఆఫ్స్’ అవకాశాలు ఇప్పటికే కోల్పోయిన రాజస్తాన్ లీగ్‌లో చివరి స్థానంలో నిలవకుండా ఉండాలని కోరుకుంటోంది.

తొలిసారి మిచ్ ఓవెన్...

ఐపీఎల్ వాయిదా పడటంతో పంజాబ్ ఇద్దరు కీలక ఆటగాళ్లను కోల్పోయింది. ఆసీస్ ఆటగాళ్లు స్టొయినిస్, ఇన్‌గ్లిస్ తిరిగి రావడానికి విముఖత చూపారు. దాంతో ఇప్పుడు తప్పనిసరి స్థితిలో తుది జట్టులో మార్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. మ్యాక్స్‌వెల్ గాయంతో తప్పుకోవడంతో జట్టులోకి వచ్చిన మిచెల్ ఓవెన్ తొలిసారి ఐపీఎల్ బరిలోకి దిగడం ఖాయమైంది. విధ్వంసకర బ్యాటర్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఓవెన్ గత ఏడాది బిగ్‌బాష్ లీగ్‌లో టాప్ స్కోరర్‌గా నిలవడంతో పాటు హోబర్ట్ హరికేన్స్ టైటిల్ గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే టాపార్డర్ బ్యాటర్ అయిన ఓవెన్... ప్రస్తుతం పంజాబ్ ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ ఆర్య అద్భుతంగా ఆడుతుండటంతో మిడిలార్డర్‌లో ఆడాల్సి రావచ్చు. బౌలింగ్‌ను పటిష్టపర్చుకోవడంలో భాగంగా కివీస్ పేసర్ కైల్ జేమీసన్‌ను పంజాబ్ ఆడించే అవకాశం ఉంది. శ్రేయస్, వధేరా, శశాంక్‌లతో జట్టు బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. చహల్, అర్ష్‌దీప్ ఫామ్‌లో ఉండటంతో పాటు మార్కో యాన్సెన్ కూడా మెరుగ్గా రాణిస్తుండటం పంజాబ్‌కు సానుకూలాంశం.

బరిలోకి సంజు సామ్సన్...

రాజస్తాన్ పేలవ ఆటతో చాలా ముందే ప్లే ఆఫ్స్ అవకాశాలు చేజార్చుకుంది. జట్టు 12 మ్యాచ్‌లలో 3 మ్యాచ్‌లే గెలిచింది. మిగిలిన మ్యాచ్‌లలోనైనా రాణించి పరువు కాపాడుకోవాలని టీమ్ భావిస్తోంది. నెల రోజుల క్రితం తన ఆఖరి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన సంజు సామ్సన్ కోలుకొని ఇప్పుడు మళ్లీ బరిలోకి దిగుతున్నాడు. జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ ఓపెనర్లుగా రాణిస్తుండటంతో అతను మూడో స్థానంలో ఆడతాడు. పరాగ్, జురేల్ కూడా రాణిస్తే రాయల్స్ మెరుగైన స్థితిలో నిలుస్తుంది. విదేశీ ఆటగాళ్లు హెట్‌మైర్, హసరంగ, తీక్షణ జట్టుతో చేరారు. అయితే టోర్నీ ఆరంభంనుంచి చాలా బలహీనంగా ఉన్న రాజస్తాన్ పేస్ బృందం ఆర్చర్, సందీప్ శర్మ దూరం కావడంతో ఇప్పుడు మరింత బలహీనంగా మారింది. తుషార్ దేశ్‌పాండే, ఆకాశ్ మధ్వాల్, నాండ్రే బర్గర్ పంజాబ్ బ్యాటర్లను ఎలా నిలువరిస్తారో చూడాలి.



ఢిల్లీ క్యాపిటల్స్ కోలుకునేనా!

- నేడు గుజరాత్‌తో సమరం
- మ్యాచ్ గెలిస్తే ‘ప్లే ఆఫ్స్’కు గిల్ బృందం
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

న్యూఢిల్లీ: ఐపీఎల్–2025ను ఢిల్లీ క్యాపిటల్స్ ఘనంగా ప్రారంభించింది. తొలి 4 మ్యాచ్‌లలో వరుస విజయాలు సాధించి జోరు ప్రదర్శించింది. అయితే తర్వాత జట్టు ఫామ్ ఒక్కసారిగా తిరోగమించింది. తర్వాత 7 మ్యాచ్‌లలో ఢిల్లీ కేవలం 2 మాత్రమే గెలవగలిగింది. హైదరాబాద్‌లో జరిగిన తమ చివరి పోరులో కూడా క్యాపిటల్స్ 133 పరుగులకే పరిమితమై ఓటమికి బాటలు వేసుకుంది. అయితే అదృష్టవశాత్తూ వర్షంతో ఆ మ్యాచ్ రద్దు కావడంతో ఊపిరి పీల్చుకుంది. ఇప్పుడు మిగిలిన 3 మ్యాచ్‌లలో గెలిస్తే ఇతర సమీకరణాలతో సంబంధం లేకుండా ‘ప్లే ఆఫ్స్’కు చేరుకునే అవకాశం ఉంటుంది. మరోవైపు గుజరాత్ టైటాన్స్ నిలకడకు మారుపేరులా ఆడుతూ ముందంజ వేసేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న ఆ టీమ్ మరో మ్యాచ్ గెలిస్తే చాలు అధికారికంగా ప్లే ఆఫ్స్‌కు చేరుతుంది. ఈ మ్యాచ్‌లోనే దానిని అందుకోవాలని గిల్ బృందం భావిస్తోంది.

ముస్తఫిజుర్ దూరం...

ఐపీఎల్ కొత్త షెడ్యూల్ కారణంగా ఢిల్లీ ప్రణాళికలు కూడా మారాయి. కీలక సమయంలో జట్టును గెలిపించే సత్తా ఉన్న ప్రధాన పేసర్ మిచెల్ స్టార్క్ ఆస్ట్రేలియాకు వెళ్లిపోయాడు. అతని స్థానంలో బంగ్లాదేశ్ బౌలర్ ముస్తఫిజుర్‌ను ఢిల్లీ ఎంచుకుంది. అయితే శనివారం షార్జాలో టి20 మ్యాచ్ ఆడిన అతను తిరిగి వచ్చి ఈ మ్యాచ్ బరిలోకి దిగే అవకాశం లేదు. దాంతో తుది జట్టులో ముగ్గురు విదేశీయులే ఉండనున్నారు. డుప్లెసిస్, స్టబ్స్ పునరాగమనంతో జట్టు బ్యాటింగ్ బలంగా కనిపిస్తుండగా, పేసర్ చమీరా కూడా ఆడనున్నాడు. అయితే జట్టు విజయావకాశాలు భారత ఆటగాళ్లు పొరేల్, కరుణ్ నాయర్, రాహుల్, కెప్టెన్ అక్షర్ ప్రదర్శనపైనే ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. విప్‌రాజ్, అశుతోష్ మిడిలార్డర్‌లో చెలరేగాల్సి ఉండగా... కుల్దీప్ యాదవ్ ఎప్పటిలాగే తన పదును చూపిస్తే ప్రత్యర్థిని కట్టిపడేయవచ్చు.

మార్పుల్లేకుండా...

టోర్నీ వాయిదా తర్వాత ఎలాంటి ఇబ్బందీ లేకుండా దాదాపు అదే ప్రధాన ఆటగాళ్లతో జట్టును సిద్ధం చేసుకోవడంలో గుజరాత్ సఫలం కావడం విశేషం. మరో మ్యాచ్ గెలిస్తే ముందంజ వేసే టీమ్ మరో రెండు కూడా నెగ్గి టాప్ స్థానంపై గురి పెట్టింది. లీగ్ దశ వరకు బట్లర్, రూథర్‌ఫర్డ్, రబడ, కొయెట్జీ అందుబాటులో ఉంటుండటంతో టైటాన్స్ మేనేజ్‌మెంట్ ధీమాగా ఉంది. ఓపెనర్లు గిల్, సుదర్శన్ అందిస్తున్న చక్కటి ఆరంభాలు జట్టును ముందంజలో నిలిపాయి. ఆ తర్వాత బట్లర్ మిగిలిన పని పూర్తి చేస్తున్నాడు. సీజన్‌లో 500 పరుగులు దాటిన టాప్–5లో ముగ్గురు టైటాన్స్ సుదర్శన్, గిల్, బట్లర్ ఉండటం విశేషం. షారుఖ్, తెవాటియా చివర్లో అదనపు పరుగులు జోడించగలరు. ముగ్గురు పేసర్లు ప్రసిధ్, సిరాజ్, అర్షద్ చక్కటి బౌలింగ్ ప్రదర్శన కనబరుస్తుండగా... స్పిన్నర్లు సాయికిషోర్, రషీద్ ఖాన్ తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. బలాబలాలపరంగా చూస్తే టైటాన్స్‌దే పైచేయిగా కనిపిస్తోంది.

ఇకపై లక్ష్యం... 90 ప్లస్

కొత్త మైలురాయి సంతృప్తినిచ్చింది • ఇక్కడితోనే ఆగిపోను • నీరజ్ చోప్రా వ్యాఖ్య


నీరజ్ చోప్రా

దోహా: 90 మీటర్ల దూరం ఇంకెప్పుడనే నిరీక్షణకు తెరదించిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తన ప్రదర్శన పట్ల సంతోషాన్ని వెలిబుచ్చాడు. దోహా డైమండ్ లీగ్ ప్రదర్శన తనకెంతో ఊరటనిచ్చిందని అన్నాడు. కొన్నేళ్లుగా తనను అదేపనిగా వేధిస్తోన్న 90 మీటర్ల మైలురాయి సాకారం కావడంతో తన శరీరం ఇప్పుడు తేలిక పడిందని చెప్పాడు. ఇదే ఉత్సాహంతో ఈటెను మరింత దూరం విసిరేందుకు ఇంకా ఇంకా శ్రమిస్తానని నీరజ్ వివరించాడు. 27 ఏళ్ల చోప్రా దోహాలో 90.23 మీటర్లతో రెండో స్థానంలో నిలిచాడు. ‘ఈ మైలురాయి ఆనందాన్నిచ్చింది. పట్టుదలతో శ్రమించేందుకు ఊతమిచ్చింది. అయితే ఇక్కడితోనే ఆగిపోను. నా కోచ్ జాన్ జెలెజ్నీతో మెరుగైన మార్క్‌ను దాటేందుకు క్రమం తప్పకుండా శ్రమిస్తూనే ఉంటా. మా ఇద్దరి పయనం ఫిబ్రవరిలోనే మొదలైంది. ఇంకా నేర్చుకునే దశలోనే ఉన్నాను. కొన్ని నెలలుగా గజ్జల్లో గాయం నన్ను తెగ ఇబ్బంది పెట్టింది. శారీరక ప్రతికూలతలన్నీ అధిగమించి ఈ ప్రదర్శన చేయడం చాలా చాలా సంతోషాన్నిచ్చింది. ఈ సీజన్‌పై గంపెడాశలు పెట్టుకున్న నాకు దోహా ఈవెంట్ వరమైంది. ఇప్పుడు నేను 90 మీటర్లకు మించి ఈటెను విసరగలననే ఆత్మవిశ్వాసంతో ఉన్నాను. ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్ వరకు నేను మరింత రాటుదేలాల్సి ఉంది’ అని నీరజ్ చోప్రా వివరించాడు. చెక్ రిపబ్లిక్ దిగ్గజం జెలెజ్నీ అప్పట్లో 98.48 మీటర్లతో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అతని మార్గదర్శనంలోనే చోప్రా మెరుగులు దిద్దుకుంటున్నాడు. తన మెరుగైన ప్రదర్శన కోసం కోచ్ తనతో పాటు చెమటోడ్చుతున్నాడని చెప్పుకొచ్చాడు. అతని కోచింగ్ వల్లే ఈ మార్క్ సాధ్యమైందన్నాడు. ఇప్పుడు ఈ మార్క్‌ను ప్రతీ ప్రయత్నంలోనూ సాధించడంతో పాటే మరింత దూరం పెంచుకునేందుకు కృషి చేస్తానని చోప్రా చెప్పాడు. పోటీల రోజే (శుక్రవారం) కోచ్ జెలెజ్నీ తన వద్దకు వచ్చి ‘ఈ రోజు నీదని... నీవనుకున్న లక్ష్యం చేరతావ్’ అని చెప్పడం కూడా కొండంత ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. 90 మీటర్ల మార్క్‌ను దాటాక కూడా అతను ఇంకో రెండు, మూడు మీటర్ల దూరం విసరగలిగే సామర్థ్యం తనలో ఉందని చెప్పడం కూడా తన స్థయిర్యాన్ని పెంచిందన్నాడు.



విజేత ప్రజ్ఞానంద

బుకారెస్ట్: గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా నిర్వహించిన సూపర్‌బెట్ క్లాసిక్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద చాంపియన్‌గా అవతరించాడు. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరిగింది. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత ప్రజ్ఞానంద, మాక్సిమి లాగ్రెవ్ (ఫ్రాన్స్), అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్) 5.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. దాంతో విజేతను నిర్ణయించేందుకు వీరిద్దరి మధ్య టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. అలీరెజాతో గేమ్‌ను ‘డ్రా’ చేసుకున్న ప్రజ్ఞానంద.. లాగ్రెవ్‌పై గెలిచి 1.5 పాయింట్లతో టైటిల్‌ను ఖరారు చేసుకున్నాడు. విజేత ప్రజ్ఞానందకు 77,667 డాలర్లు (రూ. 66 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ నాలుగు పాయింట్లతో తొమ్మిదో స్థానంలో నిలిచాడు.

ఫేవరెట్ భారత్

- నేడు బంగ్లాదేశ్‌తో టైటిల్ పోరు
- దక్షిణాసియా అండర్–19 ఫుట్‌బాల్ టోర్నీ



యూపియా (అరుణాచల్ ప్రదేశ్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్–19 టోర్నీలో టైటిలే లక్ష్యంగా భారత కుర్రాళ్లు బరిలోకి దిగుతున్నారు. ఆదివారం జరిగే తుదిపోరులో భారత యువ జట్టు బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. ఈ టోర్నీలో పరాజయమే ఎరుగని భారత్ ఫేవరెట్‌గా తమ జైత్రయాత్రను టైటిల్‌తో ముగించాలని అనుకుంటోంది. గ్రూప్ దశలో భారత టీనేజ్ జట్టు 8–0తో శ్రీలంకను చిత్తు చేసి... 4–0తో నేపాల్‌పై జయభేరి మోగించింది. ఇక నాకౌట్ దశలో మాల్దీవులుతో జరిగిన సెమీఫైనల్లో భారత్ 3–0తో జయకేతనం ఎగురవేసింది. మ్యాచ్ ఓడిపోవడం కాదుకదా... కనీసం ప్రత్యర్థికి ఒక్క గోల్ కూడా సమర్పించుకోని భీకరఫామ్‌లో భారత జట్టు ఉంది. ‘శాఫ్’ వయో విభాగాల టోర్నీల్లో భారత్‌కే అసాధారణ రికార్డు ఉంది. అండర్–15, 16, 17, 18, 19, 20 చాంపియన్‌షిప్‌లలో భారత్ ఇప్పటి వరకు తొమ్మిది టైటిల్స్ గెలిచింది. ఇలాంటి మేటి జట్టును బంగ్లాదేశ్ ఏ మేరకు నిలువరించగలదో మరి! అలాగని ఫైనల్ ప్రత్యర్థిని అంత తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. ఈ టోర్నీలో బంగ్లా కూడా అజేయమైన జట్టు. మాల్దీవులుతో 2–2తో ‘డ్రా’ చేసుకొని, 3–0తో భూటాన్‌పై గెలిచి లీగ్ దశను ముగించింది. సెమీస్‌లో 2–1తో నేపాల్‌ను ఓడించి... ఇప్పుడు భారత్‌తో అమీతుమీకి సిద్ధమైంది. ఇరు దేశాలు శాఫ్ ఫైనల్స్‌లో నాలుగుసార్లు తలపడగా... ఈ నాలుగుసార్లు భారతే గెలిచింది.



‘మరింత మంది కోహ్లీలు వస్తారు’

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్య

హైదరాబాద్: భారత క్రికెట్‌లో విరాట్ కోహ్లిది ఒక ప్రత్యేక అధ్యాయమని, అతని బాటలో మరెంతో మంది యువ క్రికెటర్లు వెలుగులోకి వస్తారని హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ అభిప్రాయపడ్డారు. ఇటీవలే టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లిపై ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. ‘కోహ్లి అద్భుతమైన ఆటగాడు. అతని కవర్‌డ్రైవ్ ఎంతో చూడముచ్చటగా ఉంటుంది. ఇకపై టెస్టుల్లో అలాంటివి చూడలేము. బౌలర్ల తల మీదుగా అతను ఆడే స్ట్రెయిట్ షాట్ కూడా నాకు చాలా నచ్చుతుంది. అయితే మన దేశంలో ప్రతిభకు కొదవ లేదు.ఎంతో మంది కోహ్లీలు ఉన్నారు. వారంతా ముమ్ముందు వెలుగులోకి వచ్చి దేశానికి ఆడతారు’ అని ఒవైసీ వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) విద్యార్థిగా ఉన్నప్పుడు మీడియం పేసర్‌గా సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ అండర్–25 టోర్నీలో ఆడిన ఒవైసీ... జాతీయ స్థాయి యూనివర్సిటీ వన్డే టోర్నీ విజ్జీ ట్రోఫీలో కూడా ఓయూకు ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిపోవడంతో క్రికెట్ కెరీర్ ముగిసింది. భారత క్రికెట్‌లో ఇప్పుడు గొప్ప దశ నడుస్తోందని, ప్రతిభ ఉంటే చాలు ఏ స్థాయికైనా చేరవచ్చని హైదరాబాదీ పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ చూపించాడని ఒవైసీ అన్నారు. ‘పేదరిక నేపథ్యం నుంచి వచ్చిన సిరాజ్ తన కఠోర శ్రమతో ఈ స్థాయికి చేరాడు. టెస్టుల్లో 100 వికెట్ల మైలురాయిని అందుకోగలిగిన అతనిది గొప్ప ప్రస్థానం. ఎందరికో స్ఫూర్తిదాయకం. సిరాజ్ భారత్‌కు మరిన్ని విజయాలు అందించాలి’ అని ఒవైసీ ఆకాంక్షించారు.



నిధి నాయకత్వంలో...

నాలుగు దేశాల మహిళల హాకీ టోర్నీ బరిలో భారత జట్టు

బెంగళూరు: ఈ ఏడాది డిసెంబర్‌లో జరిగే మహిళల జూనియర్ ప్రపంచకప్ టోర్నమెంట్‌కు సన్నాహాల్లో భాగంగా భారత జట్టు ఈ నెలలో నాలుగు దేశాల టోర్నీలో పోటీపడనుంది. అర్జెంటీనాలోని రొసారియా నగరంలో ఈనెల 25 నుంచి జూన్ 2వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీలో భారత్‌తోపాటు అర్జెంటీనా, చిలీ, ఉరుగ్వే జట్లు పాల్గొంటున్నాయి. ఈ టోర్నీలో ఆడనున్న భారత జట్టును శనివారం హాకీ ఇండియా ప్రకటించింది. 24 మంది సభ్యులతో కూడిన టీమిండియాకు గోల్‌కీపర్ నిధి నాయకత్వం వహిస్తుంది. డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీలో భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను మే 25న చిలీతో ఆడుతుంది. ఆ తర్వాత టీమిండియా వరుసగా ఉరుగ్వేతో (మే 26న), అర్జెంటీనాతో (మే 28న), చిలీతో (మే 30న), ఉరుగ్వేతో (జూన్ 1న), అర్జెంటీనాతో (జూన్ 2న) తలపడతుంది. ‘ఈ టోర్నీ ద్వారా మా అత్యుత్తమ క్రీడాకారిణులు ఎవరో గుర్తిస్తాము. మరో ఆరు నెలల్లో జూనియర్ ప్రపంచకప్ జరగనుంది. తాజా టోర్నీ మన అమ్మాయిలకు అంతర్జాతీయ అనుభవం కలిపిస్తుంది’ అని భారత జూనియర్ జట్టు కోచ్ తుషార్ ఖాండ్కర్ తెలిపారు.

భారత జూనియర్ మహిళల హాకీ జట్టు: నిధి (కెప్టెన్, గోల్‌కీపర్), ఏంజిల్ హర్షరాణి మింజ్ (గోల్‌కీపర్), మమితా ఓరమ్, లాల్‌తట్లుయాంగి, మనీషా, పూజా సాహూ, పార్వతి టొప్నో, నందిని, సాక్షి శుక్లా (డిఫెండర్లు), ప్రియాంక యాదవ్, అనీషా సాహూ, రజని కెర్కెట్టా, బినిమా ధన్, ఖైడెమ్ షిలీమా చాను, సంజన హోరో, సుప్రియా కుజుర్, ప్రియాంక డోగ్రా (మిడ్ ఫీల్డర్లు), హీనా బానో, సోనమ్, సుఖ్‌వీర్ కౌర్, గీతా యాదవ్, లాల్‌రిన్‌పుయ్, కనిక సివాచ్, కర్మన్‌ప్రీత్ కౌర్ (ఫార్వర్డ్‌లు). స్టాండ్‌బై: విద్యశ్రీ, హుందా ఖాన్, మున్మిని దాస్, సెలెస్టినా హోరో.

మరో సౌరవ్యవస్థలో గడ్డ కట్టిన నీరు



తొలిసారిగా గుర్తించిన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్

వాషింగ్టన్: జీవుల మనుగడకు ప్రాణాధారమైన నీరు అంతరిక్షంలో మరెక్కడుందోననే ప్రశ్నకు సమాధానం వెతికినట్లు ప్రఖ్యాత జేమ్స్ వెబ్ అంతరిక్ష టెలిస్కోప్ తాజాగా ప్రకటించింది. మన సౌరమండలం తరహాలోనే ఇతర నక్షత్ర వ్యవస్థల్లో గడ్డ కట్టిన స్థితిలో నీరు ఉంటుందనే వాదనకు బలం చేకూరుస్తూ నాసా వారి జేమ్స్ వెబ్ టెలిస్కోప్ పలు సాక్ష్యాధారాలను సంపాదించింది. ఒక యువ నక్షత్ర మండలంలో గడ్డకట్టిన నీటి జాడలను కనిపెట్టినట్లు నాసా తాజాగా ప్రకటించింది. నక్షత్రం చుట్టూ తిరుగుతున్న దుమ్ము ధూళితో కూడిన అంతరిక్ష శిలలు, శకలాలు, శిథిలాల వలయాల్లో నీరు గడ్డకట్టి ఉందని నాసా వెల్లడించింది. మన సౌరవ్యవస్థ వయసుతో పోలిస్తే తక్కువ వయసున్న ఈ కొత్త నక్షత్ర మండలం 'హెచ్‌డీ 181327'మన భూమికి 155 కాంతి సంవత్సరాల దూరంలో ఉందని నాసా తెలిపింది. వెబ్ టెలిస్కోప్ పంపిన 'స్పెక్ట్రా'డేటాలో ఇందుకు సంబంధించిన వివరాలు ఉన్నాయి. విశాల అంతరిక్షంలో ఎక్కడో ఓ చోట నీరు నిక్షిప్తమై ఉంటుందని నాసా వారి స్పిట్జర్ స్పేస్ టెలిస్కోప్ 2008లోనే కొంత డేటాను పంపించింది. ఆ తర్వాత జేమ్స్ వెబ్ టెలిస్కోప్ ఇలా నీటి జాడలను వెతికిపట్టడం ఇదే తొలిసారి. ''కేవలం నీటిని మాత్రమేకాదు మరీముఖ్యంగా స్ఫటికాకృతిలో ఉండే గడ్డ కట్టిన నీటి జాడను వెబ్ టెలిస్కోప్ కనుగొంది. ఈ ధూళి వలయాల్లోని ప్రతి దుమ్ము కణంతో నీటి అణువులు కలిసిపోయి ఉన్నాయి. ఈ అణువులను సమీప-పరారుణ స్పెక్ట్రోగ్రాఫ్ ఉపకరణంతో చూసినప్పుడు ఇవన్నీ మంచు బంతుల్లా కనిపించాయి. గతంలో ఇలాంటి క్రిస్టల్ ఐస్‌ను మన సౌరవ్యవస్థలో శనిగ్రహ వలయాల్లో, క్యూపర్ బెల్ట్‌లో చూశాం''అని ఈ పరిశోధనా పత్రం ముఖ్య రచయిత చెన్ గ్జీ చెప్పారు. చెన్ గ్జీ.. మేరిలాండ్‌లోని జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ(బాల్టీమోర్)లో అసిస్టెంట్ రీసెర్చ్ సైంటిస్ట్‌గా సేవలందిస్తున్నారు. సంబంధిత వివరాలు 'నేచర్'జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

నీరే కీలకం

అంతరిక్షంలో నక్షత్రాల చుట్టూతా గ్రహ వ్యవస్థ పురుడుపోసుకోవడానికి నీరే ప్రధాన కారణం. యువ నక్షత్రాల చుట్టూతా పరుచుకున్న దుమ్ము, ధూళి వలయాల్లో ప్రధాన ముడి సరకు నీరే. ఒక రకంగా పట్టిఉంచే నీరు సైతం ధూళి, దుమ్ము గట్టిపడి గ్రహాల ఆవిర్భావానికి దారితీస్తుంది. తక్కువ గురుత్వాకర్షణ సందర్భాల్లో తోకచుక్కలు, గ్రహశకలాల వంటివి ఏర్పడతాయి. ఒక వేళ బలాలు బలపడితే ఇవన్నీ కలగలిసిపోయి పెద్ద గ్రహాలుగా రూపాంతరం చెందుతాయి. మన భూమి సైతం తొలినాళ్లలో ఇలాగే ఏర్పడింది. తాజాగా వెబ్ టెలిస్కోప్ సేకరించిన సమాచారంతో ఇతర ఖగోళ అధ్యయనకారులు సైతం నూతన నక్షత్రవ్యవస్థల్లో కొత్త గ్రహాలు ఎలా ఏర్పడతాయి వంటి అంశాలపై మరింత శోధన చేసేందుకు అవకాశం లభించనుందని మరో రచయిత క్రిస్టీన్ చెన్ చెప్పారు. ఈ 'హెచ్‌డీ 181327'నక్షత్ర వ్యవస్థ కేవలం 2.3 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడింది. మన సూర్యుడు ఏకంగా 460 కోట్ల సంవత్సరాల క్రితం ఆవిర్భవించాడు. వయసులో చిన్నదైనా సరే ఈ యువ నక్షత్రం మన సూరీడి కంటే బరువు ఎక్కువగా ఉంది. వేడి కూడా మరింత ఎక్కువగా ఉన్నట్లు తేలింది.

ముంబైలో ఇద్దరు ఐసిస్ సభ్యుల అరెస్ట్

న్యూఢిల్లీ: ఉగ్ర సంస్థ ఐసిస్‌కు చెందిన ఇద్దరు స్లీపర్ సెల్ సభ్యులను జాతీయ దర్యాప్తు విభాగం(ఎన్‌ఐఏ) ముంబైలో అరెస్ట్ చేసింది. మహారాష్ట్రలోని పుణెలో 2023లో మందుపాతరను పేల్చి పరీక్షించిన కేసులో వాంటెడ్ జాబితాలో ఉన్న ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్‌వాలా, తల్హా ఖాన్ అనే ఇద్దరూ తప్పించుకు తిరుగుతున్నారు. వీరిపై ముంబైలోని ఎన్‌ఐఏ ప్రత్యేక కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. రూ.3 లక్షల చొప్పున రివార్డు సైతం ఉంది. రెండేళ్లకు పైగా ఇండోనేసియా దాక్కున్న వీరు శుక్రవారం రాత్రి విమానంలో ముంబైకి చేరుకోగా ఇమిగ్రేషన్ విభాగం అధికారులు పట్టుకున్నారు. ఇద్దరినీ తాము అదుపులోకి తీసుకున్నట్లు ఎన్‌ఐఏ వెల్లడించింది. పుణె ఐసిస్ స్లీపర్ సెల్‌లోని మరో 8 మంది ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. పుణెలోని కొంధ్వాలో ఉన్న అబ్దుల్లా ఫయాజ్ షేక్ అద్దె ఇంట్లో మందుపాతరలను తయారు చేసినట్లు వీరిపై ఆరోపణలున్నాయి. 2022-23 సంవత్సరాల్లో బాంబులను తయారు చేయడంతోపాటు, శిక్షణ శిబిరాలను సైతం నడిపారు.ముఠాలోని 10 మందిపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ చట్టం, పేలుడు పదార్థాల చట్టం, ఆయుధాల చట్టంతోపాటు ఐపీసీ కింద పలు కేసులున్నాయి.

మందుపాతర పేలి జవానుకు గాయాలు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో శనివారం నియంత్రణ రేఖ వెంబడి మందుపాతర పేలిన ఘటనలో ఒక జవాను గాయాలపాలయ్యారు. చొరబాట్లను అడ్డుకునేందుకు సైన్యం మందుపాతరలు ఏర్పాటు చేస్తుంటుంది. ఇటీవలి వర్షాలకు వాటి గుర్తులు కొట్టుకుపోవడం పేలుడుకు దారి తీసింది. సాంబ జిల్లాలో పేలని మోర్టార్ షెల్‌ను బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ నిర్వీర్యం చేసింది.

జైలుకు కన్నం.. 10 మంది ఖైదీలు పరార్

న్యూ ఆర్లియన్స్: అమెరికాలోని న్యూ ఆర్లియెన్స్ జైలు గోడకు కన్నం వేసి 10 మంది ఖైదీలు పరారయ్యారు. ఆ సెల్‌కు ఉన్న ఒకే ఒక గార్డు భోజనం చేసేందుకు వెళ్లగా అదను చూసుకుని టాయిలెట్ గోడకు కన్నం వేశారు. ముళ్ల ఫెన్సింగ్‌పైన మందపాటి దుప్పట్లను వేసి, గోడ దూకి పరారయ్యారు. శుక్రవారం అర్ధ రాత్రి ఒంటి గంట సమయంలో ఘటన చోటుచేసుకోగా శనివారం ఉదయం 8.30 గంటలకు విషయం వెలుగు చూసింది. పది మందికిగాను 8 మందిపై తీవ్రమైన హత్యారోపణలుండటం గమనార్హం. ఖైదీల పరారులో జైలు సిబ్బంది హస్తం ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ సెల్‌కు తాళాలు సరిగా లేవని ఎప్పటి నుంచో చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని జైలు అధికారి సుసాన్ హట్సన్ తెలిపారు. కాగా, అధికారులు అప్రమత్తం చేయడంతో తప్పించుకుపోయిన వారిలో ఇద్దరిని మధ్యాహ్నం కల్లా పట్టుకున్నారు. ఘటనకు బాధ్యులుగా భావిస్తూ ముగ్గురు జైలు సిబ్బందిని సస్పెండ్ చేసి, దర్యాప్తునకు ఆదేశించారు.

ఆవడిలో ఏడబ్ల్యూటీసీ ప్రారంభం

సాక్షి, చెన్నై: చెన్నై సమీపంలోని ఆవడిలో యుద్ధ ట్యాంకర్ల పరిశోధన, అభివృద్ధి సంస్థను డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆటోమోటివ్- ఆయుధ వ్యవస్థ పరీక్షా కేంద్రం(ఏడబ్ల్యూటీసీ)ని ప్రారంభించారు. ఇందులో ఏడబ్ల్యూటీసీ ట్రాక్డ్ ఆర్మ్‌డ్ ఫైటింగ్ వెహికల్స్ పూర్తి ఆటోమోటివ్ పనితీరును పరీక్షించేందుకు ఉపయోగపడే 26 రకాల ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. ఇంజిన్ టెస్ట్ సెంటర్‌ను కూడా కామత్ ప్రారంభించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళులర్పించారు. డైరెక్టర్ జనరల్ (ఆయుధాలు, యుద్ధ ట్యాంకుల విభాగం) డాక్టర్ ప్రతీక్ కిశోర్, డైరెక్టర్ జనరల్ (వనరులు, నిర్వహణ) డాక్టర్ మను కొరుల్లా, సీవీఆర్‌డీఈ డైరెక్టర్ జె.రాజేశ్ కుమార్, సివిల్ వర్క్స్, ఎస్టేట్స్ డైరెక్టరేట్ డాక్టర్ బిశ్వజిత్ చౌబే, ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ద్వివేది పాల్గొన్నారు.

ఉగ్రమూకలకు సాయమందిస్తున్న 23 మందిపై పీఎస్‌ఏ కేసులు

శ్రీనగర్: ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తులకు సాయ మందిస్తున్న శ్రీనగర్‌కు చెందిన 23 మంది ప్రజాభద్రతా చట్టం(పీఎస్‌ఏ)కింద కేసులు నమోదు చేసినట్లు జమ్మూకశ్మీర్ పోలీసులు తెలిపారు. వీరిపై పలు క్రిమినల్ కేసులున్నాయన్నారు. కోర్టుల నుంచి బెయిల్ పొందిన తర్వాత కూడా వీరిలో మార్పు రాలేదని వివరించారు. మొత్తం 23 మందిని పూంఛ్, ఉధంపూర్, కోట్ బల్వాల్ జమ్మూ జైళ్లకు తరలించామన్నారు. శ్రీనగర్ జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఇటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

టోర్నడోల బీభత్సం..21 మంది మృతి

సెయింట్ లూయిస్: అమెరికాలో శుక్రవారం రాత్రి సంభవించిన శక్తివంతమైన టోర్నడోల తాకిడికి 21 మంది ప్రాణాలు కోల్పోయారు. కెంటకీలో అత్యధికంగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్క లారెల్ కౌంటీలోనే 9 మంది చనిపోయారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉందని, మృతుల సంఖ్య పెరగొచ్చని అధికారులు చెబుతున్నారు.

ఆపరేషన్ సిందూర్‌ను బిన్ లాడెన్ హతంతో పోల్చిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

న్యూఢిల్లీ: 2011లో పాకిస్తాన్‌లో అమెరికా బలగాలు ఒసామా బిన్ లాడెన్‌ను మట్టుబెట్టిన ఘటనకు భారత ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో దగ్గరి పోలికలున్నాయని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. '2011లో అమెరికాలో జరిగిన భీకర ఉగ్రదాడులకు సూత్రధారి అయిన ప్రపంచ ఉగ్రవాది పాక్‌లో దాక్కుని ఉండగా అమెరికా బలగాలు అంతం చేశాయి'అంటూ ఆయన బిన్‌లాడెన్ పేరును ప్రస్తావించకుండా వ్యాఖ్యానించారు. అదేవిధంగా, తాజాగా భారత బలగాలు పాకిస్తాన్‌లోని సుదూర ప్రాంతాలకు చొచ్చుకెళ్లి, ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయగలిగాయన్నారు. అనితర సాధ్యమైన ఈ పనిని విజయవంతంగా పూర్తి చేయడాన్ని ప్రపంచ దేశాలు గమనించాయని చెప్పారు. శాంతి కాముకంగా ఉంటూనే ఉగ్రవాద నెట్‌వర్క్‌ను నాశనం చేయడమనే లక్ష్యాన్ని సాధించిన భారత్ సరికొత్త ప్రమాణాన్ని నెలకొల్పిందని చెప్పారు. అత్యంత కచ్చితత్వంతో జరిగిన ఈ దాడుల్లో ఉగ్రవాదులకు మాత్రమే నష్టం జరిగిందన్నారు.

టెండర్‌కు ముందే కీలక అనుమతులు

జాతీయ రహదారుల నిర్మాణంపై కేంద్రం కొత్త మార్గదర్శకాలు

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ రహదారుల నిర్మాణంలో పెరుగుతున్న జాప్యాన్ని, ఖర్చును నివారించడమే లక్ష్యంగా కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ, అటవీ, పర్యావరణ, వన్యప్రాణి అనుమతులన్నీ టెండర్ ప్రక్రియకు ముందుగానే పూర్తి చేసేలా కచ్చితమైన గడువును నిర్దేశిస్తూ రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. జూన్ ఒకటి తర్వాత జారీ చేసే జాతీయ రహదారుల ప్రాజెక్టుల టెండర్ ప్రాజెక్టులన్నింటికీ ఈ మార్గదర్శకాలు వర్తిస్తాయి. ఏదైనా ఒక ప్రాజెక్టు మంజూరవడం, ఆ తర్వాత అవసరమైన అనుమతులు సాధించడంలో, భూసేకరణలో జాప్యం వంటివి అడ్డుగోడలుగా నిలుస్తుండటం గత కొన్నేళ్లుగా జరుగుతోంది. ఫలితంగా ప్రాజెక్టు వ్యయం పెరగడంతోపాటు, ప్రాజెక్టు పూర్తికి విపరీతమైన జాప్యం అవుతోంది. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని భూ సేకరణ ఉద్దేశాన్ని సూచించే చట్టంలోని సెక్షన్ -3ఎ కింద నోటిఫికేషన్‌ను రహదారి ప్రాజెక్ట్ అలైన్‌మెంట్ ఆమోదించిన 60 రోజుల్లోగా జారీ చేయాలని కొత్త మార్గదర్శకాల్లో సూచించింది. టెండర్లను ఆహ్వానించే ముందే అవసరమైన భూమిలో 90 శాతానికి పైగా ప్రాజెక్టు కోసం రిజర్వు అయినట్లుగా డిక్లరేషన్ జారీ చేయాలి. దీనికి తోడు లెటర్ ఆఫ్ అవార్డు జారీకి ముందే 90 శాతం కంటే ఎక్కువ భూమికి సెక్షన్ 3జీ కింద పరిహారం చెల్లింపులు పూర్తి చేయాలి. నిర్మాణ పనులు ప్రారంభించడానికి ముందే అధికారులు 90శాతానికి పైగా భూమి భౌతికంగా తమ స్వాధీనంలోకి వచ్చిందన్నది నిర్ధారించుకోవాలి. భూసేకరణలో భాగంగా ఉండేలా నిర్మాణాలకు తగిన పరిహార మూల్యాంకనం, చెల్లింపులు సైతం భూపరిహార ప్రక్రియలో అంతర్భాగంగానే పరిగణిస్తూ, నిర్ణీత కాల వ్యవధిలో పరిహార చెల్లింపులు పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటితో పాటే వన్యప్రాణి క్లియరెన్స్‌లు సైతం టెండర్లు దక్కించుకునేందుకు ముందే పూర్తి చేయడం తప్పనిసరి. అలైన్‌మెంట్ ఆమోదం పొందిన వెంటనే అటవీ క్లియరెన్స్ ప్రక్రియ సైతం ప్రారంభం అవుతుంది. ఈ కొత్త మార్గదర్శకాలతో సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులు మొదలు పెట్టడానికి ముందే చాలా వరకు భూసేకరణ ప్రక్రియతో పాటు ఇతర అనుమతులు పూర్తవడంతో సకాలంలో పనులు పూర్తి చేసే అవకాశం లభించనుంది.

బంగ్లా దిగుమతులపై పోర్టుల్లో ఆంక్షలు

- భూటాన్, నేపాల్‌కు వెళ్లే సరుకుకు మాత్రం మినహాయింపు
- తక్షణమే అమల్లోకి వచ్చిన ఆదేశాలు
- స్పష్టం చేసిన కేంద్ర వాణిజ్య శాఖ

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ నుంచి వచ్చే రెడీమేడ్ దుస్తులు, కొన్ని ప్రాసెస్ట్ ఆహార వస్తువుల దిగుమతులపై నౌకాశ్రయాల్లో కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో పనిచేసే విదేశీ వాణిజ్యం డైరెక్టరేట్ జనరల్(డీజీఎఫ్‌టీ) ఇందుకు సంబంధించిన ఒక నోటిఫికేషన్‌ను శనివారం విడుదల చేసింది. అయితే, భారత్ మీదుగా నేపాల్, భూటాన్ మినహా ఇతర అన్ని దేశాలకు వెళ్లే వస్తువులకు ఈ ఆంక్షలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్ రెడీమేడ్ దుస్తుల దిగుమతులకు ఏ ల్యాండ్ పోర్టులోనూ అనుమతి లేదని స్పష్టం చేసింది. వీటిని కోల్‌కతా, నవసేవా పోర్టుల్లో మాత్రమే అనుమతిస్తామని పేర్కొంది. ఫ్రూట్ ఫ్లేవర్డ్ కార్బొనేటెడ్ డ్రింకులు, బేక్డ్ గూడ్స్, స్నాక్స్, చిప్స్, కాటన్, కాటన్ యార్న్ వేస్ట్, ప్లాస్టిక్, పీవీసీ ఫినిష్డ్ గూడ్స్, డైస్, గ్రాన్యుల్స్, వుడెన్ ఫర్నిచర్, వంటి వాటిని చంగ్రాబంధా, ఫుల్బారీ ల్యాండ్ కస్టమ్స్ స్టేషన్ల ద్వారాగానీ, అస్సాం, మణిపూర్, త్రిపుర, మిజోరంలలోని ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టుల ద్వారా గానీ అనుమతించబోమని తేల్చింది. చేపలు, ఎల్పీజీ, వంట నూనెల దిగుమతులకు పోర్టుల్లో ఆంక్షలు వర్తించవని స్పష్టం చేసింది. ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రకటించింది. బంగ్లాదేశ్ ఆపద్ధర్మ ప్రభుత్వ చీఫ్ యూనుస్ ఇటీవల చైనా పర్యటన సమయంలో భారత్‌కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యల పర్యవసానమే ఈ ఆంక్షలని పరిశీలకులు అంటున్నారు. నౌకల ద్వారా భారత్‌లోని పోర్టులకు తమ వస్తువులను తరలించుకుని, ఇక్కడి నుంచి విదేశాలకు ఎగుమతులు చేసుకునేలా బంగ్లాదేశ్‌కు 2020 మే నుంచి కేంద్రం వెసులుబాటు కల్పించింది.

సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డుల సరఫరా

- తెలంగాణ, అస్సాం, రాజస్తాన్‌లలో దాడులు
- ఏడుగురు సభ్యుల ముఠా పట్టివేత

గువాహటి: పాకిస్తాన్ సహా వివిధ దేశాల సైబర్ నేరగాళ్లకు మొబైల్ ఫోన్ కనెక్షన్లను సమకూర్చుతున్న అంతర్రాష్ట్ర రాకెట్‌ను అస్సాం పోలీసులు ఛేదించారు. ముఠాలోని ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు అస్సాం డీజీపీ హర్మీత్ సింగ్ శనివారం గువాహటిలో వెల్లడించారు. సైనిక నిఘా విభాగం 'ఆపరేషన్ గజరాజ్ కార్ప్స్'అందించిన సమాచారం మేరకు 'ఆపరేషన్ ఘోస్ట్ సిమ్'చేపట్టి, వీరిని పట్టుకున్నామన్నారు. వేర్వేరు పేర్లతో సిమ్ కార్డులను పొందే ఈ ముఠా అనంతరం వీటిని సైబర్ నేరగాళ్లకు సరఫరా చేస్తుంటుంది. ఈ నేరగాళ్లు ప్రజలను మోసం చేసేందుకు ఈ నంబర్లతో వాట్సాప్ కాల్స్ చేస్తుంటారు. ఈ వ్యవహారంపై ఈ నెల 14వ తేదీన కేసు నమోదు చేసి, అస్సాంలోని రెండు జిల్లాలు, తెలంగాణలోని ఒక జిల్లా, రాజస్తాన్‌లోని రెండు జిల్లాల్లోని దాడులు జరిపి ఏడుగురిని అరెస్ట్ చేశామన్నారు. వీరు పాకిస్తానీ సైబర్ నేరగాళ్లకు ఈ సిమ్ కార్డులను అందజేశారన్నారు. వీరు భారత్ నంబర్లతో వాట్సాప్ అకౌంట్లను ఓపెన్ చేసి, ప్రజలను మోసం చేస్తున్నట్లు డీజీపీ హర్మీత్ సింగ్ చెప్పారు. ఈ విషయం తెలియని బాధితులు వీటిని భారత్‌లోని నంబర్లుగానే నమ్ముతూ మోసపోతున్నట్లు వివరించారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాలతోపాటు 948 సిమ్ కార్డులను ఈ ముఠా సభ్యుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



శనివారం ఉత్తర గాజాలో ఇజ్రాయెల్ బాంబు దాడులతో ధ్వంసమైన భవనాలు, దట్టంగా అలుముకున్న పొగలు

24 గంటల్లో 150 మంది మృతి

గాజాపై దాడులు తీవ్రతరం చేసిన ఇజ్రాయెల్

జెరూసలేం: గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ ఆర్మీ భీకర వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. ఈ దాడుల్లో 24 గంటల వ్యవధిలో మహిళలు, చిన్నారులు సహా 150 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. ఇదే విషయాన్ని రాయిటర్స్ వార్తా సంస్థ సైతం ధ్రువీకరించింది. దాడుల్లో వందలాదిగా గాయపడ్డారని పేర్కొంది. గురువారం నుంచి కొనసాగుతున్న భీకర దాడుల్లో మొత్తం 250 మంది మృత్యువాతపడ్డారని ఆరోగ్య విభాగం వివరించింది. గడిచిన 24 గంటల్లో గాజా వ్యాప్తంగా ఉన్న 150 ఉగ్ర లక్ష్యాలపై దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ పేర్కొంది. 2023 అక్టోబర్ 7వ తేదీ నుంచి మొదలైన ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటి వరకు 53 వేల మందికి పైగా చనిపోయినట్లు ఆరోగ్య విభాగం వెల్లడించింది. వీరిలో అత్యధికులు మహిళలు, చిన్నారులేనని వివరించింది. క్షతగాత్రుల సంఖ్య లక్షల్లోనే ఉంటుందని పేర్కొంది.

ఆర్మీ మరో ఆపరేషన్

ఉత్తర, మధ్య గాజాలోని వారిని నివాసాలు, టెంట్లు విడిచిపెట్టి వెళ్లాలని హెచ్చరికలు చేస్తూ భీకర దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ ఆర్మీ కీలకమైన మరో ఆపరేషన్‌కు తెరతీసింది. లక్షిత ప్రాంతాలను స్వాధీనం చేసుకునే ఆపరేషన్ 'గిడియన్ చారియట్స్'ను తమ సైన్యం పూర్తి సామర్థ్యంతో కొనసాగిస్తుందని రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ వెల్లడించారు. మరికొద్ది రోజుల్లోనే వేలాదిగా ఇజ్రాయెల్ బలగాలు గాజాలో ప్రవేశించి ఆపరేషన్ మొదలుపెట్టనున్నాయి. ఇజ్రాయెల్ మిలటరీ ఆపరేషన్ ప్రకటనతో హమాస్ కాస్తంత వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. ఎటువంటి ముందస్తు షరతులు లేకుండా అన్ని అంశాలపైనా చర్చలకు సిద్ధమని ప్రకటించింది. ఖతార్ రాజధాని దోహాలో ఇజ్రాయెల్‌తో చర్చలకు హాజరవుతామని తెలిపింది. అయితే, పాలస్తీనా ఖైదీల విడుదల, గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం సంపూర్ణ ఉపసంహరణ తమ కీలక డిమాండ్లని స్పష్టం చేసింది.

పాక్‌కు ముందే సమాచారం ఇవ్వడం నేరం: రాహుల్

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ గురించి పాకిస్తాన్‌కు భారత ప్రభుత్వం ముందే సమాచారం ఇవ్వడం ఏమిటని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయబోతున్నామంటూ ముందస్తుగానే సమాచారం చేరవేయడం కచ్చితంగా నేరమేనని తేల్చిచెప్పారు. ఇలా పాకిస్తాన్‌కు సమాచారం ఇచ్చింది ఎవరో బయటపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైమానిక దాడుల గురించి పాకిస్తాన్‌కు సమాచారం చేరవేశామని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ బహిరంగంగా ప్రకటించారని రాహుల్ వెల్లడించారు. పాక్ దాడుల్లో భారత వైమానిక దళం ఎన్ని విమానాలు కోల్పోయిందో ప్రభుత్వం ప్రజలకు చెప్పాలన్నారు. ఈ మేరకు ఆయన శనివారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. జైశంకర్ మాట్లాడిన వీడియోను కూడా షేర్ చేశారు. మరోవైపు ఉగ్రవాద స్థావరాలపై దాడుల గురించి పాక్‌కు ముందే సందేశం చేరవేశామంటూ జైశంకర్ చెప్పినట్లు వైరల్ అవుతున్న వీడియోలో వాస్తవం లేదని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) వెల్లడించింది. జైశంకర్ అలాంటి వ్యాఖ్యలు చేయలేదని తెలియజేసింది. జైశంకర్‌పై రాహుల్ గాంధీ చేసిన విమర్శలను బీజేపీ జాతీయ అధికారి ప్రతినిధి ప్రదీప్ భండారీ తప్పుపట్టారు. పాకిస్తాన్‌కు ప్రచార సాధనంగా రాహుల్ మారిపోయారని ధ్వజమెత్తారు. భారత్‌కు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పాకిస్తాన్‌లో ఉగ్రవాద క్యాంపులను ధ్వంసం చేయడం రాహుల్‌కు ఇష్టం లేదా? అని ప్రశ్నించారు.

వాటికన్ వేదికగా రష్యా-ఉక్రెయిన్ శాంతి చర్చలు

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడి

రోమ్: రష్యా-ఉక్రెయిన్ శాంతి చర్చలకు వాటికన్ సిటీ వేదికగా మారే అవకాశముందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. యుద్ధానికి ముగింపు పలికేందుకు అవసరమైన ప్రతి సాయం అందిస్తామని ఇటీవల పోప్ లియో 14 ప్రకటించిన నేపథ్యంలో శనివారం ఆయన రోమ్ చేరుకున్నారు. మీడియాతో మాట్లాడుతూ.. 'రష్యా, ఉక్రెయిన్ సమస్యపై వాటికన్ సాయం కోరుతా. శుక్రవారం తుర్కియేలో జరిగిన చర్చల ఫలితం, ముందుకు వెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తా. అయితే, దీనిని వాటికన్ మధ్య వర్తిత్వం అనలేము. వాటికన్ సిటీ ఇరు పక్షాలకు ఇది చాలా సౌకర్యవంతమైన చర్చా వేదిక'అని ఆయన తెలిపారు. నిర్మాణాత్మక, సానుకూల పాత్రను పోషించడానికి వాటికన్ సుముఖత వ్యక్తం చేసినందుకు కృతజ్ఞులమై ఉంటామన్నారు. రూబియో అనంతరం వాటికన్ విదేశాంగ మంత్రి పియెట్రో పరోలిన్‌తో సమావేశమ య్యారు. తుర్కియేలో చర్చలు విఫలం కావడాన్ని పియెట్రో విషాదంగా పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్‌ల ప్రత్యక్ష శాంతి చర్చలకు వేదికగా వాటికన్ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. గతంలోనూ వాటికన్ సిటీ వేదికగా శాంతి చర్చలు జరిగిన దాఖలాలు న్నాయి. ఇలా ఉండగా, యుద్ధానికి ముగింపు పలికేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో పాటు, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సోమవారం ఫోన్‌లో చర్చించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా ప్రకటించారు.

భారత్-పాక్ మధ్య అణు యుద్ధం ఆపేశా..

- కాల్పుల విరమణకు నేనే స్వయంగా చొరవ తీసుకున్నా
- నా అతిపెద్ద విజయాల్లో ఒకటి
- ట్రంప్ నోట మళ్లీ అదేమాట

వాషింగ్టన్: భారత్-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ కోసం తానే చొరవ తీసుకున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చెప్పుకొచ్చారు. ఆ క్రెడిట్ తనకే దక్కాలని పేర్కొన్నారు. ఆ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చి, ఉద్రిక్తతలు ఆగిపోవడం ఇప్పటిదాకా తాను సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటి అని వ్యాఖ్యానించారు. ఆయన శుక్రవారం ఫాక్స్ న్యూస్ సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. తన జోక్యం వల్లే పాకిస్తాన్‌పై ఇండియా సైనిక చర్య నిలిచిపోయిందని వెల్లడించారు. ఇరు దేశాల మధ్య అణుయుద్ధాన్ని నివారించానని తెలిపారు. రెండు బలమైన దేశాలైన భారత్-పాక్ మధ్య మొదలైన ఘర్షణలు అతి తక్కువ సమయంలోనే అణుయుద్ధానికి దారితీసే పరిస్థితి ఏర్పడిందని, తాను కల్పించుకోవడంతో అది ఆగిపోయిందని వివరించారు. అయితే, పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ వెనుక ట్రంప్ ప్రమేయం ఎంతమాత్రం లేదని భారత్ ఇప్పటికే తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే. మూడో పక్షం జోక్యాన్ని తాము అంగీకరించే ప్రసక్తే లేదని భారత్ వెల్లడించింది. అయినప్పటికీ ట్రంప్ తన నోటి దురుసు తగ్గించుకోకపోవడం గమనార్హం. భారత్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పినప్పటికీ ఈ అంశాన్ని పదేపదే ప్రస్తావించడం ద్వారా ఆయన ఏం సాధించదల్చుకున్నారో అర్థం కావడం లేదని నిపుణులు అంటున్నారు.

టారిఫ్‌ల రద్దుకు ఇండియా సంసిద్ధత

భారత్, పాక్ నడుమ ఉద్రిక్తతలు నివారించి, శాంతిని నెలకొల్పడానికి వాణిజ్యాన్ని ఆయుధంగా వాడుకున్నానని డొనాల్డ్ ట్రంప్ తెలియజేశారు. అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లను 100 శాతం రద్దు చేయడానికి ఇండియా సంసిద్ధత వ్యక్తం చేసిందని పునరుద్ఘాటించారు. అమెరికా-ఇండియా మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలోనే కుదరడం ఖాయమని తెలిపారు. అయితే, ఈ ఒప్పందం కోసం తాను తొందరపడడం లేదన్నారు. తమతో వాణిజ్య ఒప్పందం చేసుకోవాలని ఇప్పుడు ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని చెప్పారు. ఇప్పటిదాకా 150 దేశాలు ఇలాంటి ఒప్పందం కోసం ముందుకొచ్చాయన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశం ఇండియా అంటూ ట్రంప్ మరోసారి విమర్శించారు. వ్యాపారాలు చేయడం అసాధ్యం అనే పరిస్థితులు ఇండియాలో సృష్టించారని తప్పుపట్టారు. కానీ, అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు పూర్తిగా రద్దు చేయడానికి ఇండియా సుముఖంగా ఉందని వివరించారు. కేవలం అమెరికా కోసం ఇండియా ఈ మేలు చేయడానికి సిద్ధపడిందని అన్నారు.



హెలి అంబులెన్స్ ఎమర్జెన్సీ ల్యాండింగ్

కేదార్‌నాథ్‌లో ఇద్దరు వైద్యులు, పైలట్‌కు తప్పిన ప్రమాదం

రుద్రప్రయాగ్: ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్ ఎయిమ్స్ ఆధ్వర్యంలో పనిచేసే హెలి అంబులెన్స్ 'సంజీవని'సాంకేతిక లోపం తలెత్తడంతో కేదార్‌నాథ్‌లో అత్యవసరంగా ల్యాండయ్యింది. అందులోని ఇద్దరు వైద్యులు, పైలట్‌త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కేదార్‌నాథ్ ఆలయానికి వచ్చిన శ్రీదేవి అనే భక్తురాలు శ్వాస సంబంధ సమస్యతో బాధపడుతున్నట్లు రిషికేశ్ ఎయిమ్స్‌కు సమాచారం అందింది. దీంతో ఆస్పత్రి హెలి అంబులెన్స్ 'సంజీవని'ఇద్దరు వైద్యులతో టేకాఫ్ తీసుకుంది. కేదార్‌నాథ్‌లోని హెలిప్యాడ్‌పై ల్యాండయ్యే సమయానికి తోకభాగంలో సాంకేతిక లోపం తలెత్తింది. ప్రమాదాన్ని పసిగట్టిన పైలట్ హెలికాప్టర్‌ను అక్కడే చదునుగా ఉన్న ప్రాంతంలో అతికష్టమ్మీద ల్యాండ్ చేయగలిగారు. అందులోని ఇద్దరు వైద్యులు, పైలట్ సురక్షితంగా బయటపడ్డారు. ల్యాండయ్యే క్రమంలో తోక భాగం రోటర్ దెబ్బతిందని అధికారులు తెలిపారు. ఘటనపై సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ జనరల్ దర్యాప్తునకు ఆదేశించారు.

గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులున్నట్లు రాసిందెవరు?

కాకతీయ వాస్తు, శిల్ప రీతికి తలమానికం రామప్ప దేవాలయం. ఈ దేవాలయంలోని నందికి ఒక ప్రత్యేకత ఉంది. వీక్షకులు ఏ వైపు నుంచి చూసినా అది వారివైపే చూస్తున్నట్లు కనిపిస్తుంది. ఓరుగల్లు కోటలోని నిర్మాణాలు కాకతీయుల కాలంనాటి వాస్తు, శిల్ప కౌశలాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ కోటను ఏకశిల చుట్టూ నిర్మించారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

కాకతీయ యుగ విశేషాలు

పన్నులు

కాకతీయుల కాలంలో స్థూలంగా అయిదు రకాల పన్నులుండేవి.

అవి: 1. భూమి పన్ను, 2. పారిశ్రామిక, ఆస్తి పన్నులు, 3. వృత్తి పన్నులు, 4. వ్యాపార పన్నులు, 5. ఇతర పన్నులు.

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ మార్గం భూమి శిస్తు. వర్తకం, పరిశ్రమలు, వృత్తులపై విధించే పన్నులు రెండో ఆదాయ మార్గం. పశుగ్రాసానికి పనికి వచ్చే పచ్చికబయళ్లపై వసూలు చేసే పన్ను, అడవుల కలపపై వేసే పన్ను మూడో ఆదాయ మార్గంగా ఉండేది. వర్తక సరకులు, ఎగుమతి దిగుమతులు, తయారైన వస్తువుల మీద వేసే పన్నును 'సుంకం'గా పేర్కొనేవారు. సాధారణంగా సుంకాలు వసూలు చేసే అధికారం వర్తక శ్రేణులకు ఇచ్చేవారు.

న్యాయ పాలన

సామాన్యమైన వివాదాలన్నింటినీ గ్రామ సభల్లో గ్రామ ప్రభువులు పరిష్కరించేవారు. గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా 'తలారి' అనే గ్రామోద్యోగి చూసేవాడు. రాజే అంతిమ న్యాయ నిర్ణేత. యాజ్ఞవల్క్య స్మృతి లాంటి ప్రాచీన స్మృతి గ్రంథాల్లో పేర్కొన్న సూత్రాలను అనుసరించి ధర్మాసనాలు ఏర్పరిచేవారు. ఒకరిద్దరు రాజాధికారులతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సభల్లో న్యాయ సమస్యలు పరిష్కారమయ్యేవి. వీరిని 'మహాజనులు'గా పేర్కొనేవారు. సమస్య పరిష్కారమైన వెంటనే సభ రద్దయ్యేది. ప్రస్తుతం గ్రామ పెద్దల మాదిరిగా ఈ మహాజనులు పనిచేసేవారు. తెగల్లో వివాదాలను 'సమయాలే' పరిష్కరించేవి.

సైనిక వ్యవస్థ

కాకతీయ సైన్యంలో చక్రవర్తి సైన్యం, నాయంకర సైన్యం అని రెండు విభాగాలు ఉండేవి. కాకతీయ చక్రవర్తులు సైన్యానికి స్వయంగా నాయకత్వం వహించేవారు. వీరి రాజ్యంలో స్థల, జల, వన, గిరి అనే నాలుగు రకాల కోటలు ఉన్నట్లు తెలుస్తోంది. కాకతీయుల కాలంలో ఓరుగల్లు, రాయచూరు, గోల్కొండ, భువనగిరి, రాచకొండ, దేవరకొండ, నల్లగొండ, పానుగల్లు కోటలు శత్రు దుర్భేద్యమైనవిగా పేరు పొందాయి.

ఆర్థిక పరిస్థితులు

కాకతీయుల కాలంలో ఆంధ్రదేశం సిరి సంపదలతో విలసిల్లినట్లు అమీర్ ఖుస్రూ, అబ్దుల్లా వాసఫ్, మార్కోపోలో లాంటి విదేశీ యాత్రికుల రచనల ద్వారా తెలుస్తోంది.

వ్యవసాయం: తెలంగాణా ప్రాంతంలో సాగు భూమిని, నీటి వనరులను పెంచడానికి కాకతీయులు ఎనలేని కృషి చేశారు. వీరు చెరువులు నిర్మించి నీటి పారుదలపై శ్రద్ధ వహించారు. రెండో బేతరాజు సెట్టి సముద్రం, కెరె సముద్రం, కేసరి సముద్రం చెరువులను నిర్మించాడు. గణపతిదేవుడు రాజ్యం నలుమూలలా అనేక చెరువులు నిర్మించాడు. గణపతిదేవుడి సేనాని రేచర్లరుద్రుడు 17,258 ఎకరాలకు సాగు నీరు అందించేవిధంగా పాకాల చెరువును నిర్మించాడు. దీని విస్తీర్ణం 12 చ.కి.మీ. రామప్ప చెరువును నిర్మించింది కూడా ఇతడే. రేచర్ల రెడ్లు 35 నీటి వనరులను ఏర్పాటు చేశారు. కాటచమూపతి కాట సముద్రం; చౌడ చమూపతి చౌడ సముద్రం; నామిరెడ్డి సబ్బి సముద్రం, గౌర సముద్రం, కోమటి చెరువు; ఎరకసాని ఎరక సముద్రం నిర్మించారు. వీటితో పాటు చింతల సముద్రం, నామా సముద్రం కూడా ఉండేవి. చెరువుల నిర్మాణంలో పాల్గొన్న శ్రామికులకు దినసరి వేతనాలు చెల్లించేవారు. చెరువులతో పాటు ఊట కాలువలను కూడా నిర్మించారు. మూసీ నది నుంచి సాగే మూసెటి కాలువ; ఆలేరు నది నుంచి ఆలేటి కాలువ; కూచినేని కాలువ, రావిపాటు కాలువ, బొమ్మకంటి కాలువ, ఉటుంకాలువ, చింతల కాలువల గురించి పిల్లలమర్రి శాసనాల్లో పేర్కొన్నారు. ఏతం, మోటలతో కూడా వ్యవసాయం చేసేవారు. కొత్తగా పొలాలను సాగు చేయడానికి కాకతీయ రాజులు కృషి చేశారు. ప్రతాపరుద్రుడి కాలంలో అడవులను నరికేసి విశాల భూభాగాలను సాగులోకి తీసుకువచ్చారు. నేటి రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లోని అనేక గ్రామాలు ప్రతాపరుద్రుడి కాలంలో రూపొందినవేనని ఆ గ్రామ కైఫీయతుల ద్వారా తెలుస్తోంది. తెలంగాణలోని మంథెన, కాళేశ్వరం, చెన్నూరు, నర్సంపేట, అచ్చంపేట, ఖమ్మం మెట్టు, కొత్తగూడెం అటవీ ప్రాంతాల్లోని గ్రామాల్లో ఎక్కువ భాగం కాకతీయుల కాలంలోనే ఏర్పడినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. గ్రామం, చెరువును నిర్మించడం నాడు పుణ్యకార్యంగా భావించేవారు. గ్రామాలను ఏర్పరచడానికి అన్ని వృత్తుల వారికి ప్రోత్సాహకాలు ఇచ్చేవారు. చాలా మంది కాకతీయ రాజులు, రాణులు అటవీ, బీడు భూములను వ్యవసాయ యోగ్యంగా చేశారు. వీరి పేరు మీద అనేక గ్రామాలు ఏర్పడ్డాయి. గణపవరం, ఘన్‌పూర్, మహాదేవపురం, రుద్రవరం, బయ్యారం, ముప్పవరం, కుందవరం మొదలైనవన్నీ వీటికి ఉదాహరణ. భూమిపై ప్రాథమిక స్వామ్యం రాజుది, ద్వితీయ స్వామ్యం వ్యక్తిది.

రైతులు వరి, గోధుమలు, కొర్రలు, జొన్నలు, మొక్కజొన్నలు, నీలిమందు, ఆముదాలు, నువ్వులు, పెసలు, కందులు, చెరకు, నూనెగింజలు, ఆవాలు, సజ్జలు, మినుములు, ఉలవలు, పత్తి, అల్లం, పసుపు, ఉల్లి తదితర పంటలు పండించేవారు. ఓరుగల్లు ప్రాంతంలో సువాసనలు వెదజల్లే బియ్యం తయారైనట్లు సాహిత్యం ద్వారా తెలుస్తోంది. ఆ కాలంలో కొబ్బరి, చెరకు, మామిడి, జామ, అరటి తోటలు విస్తారంగా ఉండేవి. సాధారణంగా ప్రతి గ్రామంలో బెల్లం, నూనె గానుగలు ఉండేవి. పశు సంపద పుష్కలంగా ఉండేది.

పరిశ్రమలు: నాడు వ్యవసాయంతో పాటు అనేక పరిశ్రమలు కూడా ఉండేవి. పాల్కురికి సోమనాథుడు 'పండితారాధ్య చరిత్ర'లో ఇరవైకి పైగా వస్త్రాల గురించి పేర్కొన్నాడు. ఓరుగల్లులో రత్న కంబళ్లు, ముఖమల్ వస్త్రాలు నేసేవారు. ఏకామ్రనాథుడు ఓరుగల్లులో చిత్తరువులు రాసే ఇళ్లు 1500 వరకు ఉండేవని పేర్కొన్నాడు. నాడు చిత్రకళకు మంచి ఆదరణ ఉండేది. పాల్కురికి 'బసవపురాణం'లో యాభై రకాల దుస్తుల పేర్లను ప్రస్తావించాడు. కాకతీయుల రాజ్యంలో శ్రేష్ఠమైన సన్నని వస్త్రాలు నేసేవారని, అవి సాలెపురుగు జాలె మాదిరిగా ఉండేవని మార్కోపోలో ప్రశంసించాడు. వీటి ఆధారంగా ఆ కాలంలో పద్మశాలీలకు మంచి నైపుణ్యం ఉండేదని తెలుస్తోంది. పల్లకీల మీద చెక్కిన నగిషీల వర్ణనను పరిశీలిస్తే నాటి వడ్రంగుల పని నైపుణ్యం అర్థమవుతుంది. పంచలోహాలతో వివిధ రకాల వస్తువులను తయారు చేసేవారు. నిర్మల్‌లో తయారైన కత్తులకు డమాస్కస్‌లోనూ మంచి ఆదరణ ఉండేది. గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులున్నట్లు మార్కోపోలో రాశారు. వ్యవసాయానికి అవసరమైన పరికరాలను గ్రామాల్లోనే తయారు చేసేవారు. పానగల్లు, చందూరులో దేవాలయాల్లో ఉపయోగించే కంచు గంటలు, పళ్లాలు, పాత్రలను రూపొందించేవారు.

వర్తక - వాణిజ్యం: శాతవాహనుల తర్వాత క్రమంగా క్షీణించిన దేశీయ, విదేశీ వాణిజ్యాన్ని కాకతీయులు పునరుద్ధరించారు. కాకతీయుల కాలంలో దేశీయ వాణిజ్యానికి ప్రధాన కేంద్రం ఓరుగల్లు. ఆ తర్వాత తెలంగాణలో మంథెన, అలంపురం, జడ్చర్ల, మగతల, పేరూరు ప్రధాన వాణిజ్యకేంద్రాలుగా ఉండేవి. పలనాటి సీమ నుంచి వాడపల్లి, నకిరెకల్, పిల్లలమర్రి మీదుగా వ్యాపారులు వరంగల్ వచ్చేవారు. బళ్లారి-చిత్తూరు, రాయచూరు-కొలనుపాక, బీదరు-కొలనుపాక, కల్యాణి-కొలనుపాక-అనుమకొండ, బీదరు-పటాన్‌చెరువు-వరంగల్ మొదలైనవి ముఖ్యమైన వాణిజ్య మార్గాలుగా ఉండేవి.

కాకతీయుల పాలనలో తెలంగాణలో వర్తక శ్రేణుల నిర్మాణంలో గుర్తించదగిన మార్పు వచ్చింది. ఆ కాలంలో వ్యాపారం బలిజలకు, వైశ్యులకే పరిమితం కాలేదు. రెడ్లు, నాయుళ్లు, బోయలు, దాసర్లు, తెలికలు, పద్మశాలీలు, వ్యవసాయదారుల లాంటి ఉత్పత్తిదారులు, కమ్మరి, కంసాలి, మేదరి లాంటి వృత్తి కులాల వారు వ్యాపారంలోకి వచ్చారు. వివిధ వృత్తికారులు, ఉత్పత్తిదారులు సొంత సమయాలను ఏర్పరచుకొని తమ కులవృత్తులతో పాటు వ్యాపారాలను నిర్వహించుకునేవారు. వీరిలో కొంత మంది కేవలం తమ ఉత్పత్తులనే అమ్ముకునేవారు. అందువల్ల ఇంత మంది వ్యాపారంలోకి వచ్చినప్పటికీ ప్రధానంగా వ్యాపారం వైశ్యుల చేతిలోనే ఉండేది. గోధుమ, పెసలు, వడ్లు, జొన్నలు, ఉప్పు, నూనె, నెయ్యి, మిరియాలు, ఆవాలు, తేనె, తగరం, రాగి, కర్పూరం, కస్తూరి, పట్టు, రత్నాలు, ముత్యాలు, పూసలు, పసుపు, ఉల్లిగడ్డలు, అల్లం, నూలు, దుంపలు మొదలైన ఉత్పత్తుల వ్యాపారం జరిగేది.

విదేశీ వాణిజ్యం: కాకతీయుల కాలంలో 'మోటుపల్లి' విదేశీ వాణిజ్యానికి ప్రసిద్ధమైన రేవు పట్టణంగా గుర్తింపు పొందింది. చాళుక్య, చోళ రాజుల కారణంగా దెబ్బతిన్న విదేశీ వ్యాపారాన్ని గణపతిదేవుడు ఈ రేవు పట్టణం ద్వారా పునరుద్ధరించాడు. దీని ద్వారా ఇండోనేషియా, జావా, సుమత్రా, జపాన్, మలయా, బర్మాతో వ్యాపారం చేసేవారు. మార్కోపోలో ఈ రేవు పట్టణాన్ని సందర్శించాడు. ఇక్కడి నుంచి ఎగుమతయ్యే వస్తువుల్లో వజ్రాలు, పట్టుతో తయారయ్యే సన్నని వస్త్రాలు ముఖ్యమైనవని అతడు పేర్కొన్నాడు. కాకతీయుల నాణేలు ఎక్కువగా లభించలేదు. కానీ శాసనాలు, సాహిత్యంలో నాణేల ప్రస్తావన ఉండేది.

సాంఘిక పరిస్థితులు

కాకతీయుల కాలంనాటి సంఘంలో ప్రధానంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు ఉండేవి. ప్రతి కులంలో అనేక ఉపకులాలు ఏర్పడ్డాయి. ఏకామ్రనాథుడు 'ప్రతాపచరిత్ర'లో, వినుకొండ వల్లభరాయుడు 'క్రీడాభిరామం'లో కాకతీయుల కాలంనాటి వివిధ వృత్తుల గురించి ప్రస్తావించారు. కోమట్లు, ఈడురవారు, గొల్లవారు, అక్కలవారు (ఆగసాల), సాలెవారు, మంగలులు, కుమ్మరివారు, బోయవారు, రుంజులు, పిచ్చుకుంట్లు, పంబల, బవని, మేదర, గాండ్ల మొదలైన కులాల పేర్లను శాసనాల్లోనూ పేర్కొన్నారు.

హిందూ మతాన్ని సంస్కరించే ఉద్దేశంతో శైవ, వైష్ణవ మతాలు ఆవిర్భవించాయి. కుల నిర్మూలన కోసం పుట్టిన వీటి ద్వారా సంఘంలో కొత్త కులాలు ఏర్పడ్డాయి. ఈ విధంగా శైవుల్లో లింగాయతులు, బలిజలు, జంగాలు, తంబళ్లు మొదలైన కులాలు ఏర్పడ్డాయి. వైష్ణవుల్లో నంబులు, సాతానులు, దాసర్లు మొదలైన కులాలు ఆవిర్భవించాయి. 'అష్టాదశ కులాలు' అప్పటికే ప్రాచుర్యంలో ఉన్నాయి.

కాకతీయుల కాలంలో బాల్యవివాహాలు జరిగాయి. అనులోమ, ప్రతిలోమ వివాహ పద్ధతులు ఉండేవి. రుద్రమదేవి కుమార్తె రుయ్యమను బ్రాహ్మణ మంత్రి ఇందులూరి అన్నయ్య దేవుడు పెళ్లి చేసుకోవడం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. అయినప్పటికీ కుల నిర్మూలన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కాకతీయుల కాలంలో వెలమలు సంఘ సంస్కర్తలుగా, రెడ్లు పూర్వాచార పరాయణులుగా ఉన్నట్లు తెలుస్తోంది. నాడు రాజకీయంగా ప్రాబల్యం వహించిన రెడ్లు, వెలమల మధ్య అధికారం కోసం పోటీ ప్రారంభమైంది. ఈ కాలంలో అష్టాదశ వర్ణాల్లో అగ్రవర్ణమైన బ్రాహ్మణ వర్గానికి చెందినవారు రాజకీయ ప్రాబల్యాన్ని కోల్పోయారు. రాజకీయాధికారం చతుర్థ వర్ణ పరమైంది. క్షత్రియ వంశాలు నామమాత్రంగా అధికారంలో ఉండేవి.

కాకతీయుల కాలంనాటి సాంఘిక జీవితానికి సంబంధించిన ఒక ప్రధాన లక్షణం కుల సంఘాలు. వీటిని 'సమయములు' అనేవారు. నగరాలు, గ్రామాలు పేటలుగా విభజించి ఉండేవి. అక్కలవాడ, భోగంవీధి, వెలిపాళి, మేదరవాడ, మోహరినాడు మొదలైనవి ఇలాంటివే. పూటకూళ్ల ఇళ్లు ఉండేవి. బసవ పురాణం ఆధారంగా ఆనాటికే వెట్టి వ్యవస్థ ఉన్నట్లు తెలుస్తోంది. మహిళలు పాత్ర, గొండ్లి, పేరణి, కోలాటం, గొబ్బిళ్లు, గుర్రం, భంజళి మొదలైన క్రీడలతో వినోదం పొందేవారు.

వాస్తు, శిల్ప కళ

కాకతీయ రాజులు, వారి సామంతులు అనేక జైన, శైవ, వైష్ణవాలయాలను నిర్మించారు. దేవాలయ నిర్మాణంలో కాకతీయులు పశ్చిమ చాళుక్యుల వాస్తు విధానాన్ని అనుసరించారు. వీరు త్రికూటాలయాలను ఇదే పద్ధతిలో నిర్మించారు. బేతిరెడ్డి భార్య ఎరకేశ్వరాలయం నిర్మించారు. నామిరెడ్డి పిల్లలమర్రిలో కాటేశ్వర, కాచేశ్వర, నామేశ్వర ఆలయాలను నిర్మించాడు. పాలంపేట, పిల్లలమర్రి, పానగల్లు, హన్మకొండలో ఉన్న ఆలయాలను త్రికూట పద్ధతిలోనే నిర్మించారు.

నంది విగ్రహాలు కాకతీయ శిల్ప ప్రాభవానికి నిదర్శనాలు. కాకతీయ శిల్పం చాళుక్యుల శిల్పం కంటే నిగ్గ తేలి ఉంది. ఇది కొంత ప్రాంతీయ లక్షణాలను సంతరించుకొని ఉంటుంది. దేశీయ నృత్య రీతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాట్యగత్తెల కోలాట దృశ్యాలు కూడా కాకతీయుల కళా నైపుణ్యానికి తార్కాణంగా ఉన్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఏ కాకతీయ పాలకుడి కాలంలో విశాల భూభాగాలు సాగులోకి వచ్చాయి?
   1) గణపతిదేవుడు 2) ప్రతాపరుద్రుడు
   3) రుద్రదేవుడు 4) రెండో బేతరాజు
2. రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లోని అనేక గ్రామాలు ఎవరి కాలంలో ఏర్పడ్డాయని కైఫీయత్తుల ద్వారా తెలుస్తోంది?
   1) బేతరాజు 2) ప్రోలరాజు
   3) ప్రతాపరుద్రుడు 4) రుద్రమదేవి
3. కాకతీయ రాజ్యంలో శ్రేష్ఠమైన వస్త్రాలు ఉన్నాయని ప్రశంసించిన విదేశీ యాత్రికుడు?
   1) మెగస్తనీస్ 2) ప్లీని
   3) మార్కోపోలో 4) నికోలో కాంటి
4. గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులు ఉన్నట్లు రాసిన విదేశీ యాత్రికుడు?
   1) టాలెమి 2) మార్కోపోలో
   3) ప్లీని 4) కొలంబస్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 2.

హైదరాబాద్‌లోని ప్లానిటోరియం పేరు?



బోధనోపకరణాలు

1. బోధనోపకరణం ద్వారా దృష్టి, వినికిడిని ఏకకాలంలో ఉపయోగించి విద్యార్థి అభ్యసన అనుభవాన్ని పెంపొందిస్తే దాన్ని దృశ్య శ్రవణ బోధనోపకరణం అంటారని నిర్వచించిందెవరు?
   1) బర్టన్ 2) కార్టర్ గుడ్
   3) ఎడ్గర్ డేల్ 4) జేమ్స్ వాట్
2. చూడడం ద్వారా అభ్యసన స్థాయి శాతం?
   1) 11% 2) 35%
   3) 83% 4) 100%
3. చెప్పడం,చేయడం ద్వారా స్మృతి స్థాయి శాతం?
   1) 60% 2) 75%
   3) 50% 4) 90%
4. అభ్యసనానుభవాలను బట్టి బోధనోపకరణాలను మూడు విధాలుగా వర్గీకరించినవారు?
   1) జి.ఎస్.బ్రూనర్ 2) కార్టర్ ఎ.గుడ్
   3) బర్టన్ 4) ఎడ్గర్ డేల్
5. నమూనాలు ఏ రకానికి చెందిన బోధనోపకరణాలు?
   1) ప్రత్యక్షానుభవాన్నిచ్చేవి
   2) ఆరోపిత అనుభవాన్నిచ్చేవి
   3) గుర్తులతో అనుభవాన్నిచ్చేవి
   4) సంకల్పిత అనుభవాన్నిచ్చేవి
6. ప్రయోగాలు చేయడం ఏ రకమైన బోధనోపకరణం?
   1) ఆరోపిత 2) ప్రత్యక్ష అనుభవ
   3) మాటలు లేదా గుర్తులతో
   4) ఏవీకాదు
7. దృశ్య,శ్రవణ,దృశ్య-శ్రవణ, కృత్యాధార అనే బోధనోపకరణాల వర్గీకరణ దేన్ని బట్టి జరిగింది?
   1) అనుభవాలు 2) పరిమాణం
   3) లభ్యత 4) లక్షణాలు
8. క్షేత్ర పర్యటన ఏ రకం బోధనోపకరణం?
   1) దృశ్య 2) దృశ్య-శ్రవణ
   3) కృత్యాధార 4) శ్రవణ
9. ఎడ్గర్ డేల్ బోధనోపకరణాలను అనుభవాలను బట్టి ఏ ఆకారంలో అమర్చారు?
   1) గోళాకారం 2) చతురస్రాకారం
   3) శంఖాకారం 4) చతుర్భుజాకారం
10. ఎడ్గర్ డేల్ శంఖువులో ప్రత్యక్ష అనుభవాల స్థానం?
    1) పీఠ భాగం 2) శిఖర భాగం
    3) మధ్య భాగం 4) కింది భాగం
11. ఎడ్గర్ డేల్ శంఖువులో శాబ్దిక చిహ్నాల స్థానం?
    1) పీఠ భాగం 2) శిఖర భాగం
    3) మధ్య భాగం 4) ఎక్కడైనా ఉండొచ్చు
12. పోషకాహార విలువలను నృత్య రూపకంగా చేసి బోధించడం?
    1) ప్రత్యక్ష అనుభవం 2) క్షేత్ర పర్యటన
    3) ప్రదర్శన 4) నాటకీకరణ
13. ఫ్లానెల్ బోర్డ్ ఏ రకానికి చెందిన బోధనోపకరణం?
    1) ప్రదర్శనా ఉపకరణాలు
    2) త్రిపరిమాణ ఉపకరణం
    3) రేఖీయ చిత్రం 4) ప్రక్షేపిత ఉపకరణం
14. మాతృకలు (స్పెసిమన్) ఏ రకం బోధనోపకరణం?
    1) ప్రదర్శన 2) ప్రక్షేపిత
    3) కృత్యాధార 4) త్రిపరిమాణ
15. ఫిల్మ్ ప్రొజెక్టర్ ఏ రకం బోధనోపకరణం?
    1) ప్రదర్శన 2) ప్రక్షేపిత
    3) కృత్యాధార 4) త్రిపరిమాణ
16. ఎడ్గర్ డేల్ అనుభవ శంఖువులో ప్రొజెక్టర్ల స్థానం?
    1) ప్రదర్శన బల్లలపైన
    2) చార్టు తర్వాత 3) చలనచిత్రాలపైన
    4) శాబ్దిక చిహ్నాలపైన
17. జంతువుల వర్గీకరణ రాయడానికి ఏ రకం చార్ట్ అవసరం?
    1) వ్యవస్థానుక్రమ 2) దత్తాంశ
    3) వంశవృక్ష 4) క్రమానుగత
18. బార్ గ్రాఫ్‌లను ఏ విధంగా పిలుస్తారు?
    1) హిస్టోగ్రామ్‌లు 2) లైన్ గ్రాఫ్‌లు
    3) సెక్టర్ గ్రాఫ్‌లు 4) వ్యంగ్య చిత్రాలు
19. వీటిలో ఏది ప్రత్యక్ష అనుభవానికి దగ్గరగా ఉంటుంది?
    1) రేఖా చిత్రం 2) త్రిమితీయ ఉపకరణం
    3) రేడియో 4) శాబ్దిక చిహ్నం
20. తోలుబొమ్మలు ఏ రకం బోధనోపకరణం?
    1) కృత్యాధార 2) ప్రదర్శన
    3) ప్రక్షేపిత 4) త్రిమితీయ
21. అపార దర్శక వస్తువులను ఏ ఉపకరణం ద్వారా ప్రక్షేపితం చేయొచ్చు?
    1) ఫిల్మ్ ప్రొజెక్టర్ 2) ఓవర్‌హెడ్ ప్రొజెక్టర్
    3) ఎపిడయాస్కోప్ 4) మైక్రో ప్రొజెక్టర్
22. మైక్రో ప్రొజెక్టర్ ప్రత్యేకత ఏమిటి?
    1) ఉపాధ్యాయుడి వెనుక ప్రతిబింబం
    2) అపారదర్శకత కలిగిన వస్తువుల ప్రక్షేపణ
    3) సూక్ష్మదర్శినిలోని స్లైడుల ప్రక్షేపణ
    4) సెల్లోఫేన్ పేపర్‌పైన వేసిన బొమ్మల ప్రక్షేపణ
23. ప్రొజెక్టర్ ఉపాధ్యాయుడి దగ్గరే ఉండి ప్రతిబింబం కూడా అయన వైపే ప్రక్షేపించడం ఏ ప్రొజెక్టర్ లక్షణం?
    1) స్లైడ్ ప్రొజెక్టర్ 2) ఓవర్ హెడ్ ప్రొజెక్టర్
    3) ఎపిడయాస్కోప్ 4) మైక్రో ప్రొజెక్టర్
24. భారతదేశంలో దూరదర్శన్ ప్రయోగాత్మక ప్రసారాలు ప్రారంభించిన సంవత్సరం?
    1) 1959 2) 1961
    3) 1987 4) 1998
25. బడి తోట పెంచడం ఏ కమిటీ సూచించిన SUPWలో ఒక భాగం?
    1) మొదలియార్ 2) తారాదేవి
    3) ఈశ్వరీబాయి 4) కొఠారీ
26. వైజ్ఞానిక సంఘాలు ఏ రకం బోధనోపకరణాల కిందకు వస్తాయి?
    1) ప్రక్షేపిత 2) కృత్యాధార
    3) పరోక్ష 4) దృశ్య శ్రవణ
27. 1959లో మొదటి బిర్లా పారిశ్రామిక సాంకేతిక ప్రదర్శనశాలను ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) కోల్‌కతా 2) ముంబై
    3) హైదరాబాద్ 4) ఢిల్లీ
28. 1977లో ముంబైలో ఏ విజ్ఞాన శాస్త్ర కేంద్రాన్ని ఏర్పాటు చేశారు?
    1) బిర్లా ప్లానిటోరియం
    2) విశ్వేశ్వరయ్య మ్యూజియం
    3) నెహ్రూ విజ్ఞాన కేంద్రం
    4) జాతీయ విజ్ఞాన కేంద్రం
29. మొక్కలను లేదా వాటి భాగాలను కొంతకాలం ఎండబెట్టి భద్రపర్చే విధానం?
    1) వివేరియం 2) చేధనం
    3) టెర్రేరియం 4) హెర్బేరియం
30. అక్వేరియం అనేది ఒక?
    1) అందాన్నిచ్చే వస్తువు
    2) కృత్రిమ జీవావరణ వ్యవస్థ
    3) అన్ని రకాల జీవులుండే స్థలం
    4) చీకటి జీవులను తెలుసుకునేది
31. ప్రత్యేక స్థలాల్లో జీవించి ఉన్న జంతువులకు సహజ స్థితులను ఏర్పర్చి పరిశీలించడాన్ని ఏమంటారు?
    1) వివేరియం 2) అక్వేరియం
    3) హెర్బేరియం 4) టెర్రేరియం
32. కీటకాల జీవిత చరిత్రను బోధించేందుకు దేన్ని ఉపయోగించవచ్చు?
    1) అక్వేరియం 2) వివేరియం
    3) హెర్బేరియం 4) టెర్రేరియం
33. భూచరాలయాన్ని ఏ విధంగా పిలుస్తారు?
    1) వివేరియం 2) హెర్బేరియం
    3) అక్వేరియం 4) టెర్రేరియం
34. అక్వేరియంలో ఉండే జీవులు?
    1) కీటకాలు 2) చేపలు
    3) వృక్షాలు 4) మానవులు
35. అక్వేరియంలో ఏ మొక్కలను పెంచుతారు?
    1) గులాబీ మొక్కలు 2) కాక్టస్
    3) హైడ్రిల్లా 4) గడ్డి మొక్కలు

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 1; 5) 2; 6) 2; 7) 4; 8) 3; 9) 3; 10) 1; 11) 2; 12) 4; 13) 1; 14) 4; 15) 2; 16) 3; 17) 3; 18) 1; 19) 2; 20) 4; 21) 3; 22) 3; 23) 2; 24) 1; 25) 3; 26) 2; 27) 1; 28) 3; 29) 4; 30) 2; 31) 1; 32) 2; 33) 4; 34) 2; 35) 3.

అనియత విజ్ఞాన శాస్త్ర విద్య

1. ఏ రకమైన నియమ నిబంధనలు లేకుండా సైన్స్‌పై అవగాహన ఏర్పర్చి, శాస్త్రీయ వైఖరులను అభివృద్ధి చేయడానికి పాటించే పద్ధతులేవి?
   1) విద్యా సాంకేతిక శాస్త్ర కార్యక్రమాలు
   2) నిర్బంధ విద్యా కార్యక్రమాలు
   3) అనియత విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాలు
   4) పాఠ్యేతర విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాలు
2. వైజ్ఞానిక సంఘాలు, వైజ్ఞానిక ప్రదర్శనలు, మ్యూజియాలు, సైన్స్ కమ్యూనిటీ సెంటర్‌లు.. సైన్స్ ఫెయిర్స్ (ప్రదర్శన)ల ద్వారా అందించే విజ్ఞాన శాస్త్ర విద్య?
   1) నియత విజ్ఞాన శాస్త్ర విద్య
   2) నిర్బంధ విజ్ఞాన శాస్త్ర విద్య
   3) విద్య సాంకేతిక శాస్త్రం
   4) అనియత విజ్ఞాన శాస్త్ర విద్య
3. వైజ్ఞానిక సంఘాలు ఏ రంగాలను ప్రభావితం చేస్తాయి?
   1) జ్ఞానాత్మక - భావావేశ
   2) భావావేశ, మానసిక చలనాత్మక
   3) మానసిక చలనాత్మక, జ్ఞానాత్మక
   4) జ్ఞాన, భావావేశ, మానసిక చలనాత్మక
4. వైజ్ఞానిక సంఘాలు విద్యార్థులకు పని - అనుభవం కలిగించే ప్రక్రియలు అని తెలిపినవారు?
   1) మొదలియార్ 2) కొఠారీ
   3) తారాదేవి 4) రాధాకృష్ణన్
5. కిందివాటిలో ఏది వైజ్ఞానిక సంఘ లక్ష్యం కాదు?
   1) విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులను పెంపొందించడం
   2) అనాదిగా వస్తున్న ఆచారాలను నమ్మడం
   3) విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను, పెంపొందించడం
   4) విరామకాలాన్ని సద్వినియోగపర్చుకునేలా చేయడం
6. సాధారణ సంఘాలు, ప్రత్యేక అభిరుచి సంఘాలు అనేవి ఏ సంఘంలో రకాలు?
   1) వైజ్ఞానిక సంఘం
   2) విహార యాత్ర సంఘం
   3) సేవా సంఘం 4) శాస్త్రవేత్తల సంఘం
7. ఫొటోగ్రాఫర్ క్లబ్ ఏ రకమైన సంఘం?
   1) సాధారణ సంఘం
   2) సాంస్కృతిక సంఘం
   3) ప్రత్యేక అభిరుచి సంఘం
   4) సేవా సంఘం
8. పాఠశాలలో వైజ్ఞానిక సంఘానికి మార్గదర్శి లేదా ప్రతిపాదకుడుగా వ్యవహరించాల్సిన వారు?
   1) ప్రధానోపాధ్యాయుడు
   2) డీఈవో
   3) ఆ ప్రాంతంలోని శాస్త్రవేత్త
   4) విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు
9. కిందివాటిలో వైజ్ఞానిక సంఘం ఏర్పాటుకు పరిగణనలోకి తీసుకోని అంశం ఏది?
   1) ప్రభుత్వ గుర్తింపు
   2) కమిటీల ఏర్పాటు
   3) నియమాలు
   4) సమావేశాలు, కార్యక్రమాలు
10. NCERT సూచనల ప్రకారం వైజ్ఞానిక సంఘంలో ప్రధానోపాధ్యాయుని పాత్ర?
    1) మార్గదర్శి 2) నియంత
    3) పోషకుడు 4) సేవకుడు
11. సంఘం ఉద్దేశాలను, సంఘ కార్యక్రమాలను, ప్రదర్శనలు, వైజ్ఞానిక నాటకాల గురించి పరసర సమాజానికి తెలియజేసే వైజ్ఞానిక సంఘ నిర్వాహక కమిటీ వ్యక్తి?
    1) అధ్యక్షుడు 2) కార్యదర్శి
    3) పోషకుడు 4) ప్రచారాధికారి
12. కిందివాటిలో ఏది వైజ్ఞానిక సంఘ కార్యక్రమం కాదు?
    1) క్షేత్ర పర్యటన
    2) మాక్ పార్లమెంట్ నిర్వహణ
    3) బడి తోట నిర్వహణ
    4) పర్యావరణ దినోత్సవ నిర్వహణ
13. విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులు, తగిన నైపుణ్యాలు పెంపొందించి వారు భావి శాస్త్రవేత్తలుగా రూపుదిద్దుకొనేందుకు ప్రతి ఏటా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు?
    1) మండల విద్యాశాఖ
    2) రాష్ట్ర విద్యాశాఖ
    3) NCERT 4) CBSE
14. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిల వైజ్ఞానిక ప్రదర్శనలు ఎవరి ఆర్థిక సహాయంతో జరుగుతాయి?
    1) NCERT– SCERT
    2) విద్యా శాఖా మంత్రి
    3) ముఖ్యమంత్రి 4) డీఈవో
15. జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన కమిటీ చైర్మన్‌గా వ్యవహరించేవారు?
    1) కలెక్టర్ 2) డీఈవో
    3) డైట్ ప్రిన్సిపాల్
    4) జిల్లాలో అవార్డు తెచ్చుకున్న సైన్స్ టీచర్
16. లైబ్రరీ అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
    1) గ్రీకు 2) పర్షియా
    3) ఇంగ్లిష్ 4) లాటిన్
17. 'లైబర్' అనే మాటకు అర్థం?
    1) పుస్తకం 2) రాయడం
    3) జ్ఞానం 4) సేకరించడం
18. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలయం ఎవరి ఆధీనంలో ఉంటుంది?
    1) ప్రధానోపాధ్యాయుడు
    2) జిల్లా విద్యాశాఖాధికారి
    3) తరగతిలో, సైన్స్‌లో తెలివి కలిగిన విద్యార్థి
    4) విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు
19. వేటి నిర్వహణలో ఇండెక్స్ కార్డ్, క్యాటలాగ్‌లను తప్పనిసరిగా ఏర్పర్చాలి?
    1) సైన్స్ క్లబ్ 2) సైన్స్ లైబ్రరీ
    3) సైన్స్ ఫేర్ 4) ఫీల్డ్ ట్రిప్
20. ప్రతి పాఠశాలలో ప్రత్యేక విజ్ఞాన శాస్త్ర గ్రంథాలయం ఉండాలి అని ప్రతిపాదించిన వారు?
    1) కొఠారీ కమిషన్
    2) మొదలియార్ కమిషన్
    3) ఆలిండియా సైన్స్ సెమినార్
    4) రాధాకృష్ణన్ కమిషన్
21. హైదరాబాద్‌లోని ప్లానిటోరియం పేరు?
    1) బిర్లా 2) టాటా
    3) గెలాక్సీ 4) గెలీలియో
22. విక్రం సారాభాయ్ సమాజ విజ్ఞాన కేంద్రాన్ని 1966లో ఎక్కడ ప్రారంభించారు?
    1) అహ్మదాబాద్ 2) ముంబై
    3) లక్నో 4) అలహాబాద్

సమాధానాలు

1) 3; 2) 4; 3) 4; 4) 2; 5) 2; 6) 1; 7) 3; 8) 4; 9) 1; 10) 3; 11) 4; 12) 2; 13) 3; 14) 1; 15) 2; 16) 1; 17) 1; 18) 4; 19) 2; 20) 3; 21) 1; 22) 1;

రక్తం గడ్డ కట్టడానికి అవసరమయ్యే విటమిన్ ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయనశాస్త్రం

మాదిరి ప్రశ్నలు

1. మానవ శరీరంలో అత్యధిక శాతం ఉండే మూలకం ఏది?
   1) కార్బన్ 2) ఆక్సిజన్
   3) నైట్రోజన్ 4) సోడియం
2. ఎత్తైన పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజల్లో ఎక్కువగా కనిపించే వ్యాధి ఏది?
   1) కంటి శుక్లాలు 2) రక్తహీనత
   3) గాయిటర్ 4) ఫ్లోరోసిస్
3. అయోడిన్‌కు సంబంధించి సరికాని వాక్యం ఏది?
   1) సముద్రపు ఆహారంలో ఎక్కువగా లభిస్తుంది
   2) ఎత్తైన ప్రదేశాల్లోని నీటిలో అయోడిన్ లభ్యత తక్కువగా ఉంటుంది
   3) పిల్లల ఆహారంలో అయోడిన్ లోపిస్తే మందకొడిగా ఉండటంతో పాటు పెరుగుదల లోపిస్తుంది
   4) అయోడిన్ ఫ్లోరోసిస్ వ్యాధికి కారణమవుతుంది
4. కింది వాటిలో నీటిని శుద్ధి చేయడానికి దేన్ని ఉపయోగించవచ్చు?
   1) అయోడిన్ 2) ఫ్లోరిన్
   3) ఆక్సిజన్ 4) క్లోరిన్
5. కింది వాటిలో కాల్షియం ఉపయోగం కానిది ఏది?
   1) ఆరోగ్యవంతమైన ఎముకలు, దంతాల కోసం కాల్షియం అవసరం
   2) కండరాల సంకోచానికి అవసరం
   3) రక్తం గడ్డకట్టడానికి అవసరం
   4) ఆక్సిజన్ రవాణాకు అవసరం
6. రక్తంలోని హిమోగ్లోబిన్‌లో ఉండే లోహ అయాన్ ఏది?
   1) మాంగనీస్ 2) కాపర్ 3) ఐరన్ 4) జింక్
7. రక్తహీనతతో సంబంధం ఉన్న లోహం ఏది?
   1) ఐరన్ 2) జింక్
   3) అయోడిన్ 4) కార్బన్
8. కింది వాటిలో మాంసకృత్తుల తయారీకి అవసరం లేని మూలకాలేవి?
   i. కార్బన్ ii. నైట్రోజన్
   iii. ఆక్సిజన్ iv. హైడ్రోజన్
   v. ఐరన్ vi. కాల్షియం
   1) i, ii మాత్రమే 2) iii, iv మాత్రమే
   3) v, vi మాత్రమే 4) ii, iv మాత్రమే
9. కిరోసిన్‌లో ఏ లోహాన్ని నిల్వ చేస్తారు?
   1) సోడియం 2) మెగ్నీషియం
   3) ఐరన్ 4) ఫాస్ఫరస్
10. సిలికాన్ మూలకం ప్రధానంగా దేనిలో లభిస్తుంది?
    1) బొగ్గు 2) ఇసుక
    3) సున్నపురాయి 4) ఉప్పు
11. అయోడిన్ కలిగి ఉండే హార్మోన్ ఏది?
    1) ఇన్సులిన్ 2) టెస్టోస్టిరాన్
    3) థైరాక్సిన్ 4) ప్రొజెస్టిరాన్
12. కింది ఏ విటమిన్‌లో కోబాల్ట్ ఉంటుంది?
    1) B_1 2) B_6 3) B_{12} 4) B_2
13. కింది వాటిలో ఫెర్రో అయస్కాంత లోహాలని వేటిని అంటారు?
    1) ఐరన్, కోబాల్ట్, నికెల్
    2) ఐరన్, నికెల్, జింక్
    3) కాపర్, క్రోమియం, జింక్
    4) కాపర్, నికెల్, జింక్
14. గోర్లు, వెంట్రుకల పెరుగుదలకు అవసరమయ్యే లోహం ఏది?
    1) కాల్షియం 2) మాంగనీస్
    3) జింక్ 4) క్రోమియం
15. విటమిన్ B_1 (థయమిన్)లో ఉండే ప్రత్యేక మూలకం ఏది?
    1) ఫాస్ఫరస్ 2) క్లోరిన్
    3) అయోడిన్ 4) సల్ఫర్
16. కింది వాటిలో దేనిలో ఇనుము అధికంగా లభిస్తుంది?
    1) బెల్లం 2) కాలేయం
    3) తోటకూర 4) పైవన్నీ
17. కేన్సర్ చికిత్సలో ఉపయోగించే కోబాల్ట్ - 60 నుంచి విడుదలయ్యే వికిరణాలేవి?
    1) ఆల్ఫా కిరణాలు 2) బీటా కిరణాలు
    3) ఎక్స్ కిరణాలు 4) గామా కిరణాలు
18. సమయాన్ని కచ్చితంగా కొలవడానికి ఉపయోగించే పరమాణు గడియారాల్లో ఏ లోహాన్ని వాడతారు?
    1) కాడ్మియం 2) సీజియం
    3) టైటానియం 4) ఐరన్
19. గుండె కొట్టుకోవడంలో ముఖ్య పాత్ర పోషించే లోహం ఏది?
    1) పొటాషియం 2) కాల్షియం
    3) సీజియం 4) కాపర్
20. థర్మామీటర్‌లో ఉపయోగించే లోహం?
    1) పొటాషియం 2) ఐరన్
    3) కాపర్ 4) మెర్క్యురీ
21. జతపరచండి.

    జాబితా - I
    a) హిమోగ్లోబిన్‌లో ఆక్సిజన్ వాహకం
    b) క్లోరోఫిల్‌లోని ఆకుపచ్చ పదార్థం
    c) రబ్బర్ వల్కనైజేషన్
    d) కండరాల కదలిక

    జాబితా - II
    i) ఫాస్ఫరస్ ii) ఐరన్
    iii) మెగ్నీషియం iv) సల్ఫర్

	a	b	c	d
1)	iv	iii	ii	i
2)	iii	iv	i	ii
3)	ii	iii	iv	i
4)	i	iii	ii	iv

22. కింది వాటిలో కందెనగా వాడే పదార్థాలేవి?
    i. గ్రీజు ii. గ్రాఫైట్
    iii. టెఫ్లాన్ iv. డైమండ్
    1) i మాత్రమే 2) i, ii మాత్రమే
    3) i, ii, iii మాత్రమే 4) i, ii, iii, iv
23. కింది వాటిలో ఎమల్షన్ ఏది?
    1) పాలు 2) మీగడ 3) వెన్న 4) పైవన్నీ
24. ఆక్వాడాగ్ (Aquadag) అంటే ఏమిటి?
    1) డాగ్ వాటర్
    2) గ్రాఫైట్ కొల్లాయిడల్ ద్రావణం
    3) గోల్డ్ కొల్లాయిడ్ 4) లేటెక్స్
25. ఆక్వాడాగ్‌ను ప్రధానంగా వేటి తయారీలో ఉపయోగిస్తారు?
    1) కాథోడ్ రే ట్యూబ్ (CRT)
    2) థర్మామీటర్ 3) పెయింట్ 4) పైవన్నీ
26. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) పచ్చి కాయలను పక్వానికి తీసుకురావడం - ఇథిలీన్
    2) నీటిశుద్ధి - బ్లీచింగ్ పౌడర్
    3) మత్తు మందు - క్లోరోఫామ్
    4) దంతాల్లో ఎనామిల్ ఏర్పర్చడం - సోడియం క్లోరైడ్
27. టీ, కాఫీలను ఎక్కువగా తాగేవారిలో ఏ లోహం శోషణ తక్కువగా ఉంటుంది?
    1) కోబాల్ట్ 2) ఇనుము
    3) సోడియం 4) మెగ్నీషియం
28. వాణిజ్యపరంగా తయారు చేసే ఇన్సులిన్‌లో ఉండే లోహం ఏది?
    1) జింక్ 2) ఐరన్
    3) సెలీనియం 4) మెర్క్యురీ
29. రక్తం గడ్డకట్టడానికి అవసరమయ్యే విటమిన్ ఏది?
    1) ఎ 2) కె 3) డి 4) ఇ
30. ఏ విటమిన్ లోపిస్తే కండరాల బలహీనత, వంధ్యత్వం కలుగుతుంది?
    1) ఎ 2) బి 3) సి 4) ఇ
31. కింది వాటిలో కృత్రిమ తీపికారిణి కానిదేది?
    1) సుక్రలోజ్ 2) ఆస్పార్టేమ్
    3) సుక్రోజ్ 4) శాకరీన్
32. జతపరచండి.

    జాబితా - I / జాబితా - II
    a) విటమిన్ - సి i) స్కర్వీ
    b) విటమిన్ - డి ii) రికెట్స్
    c) విటమిన్ - ఎ iii) రేచీకటి
    d) విటమిన్ - $బి_{12}$ iv) రక్తహీనత

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	iv	iii	ii	i
3)	iii	iv	i	ii
4)	ii	i	iv	iii

33. ఏ విటమిన్ లోపం వల్ల పెదాల మూలల్లో ఉండే చర్మం పగిలి పుండ్లు ఏర్పడతాయి?
    1) రైబోఫ్లేవిన్ (B_2)
    2) థయమిన్ (B_1) 3) పిరిడాక్సిన్ (B_6)
    4) సయనోకోబాలమిన్ (B_{12})
34. కింది వాటిలో దేనికి యాంటీసెప్టిక్ ధర్మం ఉండదు?
    1) అయొడోఫామ్ 2) టింక్చర్ అయోడిన్
    3) బోరిక్ ఆమ్లం 4) క్లోరోఫామ్
35. ఎసిటైల్ శాలిసిలిక్ ఆమ్లం ఏ ఔషధంగా ప్రసిద్ధి చెందింది?
    1) ఒమిప్రజోల్ 2) ఆస్పిరిన్
    3) క్లోరోక్విన్ 4) డెట్టాల్
36. కింది వాటిలో ఆస్పిరిన్ ఉపయోగం కానిదేది?
    1) నొప్పులను తగ్గిస్తుంది
    2) రక్తం త్వరగా గడ్డకట్టకుండా పనిచేస్తుంది
    3) కీళ్ల వాతానికి సంబంధించిన నొప్పులను తగ్గిస్తుంది
    4) ఆమ్ల విరోధిగా పనిచేస్తుంది
37. కింది వాటిలో ఆమ్ల విరోధి కానిదేది?
    1) బేకింగ్ సోడా
    2) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
    3) అల్యూమినియం హైడ్రాక్సైడ్
    4) ఆస్పిరిన్
38. కింది వాటిలో కొల్లాయిడ్ ఏది?
    i. పాలు ii. రక్తం
    iii. జున్ను iv. పెయింట్
    1) i, ii మాత్రమే 2) ii, iv మాత్రమే
    3) i, ii, iii మాత్రమే 4) i, ii, iii, iv
39. జతపరచండి.

    జాబితా - I / జాబితా - II
    a) బాక్సైట్ i) థోరియం
    b) హెమటైట్ ii) యురేనియం
    c) పిచ్‌బ్లెండ్ iii) ఐరన్
    d) మోనోజైట్ ఇసుక iv) అల్యూమినియం

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	iv	iii	i	ii
3)	iv	iii	ii	i
4)	iii	iv	i	ii

40. కింది వాటిలో ఫెర్మెంటేషన్ ప్రక్రియ ద్వారా దేన్ని తయారు చేస్తారు?
    i. ఆల్కహాల్ ii. వెనిగర్ iii. టీ
    1) iii మాత్రమే 2) ii మాత్రమే
    3) ii, iii మాత్రమే 4) i, ii మాత్రమే
41. గది ఉష్ణోగ్రత వద్ద ద్రవ రూపంలో ఉండే లోహం ఏది?
    1) ఐరన్ 2) మెర్క్యురీ
    3) జింక్ 4) అల్యూమినియం
42. జతపరచండి.

    జాబితా - I / జాబితా - II
    a) హిమోగ్లోబిన్ i) కోబాల్ట్
    b) క్లోరోఫిల్ ii) సిలికాన్
    c) సయనోకోబాలమిన్ iii) ఐరన్
    d) ఇసుక, శిలలు iv) మెగ్నీషియం

	a	b	c	d
1)	ii	iii	i	iv
2)	iii	i	ii	iv
3)	i	iv	iii	ii
4)	iii	iv	i	ii

43. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) నూనె నుంచి డాల్డా తయారీ - హైడ్రోజన్
    2) వెల్డింగ్ - ఎసిటిలీన్
    3) మంటలు ఆర్పడం - ఆక్సిజన్
    4) భోపాల్ గ్యాస్ దుర్ఘటన - మిథైల్ ఐసోసయనేట్
44. బెరిబెరి (ఆకలి మందగించడం) వ్యాధి ఏ విటమిన్ లోపం వల్ల వస్తుంది?
    1) B_{12} 2) B_1 3) B_6 4) B_2
45. కింది వాటిలో నీటిలో కరిగే విటమిన్లు ఏవి?
    i. ఎ ii. బి iii. సి iv. డి v. ఇ
    1) i, iv, v మాత్రమే 2) ii, iii మాత్రమే
    3) iii, iv మాత్రమే 4) i, ii, iii, iv, v
46. జతపరచండి.

    జాబితా - I
    a) డీఎన్ఏ అణు నిర్మాణం
    b) రేడియోధార్మికత
    c) పెన్సిలిన్
    d) సల్ఫాడ్రగ్స్

    జాబితా - II
    i) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
    ii) జేమ్స్ డేవీ వాట్సన్
    iii) డోమాక్
    iv) హెన్రీ బెక్వరల్

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	iv	iii	i	ii
3)	ii	iv	i	iii
4)	iv	ii	iii	i

47. వాహనాల్లో ఉండే ఎయిర్ బ్యాగుల్లో ఏ రసాయనాన్ని ఉపయోగిస్తారు?
    1) సోడియం బై కార్బొనేట్
    2) సోడియం ఎజైడ్
    3) సోడియం పెరాక్సైడ్
    4) సోడియం క్లోరైడ్
48. కన్వేయర్ బెల్ట్, గాస్కెట్, హోజ్‌పైపుల తయారీలో వాడే రబ్బర్ ఏది?
    1) సహజ రబ్బర్ 2) బ్యునా - S
    3) బ్యునా - N 4) బ్యునా - E
49. కింది వాటిలో దేని తయారీలో PVC ని ఉపయోగించరు?
    1) నీటి పైపులు 2) రెయిన్ కోట్‌లు
    3) క్యారీ బ్యాగులు 4) స్విచ్ బోర్డులు
50. కింది వాటిలో ట్రాంక్విలైజర్ ఏది?
    1) సోఫ్రమైసిన్ 2) డయజీపామ్
    3) క్లోరాంఫెనికాల్ 4) క్లోరోమైసిటిన్
51. కింది వాటిలో సరికాని వాక్యం ఏది?
    1) గాలిలో కార్బన్ మోనాక్సైడ్ గాఢత పెరిగితే తలనొప్పి, దృష్టి మందగించడం లాంటి దుష్పరిణామాలు కలుగుతాయి
    2) గాలిలో సల్ఫర్ డైఆక్సైడ్ అధికమైతే చారిత్రక కట్టడాలు దెబ్బతింటాయి
    3) కార్బన్ డైఆక్సైడ్ ఆమ్లవర్షానికి కారణం
    4) గాలిలో లెడ్ (Pb) గాఢత పెరిగితే మానసిక వ్యాధులు కలుగుతాయి
52. కింది వాటిలో 'భౌతిక మార్పు' ఏది?
    i. పాలు పెరుగుగా మారడం
    ii. మంచు కరిగి ద్రవ నీరుగా మారడం
    iii. ఇనుము తుప్పు పట్టడం
    iv. అయోడిన్ స్ఫటికాలు ఉత్పతనం చెందడం
    1) iii మాత్రమే 2) ii, iv మాత్రమే
    3) i, ii మాత్రమే 4) i, iii మాత్రమే
53. జతపరచండి.


    జాబితా - I / జాబితా - II
    a) క్వినైన్ క్లోరోక్విన్ i) బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌లు
    b) ఎరిత్రోమైసిన్ ii) మలేరియా
    c) సిప్రోఫ్లోక్ససిన్ iii) టైఫాయిడ్
    d) AZT iv) HIV/AIDS

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	iii	iv	i	ii
3)	ii	i	iii	iv
4)	iv	i	ii	iii

సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 4	5) 4
6) 3	7) 1	8) 3	9) 1	10) 2
11) 3	12) 3	13) 1	14) 2	15) 4
16) 4	17) 4	18) 2	19) 1	20) 4
21) 3	22) 3	23) 4	24) 2	25) 1
26) 4	27) 2	28) 1	29) 2	30) 4
31) 3	32) 1	33) 1	34) 4	35) 2
36) 4	37) 4	38) 4	39) 3	40) 4
41) 2	42) 4	43) 3	44) 2	45) 2
46) 3	47) 2	48) 2	49) 4	50) 2
51) 3	52) 2	53) 3		

How many rooms are there of the west..



Model Questions

Directions (Q.No.1-5): Read the following information carefully to answer the given questions.

In a global environment summit, eight representatives, viz P, Q, R, S, T, V, W and Z are representing different countries, viz Australia, Canada, France, Iran, China, Korea, Nepal and Britain, but not necessarily in the same order. All of them are sitting around a circular table facing the center. V sits third to the left of T. R and Z and also their immediate neighbours in each direction do not represent France. Only one person sits between W and the representative of France. The representatives of Iran and Canada are immediate neighbours of each other. R represents neither China nor Iran. Only one person sits between P and the one who represents Korea. P does not represent either France or Canada. R sits third to the right of Z. Z represents Britain. T is not an immediate neighbour of either R or Z. The one who represents Australia is an immediate neighbour of T. Three people sit between Z and the representative of Nepal. Q is not representing either France or Australia. W is not representing Korea.

1. Who among the following represents Canada?
   1) Q 2) R 3) T 4) V
   5) Cannot be determined
2. Who among the following represent immediate neighbours of V?
   1) P, Q 2) P, S
   3) T, W 4) P, R
   5) P and the representative of China
3. Which of the following is true regarding W?
   1) W sits second to the right of P.
   2) W represents Iran.
   3) W sits between Q and the representative of Britain.
   4) Only one person sits between W and the representative of Canada.
   5) None is true
4. How many persons sit between S and the representative of Iran, when counted anti clockwise from S?
   1) None 2) One 3) Two 4) Three 5) Four
5. Which of the following is true?
   1) S represents France.
   2) Only one person is sitting between the representatives of Iran and China.
   3) The representative of Canada is an immediate neighbour of W.
   4) One person sits between Z and the representative of France.
   5) None is true

Directions (Q.No.6-10): Study the information carefully and answer the questions given below.

There are three floors in a given building such that floor 2 is above floor 1 and floor 3 is above floor 2. In the building there are two flats in each floor such that A is in the west of Flat B. In the building each Flat has an area of 1200 ft and each flat has certain number of rooms and no two flats have same number of rooms. The area of each room of one of the flats on the even number floor is 120ft. Total rooms on floor number three is seven. The flat which has rooms of area of 150 ft is on odd number floor. Area of rooms in the flat which is exactly below 10 rooms flat is 600 ft. There is only one floor between the flats whose each room area is 400 ft and the flat whose room's area is 150 ft. There is no flat on the west of the flat having 6 rooms.

6. What is the area of a room in Flat A on floor 2?
   1) 300 ft 2) 200 ft 3) 600 ft
   4) either (1) or (3)
   5) None of these
7. What is the total number of rooms on floor 2?
   1) 12 2) 14 3) 13
   4) 16 5) None of these
8. Which of the following statement is true?
   1) Total number of rooms on floor 2 is 16
   2) Area of each room is 150 ft of flat A on floor 1
   3) Total rooms in Flat A of all three floors is 17.
   4) All are correct
   5) None is correct
9. What is the area of room of flat B on floor 3?
   1) 200 ft 2) 600 ft 3) 300 ft
   4) 400 ft 5) None of these
10. How many rooms are there of the west of the flat whose each room area is 600 ft?
    1) 6 2) 4 3) 3
    4) 8 5) None of these

Directions (Q.No.11-15): The following questions are based on the following three-digit numbers given below:

571 863 427 654 912

11. If all the three digits of each of the numbers are multiplied together, the product of which of the following numbers will be the second highest?
    1) 571 2) 863 3) 427
    4) 654 5) 912
12. If all the digits of each of the numbers are arranged in ascending order within the number, how many numbers thus formed will be divisible by three?
    1) None 2) One 3) Two
    4) Three 5) More than three
13. If one is subtracted from each even digit of each of the numbers, in how many numbers thus formed will a digit appear twice within the number?
    1) One 2) Two 3) Three
    4) Four 5) Five
14. If the positions of the first and the second digits of each of the numbers are interchanged, what will be the product of the first and the third digits of the second highest number thus formed
    1) 14 2) 16 3) 12
    4) 18 5) None of these
15. What will be the product of the second digit of the second lowest number and the third digit of the second highest number?
    1) 21 2) 12 3) 24
    4) 16 5) None of these

(Q.No.16-17): Read each question carefully and choose the appropriate answer:

16. If the alphabet is written in the reverse order and every alternate letter starting with Y is dropped, which letter will be fourth to the right of the ninth letter from the left end?
    1) B 2) N 3) Z
    4) Z or A 5) None of these
17. In a certain code, 'COMPATIBLE' is written as MXUWGYMENF. How is BENEFICIAL written in that code?
    1) LNVLLNGLMC
    2) LVNLLNGLCM
    3) LNVLLNGLCM
    4) LNVLLNGLCM
    5) None of these

(Q.No.18 -20): In a row of children facing North, Tagore is fifth to the right of Amar who is twentieth from the right end of the row. Pavan is tenth to the left of Tagore and is twentysixth from the left end.

18. How many children are there in the row ?
    1) 49 2) 50 3)51
    4) Cannot be determined
    5) None of these
19. What is Amar's rank from the left end of the row?
    1) 29th 2) 30th 3) 31st
    4) Cannot be determined
    5) None of these
20. How many children are there in the row between Amar and Pavan?
    1) 4 2) 5
    3) 3 4) 6
    5) None of these

SOLUTIONS

(1-5)



1) 4; 2) 4 3) 5
4) 3; Only two persons, i.e W and Z
5) 2

(6-10):

Floor	A	B
3rd	Room area = 400ft Number of Rooms = 3	Room area = 300ft Number of Rooms = 4
2nd	Room area = 200ft Number of Rooms = 6	Room area = 120ft Number of Rooms = 10
1st	Room area = 150ft Number of Rooms = 8	Room area = 600ft Number of Rooms = 2

6) 2; 7) 4; 8) 4;
9) 3; 10) 4;

(11-15):

11) 4;
8×6×3 = 144; 6×5×4 = 120. Therefore, second highest number is 654.

12) 3;
654 when arranged in ascending order, becomes 456 which is divisible by 3.
912 when arranged in ascending order, becomes 129 is also divisible by 3.

13) 2;
In 654, if one is subtracted from each even digit, it becomes 553. The digit '5' appears twice.
In 912, when one is subtracted from the even digit, it becomes 911 where the digit '1' appears twice

14) 4;
In the given numbers,
571 863 427 654 912
after interchanging the first two digits, the numbers appear as follows:
751 683 247 564 192
Hence, the second highest number is 683. The product of the first and the third digits is 18.

15) 1;
second lowest number is 571, and the second digit is '7'
Second highest number is 863, and the third digit is '3'
The product of 7 and 3 is 21.

16) 1;
Step No: 1
ZYXWVUTSRQPONMLKJIHGFEDCBA
Step No: 2 ZXVTRPNLJHFDB (all the odd numbered position letters which amount to thirteen are dropped)
Step No: 3 4th letter to the right + 9th letter from left end = 13th from the left end which is 'B'

17) 4;
Each letter in the word 'COMPATIBLE' is coded in the alphabetical order in the forward direction , but in the descending order.
C+ 10 = M, O + 9 = X, and so on.

18) 2;
Tagore is 15th from the right end. Pavan is 25th from the right end. We know that Pavan is 26th from the left end.
Hence, number of children in the row
= 25 + 26 – 1 = 50

19) 3;
Left position of Amar + Right position of Amar –1 = number of children in a row
Left position
= 50 + 1 –20 = 31st

20) 1;
Pavan is 25th from the right end. Amar is 20th from the right end. Hence, there are four children between Amar and Pavan.